
www.andhrajyothy.com
# ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



బుధవారం | 14-2-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 300 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: పంచమి మ. 12.11 తదుపరి షష్ఠి; నక్షత్రం: రేవతి ఉ 10.44 తదుపరి అశ్విని; వర్జ్యం: తె. 5.39 మొదలు; దుర్ముహూర్తం: మ. 12.07-12.53; అమృతఘడియలు: ఉ. 8.31-9.59; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.47; సూర్యాస్తమయం: 6.13 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ఆంధ్రజ్యోతి
స్పోర్ట్స్
విజయవాడ ● బుధవారం 14 ఫిబ్రవరి 2024

## మంధాన.. రెండు ర్యాంక్‌లు పైకి



దుబాయ్: ఐసీసీ మహిళల వన్డే ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన రెండు స్థానాలు ఎగబాకి, నాలుగో ర్యాంక్‌కు చేరుకుంది. ఈ క్రమంలో మంధాన 696 పాయింట్లతో సౌతాఫ్రికా బ్యాటర్ లారా వోల్వార్ట్‌ను వెనక్కి నెట్టింది. బంట్ (ఇంగ్లండ్), చామరి అటపట్టు (శ్రీలంక), బెత్ మూనీ (ఆస్ట్రేలియా) టాప్-3లో కొనసాగుతున్నారు. హర్మన్‌ప్రీత్ కౌర్ 10వ స్థానంలో నిలిచింది. బౌలర్లలో దీప్తి శర్మ మూడు నుంచి 4వ ర్యాంక్‌కు పడిపోగా, ఆల్‌రౌండర్లలో ఒక స్థానం మెరుగుపర్చుకొని ఐదో స్థానానికి చేరుకుంది. బౌలర్లలో సోఫీ ఎకిల్‌స్టోన్ (ఇంగ్లండ్), ఆల్‌రౌండర్ల జాబితాలో కాప్ మారిజానె (సౌతాఫ్రికా) అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నారు.

## 'భారత రెజ్లింగ్'పై సస్పెన్షన్ ఎత్తివేత

- ప్రపంచ సమాఖ్య నిర్ణయం
- ఆ ముగ్గురు రెజ్లర్లపై చర్యలు తీసుకోబోమని హామీ ఇవ్వాలని ఆదేశం

న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ)పై విధించిన సస్పెన్షన్‌ను యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యూడబ్ల్యూడబ్ల్యూ) ఎత్తివేసింది. అయితే, లైంగిక వేధింపులు ఎదుర్కొన్న డబ్ల్యూఎఫ్ఐ మాజీ చీఫ్ బ్రిజ్‌భూషణ్‌కు వ్యతిరేకంగా గతంలో ఆందోళన చేపట్టిన స్టార్ రెజ్లర్లు బజ్‌రంగ్ పూనియా, వినేశ్ ఫొగట్, సాక్షీ మాలిక్‌పై ఎలాంటి వివక్షాపూరిత చర్యలు తీసుకోబోమని లిఖితపూర్వక హామీ ఇవ్వాలని జాతీయ సమాఖ్యను యూడబ్ల్యూడబ్ల్యూ ఆదేశించింది. సకాలంలో ఎన్నికలు నిర్వహించడంలో విఫలమైనందున డబ్ల్యూఎఫ్ఐపై సస్పెన్షన్ విధిస్తూ గతేడాది ఆగస్టు 23న ప్రపంచ సమాఖ్య నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఇక.. డబ్ల్యూఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించే, ప్రధానంగా ఒలింపిక్ ట్రయల్స్‌లాంటి జాతీయ, అంతర్జాతీయ ఈవెంట్లలో పూనియా, వినేశ్, మాలిక్‌తో పాటు ఇతర రెజ్లర్ల ప్రాతినిధ్యం విషయంలో వివక్ష ప్రదర్శించబోమని కచ్చితమైన హామీ ఇవ్వాలని ప్రపంచ సమాఖ్య కోరింది.

## ఉమా మహేష్‌కు రెండో స్వర్ణం



గ్రెనడా (స్పెయిన్): ఐఎస్ఎస్ఎఫ్ షూటింగ్ వరల్డ్‌కప్‌లో విజయవాడ షూటర్ మద్దినేని ఉమా మహేష్ రెండో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నాడు. మంగళవారం జరిగిన 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ జూనియర్ మిక్స్‌డ్ టీమ్ విభాగం ఫైనల్లో ఉమా-ఇషా అనిల్ జోడీ 16-8తో భారత్‌కే చెందిన అన్వీ రాథోడ్-అభినవ్ షా ద్వయంపై నెగ్గింది. అంతకుముందు జరిగిన 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ జూనియర్ వ్యక్తిగత విభాగంలో ఉమా 252.1 స్కోరు చేసి ఈ వరల్డ్‌కప్‌లో తొలి పసిడి పతకం సాధించాడు.

### భారత హ్యామర్ త్రోయర్
## రచనపై 12 ఏళ్ల నిషేధం



న్యూఢిల్లీ: భారత హ్యామర్ త్రో అథ్లెట్ రచనా కుమారిపై వేటు పడింది. పలుమార్లు డోప్ పరీక్షల్లో విఫల మవడంతో 30 ఏళ్ల రచనపై 12 ఏళ్ల నిషేధాన్ని విధిస్తూ అంతర్జాతీయ అథ్లెటిక్స్ సమాఖ్య సమగ్రత విభాగం (ఏఐయూ) మంగళ వారం నిర్ణయం తీసుకుంది. ఈ నిషేధం గతేడాది నవంబ రు 24వ తేదీ నుంచి అమల్లోకి వస్తుందని ప్రకటించింది. గతంలోనూ డోపీగా పట్టుబడ్డ రచన.. 2015 మార్చి నుంచి నాలుగేళ్ల పాటు నిషేధానికి గురవడం గమనార్హం. నిరుడు ఆసియా క్రీడల్లో పోటీపడ్డ రచన.. ఇప్పటిదాకా ఒక్క అంతర్జాతీయ పతకం కూడా నెగ్గలేదు.

## దక్షిణాఫ్రికా తడ'బ్యాటు'

హామిల్టన్: న్యూజిలాండ్‌తో తొలి టెస్ట్‌లో ఘోర పరాజయం చవిచూసిన దక్షిణాఫ్రికా..రెండో టెస్ట్‌లోనూ తడ'బ్యాటు'కు లోనైంది. మంగళ వారం ప్రారంభమైన మ్యాచ్‌లో తొలి రోజు ఆఖరికి మొదటి ఇన్నింగ్స్‌లో 220 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయింది. స్పిన్నర్ రచిన్ రవీంద్ర (3/33) తిప్పేయడంతో ఓ దశలో దక్షిణాఫ్రికా 150/6తో నిలిచింది. అయితే రువాన్ డిస్వార్డ్ (55 బ్యాటింగ్), 37 ఏళ్ల వయస్సులో అరంగేట్రం చేసిన షాన్ వాన్ బెర్గ్ (34 బ్యాటింగ్) ఏడో వికెట్‌కు అభేద్యంగా 70 పరుగులు జోడించడంతో కోలుకుంది.

## 29 బంతుల్లో 71

రస్సెల్ విధ్వంసం ● ఆఖరి టీ20లో విండీస్ విజయం


రస్సెల్

పెర్త్: ఆండ్రీ రస్సెల్ (29 బంతుల్లో 4 ఫోర్లు, 7 సిక్సర్లతో 71), రూథర్‌ఫోర్డ్ (40 బంతుల్లో 67 నాటౌట్ ) చెలరేగడంతో ఆస్ట్రేలియాతో మూడో టీ20లో వెస్టిండీస్ నెగ్గింది. తొలుత వెస్టిండీస్ 20 ఓవర్లలో 220/6 రన్స్ చేసింది. 79 పరుగులకే 5 వికెట్లు కోల్పోయిన దశలో..రస్సెల్, రూథర్‌ఫోర్డ్ ఆరో వికెట్‌కు 139 పరుగులు జోడించారు. టీ20లలో ఆరో వికెట్‌కిదే అత్యుత్తమ భాగస్వామ్యం. ఛేదనలో వార్నర్ (49 బంతుల్లో 81) కదం తొక్కినా..20 ఓవర్లలో ఆస్ట్రేలియా 183/5 స్కోరుకే పరిమితమైంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను ఇప్పటికే ఆతిథ్య జట్టు కైవసం చేసుకుంది.

**వార్నర్ చివరి మ్యాచ్:** వన్డే వరల్డ్ కప్‌తో 50 ఓవర్ల ఫార్మాట్‌కు, జనవరిలో పాకిస్థాన్‌తో జరిగిన సిడ్నీ మ్యాచ్‌తో టెస్టులకు వీడ్కోలు పలికిన డేవిడ్ వార్నర్..విండీస్‌తో మూడో టీ20తో స్వదేశంలో ఆఖరి అంతర్జాతీయ మ్యాచ్ ఆడేశాడు. ఈ మ్యాచ్‌లోనూ అతడు హాఫ్ సెంచరీతో సత్తా చాటడం విశేషం. 37ఏళ్ల వార్నర్ ఇకపై ప్రపంచవ్యాప్తంగా జరిగే టీ20 లీగ్‌ల్లో మాత్రమే కనిపిస్తాడు.

# ఫ్లాటా.. స్పిన్నా?

మూడో టెస్ట్ పిచ్‌పై ఆసక్తి





రాజ్‌కోట్: భారత్‌లో టెస్ట్ మ్యాచ్‌లంటే.. టర్నింగ్ వికెట్ అని సహజంగా భావిస్తారు. అయితే, ఇంగ్లండ్‌తో జరుగుతున్న టెస్ట్ సిరీస్‌లో తొలి రెండు మ్యాచ్‌లు జరిగిన హైదరాబాద్, విశాఖ పిచ్‌లపై అంతగా టర్న్ లభించక పోవడంతో టీమిండియా స్పిన్నర్లు ఇబ్బందులుపడ్డారు. దీంతో ఇంగ్లండ్ బ్యాటర్లు ధాటిగా ఆడుతూ ఆతిథ్య భారత్‌కు గట్టిసవాల్ విసిరారు. అయితే, రెండో టెస్ట్‌లో పేసర్ బుమ్రా చెలరేగడంతో టీమిండియా నెగ్గి సిరీస్‌ను సమం చేసింది. ఈ నేపథ్యంలో రాజ్‌కోట్‌లో గురువారం నుంచి జరిగే మూడో టెస్ట్ పిచ్ ఎలా ఉంటుందనేది ఆసక్తికరంగా మారింది. కోహ్లీ, రాహుల్, అయ్యర్ లాంటి సీనియర్లు లేకపోవడంతో టీమిండియా బ్యాటింగ్‌లో అనుభవలేమి కనిపిస్తోంది. మరి బ్యాటర్ ఫ్రెండ్లీ వికెట్ అయితే ఇంగ్లండ్ బజ్‌బాల్ గేమ్‌ను తట్టుకోవడం కష్టమేనని ఫ్యాన్స్ భావిస్తున్నారు. ఈ క్రమంలో మూడో టెస్ట్ కోసం టర్నింగ్ వికెట్ అందుబాటులో ఉంటుందని లెగ్గీ కుల్దీప్ యాదవ్ చూచాయగా చెప్పడం కొంత ఊరటనిచ్చే విషయం. 'స్పోర్టింగ్ వికెట్ అయితే మ్యాచ్ మజాగా సాగుతుంది. దీనర్థం రాబోయే మ్యాచ్‌ల్లో స్పిన్ వికెట్లు ఉండవని కాదు. భవిష్యత్ మ్యాచ్‌ల్లో టర్నింగ్ వికెట్లను ఆశిస్తున్నా'నని మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో కుల్దీప్ చెప్పాడు. కానీ, రాజ్‌కోట్ పిచ్ స్వభావాన్ని కచ్చితంగా చెప్పకుండా దాటవేశాడు. టెస్ట్ క్రికెట్ సంప్రదాయ బ్యాటింగ్ తీరును మార్చేస్తూ ఇంగ్లండ్ దూకుడైన ఆట తనను ఎంతో ఆశ్చర్యానికి గురి చేస్తోందన్నాడు.

### జడేజాకు చోటు..!

సీనియర్ల గైర్హాజరీలో యువ క్రికెటర్లు సత్తాచాటేందుకు ఇదో సువర్ణావకాశమని యాదవ్ చెప్పాడు. తొడ కండర గాయంతో రెండో టెస్ట్‌కు దూరమైన ఆల్‌రౌండర్ జడేజాకు తుది జట్టులో చోటుదక్కే అవకాశాలు మెరుగ్గా ఉన్నాయని కుల్దీప్ మాటలనుబట్టి తెలుస్తోంది. 'జడ్డూ యథావిధిగా తన పనులు తాను చేసుకొంటున్నాడు. సోమవారం నెట్స్‌లో కూడా పాల్గొన్నాడు. మ్యాచ్‌కు అతడు అందుబాటులో ఉంటాడని భావిస్తున్నా' అని చెప్పాడు.

### సర్ఫరాజ్ అరంగేట్రం?

రాహుల్ దూరం కావడం.. యువ ఆటగాడు సర్ఫరాజ్‌కు కలిసి రానుంది. మూడో టెస్ట్‌లో అతడు అరంగేట్రం చేసే అవకాశాలు బలంగా ఉన్నాయని బోర్డు వర్గాలు చెబుతున్నాయి. మిడిలార్డర్‌లో రాహుల్‌తోపాటు అయ్యర్ కూడా లేకపోవడంతో అతడి ఎదురుచూపులకు తెర పడుతుందని భావిస్తున్నారు.

### బ్యాటింగ్‌కాదు.. కీపింగ్ చూడండి!



కీపర్‌గా కేఎస్ భరత్ రాణిస్తున్నా.. బ్యాటింగ్‌లో అంతగా ఆకట్టుకోలేక పోవడం మేనేజ్‌మెంట్‌ను ఆందోళనకు గురి చేస్తోంది. ఈ నేపథ్యంలో కీపర్‌గా ధ్రువ్ జురెల్‌కు తుది జట్టులో చోటు ఖాయమని భావిస్తున్నారు. అయితే, ఈ సిరీస్‌లో భరత్‌ను కొనసాగించాలని భారత మాజీ ఆటగాడు ఆకాశ్ చోప్రా కోరాడు. కీపింగ్ ప్రతిభ ఆధారంగానే అతడిపై నిర్ణయం తీసుకోవాలని సూచించాడు. గత రెండు మ్యాచ్‌ల్లో భారీ స్కోర్లు చేయకపోయినా.. అతడి బ్యాటింగ్ ఫర్వాలేదనే విధంగా ఉందన్నాడు. టీమ్ ఇంత త్వరగా భరత్‌పై నమ్మకాన్ని కోల్పోవడం బాధాకరమని చోప్రా చెప్పాడు.

### స్టోక్స్ @100

టెస్ట్ క్రికెట్‌లో ఇంగ్లండ్ కెప్టెన్ బెన్‌స్టోక్స్ అరుదైన మైలురాయిని అందుకోనున్నాడు. రాజ్‌కోట్‌లో జరగబోయే మూడో టెస్ట్.. స్టోక్స్ కెరీర్‌లో 100వ మ్యాచ్ కావడం విశేషం.

### రెహాన్‌కు తాత్కాలిక వీసా..

ఇంగ్లిష్ స్పిన్నర్ రెహాన్ అహ్మద్‌కు తాత్కాలిక వీసాను మంజూరు చేశారు. మ్యాచ్‌కు ముందే అతడికి పూర్తిస్థాయి వీసా వస్తుందని ఇంగ్లండ్ జట్టు అధికారి ఒకరు విశ్వాసం వ్యక్తం చేశాడు. క్లరికల్ తప్పిదం కారణంగానే ఇది జరిగిందని తెలుస్తోంది. సోమవారం ఇంగ్లండ్ జట్టు అబుధాబి నుంచి వచ్చింది. అయితే, అతడికి సింగిల్ ఎంట్రీ వీసా ఉండడంతో ఎయిర్‌పోర్టులోనే అడ్డుకొన్నారు. ఆ తర్వాత తాత్కాలిక వీసాతో హోటల్‌కు వెళ్లాడు.

## రంజీలు ఆడితేనే.. ఐపీఎల్‌కు?

- కిషన్‌పై బీసీసీఐ ఆగ్రహం
- నిబంధనలు కఠినతరం చేసే యోచన



ముంబై: ఇషాన్ కిషన్ ఎపిసోడ్ నేపథ్యంలో ఐపీఎల్‌కు ప్రాధాన్యమిస్తున్న ఆటగాళ్లకు బీసీసీఐ కఠిన హెచ్చరికలు చేయనుంది. రంజీలు ఆడేందుకు విముఖత ప్రదర్శిస్తున్న జార్ఖండ్ ఆటగాడు కిషన్.. బరోడాలో పాండ్యా బ్రదర్స్‌తో కలసి ఐపీఎల్ కోసం సన్నద్ధమవుతున్నాడు. ఈ సమాచారం బయటకు రావడంతో ఆగ్రహించిన బోర్డు పెద్దలు.. ఈనెల 16 నుంచి రాజస్థాన్‌తో జరిగే మ్యాచ్‌లో ఆడాల్సిందిగా ఇషాన్‌కు హుకుం జారీ చేశారు. తద్వారా రెడ్‌బాల్ క్రికెట్ ఆడకుండా తప్పించుకొంటున్న యువ ఆటగాళ్లకు చెక్ పెట్టాలని బోర్డు భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఇషాన్‌తోపాటు దీపక్ చాహర్, కృనాల్ పాండ్యా, శ్రేయాస్ అయ్యర్‌లకు కూడా ఇలాంటి ఆదేశాలే జారీ చేయనున్నారట. కనీసం 3-4 రంజీ మ్యాచ్‌లు ఆడితేనే.. ఐపీఎల్ బరిలో దిగేందుకు అనుమతించేలా సరికొత్త రూల్స్ తీసుకొచ్చే ఆలోచన చేస్తున్నట్టు ఓ అధికారి తెలిపాడు. దక్షిణాఫ్రికా టూర్ మధ్యలో బ్రేక్ తీసుకొని భారత్ తిరిగి వచ్చిన కిషన్.. మళ్లీ సెలెక్టర్లకు అందుబాటులోకి రాలేదు. కాగా, సెంట్రల్ కాంట్రాక్ట్ 'సి'జాబితా నుంచి ఇషాన్‌ను తప్పించారనే వార్తలు వస్తున్నాయి.

### భారత జట్టు మాజీ కెప్టెన్
## దత్తాజీరావు గైక్వాడ్ మృతి



న్యూఢిల్లీ: భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ దత్తాజీరావు గైక్వాడ్ (95) మంగళవారం అనారోగ్యంతో బరోడాలో మరణించారు. ఆయన తనయుడు అన్షుమన్ గైక్వాడ్ టెస్టు క్రికెటర్‌గా, రెండుసార్లు భారత జట్టు కోచ్‌గా వ్యవహరించాడు. 1950వ దశకంలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన దత్తాజీరావు.. అభేద్యమైన డిఫెన్స్, సుందరమైన కవర్ డ్రైవ్‌లు ఆడడంలో పేరెన్నికగన్న బ్యాటర్. 1952 నుంచి 1961 మధ్య ఆయన 11 టెస్ట్‌లు ఆడారు. 1959లో ఇంగ్లండ్‌లో పర్యటించిన భారత జట్టుకు దత్తాజీ కెప్టెన్‌గా వ్యవహరించారు. జీవించివున్న అతి పెద్ద వయస్సు భారత టెస్ట్ క్రికెటర్లలో దత్తాజీ ఒకరు.

### మైక్ ప్రాక్టర్ పరిస్థితి విషమం



డర్బన్ : సౌతాఫ్రికా దిగ్గజ ఆల్‌రౌండర్, కోచ్ మైక్ ప్రాక్టర్ మృత్యువుతో పోరాడుతున్నాడు. 77 ఏళ్ల ప్రాక్టర్‌కు డర్బన్‌లోని ఓ ఆసుపత్రిలో ఆపరేషన్ సందర్భంగా గుండెపోటుకు గురయ్యాడు. ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో ఉన్న మైక్ పరిస్థితి విషమంగా ఉన్నట్టు డాక్టర్లు వెల్లడించారు.

## ప్లేఆఫ్స్‌కు పట్నా పైరేట్స్

కోల్‌కతా: ప్రొ కబడ్డీ సీజన్-10లో పట్నా పైరేట్స్ ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించింది. మంగళవారం తెలుగు టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో పట్నా 38-36తో గెలిచింది. ఈ సీజన్‌లో పట్నాకు ఇది వరుసగా ఏడో విజయం కావడం విశేషం. గెలుపురుచి ఎలావుంటుందో మరిచిపోయిన తెలుగు టైటాన్స్ ఈ మ్యాచ్‌లో విజయం కోసం పోరాట పటిమ ప్రదర్శించింది. టైటాన్స్ కెప్టెన్ పవన్ (16 పాయింట్లు) ఒంటరి పోరాటం వృథా అయింది.

---

# బిజినెస్

## జీఎంఆర్ చేతికి మనీలా విమానాశ్రయం!

కాంట్రాక్టు విలువ 300 కోట్ల డాలర్లు

న్యూఢిల్లీ: జీఎంఆర్ గ్రూప్ విదేశాల్లో మరింత విస్తరిస్తోంది. కొత్తగా ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలోని 'నినాయ్ అక్వినో ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు (ఎన్ఏఐఏ) రీడెవలప్‌మెంట్ కోసం పోటీపడుతోంది. ఇందుకోసం మొత్తం నాలుగు కంపెనీలు బిడ్స్ దాఖలు చేశాయి. అయితే జీఎంఆర్ గ్రూప్ నేతృత్వంలోని కన్సార్షియం అతి తక్కువ ధరతో పోటీలో ముందున్నట్టు సమాచారం. విమానాశ్రయాన్ని రీడెవలప్ చేయడంతో పాటు ఏటా వచ్చే ఆదాయంలో 33.3 శాతం ఫిలిప్పీన్ ప్రభుత్వానికి ఇచ్చేందుకు హామీ ఇచ్చింది. దీంతో 300 కోట్ల డాలర్ల విలువైన ఈ రీడెవలప్‌మెంట్ కాంట్రాక్టు జీఎంఆర్ గ్రూప్‌నకే దక్కుతుందని భావిస్తున్నారు. ఈ కాంట్రాక్టు దక్కితే జీఎంఆర్ గ్రూప్ మనీలా విమానాశ్రయాన్ని ఏటా 6.2 కోట్ల మంది ప్రయాణికుల రాకపోకలకు అనుగుణంగా అభివృద్ధి చేయాల్సి ఉంటుంది. ఇందుకు ప్రతిగా ఫిలిప్పీన్ ప్రభుత్వం 15 ఏళ్ల పాటు పన్ను రాయితీలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉంది.

## జల్ జీవన్ మిషన్ కింద మరిన్ని కాంట్రాక్టులు : ఎన్‌సీసీ

హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ఎన్‌సీసీ లిమిటెడ్ సాగునీటి ప్రాజెక్టులపై మరింత దృష్టి పెట్టింది. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'జల్ జీవన్ మిషన్' పథకం కింద కంపెనీ ఇప్పటికే రూ.18,000 కోట్ల కాంట్రాక్టులు సంపాదించింది. రానున్న ఆర్థిక సంవత్సరంలో ఈ పథకం కింద మరిన్ని కాంట్రాక్టులు వచ్చే అవకాశం ఉందని కంపెనీ స్ట్రాటజీ హెడ్ నీరద్ శర్మ తెలిపారు. ఈ నెల ఒకటో తేదిన ప్రవేశ పెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వచ్చే ఆర్థిక సంవత్సరం (2024-25) జల్ జీవన్ మిషన్ పథకానికి కేటాయింపులను రూ.96,549 కోట్ల నుంచి రూ.98,418 కోట్లకు పెంచారు. దీంతో ఈ పథకం కింద మరిన్ని ఆర్డర్లు వచ్చే అవకాశం ఉందని ఎన్‌సీసీ భావిస్తోంది.

## ఆటో డ్రైవర్లకు జీరో కమిషన్ నమూనా

ర్యాపిడో

హైదరాబాద్: జీరో కమిషన్ మోడల్‌తో ఆటో డ్రైవర్లను ఆకర్షించి, తమతో చేర్చుకోవాలని భావిస్తున్నట్టు రైడ్ హైలింగ్ కంపెనీ ర్యాపిడో తెలిపింది. సేవలు పారదర్శకంగా, సమ్మిళితంగా ఉండేందుకు ఆటో డ్రైవర్ల కోసం అగ్రిగేటర్ కమిషన్ ఆధారిత మోడల్ నుంచి జీవితకాల జీరో కమిషన్ మోడల్‌కు మారబోతున్నట్టు కంపెనీ సహ వ్యవస్థాపకుడు పవన్ గుంటుపల్లి తెలిపారు. దేశంలో ప్రతి రోజూ రెండు కోట్ల ఆటో రైడ్లు జరుగుతాయని, వాటిలో ఆన్‌లైన్ మార్కెట్ వాటా 10 శాతం కన్నా తక్కువేనని ఆయన చెప్పారు. తన పోటీ సమాంతరంగా కార్యకలాపాలు సాగిస్తున్న మార్కెట్ కన్నా ఆఫ్‌లైన్ మార్కెట్‌తోనే అన్నారు. దేశంలో 25 లక్షల ఆటోడ్రైవర్లుంటే 4 లక్షల మంది ర్యాపిడో ద్వారా ఆటోలు నడుపుతున్నారని, కొత్త మోడల్ ద్వారా వారిలో అధిక శాతం మందిని ఆకర్షించడం తమ లక్ష్యమని చెప్పారు.

## 8 శాతం వృద్ధితోనే వికసిత్ భారత్ సాధ్యం

రంగరాజన్

హైదరాబాద్: భారత్ 2047 నాటికి 13,000 డాలర్ల తలసరి ఆదాయంతో అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే ఏటా 7 లేదా 8 శాతం వృద్ధి తప్పనిసరి ఆర్‌బీఐ మాజీ గవర్నర్, పీఎంఈఏసీ మాజీ ఛైర్మన్ సి.రంగరాజన్ అన్నారు. సమాజంలో అసమానతలు, పేదరికం తగ్గించడానికి ఇన్నోవేషన్ ఒక్కటే పరిష్కారం అవదని ఆయన వ్యాఖ్యానించారు. వృద్ధి రేటుతో పాటుగా నగదు, మౌలికాదాయం రూపంలో సబ్సిడీలు కూడా అవసరమేనని తేల్చి చెప్పారు. "తలసరి ఆదాయం 13,000 డాలర్లుగా ఉన్న దేశమే అభివృద్ధి చెందిన దేశంగా పరిగణనలోకి వస్తుంది, కాని ఇప్పుడు మన తలసరి ఆదాయం 2,700 డాలర్లు మాత్రమే. అంటే దాన్ని మనం ఐదు రెట్లు పెంచుకోవాల్సి ఉంటుంది" అని రంగరాజన్ వ్యాఖ్యానించారు. సమాజంలో అట్టడుగున ఉన్న ప్రజల జీవనోపాధి అవకాశాలు పెంచేందుకు మరింతగా దృష్టి సారించాల్సి ఉంటుందని ఆయన అన్నారు.

# రిలయన్స్ ఇండస్ట్రీస్ రూ.20 లక్షల కోట్లు

- మార్కెట్ క్యాప్‌లో రికార్డు సృష్టించిన కంపెనీ
- ఈ ఘనత సాధించిన తొలి భారత కంపెనీ ఇదే



ముంబై/న్యూఢిల్లీ: ముకేశ్ అంబానీ యాజమాన్యంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) మంగళవారం మార్కెట్ విలువలో చారిత్రక మైలురాయిని అధిగమించింది. తొలిసారిగా రూ.20 లక్షల కోట్ల మార్కెట్ విలువను అధిగవించి ఈ ఘనత సాధించిన తొలి భారతీయ కంపెనీగా చరిత్ర నమోదు చేసింది. బీఎస్ఈలో కంపెనీ షేరు ఇంట్రాడేలో 1.88 శాతం పెరిగి 52 వారాల గరిష్ఠ స్థాయి రూ.2957.80ని తాకడంతో ఈ రికార్డు రిలయన్స్ ఖాతాలో పడింది. అప్పటికి కంపెనీ మార్కెట్ విలువ రూ.20,01,279.72 కోట్లకు చేరింది. తదుపరి క్రమంలో షేరు విలువ కొంత దిగజారి చివరికి 0.90 శాతం లాభంతో రూ.2928.95 వద్ద ముగిసింది. ఫలితంగా ముగింపు సమయానికి కంపెనీ మార్కెట్ విలువ రూ.19,81,635.72 కోట్ల వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈలో కూడా ఈ షేరు 1.89 శాతం పెరిగి 52 వారాల గరిష్ఠ స్థాయి రూ.2958కి చేరిన అనంతరం చివరికి 0.74 శాతానికి లాభాన్ని పరిమితం చేసుకుని రూ.2926.20 వద్ద ముగిసింది.

**రెండు వారాల్లో లక్ష కోట్లు అప్**

గత రెండు వారాల వ్యవధిలోనే కంపెనీ మార్కెట్ విలువ రూ.లక్ష కోట్ల మేరకు ఎగబాకింది. గత నెలలో రిలయన్స్ షేర్లకు డిమాండ్ ఏర్పడింది. ఫలితంగా మార్కెట్ విలువ 7 శాతం మేరకు పెరిగి మార్కెట్ విలువ రూ.19.56 లక్షల కోట్లు దాటింది. 2022 మార్చిలో రిలయన్స్ రూ.18 లక్షల కోట్ల మైలురాయిని దాటింది. ఆర్ఐఎల్ మార్కెట్ విలువపరంగా దేశంలోని టాప్ 10 కంపెనీల్లో అగ్రగామిగా తన ఆధిపత్యాన్ని నిరంతరం నిలబెట్టుకుంటూ వస్తోంది. ప్రస్తుతానికి మార్కెట్ విలువలో ఆర్ఐఎల్‌ను ఢీ కొట్టగలిగే కంపెనీ దరిదాపుల్లో ఏదీ లేదు. రిలయన్స్ తర్వాత టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్,ఐసీఐసీఐ బ్యాంక్, ఇన్ఫోసిస్, ఎల్ఐసీ, ఎస్‌బీఐ, భారతి ఎయిర్‌టెల్, హెచ్‌యూఎల్, ఐటీసీ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

**అంబానీ సంపదకూ బూస్ట్**

ఆర్ఐఎల్ మార్కెట్ క్యాప్‌లో ఏర్పడిన వృద్ధి కంపెనీ అధినేత ముకేశ్ అంబానీ సంపద కూడా గణనీయంగా పెరగడానికి దోహదపడింది. ఈ సంవత్సరం ప్రారంభం నుంచి ఇప్పటికి అంబానీ సంపద 1,250 కోట్ల డాలర్ల (రూ.1,06,250 కోట్లు) మేరకు పెరిగి 10,900 కోట్ల డాలర్లకు (రూ.9,26,500 కోట్లు) దూసుకుపోయింది. బ్లూమ్‌బర్గ్ బిలియనీర్ ఇండెక్స్ ప్రకారం ఆయన ప్రస్తుతం దేశంలో అమిత సంపన్నుడుగాను, ప్రపంచ సంపన్నుల్లో 11వ స్థానంలోను ఉన్నారు.

## లాభాల్లో సెన్సెక్స్

బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసులు, ఐటీ షేర్లలో కొనుగోళ్ల మద్దతుతో మంగళవారం స్టాక్ మార్కెట్ పునరుజ్జీవం సాధించింది. రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గిందన్న వార్తలు ఇన్వెస్టర్ సెంటిమెంట్‌ను బూస్ట్ చేశాయి. సెన్సెక్స్ 482.70 పాయింట్ల లాభంతో 71,555.19 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 71,662.74-70,924.30 పాయింట్ల మధ్యన కదలాడింది. నిఫ్టీ కూడా 127.20 పాయింట్లు లాభపడి 21,743.25 వద్ద ముగిసింది. సెన్సెక్స్ షేర్లలో 2.46 శాతం లాభంతో ఐసీఐసీఐ బ్యాంక్ అగ్రగామిగా నిలవగా యాక్సిస్ బ్యాంక్, విప్రో, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఎన్‌టీపీసీ కూడా మంచి లాభాలు నమోదు చేసిన కంపెనీల్లో ఉన్నాయి.

**పేటీఎం షేరు 10 శాతం డౌన్**

పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌పై ఆంక్షల విషయంలో పునరాలోచన లేదని ఆర్‌బీఐ ప్రకటించిన నేపథ్యంలో పేటీఎం మాతృసంస్థ వన్ 97 కమ్యూనికేషన్ షేరు మంగళవారం 10 శాతం మేరకు నష్టపోయింది. దీంతో బీఎస్ఈ, ఎన్ఎస్ఈ రెండింటిలోనూ 52 వారాల కనిష్ఠ స్థాయికి దిగజారిన ఈ షేరు తొలిసారిగా రూ.400 కన్నా దిగువన ముగిసింది. ఎన్ఎస్ఈలో ఈ షేరు రూ.380 వద్ద ముగియగా బీఎస్ఈలో రూ.380.35 వద్ద ముగిసింది.

**ఎంఎఫ్ ఆస్తుల్లో మహారాష్ట్ర టాప్**

ఈ ఏడాది జనవరి నాటికి మ్యూచువల్ ఫండ్ (ఎంఎఫ్) పరిశ్రమ నిర్వహణలోని ఆస్తుల్లో మహారాష్ట్ర అగ్రగామిగా ఉంది. మొత్తం ఎంఎఫ్ ఆస్తుల విలువ రూ.52.89 లక్షల కోట్లు కాగా మహారాష్ట్ర, న్యూఢిల్లీ, కర్ణాటక, గుజరాత్, పశ్చిమ బెంగాల్ 68.46 శాతం వాటా కలిగి ఉన్నాయని ఇక్రా అనలిటిక్స్ ఒక నివేదికలో తెలిపింది. ఈ ఐదు రాష్ట్రాలు/యూటీల్లో ఏయూఎంలు గత నెలలో 27 నుంచి 30 శాతం మేరకు పెరిగాయి. ఏయూఎం వాటా మహారాష్ట్రలో రూ.21.69 లక్షల కోట్లుంది. తెలంగాణ రూ.78,964 వాటాతో టాప్ 10 రాష్ట్రాల్లో ఒకటిగా పదో స్థానంలో ఉంది.



| బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో) | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 62,840 ▼ | 57,600 ▼ | 77,000 ▲ |
| ముంబై | 62,394 ▲ | 57,153 ▲ | 71,042 ▼ |

**ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)**



| | | | |
|---|---|---|---|
| 13వ తేదీ | | విజయవాడ | 536 |
| హైదరాబాద్ | 545 | విశాఖపట్నం | 555 |
| 14వ తేదీ | | వరంగల్ | 547 |
| చిత్తూరు | 593 | | |
| గోదావరి | 536 | డజను గుడ్లు రూ.72 | |

**ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 124 | గోదావరి | 129 |
| వరంగల్ | 124 | విజయవాడ | 129 |
| కరీంనగర్ | 124 | గుంటూరు | 129 |
| మహబూబ్‌నగర్ | 124 | ఒంగోలు | 129 |
| కర్నూలు | 124 | చిత్తూరు | 133 |
| విశాఖపట్నం | 122 | | |

## పవర్‌మెక్ లాభంలో 22% వృద్ధి

హైదరాబాద్: డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో పవర్‌మెక్ ప్రాజెక్ట్స్ కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.62 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో (రూ.50.6 కోట్లు) పోల్చితే లాభం 22.5 శాతం వృద్ధి చెందింది. త్రైమాసిక సమీక్షా కాలంలో కంపెనీ మొత్తం ఆదాయం కూడా రూ.912 కోట్ల నుంచి రూ.1,114.90 కోట్లకు పెరిగింది. ఈ కాలంలో కంపెనీ మొత్తం వ్యయాలు కూడా రూ.840.90 కోట్ల నుంచి రూ.1,008.20 కోట్లకు పెరిగినట్లు కంపెనీ పేర్కొంది.

## జీఓసీఎల్ ఆదాయం రూ. 230 కోట్లు

జీఓసీఎల్ కార్పొరేషన్ లిమిటెడ్ డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ.230 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.15 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. త్రైమాసిక కాలంలో ముడి సరుకులు ధరలు పెరగటం, ద్రవ్యోల్బణ ఒత్తిళ్ల పనితీరుపై ప్రభావం చూపించాయని కంపెనీ పేర్కొంది. సమీక్షా త్రైమాసికంలో అనుబంధ సంస్థ ఐడీఎల్ ఎక్స్‌ప్లోజివ్స్ లిమిటెడ్ రూ.152 కోట్ల ఆదాయాన్ని నమోదు చేసింది. కాగా కార్యకలాపాల విస్తరణలో భాగంగా ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్, స్పేస్, రక్షణ అప్లికేషన్స్ కోసం కటింగ్ ఎడ్జ్ ఉత్పత్తులు, మెటల్ క్లాడింగ్ వంటి విభాగాల్లోకి ప్రవేశించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపింది.

## డీసీఐ లాభంలో రెండింతల వృద్ధి

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డీసీఐ) డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికానికి రూ.27.22 కోట్ల లాభాన్ని ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో లాభం రూ.13.84 కోట్లుగా ఉంది. ప్రస్తుతం ఒక్కో షేరు మీద రూ.9.72 ఆర్జించింది. అయితే సమీక్షా కాలంలో మొత్తం ఆదాయం మాత్రం రూ.372.30 కోట్ల నుంచి రూ.266.23 కోట్లకు తగ్గిందని కంపెనీ పేర్కొంది. త్రైమాసికంలో పలు కీలకమైన డ్రెడ్జింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసినట్లు తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.1,200 కోట్ల టర్నోవర్‌ను సాధించవచ్చని కంపెనీ భావిస్తోంది.

- డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో టాటా పవర్ రూ.1,076.12 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికం (రూ.1,052.14 కోట్లు)తో పోల్చితే లాభం స్వల్పంగా 2.28 శాతం పెరిగింది. త్రైమాసిక కాలంలో మొత్తం రెవెన్యూలు కూడా రూ.14,129.12 కోట్ల నుంచి రూ.14,651 కోట్లకు పెరిగింది.
- ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆఫ్ ఇండియా (టీసీఐ) లిమిటెడ్ డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన రూ.313.83 కోట్ల ఆదాయంపై రూ.32.19 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఆదాయం రూ.315.72 కోట్లుగా ఉండగా లాభం రూ.32.02 కోట్లుగా ఉంది.
- టెక్నాలజీ ఆధారిత డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్ బీఎల్ఎస్ ఈ-సర్వీసెస్ డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలో రూ.71.65 కోట్ల ఆదాయంపై రూ.7.95 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గ్రామీణ బ్యాంకింగ్ ఔట్‌లెట్స్, ఈ-గవర్నెన్స్‌పై దృష్టి సారించటం ఎంతగానో కలిసివచ్చిందని పేర్కొంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఆదాయం రూ.69.07 కోట్లుగా ఉంది.
- పీఎన్‌బీ మెట్‌లైఫ్ భారత్‌లో కొత్తగా పది శాఖలను ప్రారంభించింది. కొత్తగా ఏర్పాటు చేసిన శాఖల్లో ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోలు కూడా ఉందని తెలిపింది. కార్యకలాపాల విస్తరణలో భాగంగా వీటిని ఏర్పాటు చేసినట్లు తెలిపింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా కంపెనీ 149 శాఖలను నిర్వహిస్తోంది.

## టాటా నెక్సాన్, టియాగో ఈవీల ధర తగ్గింపు

న్యూఢిల్లీ: టాటా మోటార్స్ తన ఎలక్ట్రిక్ కార్లయిన నెక్సాన్ ఈవీ, టియాగో ఈవీ ధరలను రూ.1.2 లక్షల మేరకు తగ్గించింది. బ్యాటరీ వ్యయాలు తగ్గడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు కంపెనీ తెలిపింది. నెక్సాన్ ఈవీ ధర గరిష్ఠంగా రూ.1.2 లక్షలు తగ్గడంతో ప్రారంభ ధర రూ.14.49 లక్షలకు తగ్గుతుంది. అలాగే టియాగో ఈవీ ధర రూ.70,000 తగ్గించడంతో ఆ కారు ప్రారంభ ధర రూ.7.99 లక్షలకు దిగివస్తుంది. అయితే ఇటీవలే మార్కెట్లోకి తెచ్చిన పంచ్ ఈవీ ధరలో మాత్రం ఎలాంటి మార్పు ఉండదని, బ్యాటరీ ధర తగ్గుదలను ముందే ఊహించి ఆ కారు ధర నిర్ణయించామని వివరణ ఇచ్చింది.

# హైదరాబాద్ కావాలట!



## మరో రెండేళ్లు 'ఉమ్మడి'గా ఉండాలట

### ప్రస్తుతం కొత్త రాజధాని కట్టలేం

విశాఖలో పాలన ప్రారంభించే వరకు హైదరాబాదే రాజధాని..

కేంద్రాన్ని కోరతాం, మేనిఫెస్టోలో చేరుస్తాం.. జగన్ చిన్నాన్న వైవీ ప్రకటన 11

# సంతకాలతో సరి

## ఉత్తుత్తి ఎంవోయూలతో మాయ!

### పెట్టుబడులపై స్పందించని కంపెనీలు

విశాఖ సదస్సు ఎంవోయూలపై అరకొర సమాచారం ఇచ్చిన ఐటీ శాఖ

తిరిగి చూడని అత్యధిక కంపెనీలు


కొన్ని ఒప్పందాల నుంచి పూర్తిగా వెనక్కి

మరికొన్ని 'పురోగతి'లో అంటూ మాయ

పోయినవి చెప్పకుండా.. కొత్త పెట్టుబడులపై హడావుడి

నేడు వర్చువల్‌గా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు






(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఆదేదో సినిమాలో.. 'ఉత్తుత్తి బ్యాంకు' పెట్టి బురిడీ కొట్టిస్తారు. ఇక్కడ.. నిజంగానే 'ఉత్తుత్తి ఎంవోయూ'లతో మొత్తం రాష్ట్ర ప్రజలను బురిడీ కొట్టించేస్తున్నారు. ఆ పరిశ్రమలు వచ్చిందీ లేదు. పెట్టుబడులు పెట్టిందీ లేదు. కానీ... ఎంవోయూలు మాత్రం కుదిరాయి. పైగా.. 'ఆహా.. ఓహో... ఇన్ని వందల కోట్లు వస్తున్నాయి' అంటూ కూలి, నీలి మీడియా ప్రచార హోరు! జగన్ ముఖ్యమంత్రి అయ్యాక ఒకేఒక్కసారి దావోస్ ఆర్థిక సదస్సుకు హాజరయ్యారు. ఒకే ఒక్కసారి విశాఖలో పెట్టుబడుల సదస్సు నిర్వహించారు. 'అస్మదీయ' కంపెనీలు, అవే సోలార్, విండ్ పవర్ ప్రాజెక్టులకే మళ్లీ ఎంవోయూలు కుదుర్చుకున్నవే ఎక్కువ. ఐటీకి సంబంధించిన ఒప్పందాల్లో అత్యధికం ఉత్తుత్తివే. వైసీపీ సర్కారు వచ్చాక ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగంలో ఎన్ని కంపెనీలతో ఎంవోయూలు చేసుకున్నారు? ఎన్ని కంపెనీలు వచ్చాయి? రావాల్సినవి ఇంకా ఎన్ని ఉన్నాయో చెప్పాలని సమాచార హక్కు సంఘం జాతీయ అధ్యక్షుడు తోపూరి గంగాధర్ ఆర్‌టీఐ కింద ప్రభుత్వాన్ని సమాచారం కోరగా... ఐటీ శాఖ వివరాలు వెల్లడించింది. అదీ అరకొరగానే! విశాఖ గ్లోబల్ సమ్మిట్‌కు ముందు అంటే, 2019 నుంచి 2023 మార్చి 2 వరకు ఎన్ని ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆగ్రో ప్రాజెక్టులు వచ్చాయో, ఒప్పందాలు చేసుకున్నాయన్న సమాచారం ఇవ్వలేదు. కేవలం విశాఖ సమ్మిట్‌లో కుదిరిన ఒప్పందాల వివరాలు మాత్రమే ఐటీ శాఖ వెల్లడించింది. అందులోనూ

మిగతా 12వ పేజీలో...

### జీరో ఖాళీల డ్రామా!

వచ్చే ఏడాది నుంచి 'జీరో' లక్ష్యమట

ఐదేళ్లపాటు టీచర్ల కొరతతోనే బోధన

ఇంతకాలం 'జీరో ఖాళీలు' గుర్తులేదా?

పిల్లలు తగ్గిపోతున్నా పట్టించుకోలేదు

నిరుద్యోగుల గోడు వినిపించుకోలేదు 9

రాజకీయ లబ్ధి కోసం ఇప్పుడు నాటకం



వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



మాగుంట శ్రీనివాసులురెడ్డి



ఆదాల ప్రభాకర్‌రెడ్డి

### వైసీపీ ఎంపీ వేమిరెడ్డి టీడీపీలోకి!

హైదరాబాద్‌లో చంద్రబాబుతో భేటీ

తాజా రాజకీయ పరిస్థితులపై మంతనాలు

వేమిరెడ్డి భార్య ప్రశాంతి కూడా టీడీపీలోకి

టీటీడీ సభ్యత్వానికి త్వరలో రాజీనామా!

ఒంగోలు, నెల్లూరు ఎంపీలు మాగుంట, ఆదాలదీ వీరి బాటే?.. జగన్‌కు భారీ షాక్!

అమరావతి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్మోహన్‌రెడ్డికి మరో భారీ షాక్ తగిలింది. నెల్లూరు జిల్లాకు చెందిన వైసీపీ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలుగుదేశం పార్టీలో చేరనున్నారు. సోమవారం ఆయన హైదరాబాద్‌లో టీడీపీ అధినేత చంద్రబాబుతో భేటీ అయినట్లు సమాచారం. వైసీపీకి ఆర్థికంగా అండదండలు

మిగతా 8వ పేజీలో...

### సజ్జలకు రెండు చోట్ల ఓట్లు

భార్య, కొడుకు, కోడలికి కూడా..

మంగళగిరి, పొన్నూరు నియోజకవర్గాల్లో ఓటర్లుగా నమోదు 12

### పవన్ హెలికాప్టర్‌కు నో!

ల్యాండింగ్‌కు అనుమతి నిరాకరణ 11

గోదావరి జిల్లాల పర్యటన వాయిదా

## జగన్ లూటీ లక్ష కోట్లు..

# జైలు ఖాయం

'శంఖారావం'లో సీఎంకు లోకేశ్ హెచ్చరిక



పాలకొండలో లోకేశ్ శంఖారావం సభకు హాజరైన జనం

నిజం మాట్లాడితే తల పగిలిపోతుంది!

జగన్‌రెడ్డికి ఆ శాపం ఉంది.. అందుకే మోసాలు, అబద్ధాలు: లోకేశ్

ఎన్నికల ముందు డీఎస్సీ అంటూ మోసం

భూ పత్రాలు, సర్వే రాళ్లపైనా జగన్ బొమ్మలే

బిడ్డనంటూ మీ భూములు లాక్కునే యత్నం

3 రాజధానులంటూ ఉత్తరాంధ్రకు ద్రోహం

విశాఖ రైల్వే జోన్‌కు భూములివ్వలేదు

షర్మిలపై పేటీఎం బ్యాచ్ వికృత ప్రచారం

'శంఖారావం'లో టీడీపీ యువ నేత ధ్వజం

పాతపట్నం, పాలకొండ, కురుపాంలో సభలు

లక్ష కోట్లు లూటీ చేసిన జగన్‌రెడ్డి త్వరలోనే జైలుకెళ్తాడు. ఆయనకు ఇదే నా సవాల్. అవినీతి ఆరోపణలపై చర్చకు మేం సిద్ధం.. మీరు సిద్ధమా?

ఉత్తరాంధ్రతో పాటు రాష్ట్రం మొత్తానికీ చెడు చేసిన జగన్‌ను ప్రజలు ఓటు అనే ఆయుధంతో తరిమికొట్టాలి.

జగన్ అర్జునుడు, అభిమన్యుడు కాదు.. ఒక సైకో, ఒక భస్మాసురుడు, ఒక సద్దాం. చంద్రబాబు విజనరీ, జగన్‌రెడ్డి ప్రిజనరీ.

\- లోకేశ్

శ్రీకాకుళం/పార్వతీపురం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): 'సీఎం జగన్మోహన్‌రెడ్డికి ఓ శాపం ఉంది. నిజాలు మాట్లాడితే ఆయన తల పగిలిపోతుంది. అందుకే నోరు తెరిస్తే అబద్ధాలు.. మోసాలు' అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ ధ్వజమెత్తారు. 'శంఖారావం' కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన శ్రీకాకుళం జిల్లా పాతపట్నం, పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ, కురుపాం నియోజకవర్గంలోని ఎర్రన్న గుడి సభల్లో ప్రసంగించారు. మోసానికి ప్యాంటు, షర్టు వేస్తే అది జగన్‌రెడ్డేనని అన్నారు. పాదయాత్రలో

మిగతా 11వ పేజీలో...



శంభు వద్ద ఆందోళనకారులపై బాష్పవాయువు ప్రయోగిస్తున్న పోలీసులు

## రైతుల 'చలో ఢిల్లీ' ఉద్రిక్తం

డ్రోన్లతో బాష్పవాయువు ప్రయోగించిన పోలీసులు

రణరంగంలా పంజాబ్, హరియాణా సరిహద్దులు

రైతులు ఢిల్లీకి చేరకుండా ఎక్కడికక్కడ నిర్బంధాలు

శంభు వద్ద పోలీసులపైకి రాళ్లు రువ్విన రైతులు 8

ఖాకీల రబ్బరు బుల్లెట్ తగిలి ఓ రైతు కంటికి గాయం

భారీ ట్రాఫిక్ జామ్‌లతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు

ఎమ్మెస్పీపై కమిటీలో ప్రతినిధుల పేర్లను సంఘాలు చేర్చలేదు

హడావుడిగా ఎమ్మెస్పీ చట్టాన్ని తేలేం: కేంద్ర మంత్రి అర్జున్

## జేఈఈ మెయిన్స్‌లో మనోళ్ల సత్తా

100% స్కోరు సాధించిన 23 మందిలో పది మంది తెలుగు రాష్ట్రాల విద్యార్థులే

ఏపీ నుంచి ముగ్గురు, తెలంగాణ నుంచి ఏడుగురు


రిషి శేఖర్ శుక్లాకు జాతీయ స్థాయిలో రెండో ర్యాంకు

ఏపీకి చెందిన షేక్ సూరజ్‌కు మూడో ర్యాంకు

ఐఐటీ బాంబేలో కంప్యూటర్ సైన్సే లక్ష్యమంటున్న విజేతలు

హైదరాబాద్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్-2024లో తెలుగు విద్యార్థులు మరోసారి సత్తా చాటారు. మంగళవారం ప్రకటించిన మొదటి విడత జేఈఈ పరీక్ష ఫలితాల్లో జాతీయ స్థాయిలో రెండో ర్యాంకుతోపాటు 100 శాతం స్కోరులో అత్యధిక ర్యాంకులు తెలుగు రాష్ట్రాలకే దక్కాయి. గత నెలాఖరులో దేశంలోని అన్ని ప్రధాన నగరాలతో పాటు ఇతర దేశాలకు చెందిన 21 నగరాల్లో నిర్వహించిన ఈ పరీక్షకు 11.70 లక్షల మంది హాజరయ్యారు. ఇంగ్లిష్, హిందీ, తెలుగు తదితర 13 భాషల్లో పరీక్ష నిర్వహించారు. తాజాగా ప్రకటించిన ఫలితాల్లో 23 మంది 100 శాతం స్కోరు (100 పర్సంటైల్) సాధించారు. వారిలో తెలంగాణకు చెందిన రిషి శేఖర్ శుక్లా, పబ్బ రోహన్ సాయి,

మిగతా 8వ పేజీలో...



జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు

జస్టిస్ చక్రవర్తి

జస్టిస్ దుప్పల వెంకటరమణ

ఆంధ్ర హైకోర్టులో..

## ఇద్దరు అదనపు న్యాయమూర్తులకు పదోన్నతి

శాశ్వత జడ్జీలుగా జస్టిస్ చక్రవర్తి, జస్టిస్ టి.మల్లికార్జునరావు 11

మధ్యప్రదేశ్ హైకోర్టులో జస్టిస్ దుప్పల వెంకటరమణకు కూడా..

సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు

రాజధానిపై నయా డ్రామా

## జగన్.. జంతర్ మంతర్

పూర్తేకాని ఇళ్లలో అధికారులు ఉంటున్నారట!

సీఆర్డీఏకు 70 కోట్ల అద్దె కూడా కడుతున్నారట!

బ్యాంకులను, కోర్టును బురిడీ కొట్టించే ఎత్తుగడ

2 వేల కోట్ల అప్పు ఎగ్గొట్టడానికి 70 కోట్ల అబద్ధం

పైగా రాజధానిపై అబద్ధపు జీవో సైతం విడుదల

బాబు హయాంలో అధికారుల కోసం బిల్డింగ్‌లు

అప్పట్లోనే 75% పూర్తి.. కానీ పట్టించుకోని జగన్

నిర్మాణం 2024 ఫిబ్రవరిలో పూర్తయ్యేలా నాడు డీల్

గడువు దాటితే అప్పు 2 వేల కోట్లూ ఒకేసారి కట్టాలి

ఆ గడువు వచ్చేయడంతో డ్రామాలు ఆరంభం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

అప్పుల కోసం తప్పులు! చేసిన అప్పులు ఎగ్గొట్టడం కోసమూ తప్పులు! ఇవీ జగన్ సర్కారు పడుతున్న తిప్పలు! ఈసారి ఏకంగా భారీ 'ఇంద్రజాలం' చేశారు. అమరావతిని చిట్టడవిలా మార్చేసిన జగన్ సర్కారు.. అక్కడ నిర్మాణమే పూర్తికాని భవనాల్లో అధికారులు నివసిస్తున్నారని, దీనికోసం సీఆర్డీయేకు రూ.70 కోట్లు అద్దె రూపంలో కట్టామని ఒక అబద్ధాల కథ అల్లింది. అంతేకాదండోయ్...

మిగతా 12వ పేజీలో...

## హార్సిలీ హిల్స్‌పైకే 'యాత్ర'!

బ్రేకులుపడ్డ ప్రతిపాదనపై సీఎంవో ఒత్తిడి.. ఆరు నూరైనా కేటాయించాల్సిందే.. 11

అధికారులను పరుగులు పెట్టించిన వైనం.. సబ్ డివిజన్ కోసం మళ్లీ ఫైల్ సిద్ధం

సీమలో చిత్రపరిశ్రమ అభివృద్ధికేనన్న యాత్ర-2 దర్శకుడి వ్యాఖ్యలపై సందేహాలు

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

# పాక్‌లో అదే అనిశ్చితి

పాకిస్థాన్ ఎన్నికల ఫలితాలు ఊహించినవే. అధికారం కోల్పోయినప్పటినుంచి సైన్యంమీద ప్రతీకారజ్వాలలతో రగిలిపోతూ, భీకర యుద్ధం చేసిన ఇమ్రాన్‌ఖాన్ ఎన్నికల్లో భారీగా గెలుస్తారని అనుకున్నదే. అలా జరగనివ్వకూడదనే సైన్యం ప్రయత్నం. ఎన్నికలకు ఓ వారంముందు కూడా ఇమ్రాన్‌మీద మూడుకేసుల్లో తీర్పులు వెలువరించి న్యాయస్థానాలు ఆయనకు భారీ శిక్షలు వేశాయి. ఇప్పట్లో ఆయన జైల్లోంచి బయటకు రాడని తేల్చేశాయి. ఇమ్రాన్, ఆయన పార్టీ రాజకీయ భవిష్యత్తు గురించి ప్రజలకు పూర్తి అవగాహన ఉంది. అయినా, ఎన్నికల బరిలో ఇండిపెండెంట్లుగా నిలిచిన ఇమ్రాన్ పార్టీవారినే ప్రజలు ఎక్కువగా ఆదరించారు. కానీ, సైన్యమే అన్నీ తానై నడిపిస్తున్నది కనుక, ఇప్పుడు తరువాతి స్థానాల్లో నిలిచిన నవాజ్‌షరీఫ్ పార్టీ, భుట్టోల మద్దతుతో అధికారంలోకి వస్తోంది.

దేశం తీవ్ర సంక్షోభంలో ఉన్నదనీ, ఇప్పుడు కనుక ప్రధాని ఎంపిక, ప్రభుత్వం ఏర్పాటు సక్రమంగా జరగకపోతే మళ్ళీ ఎన్నికలకు పోవాల్సి వస్తుందనీ, మరో కొత్త సంక్షోభాన్ని నివారించే లక్ష్యంతోనే తాను ప్రధాన మంత్రి పదవికి పోటీపడకుండా తప్పుకుంటున్నానని బెనజీర్ భుట్టో కుమారుడు బిలావల్ మంగళవారం ప్రకటించారు. ఈ ప్రకటనతో ఐదురోజుల అనిశ్చితికి తెరపడింది. దేశక్షేమం దృష్ట్యా ఇంతటి త్యాగం చేసి, షరీఫ్‌లు ప్రధాని కావడానికి మార్గం సుగమం చేసిన బిలావల్ కొత్త ప్రభుత్వంలో చేరకుండా, మంత్రిపదవులు పొందకుండా వెలుపలి నుంచి అంశాలవారీ మద్దతు ఇస్తానని ప్రకటించడం విశేషం. ఈ త్యాగానికి ప్రతిఫలంగా బెనజీర్ భుట్టో భర్త, మాజీ దేశాధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ దేశాధ్యక్షుడు అవుతాడన్నది కుమారరత్నం ప్రకటన సారాంశం. ఇలా ఇచ్చిపుచ్చుకోవడం బాగున్నది కానీ, ప్రభుత్వంలో చేరకపోవడం బిలావల్ నిర్ణయమో, సైన్యం వ్యూహమో తెలియదు. బిలావల్ పోటీనుంచి తప్పుకొని, షరీఫ్‌లకు మార్గాన్ని సుగమం చేసి, అనిశ్చితికి తెరదించారు. కానీ, ప్రభుత్వంలో చేరకపోవడమన్నది ప్రమాదకరమైన సంకేతం. నవాజ్ షరీఫ్ ఏ మాత్రం స్వతంత్రంగా వ్యవహరించినా, గతంలో మాదిరిగా సైన్యానికి వ్యతిరేకంగా తలెగరేసినా ఆయన ప్రభుత్వం కూలిపోతుందన్న సైన్యం హెచ్చరిక ఇందులో ఉంది. ఈ కారణంగానే కాబోలు, తాను కాక, షాబాజ్‌నే ప్రధాని చేయాలని నవాజ్ అనుకుంటున్నట్టు వార్తలు వస్తున్నాయి.

ఎన్నికల ఫలితాలు పాకిస్థాన్‌లో సుస్థిరప్రభుత్వం ఏర్పాటుకు తావు లేకుండా ఉన్నాయి. 264స్థానాల్లో 101స్థానాలతో ఇండిపెండెంట్లు అగ్ర స్థానంలో ఉంటే, వీరిలో 93మంది ఇమ్రాన్ ఖాన్ పార్టీ బలపరిచినవారే. 75సీట్లతో నవాజ్‌షరీఫ్ పార్టీ, 54సీట్లతో భుట్టోల పార్టీ ఆ తరువాత స్థానాల్లో ఉన్నాయి. ఇప్పటికే కొంతమంది ఇండిపెండెంట్ల చేరికతో షరీఫ్ పార్టీ బలం 80కు పెరిగింది. తమ స్వతంత్ర అభ్యర్థులందరినీ ఒక కూటమిగా మార్చి, కొన్ని పార్టీలతో పొత్తులు పెట్టుకొని అన్ని పదవులకూ పోటీపడతామని ఇమ్రాన్ అంటున్నప్పటికీ అది ఆచరణ సాధ్యంగా కనిపించడం లేదు. అత్యధిక స్థానాలు గెలుచుకొని, భుట్టోల చేయూతను కూడా అందుకున్నందున మరిన్ని పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు షరీఫ్‌ల పక్షానే చేరే అవకాశాలే అధికం. ఒకటి రెండు ప్రావిన్సుల్లో తప్ప కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయగల పరిస్థితి ఇమ్రాన్‌కు లేదు.

మొత్తానికి ఈ ఎన్నికల తరువాత కూడా పాకిస్థాన్‌లో ఒక బలహీనమైన ప్రభుత్వమే ఏర్పడబోతున్నది. ఇమ్రాన్ ఖాన్ మీద కక్షసాధించడంలో మాత్రం సైన్యం విజయం సాధించింది. తెరవెనుకనుంచి సైన్యం అన్ని వ్యవస్థలనూ ప్రభావితం చేసి ఇమ్రాన్ ఖాన్‌ను అనేక కేసులతో వేధించి, ఆయన చేతిలోనుంచి బ్యాట్ లాక్కొని, పోటీకి, ప్రచారానికి దూరం చేసినా, జైలునుంచి కూడా ఇమ్రాన్ ఎన్నికల యుద్ధం బలంగా చేశారు. సైన్యం ప్రోత్సహించిన షరీఫ్‌లు, భుట్టోలకంటే స్వతంత్రులుగా రంగంలోకి దిగిన ఇమ్రాన్ అభ్యర్థులనే ప్రజలు ఎక్కువగా ఆదరించారు. ఇమ్రాన్ దేశద్రోహి అన్న సైన్యం వాదనను తిరస్కరించి, రాజకీయాల్లోనూ, పరిపాలనలోనూ సైన్యం పెత్తనాన్ని ప్రశ్నించిన ఇమ్రాన్ పక్షాన నిలబడ్డారు. అధికారం దక్కకపోయినా, ప్రజాబలం తగ్గలేదని రుజువుచేసిన ఈ ఫలితాలు ఇమ్రాన్‌కు ఉపశమనం కలిగించేవే. అయితే, సైన్యంతో ఆయన పోరాటం, దేశంలో రాజకీయ అనిశ్చితి కొన సాగుతూనే ఉంటాయి.

# మోదీ గ్యారంటీ రైతులకు లేదా?






■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

**స్వామినాథన్ కమిషన్ సిఫారసులను పూర్తిగా అమలు చేయకుండా ఆయనకు భారతరత్న ప్రకటించడంలో అర్థం ఉన్నదా? లక్ష కోట్ల రూపాయలతో వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధిని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన మోదీ సర్కార్ గత మూడేళ్లలో అందుకు కేటాయించింది కేవలం రూ. 12వేల కోట్లే! రైతాంగ సంక్షోభం నానాటికీ తీవ్రమవుతోందే కానీ తగ్గడం లేదని గత పదేళ్లలో సంభవించిన రైతుల ఆత్మహత్యలు స్పష్టం చేస్తున్నాయి. మరి మోదీ గ్యారంటీ ఎవరికి? ఈ పది సంవత్సరాలలో భారీ ఎత్తున సంపదను పోగుచేసుకున్న బడా పారిశ్రామికవేత్తలకేనా?**

దేశ రాజధాని చుట్టూ యుద్ధ వాతావరణం నెలకొంది. ఎక్కడ చూస్తే అక్కడ బారికేడ్లు కనపడుతున్నాయి. వందలాది లారీల్లో ఇసుకను, మట్టిని తీసుకువచ్చి జేసీబీ ప్రొక్లెయినర్లతో రహదార్లపై పోస్తున్నారు. ఢిల్లీ నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు రాజధానిలోకి ప్రవేశించేందుకు ప్రయత్నిస్తున్నారు. పోలీసులు బాష్పవాయువు, నీటి కానన్లను ప్రయోగించి వారిని చెదరగొడుతున్నారు. రాజధానికి ఇతర వాహనాల రాకపోకల్ని నిషేధించారు. పలు ప్రాంతాల్లో 144 సెక్షన్‌ను విధించారు. అనేక చోట్ల ట్రాఫిక్ జామ్ ఏర్పడి వాహనాలు అంగుళం కదలాలంటే కష్టమయ్యే పరిస్థితి ఏర్పడింది. 2020–21లో ఢిల్లీ పొలిమేరల్లో కనపడ్డ దృశ్యాలే మళ్లీ పునరావృతమవుతున్నాయి. సాగు చట్టాలకు వ్యతిరేకంగా 13 నెలల పాటు రైతులు తీవ్ర నిరసన తెలిపినప్పుడు వారి పోరాట పటిమను నీరు కార్చేందుకు ప్రభుత్వం తరఫున చాలా ప్రయత్నాలు చేశారు. రైతులను సంఘ వ్యతిరేక శక్తులు, ఉగ్రవాదులని కూడా నిందించారు. అభివర్ణించారు. తీవ్రమైన చలికి, వానకు, నిర్బంధానికి గురైన 700 మంది రైతులు ఆ నిరసన ప్రదర్శనల సందర్భంగా మరణించారు. 11 సార్లు రైతు ప్రతినిధులతో చర్చలు జరిపిన నాటి వ్యవసాయ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ తమ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ సాగు చట్టాలను వెనక్కి తీసుకునే ప్రసక్తి లేదని 2021 జూలై 28న ప్రకటన చేశారు. 2021 అక్టోబర్‌లో ఉత్తర ప్రదేశ్‌లోని లఖీంపూర్ ఖేరీలో నిరసన తెలుపుతున్న రైతులపై కేంద్రహోంశాఖ సహాయమంత్రి కుమారుడు వాహనం నడిపించడం, తర్వాత జరిగిన హింసాకాండలో 8 మందికి పైగా మరణించారు. చివరకు 2021 నవంబర్‌లో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రజల ముందుకు వచ్చి సాగు చట్టాలను వెనక్కి తీసుకుంటున్నట్లు తెలిపారు. రైతులకు కనీసమద్దతు ధరను మరింత సమర్థంగా, పారదర్శకంగా అమలు చేసేందుకు కమిటీని వేస్తామని ప్రకటించారు. ఆ తర్వాత మాత్రమే రైతులు శాంతించారు.

మళ్లీ ఇప్పుడు రైతులు ఎందుకు తీవ్ర నిరసన తెలిపేందుకు సమాయత్తమయ్యారు? మోదీ ప్రకటన చేసిన 9 నెలల తర్వాత 2022 జూలై 12న వ్యవసాయశాఖ మాజీ కార్యదర్శి సంజయ్ అగర్వాల్ అధ్యక్షతన ఒక కమిటీ నేర్పాటు చేశారు. ఈ కమిటీలో సాగు చట్టాలను వ్యతిరేకించిన ఆర్థికవేత్తలు కానీ, నిపుణులు కానీలేరు. ఉత్తర ప్రదేశ్, పంజాబ్, హర్యానా రాష్ట్రానికి చెందిన రైతు ప్రతినిధులను ఎవర్నీ అందులో నియమించలేదు. విచిత్రమేమంటే ఈ కమిటీ ఇంతవరకూ మధ్యంతర నివేదిక కూడా సమర్పించలేదు. ఇప్పుడు సార్వత్రిక ఎన్నికలు కూడా సమీపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రైతులు మళ్లీ తమ డిమాండ్లను ప్రజల ముందుకు తీసుకువచ్చేందుకు నిరసన ప్రదర్శనలు నిర్వహించాలనుకోవడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. మోదీ సర్కార్ మళ్లీ వారిని అణిచివేసేందుకు యథాప్రకారం చర్యలు తీసుకోవడంలో కూడా ఆశ్చర్యం లేదు.

నిజానికి 2014లో నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చేందుకు ప్రధానంగా రైతులు కారణమయ్యారు. అనేక సభల్లో మోదీ కనీస మద్దతు ధర గురించి మాట్లాడారు. గోధుమ, వరి వంటి పంటలకు ఉత్పత్తి వ్యయం భరించడంతో 50శాతం లాభం కలిగించే విధంగా కొత్త ఫార్ములాను రూపొందిస్తామని ఆయన ప్రకటించారు. ఈ ఫార్ములా మోదీది కాదు. ఇటీవల మోదీ భారతరత్న ప్రకటించిన వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్‌ది. మోదీ అధికారంలోకి వచ్చాక ఈ ఫార్ములాను ఏనాడూ అమలుచేయలేదు. పైగా కనీసమద్దతు ధర అనే దానికే అర్థం లేకుండా చేసేందుకు, కార్పొరేట్లు వ్యవసాయ రంగంలో ప్రవేశించేందుకు వీలుగా సాగు చట్టాలను ప్రవేశపెట్టేందుకు ప్రయత్నించారు! ఈ చట్టాలను ఉపసంహరించుకున్న తర్వాత మోదీ ప్రభుత్వం ప్రకటించిన కనీసమద్దతు ధరలు స్వామినాథన్ కమిటీ సిఫారసులకు అనుగుణంగా లేవు. భూసంస్కరణలు, రైతుల ఆత్మహత్యలు అరికట్టడం, వ్యవసాయ భూమి అమ్మకాన్ని క్రమబద్ధీకరించడం, నీటిపారుదల రంగంలో పెట్టుబడులు పెట్టడం, వ్యవసాయ భూమిని కార్పొరేట్లకు వ్యవసాయేతర అవసరాలకోసం అమ్మకుండా నిషేధించడం, గ్రామీణ బీమా అభివృద్ధి నిధిని ఏర్పాటు చేసి పంట బీమా, గ్రామీణ మౌలిక సదుపాయాలు కల్పించడం, రైతులకు 4 శాతం సరళ వడ్డీతో రుణాలు అందించడం వంటి అనేక సిఫారసులను కూడా స్వామినాథన్ కమిషన్ చేసింది. వీటిలో ఎన్ని మోదీ ప్రభుత్వం అమలు చేసింది? అమలు చేస్తే కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని, తమను అప్పుల వలయం నుంచి తప్పించాలని, రైతులకు, రైతు కూలీలకు పింఛను చెల్లించాలని, రైతులు ఇవాళ వీధుల్లోకి ఎందుకు వస్తారు? గత నిరసన ప్రదర్శనల సందర్భంగా రైతులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోనే లేదు. ఆ ప్రదర్శనల్లో మరణించిన వందలాది రైతులకు నష్టపరిహారం కూడా చెల్లించలేదు. ఇది కాకుండా మోదీ ప్రభుత్వం నీరుకార్చిన భూసేకరణ చట్టం, 2013ను పునరుద్ధరించాలని కూడా రైతులు కోరుతున్నారు. విద్యుత్ చట్టానికి చేసిన సవరణలు రైతులను వ్యవసాయం నుంచి దూరం చేసే లక్ష్యంతో రూపొందించారని విమర్శిస్తున్నారు. నాడు రైతులతో చర్చలు జరిపిన నరేంద్రసింగ్ తోమర్‌ను కేంద్ర కేబినెట్ పదవి నుంచి తప్పించి మధ్యప్రదేశ్ అసెంబ్లీకి పోటీ చేయించారు. కేంద్రంలో కనీసం 8 కేబినెట్ పదవులు నిర్వహించిన తోమర్ ఇప్పుడు అసెంబ్లీలో స్పీకర్‌గా బాధ్యత నిర్వహిస్తున్నారు. ఆయన స్థానంలో వ్యవసాయ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అర్జున్ ముండా కనీస మద్దతు ధరపై చట్టాన్ని హడావిడిగా చేయలేమని తాజాగా ప్రకటించారు. మరి గత అయిదు సంవత్సరాలుగా ఏమి చేస్తున్నారు?

అసలు స్వామినాథన్ కమిషన్ సిఫారసులను పూర్తిగా అమలు చేయకుండా ఆయనకు భారతరత్న ప్రకటించడంలో అర్థం ఉన్నదా? ఇవాళ దేశంలో వ్యవసాయ రంగానికి న్యాయం చేయాలంటే పంటలకు కనీస మద్దతు ధరను హామీ ఇచ్చే చట్టాన్ని చేయాల్సిందేనని స్వామినాథన్ కమిషన్ సభ్యుడు, పద్మభూషణ్ పురస్కార గ్రహీత డా. ఆర్‌బి సింగ్ మంగళవారం ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. ఏ పంటకైనా ఉత్పత్తి వ్యయంలో కనీసం 50 శాతం అధికంగా కనీస మద్దతు ధరను నిర్ణయించాలని తాము సిఫారసు చేశామని, కానీ దీన్ని దేశమంతటా ఒకే విధంగా అమలు చేయడం లేదని ఆయన విమర్శించారు. కనీస మద్దతు ధర విషయంలో మాత్రమే కాదు వ్యవసాయమౌలిక సదుపాయాలను కూడా మోదీ ప్రభుత్వం కల్పించడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. రూ. లక్షకోట్లతో వ్యవసాయ మౌలికసదుపాయాల నిధిని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన మోదీ ప్రభుత్వం గత మూడేళ్లలో కేవలం రూ. 12వేల కోట్లే కేటాయించిందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.

ఇవాళ దేశంలో ఏ ప్రసార సాధనాలను చూసినా మోదీ గ్యారంటీ పేరుతో ప్రకటనలు ఊదరగొడుతున్నాయి. మోదీ చెప్పింది చేస్తారని ప్రజల్లో నమ్మకం కలిగించేందుకు సర్వయత్నాలు చేస్తున్నారు. అయోధ్యలో బాల రాముడికి ప్రాణ ప్రతిష్ఠ చేసి మోదీ తన వాగ్దానం నిలుపుకున్నారేమో కాని ఈ దేశ రైతులకు మాత్రం తాను ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ఇవాళ లక్షలాది రైతులు వీధిన పడడాన్ని బట్టి అర్థమవుతోంది. 2016–17లో కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తవుతున్న దృష్ట్యా 2022 కల్లా రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామనే విధాన ప్రకటన చేశారు. అయితే దేశంలో 70 శాతం మంది రైతుల ఆదాయం సంవత్సరానికి రూ.15 వేలు కూడా మించడం లేదని, కేవలం 10శాతం మాత్రమే రూ.30 వేల కంటే ఎక్కువ ఆర్జిస్తున్నారని భారత వ్యవసాయ పరిశోధనా మండల అధ్యయనం ఒకటి తెలిపింది. దేశంలో రైతాంగ సంక్షోభం నానాటికీ తీవ్రమవుతోంది కానీ తగ్గడం లేదని గత పదేళ్లలో పెద్ద ఎత్తున జరిగిన రైతుల ఆత్మహత్యలను బట్టి తెలుస్తోందని రైతు సంఘాలు అంటున్నాయి. మరి మోదీ గ్యారంటీ ఎవరికి? ఈ పది సంవత్సరాల్లో భారీ ఎత్తున సంపదను పోగు చేసుకున్న బడా పారిశ్రామికవేత్తలకేనా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

విచిత్రమేమంటే రైతుల నిరసన ప్రదర్శనల సందర్భంగా ఎన్డీఏ నుంచి వైదొలగిన అకాలీదళ్‌ను మళ్లీ ఎన్డీఏలోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఇటీవల కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. ఒకప్పుడు రైతుల నిరసనల్లో కీలకపాత్ర పోషించి అనేక రైతు ప్రదర్శనల్లో పాల్గొన్న భారతీయ లోక్‌దళ్ నేత జయంత్ చౌదరిని కూడా ఎన్డీఏ వైపు దృష్టిసారించేలా చేశారు. కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న ప్రకటించి నితీశ్ కుమార్‌ను ఎన్డీఏలోకి లాగినట్లే, జయంత్ చౌదరిని ఇండియా కూటమిలోంచి లాగి బీజేపీ వైపు తిప్పుకునేందుకు ఆయన తాత చౌదరి చరణ్‌సింగ్‌కు భారతరత్న ప్రకటించారు.


పీవీ నరసింహారావును కాంగ్రెస్ పార్టీ గుర్తించకపోయినప్పటికీ ఆయనకు భారతరత్నను ప్రదానం చేయడం ద్వారా ఆ ఘనత పొందేందుకు మోదీ ప్రయత్నం చేయడంలో ఆశ్చర్యం లేదు. పీవీ తన అయిదేళ్ల పాలనలో అనేక నిర్ణయాలను ఏకాభిప్రాయ సాధన ద్వారా అమలు చేశారు. ఆయన హయాంలో పార్లమెంట్‌లో ఏనాడూ చర్చించకుండా ఏ బిల్లూ ఆమోదం పొందలేదు. ఇవాళ పి.వి. చనిపోయిన తర్వాత భారతరత్నను ప్రకటించారు కాని వాజపేయి ప్రతిపక్ష నేతగా తనను విమర్శిస్తారని తెలిసినప్పటికీ పి.వి. ఆయనకు పద్మవిభూషణ్ ఇచ్చారు. జెనీవాలో ఐక్యరాజ్యసమితి సమావేశానికి కేబినెట్ హోదాలో వాజపేయిని పంపించారు. అయినా సరే వాజపేయి పి.విపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. పరస్పర మర్యాదలకు లోటు రాకుండా రాజకీయాలు నిర్వహించేందుకు నాడు నేతలు జాగ్రత్తపడేవారు. కాని నేడు ప్రతిపక్షాలను నిర్మూలించేందుకు మోదీ కంకణం కట్టుకున్నట్లు కనపడుతోంది. పార్లమెంట్‌లో స్థాయీ సంఘాలను ప్రవేశపెట్టి ప్రతి కీలక బిల్లునూ క్షుణ్ణంగా చర్చించే పద్ధతిని ప్రవేశపెట్టిన నేత పి.వి. మరి ఆయన బాటలో మోదీ ఏనాడైనా నడిచే ప్రయత్నం చేశారా?

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

# నవరత్నాల బడ్జెట్ మాయాజాలం!

జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలోని వైసీపీ ప్రభుత్వం 2024–25 తాత్కాలిక రాష్ట్ర బడ్జెట్‌ను ఇటీవల అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. ఈ బడ్జెట్ అంతా నవరత్నాల చుట్టూ తిరిగింది. గ్రామీణాభివృద్ధి, పంచాయితీలకు బడ్జెట్‌లో 15,878.83 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్‌లోను ఇదే మొత్తం కేటాయించారు. అయితే వాటిని గ్రామీణ ప్రజలకు సక్రమంగా వినియోగించినప్పుడే ప్రయోజనం నెరవేరుతుంది. అత్యధిక గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ సరైన రోడ్లు, తాగునీటి సౌకర్యం, సరైన విద్యుత్, మురుగునీటి పారుదల సౌకర్యాలు లేవు. పంచాయతీలకు నిధుల కేటాయింపులేదు. వాటికి కేంద్రం ఇచ్చే నిధులను కూడా రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించింది.

వ్యవసాయ రంగానికి 11,589.48 కోట్లు తాత్కాలిక బడ్జెట్‌లో కేటాయించారు. ఈ కేటాయింపులు వ్యవసాయ రంగానికి ఏ మాత్రం ఊరటనివ్వవు. గ్రామీణ ప్రాంతంలో 68శాతం ప్రజలు నివసిస్తున్నారు. వీరిలో వ్యవసాయ కూలీలు, పేద రైతులు 60శాతం దాకా ఉన్నారు. వీరికి ఉపాధి దొరికినప్పుడే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతుంది. గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించటంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైంది. అంతేకాక 140 రోజుల దాకా లభించే వ్యవసాయ పనులు, నేడు 80 రోజులు కూడా దొరకని పరిస్థితి ఏర్పడింది. 2023 సంవత్సరంలో రాష్ట్రంలోని 69.26 లక్షల కుటుంబాలు ఉపాధి పథకం కార్డులు పొందితే, 56.76 లక్షల కుటుంబాలకు మాత్రమే పనులు లభించాయి.




**సంక్షేమ పథకాలు, నవరత్నాల పేరుతో పేదలను యాచకులుగా మార్చే ప్రయత్నాలు కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాలు చేస్తున్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాల పేదలు కాని, అగ్రకులాల పేదలు గాని పాలక ప్రభుత్వాల దయాదాక్షిణ్యాలపై ఎందుకు ఆధారపడాలి? దేశంలో సంపదను సృష్టిస్తున్నది, ప్రజలకు అవసరమైన ఆహార ధాన్యాలు పండిస్తున్నది వీరే. ఈ వాస్తవాన్ని గ్రహించి, తమకు దక్కాల్సిన వాటిని పొందటం హక్కే గాని ప్రభుత్వ భిక్ష కాదని చెప్పాలి.**

రైతులపై మోయలేని అప్పుల భారం– దేశంలోనూ, రాష్ట్రంలోనూ సేద్యాన్ని ప్రశ్నార్థకంగా మారుస్తోంది. 1952లో ఎకరా సేద్యపు ఖర్చు 56 రూపాయలు ఉంటే, నేడు కౌలు ఖర్చుతో కలుపుకుని 50వేలకు పైగా ఉంది. రైతు పండించే ధాన్యానికి మాత్రం న్యాయమైన ధర లభించక రైతులు అప్పుల పాలవుతున్నారు. దేశంలో అప్పుల్లో కూరుకుపోయిన కుటుంబాలు 52శాతం ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో 93శాతం ఉన్నారు. దేశంలో కుటుంబాల సగటు అప్పు రూ.74,121 ఉంటే, ఆంధ్రప్రదేశ్‌లో రూ.2,45,554గా ఉంది. దేశంలో సంస్థాగత రుణాలు పొందే రైతులు 69శాతం ఉంటే, ఆంధ్రప్రదేశ్‌లో 49.6శాతంగా ఉన్నారు. రాష్ట్రంలో ఎక్కువ మంది రైతులు ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేస్తున్నారు. అప్పుల పాలైన రైతులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు.

గ్రామీణ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి నీటి రంగం అత్యంత ప్రధానమైంది. రాష్ట్రంలో కృష్ణా, గోదావరి నదులతో పాటు అనేక జీవనదులు ఉన్నా, అనేక ప్రాంతాల్లో సేద్యం వర్షంపైనే ఆధారపడి ఉంది. ఏ పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్నా నీటి ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తామని చెబుతూనే ఉన్నాయి. పోలవరం, హంద్రీ–నీవా, వెలిగొండ మొదలైన ప్రాజెక్టులను వివాదం చేస్తూ రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటున్నాయే తప్ప, సమిష్టిగా ప్రాజెక్టుల పూర్తికి ప్రయత్నించటం లేదు. వైసీపీ అధికారంలోకి వస్తే ప్రాజెక్టులు పూర్తి చేస్తామని చెప్పినా, ఇంతవరకు ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదు. నాలుగేళ్లలో నీటిపారుదల ప్రాజెక్టులకు 60 కోట్లు కేటాయించి, 20 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది.

ఎస్సీ, ఎస్టీ, బీసీల అభివృద్ధి కోసం సబ్ ప్లాన్ ద్వారా నిధులు కేటాయించి వారి అభివృద్ధికి పాటుపడుతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెడుతూ చెప్పింది. దశాబ్దాల తరబడి చూసినా వీరి అభివృద్ధిలో మౌలిక మార్పులు కన్పించలేదు. వారికి కేటాయించిన నిధులు కూడా వారికే ఖర్చు చేయటం లేదు. వైసీపీ ప్రభుత్వం 2019–20లో 11శాతం, 2020–21లో 11.9శాతం, 2021–22లో 13.8శాతం ఎస్సీల సబ్ ప్లాన్ కోసం కేటాయించింది. ఈ మూడు సంవత్సరాల్లో ఎస్సీలకు కేటాయించాల్సిన దానిలో 16వేల కోట్లు కోత విధించారు. ఎస్టీలకు కూడా ఈ మూడు సంవత్సరాల్లో 3.7శాతం, 3.9శాతం, 4.9శాతం నిధులను మాత్రమే కేటాయించి 4వేల కోట్ల రూపాయల కోత పెట్టారు. 2019 నుంచి 2022 వరకు సబ్ ప్లాన్ కింద 49,710.17 కోట్లు ఖర్చు చేసినట్లు ప్రభుత్వం లెక్కలు చెబుతున్నాయి. ఇది ఎస్సీ, ఎస్టీలను మోసగించటమే. నవరత్నాల కింద అమ్మఒడి, వైఎస్సార్ పెన్షన్ కానుక, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి వాటిల్లో భాగంగా వీరికి ఇచ్చే వాటిని కూడా సబ్ ప్లాన్ కోసం ఖర్చు చేసినట్లు వైసీపీ ప్రభుత్వం ప్రచారం చేస్తున్నది. ఇవి సబ్ ప్లాన్ ఖర్చుల కిందకు రావు. గత నాలుగు సంవత్సరాల్లో సబ్ ప్లాన్ గ్రాంట్ల కోసం 2.31 లక్షల కోట్లు కేటాయించి, ఖర్చు చేసింది 1.6లక్షల కోట్లు మాత్రమే. ఎస్సీ, ఎస్టీల సబ్ ప్లాన్ గడువు 23 జనవరి 2023తో ముగియటంతో మరో పది సంవత్సరాలు పొడిగిస్తూ వైసీపీ ప్రభుత్వం జీవో జారీ చేసింది. గడువు పొడిగించినంత మాత్రాన ఎస్సీలకు, ఎస్టీలకు మేలు జరుగుతుందని భావించకూడదు. జనాభా ప్రాతిపదికన వారికి బడ్జెట్‌లో నిధులు కేటాయించి, వినియోగించాలి.

బీసీల సబ్ ప్లాన్‌కు ప్రతి బడ్జెట్ నుంచి 15 వేల కోట్లతో 5 సంవత్సరాల్లో 75 వేల కోట్లు కేటాయించి, 66 వేల కోట్లు ఖర్చు చేసినట్లు ప్రభుత్వం లెక్కలు చెబుతున్నది. బీసీ కులాల్లో ఆర్థికంగా, సాంఘికంగా, సంస్కృతి పరంగా పెద్ద మార్పులేమీ జరగలేదు. ఎస్సీ, ఎస్టీ, బీసీల సబ్ ప్లాన్ కేటాయింపులను, రిజర్వేషన్లను ఆయా కులాల్లోని క్రీమీలేయర్లు ఉపయోగించుకుని సంపన్నవర్గాల జాబితాలో చేరుతున్నారు. రాజకీయంగా, ఆర్థికంగా ఉద్యోగాల్లోనూ ఈ క్రీమీలేయర్లే ముందుకు పోతున్నారు. ఈ కులాల్లోని పేదలు పేదలుగానే కొనసాగుతున్నారు. ఈ పరిస్థితులు మారాలి.

సంక్షేమ పథకాలు, నవరత్నాల పేరుతో పేదలను యాచకులుగా మార్చే ప్రయత్నాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాల పేదలు కాని, అగ్రకులాల పేదలు గాని పాలక ప్రభుత్వాల దయాదాక్షిణ్యాలపై ఎందుకు ఆధారపడాలి. దేశంలో సంపదలను సృష్టిస్తున్నది, ప్రజలకు అవసరమైన ఆహార ధాన్యాలు పండిస్తున్నది వీరే. ఈ వాస్తవాన్ని గ్రహించి, తమకు దక్కాల్సిన వాటిని పొందటం హక్కే గాని, ప్రభుత్వ భిక్ష కాదని చెప్పాలి. ఈ నేపథ్యంలో బడ్జెట్ కేటాయింపుల మోసాన్ని అర్థం చేసుకుని ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాల ప్రజలు ఇతర కులాల్లోని పేదలను కలుపుకుని సమిష్టిగా తమ హక్కుల సాధన కోసం ఉద్యమించాలి.

■ బొల్లిముంత సాంబశివరావు

# హేతువాద ఉద్యమాలతోనే సమాజాభివృద్ధి

ఏ దేశంలోనైనా మూఢనమ్మకాలు ఎంత తక్కువగా ఉంటే, ఆ దేశం అంతగా అభివృద్ధిపథంలో ముందుకు పోతుంది. మనదేశంలో తరతరాలుగా వస్తున్న ఆచారాలు, సాంప్రదాయాల పేరుతో చాందస భావాలను ప్రజల వదులుకోలేకపోతున్నారు. సైన్సు ఎంతగా అభివృద్ధి చెందినా దేవుడూ, దెయ్యం, బూచోడు లాంటి మాటలు, పుక్కిట పురాణాలు, మంత్రాలు–శాపాలూ వీటి బారి నుంచి బయటపడలేకపోతున్నారు. ఎంత చదువుకున్నా శాస్త్రీయ దృక్పథం లోపించిన కారణంగా డాక్టర్లు, యూనివర్శిటీ వైస్ చాన్సలర్లు, కలెక్టర్లు సైతం యాగాలు చేస్తున్నారు. యూనివర్శిటీలలో వాస్తు జ్యోతిష్యాలను కోర్సులుగా పెట్టి, సర్టిఫికెట్లు ఇస్తున్నారు. 'పదార్థం సృష్టించబడదు, నాశనం కాదు, మార్పు చెందుతుంది' అని విద్యార్థులకు బోధించే ఫిజిక్స్ ప్రొఫెసర్, ఒక బాబా నోట్లోంచి లింగం తీస్తే, అమాంతం వెళ్లి ఆయనకు సాష్టాంగపడుతున్నాడు.

ఆర్టికల్ 51ఏ(హెచ్)లో ఉన్న ప్రశ్నించే తత్వము, శాస్త్రీయ ఆలోచన, మానవవాదాన్ని పెంచటం ప్రతి పౌరుని బాధ్యత అన్న సూత్రాలను అమలుపరుస్తామని ప్రమాణం చేసిన ప్రధాని మోదీ ఒక సైన్సు కాంగ్రెసు సభలో పురాణాలలో వినాయకునికి ఏనుగు తలను అతికించడాన్ని ఇప్పటి సర్జరీలతో పోల్చి చెప్పారంటే పాలకులు ఎంత అజ్ఞానంలో కూరుకుపోయారో ఊహించుకోవచ్చు. ప్రభుత్వ భూములు ఆక్రమించి ఆశ్రమాల పేరుతో మోసం చేస్తున్న బాబాల వద్దకు అధికారికంగా వెళ్లి సాష్టాంగపడుతున్న ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, గవర్నర్లు, ప్రజాప్రతినిధులు రాజ్యాంగంలోని లౌకికవాదాన్ని మంటగలుపుతున్నా అడిగేవాడు లేడు. ఈ రకంగా దేశంలో మూఢనమ్మకాలు పెరిగిపోతున్నాయి. అరికట్టవలసిన అధికారులు సైతం వాటిలోనే మునిగిపోతున్నారు. వీటికి విరుగుడు ఒక్కటే.. మూఢనమ్మకాల నిర్మూలనచట్టం. కర్ణాటక, మహారాష్ట్ర మరికొన్ని రాష్ట్రాలలో ఉన్నట్లుగా ఉభయ తెలుగు రాష్ట్రాలలో కూడా మూఢనమ్మకాల నిర్మూలనచట్టం ఎంతో అవసరం. అందుకోసం అన్ని హేతువాద నాస్తిక సంఘాలూ, జన విజ్ఞాన వేదిక, ఇతర అభ్యుదయ సంఘాలు కలసి పోరాడాలి.

– నార్నె వెంకటసుబ్బయ్య

# కుల గణన! మత గణన! వర్గ గణన!

'కుల గణన విదేశీ శక్తుల ఎజండా?' పేరుతో (ఫిబ్రవరి 3న) వచ్చిన కె. అరవిందరావు వ్యాసానికి ప్రతిస్పందన ఇది. ఆ వ్యాసంలో, 'సంప్రదాయ మార్క్సిజం', 'సాంస్కృతిక మార్క్సిజం', 'రథయాత్ర', 'మండల్ కమిషన్ నివేదిక', 'హెయిర్ కటింగ్ రంగం', 'హిందూ సంస్కృతి', 'భారతీయ సంస్కృతి' అంటూ అనేక విషయాల గురించి అవాస్తవాలు రాశారు, వ్యాసకర్త!

(1) మార్క్సిజంలో 'సంప్రదాయ మార్క్సిజం' అనీ, 'సాంస్కృతిక మార్క్సిజం' అనీ, తేడాలేమీ ఉండవు. మార్క్సు, ఎంగెల్సులు, తమకు పూర్వం వున్న సిద్ధాంతాలను, విమర్శనాత్మకంగా పరిశీలించి రూపొందించిన 'శ్రామికవర్గ పోరాట సిద్ధాంతం' ఒక్కటే వుంటుంది. దానిని, వేరు వేరు దేశాలలో ఉన్న పరిస్థితులను బట్టి అన్వయించుకోవడం మాత్రమే జరిగింది. అది తప్ప, మార్క్సిజం చెప్పిన 'శ్రమ దోపిడీ' అనే సత్యాన్ని మించిన సత్యాన్ని, ఇప్పటి వరకూ ఎవరూ కనిపెట్టలేదు.

(2) 'గ్రామ్షీ' వంటి కమ్యూనిస్టు మేధావులు కనిపెట్టారని వ్యాసకర్త చెపుతున్న 'సాంస్కృతిక పెత్తందారీతనం' ('కల్చరల్ హెగిమొనీ') అనే భావన, కొత్త సత్యమేమీ కాదు. ఆ పద ప్రయోగమే కొత్త! మార్క్సు–ఎంగెల్సులు 1845లో రాసిన 'జర్మన్ ఐడియాలజీ'లోనూ; 1848లో రాసిన 'కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక'లోనూ, ఆ భావన చాలా స్పష్టంగా ఉన్నదే. వాళ్ళ మాటలు చూడండి: "ప్రతీయుగంలోనూ, పాలించే భావాలు, ఆ నాటి పాలకవర్గ భావాలే"– (కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక, పేజీ–66). "భౌతిక ఉత్పత్తి సాధనాలను తన అదుపులో కలిగివున్న వర్గమే, దాని ఫలితంగా బౌద్ధిక ఉత్పత్తి సాధనాలను కూడా కంట్రోల్ చేస్తుంది. బౌద్ధిక ఉత్పత్తి సాధనాలను కలిగివుండని వారి భావాలు, మొత్తం మీద, కంట్రోలు చేసే వర్గానికి లోబడివుంటాయి... పాలకవర్గ భావాలు అనేవి, ప్రబలంగా వున్న భౌతిక సంబంధాలకు ఖచ్చితమైన వ్యక్తీకరణ తప్ప ఇంకేమీ కాదు." (జర్మన్ ఐడియాలజీ, పేజీ–67) మార్క్సు, ఎంగెల్సులు చెప్పిన భావాన్నే, గ్రామ్షీ గానీ, ఇంకో కమ్యూనిస్టు గానీ చెప్పగలిగారు గానీ, వర్గాతీతమైన భావాన్నయితే చెప్పలేదు! కాబట్టి, 'సంప్రదాయ మార్క్సిజం' అనీ, 'సాంస్కృతిక మార్క్సిజం' అని వేరే వేరే పేర్లు పెట్టినంత మాత్రాన, మార్క్సిజపు సారాంశం మారదు.

(3) "అనేక దేశాల్లో ఆర్థిక అసమానతలున్నా, వర్గ పోరాటాలు జరగలేదు."– అని వ్యాసకర్త వ్యాఖ్య! అవి జరగలేదంటే, అది మార్క్సిజంలో లోపం కాదు. వర్గ పోరాటాలు అనేవి, పగలూ–రాత్రీలా, అమావాస్యా– పౌర్ణమీలా, ప్రకృతి సహజంగా జరగవు! వర్గ పోరాటాల కోసం, శ్రామికవర్గ పార్టీలైన కమ్యూనిస్టు పార్టీలకు, మార్క్సిస్టు సిద్ధాంత గ్నానంతో, నడిచే సామర్థ్యాలు బలహీనపడి ఉండవచ్చు! అలా జరగలేదు కాబట్టి, 'సాంస్కృతిక మార్క్సిజం' అనే భావన వచ్చిందనడం తప్పు! వర్గ పోరాటాలలోకి శ్రామిక జనాల్ని సమీకరించడానికి, కావలసిన వర్గ చైతన్యం ప్రాధాన్యతను నొక్కి చెప్పే సందర్భంలో, గ్రామ్షీ 'సాంస్కృతిక పెత్తనం' అనే మాటని వాడాడు. సంస్కృతి అంటే భావజాలం. శ్రామిక జనాల మీద పాలక వర్గ సంస్కృతి పెత్తనాన్ని ఎదుర్కోవడానికి శ్రామిక వర్గ మేధావులు కృషి చెయ్యాలని చెప్పిన సందర్భం అది! ఈ భావన, మార్క్సు ఎంగెల్సులు చెప్పని భావన కాదు. ఉదాహరణకి, సమాజానికి ఒక పునాదీ (ఆర్థిక సంబంధాలు), ఆ పునాదికి అనుగుణమైన, ఉపరితలం (సంస్కృతీ, రాజకీయాలూ, మతం మొదలైనవి) ఉంటాయని మార్క్సు ఎంగెల్సులు గతంలోనే చెప్పివున్నారు.

(4) "హిందూ మతం, కులాన్ని నిర్మించిందన్నది అసత్య ప్రచారం" అని వ్యాసకర్త వాదన. హిందూ మత గ్రంథాలలో నాలుగు వర్ణాల గురించే రాశారట గానీ, కులాల గురించి చెప్పలేదట! ఏ మతాల్లోనూ లేని ఆ వర్ణ వ్యవస్థ హిందూ సమాజంలో మాత్రమే ఉందంటే, అది హిందూ మతానికి వున్న ప్రత్యేక లక్షణమే! వర్ణ వ్యవస్థ మానవుల్ని ఎలా విభజించిందో చూడండి! బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర అనేవే ఆ నాలుగు వర్ణాలూ. ఇవన్నీ అసమాన వర్ణాలే! వాటిల్లోని అసమానత్వమే, అనేక వేల కులాలు ఏర్పడడానికి దారి తీసింది. అసలు గ్రహించవలసింది: వర్ణ వ్యవస్థలో గానీ, కుల వ్యవస్థలో గానీ వున్నదంతా, అసమాన శ్రమ విభజనే! అసమాన శ్రమ విభజన అంటే, మానవుల్లో కొందరు ఎక్కువ విలువ గలిగిన మేధా శ్రమలూ; కొందరు తక్కువ విలువ గలిగిన శారీరక శ్రమలూ; కొందరు ఎప్పుడూ మురికిని శుభ్రం చేసే శ్రమలు చేయవలిసి రావడం, కొందరు ఆ రకం పనులు ఎప్పుడూ చెయ్యకపోవడం... ఇలాంటి పరిస్థితే అసమాన శ్రమ విభజన! అయితే, ఈ అసమాన శ్రమ విభజన అనేది, ప్రపంచ వ్యాప్తంగా, అన్ని మతాలలోనూ వున్నప్పటికీ, హిందూ మతం మాత్రమే వర్ణ వ్యవస్థని ఎందుకు కౌగలించుకుందో ఊహించుకోవలిసిందే! ఇప్పుడు మనం చెయ్యవలిసిందల్లా, కుల సంస్కృతిని చీదరించుకోవడమే! దాన్ని నిర్మూలించడమే!

**అసలు గ్రహించవలిసింది: వర్ణ వ్యవస్థలో గానీ, కుల వ్యవస్థలో గానీ వున్నదంతా, అసమాన శ్రమ విభజనే! అసమాన శ్రమ విభజన అంటే, మానవుల్లో కొందరు ఎక్కువ విలువ గలిగిన మేధా శ్రమలూ; కొందరు తక్కువ విలువ గలిగిన శారీరక శ్రమలూ; కొందరు ఎప్పుడూ మురికిని శుభ్రం చేసే శ్రమలు చేయవలిసి రావడం, కొందరు ఆ రకం పనులు ఎప్పుడూ చెయ్యకపోవడం... ఇలాంటి పరిస్థితే అసమాన శ్రమ విభజన! అయితే, ఈ అసమాన శ్రమ విభజన అనేది, ప్రపంచ వ్యాప్తంగా, అన్ని మతాలలోనూ వున్నప్పటికీ, హిందూ మతం మాత్రమే వర్ణ వ్యవస్థని ఎందుకు కౌగలించుకుందో ఊహించుకోవలిసిందే! ఇప్పుడు మనం చెయ్యవలిసిందల్లా, కుల సంస్కృతిని చీదరించుకోవడమే! దాన్ని నిర్మూలించడమే!**






(5) 'ఈనాడు చాలా మంది కుల వృత్తులలో లేరనడానికి ఉదాహరణగా, క్షవరం చేసే వృత్తిలో ముస్లిములే చాలామంది వున్నారని వ్యాసకర్త వాదన. అంటే, హిందువుల్లో, కులవృత్తుల్లో వున్నవారు తగ్గిపోయారని, తేల్చే ప్రయత్నం! జనాభా లెక్కల్ని ఆధారం చేసుకుని, 'టైమ్స్ ఆఫ్ ఇండియా' పత్రిక, 2018 డిసెంబరు 22న ఇచ్చిన వివరాల ప్రకారం, కులం అనేది ఇప్పటికీ, వృత్తుల్ని ఎంచుకోవడంలో, ప్రధానమైన అడ్డంకిగా వుంది–అని! ఉత్తరప్రదేశ్‌లో జనాభా లెక్కల ప్రకారం: తోలు పరిశ్రమల్లో (లెదర్ ఇండస్ట్రీస్) పని చేసే 46 వేల మందిలో, 41 వేల మంది, ఎస్సీ కులస్తులే! అదే సమయంలో, రాజస్థాన్‌లో 76 వేల మంది స్వీపర్లుగా వుంటే, వారిలో 52 వేల మంది ఎస్సీలే!

(6) 'అద్వానీ రథయాత్ర సమయంలో, వి.పి.సింగు ప్రభుత్వం మండల్ కమిటీ నివేదికను అమలు చేసిందని' వ్యాసకర్త చేసిన వ్యాఖ్య వాస్తవ విరుద్ధం. ఆ నివేదికను వి.పి.సింగు పార్లమెంటులో ప్రవేశపెట్టినది, రథయాత్రకు పూర్వమే. 1990 ఆగస్టు 7న. రథ యాత్ర ప్రకటన వచ్చింది ఒక నెల తర్వాత, సెప్టెంబరు 12న. ఎయిర్ కండిషనర్లు బిగించిన టొయాటో వ్యానుతో 'రథయాత్ర' మొదలైనది, సెప్టెంబరు 25న.

(7) కుల గణన వల్ల భారతీయ సంస్కృతీ మూలాలు నశించే అవకాశం వుంది–అని వ్యాసకర్త వాపోయారు. కుల వ్యవస్థను సృష్టించినదే హిందూ సంస్కృతి కాబట్టి, కుల గణన వలన భారతీయ సమాజానికి ఏమీ నష్టం జరగదు. ఎందుకంటే, కుల గణన కోరే వారి ఉద్దేశం, కులాల జనాభాని బట్టి ఆర్థిక, రాజకీయ అవకాశాలు పొందాలి–అన్నదే! అందుచేత, కులాల నాయకులు ఇప్పుడున్న దోపిడీ రాజ్యాంగ యంత్రంలోనే, అధికారులుగా, ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా, మంత్రులుగా, పదవులకోసం ప్రయత్నిస్తారు. ఆ ప్రయోజనం కోసం, ఎల్లకాలమూ కులాలు నిలిచివుండేలా చూసుకుంటారు. నష్టం అంటూ జరిగితే, కులాల వారీగా కాకుండా, మతాల వారీగా, అది కూడా, మెజారిటీ మతస్తుల ఓట్లకోసం ప్రయత్నించే మతతత్వ రాజకీయ పార్టీలకి తలనొప్పే. మతతత్వ వాద పార్టీలకు కావలిసింది 'మత గణన'.

(8) ఈ కులగణనను మార్క్సిస్టులే వెనక వుండి రాజకీయ పార్టీల చేత చేయిస్తున్నారు – అని, వ్యాసం చివరిలో, వ్యాసకర్త అనుమానం! అది పూర్తిగా తప్పు. ఎందుకంటే, 'శ్రమ దోపిడీ'ని శ్రామిక వర్గ పోరాటాల ద్వారా నిర్మూలిస్తూ, అసమాన శ్రమ విభజనను మార్చడం ద్వారా కుల వ్యవస్థను కూల్చే లక్ష్యం గల కమ్యూనిస్టులు, కుల గణన మీద భ్రమలు పెట్టుకోరు! 'వర్గ గణన' మీద ఆధారపడి, వారు తమ కార్యక్రమాలు నిర్వహించుకుంటారు. అలాగే, "మనమంతా హిందువులం! మనమంతా బంధువులం!" అనే నినాదంతో, కుల గణనను వ్యతిరేకించే పార్టీలను నమ్మవద్దని కూడా శ్రామిక జనాలకు కమ్యూనిస్టులు వివరిస్తారు.

(9) ఆరెస్సెస్ వాళ్ళూ, బీజేపీ వాళ్ళూ తరుచుగా జపించే 'భారతీయ సంస్కృతి', 'జాతీయ భావన' అనే మాటలు, ఈ వ్యాసంలో కూడా కనిపించాయి. వాస్తవంలో, హిందూ మతస్తులందరూ, భారతీయ సమాజం అంతా, ఒకే రాయితో చేసిన శిల్పం కాదు. ప్రపంచంలో అన్ని దేశాల్లోనూ, అన్ని సమాజాల్లోనూ, అన్ని మతాల్లోనూ వున్నట్టే, ఇక్కడా ధనిక–పేద తేడాలూ, స్త్రీ–పురుష అసమానత్వమూ, మూఢ నమ్మకాలూ, ఇలా అన్ని చెడుగులూ వున్నాయి. కుల వ్యవస్థ అనేది, ఇక్కడ అదనంగా వున్న చెడ్డ లక్షణం! అన్ని దేశాలలోనూ వున్నట్టే, ఈ దేశంలోనూ, లాభాలూ, వడ్డీలూ, కౌళ్ళూ అనే 'శ్రమ దోపిడీ' ఆదాయాల మీద బ్రతికే సంస్కృతే, దోపిడీ వర్గానికి మూలం! ఏదో ఒక రకమైన శ్రమ చేస్తూ, జీతాల మీద బ్రతికే పేదల సంస్కృతీ వుంది. అలాంటప్పుడు భారతీయ సంస్కృతి, ఇతర దేశాల సంస్కృతి నించీ వేరుగా వుండదు.

(10) "కులగణన వల్ల ఎవరికి లాభం?" అని ప్రశ్నించిన వ్యాసకర్తకి, మత గణన వల్ల ఎవరికి లాభం? అని కూడా ప్రశ్నించాలని తోచలేదు. 2022లో, ఉత్తరప్రదేశ్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో, బీజేపీ రాజ'యోగి' (ముఖ్యమంత్రి), 'ఈ ఎన్నికలు 80 శాతానికీ, 20 శాతానికీ మధ్య పోరాటం!' అనడం, 'మత గణన' దృష్టితో కాదా? ఇలాంటి ప్రకటనలు, దేశ ప్రజల్ని కలిపి వుంచుతాయా, విభజిస్తాయా?

• రంగనాయకమ్మ





హోమగుండం ఏర్పాట్లు



కంకిపాడులో నడి రోడ్డుపై ఏర్పాటు చేసిన సభ

## అధికారం మాది.. మమ్మల్ని ఎవరు ఆపేది?

'మాది అధికార పార్టీ. ఏం చేసినా మమ్మల్ని అడిగేదెవరు? ఆపేదెవరు?' అన్నట్టుంది వైసీపీ నేతల తీరు. పైగా మంత్రి జోగి రమేష్ పాల్గొనే సభ కావడంతో నిబంధనలు అడ్డురాలేదు. అధికారులు అడ్డు చెప్పలేదు. పోలీసులు అడ్డగించలేదు. మంగళవారం కంకిపాడులో నడిరోడ్డుపై వైఎస్సార్ ఆసరా సభ నిర్వహించారు. బస్సులు, వాహనాలను మళ్లించారు. మధ్యాహ్నం నుంచి ట్రాఫిక్‌కు తీవ్ర ఆటంకం కలిగించారు. ప్రజలను అవస్థలపాలు చేశారు. ప్రతిపక్ష పార్టీలు రోడ్డుపై నిరసన తెలిపితే అరెస్టులు చేసి అడ్డగించే పోలీసులు అధికార పార్టీకి అంటకాగడం గమనార్హం. - కంకిపాడు

- 4లో..



## మల్లేశ్వర వైభవం

ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో మల్లేశ్వరాలయ పునఃప్రారంభ కార్యక్రమాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. 18వ తేదీ వరకు భారీగా పూజా కార్యక్రమాలు, హోమాలు జరగనున్నాయి. 18న ఆలయ స్వర్ణశిఖర కుంభాభిషేకం జరగనుంది.

# టీడీపీ టార్గెట్ యువ!

## యువ ఓటర్లే లక్ష్యంగా కార్యక్రమాలు

యువ ఓటర్లపై తెలుగుదేశం దృష్టి సారించింది. మొదటి సారి ఓటు వేయబోతున్న యువతను లక్ష్యంగా చేసుకుంది. వీరి కోసం పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలకు సిద్ధమవుతోంది. యువ ఓటర్లు తాము ఎందుకు ఓటు వేయాలో తెలుపుతూ ఈ కార్యక్రమాలకు రూపకల్పన చేస్తున్నారు. ప్రస్తుతం ఏపీ ఉన్న పరిస్థితి నుంచి బయటపడాలంటే యువత ఓటు ఎంత కీలకమో అవగాహన కల్పించేలా 'మై ఫస్ట్ ఓట్ టు ఏపీ' కార్యక్రమానికి రూపకల్పన చేశారు.

- మై ఫస్ట్ ఓట్ టు ఏపీ పేరుతో సమావేశాలు
- దేవినేని చందుకు మచిలీపట్నం పార్లమెంటు, విజయవాడ తూర్పు బాధ్యతలు
- కిలారు నాగ శ్రవణ్‌కు విజయవాడ పార్లమెంటు బాధ్యతలు

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో మొత్తం ఓటర్ల సంఖ్య 31,93,250. వీరిలో తొలి సారి ఓటు హక్కు వినియోగించుకునే వారి సంఖ్య సుమారు 70వేల వరకు ఉంటుంది. వీరితోపాటు 25 ఏళ్లలోపు ఉన్న ఓటర్ల సంఖ్య మరో 2 లక్షల వరకు ఉంటుందని అంచనా. మొత్తం మీద యువ ఓటర్లు రానున్న ఎన్నికల్లో కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వారిని లక్ష్యంగా చేసుకుని టీడీపీ 'మై ఫస్ట్ ఓట్ టు ఏపీ' కార్యక్రమానికి రూపకల్పన చేసింది. ఇందులో భాగంగా తొలి ఓటర్లతోపాటు యువతను లక్ష్యంగా చేసుకుని అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 'దేశ దిశ, దశను మార్చే అస్త్రం ఓటు. రాజ్యాంగం కల్పించిన ఈ హక్కు ద్వారా ప్రభుత్వాలను, పాలకులను ఎన్నుకునే గొప్ప అవకాశం ఉంది. అందుకే యువత ఓటును నిర్లక్ష్యం చేయొద్దు' అని చెప్పడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశం.



దేవినేని చందు



కిలారు నాగ శ్రవణ్

### కార్యక్రమాల బాధ్యతలు అప్పగింత

మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ఏడు నియోజకవర్గాలు, విజయవాడ తూర్పు నియోజకవర్గంలో 'మై ఫస్ట్ ఓట్ టు ఏపీ' కార్యక్రమాలను తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని చంద్రశేఖర్ పర్యవేక్షించనున్నారు. త్వరలో అవనిగడ్డ, పెడన, గుడివాడ, మచిలీపట్నం, పామర్రు, పెనమలూరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కనీసం రెండు మీటింగ్స్ నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. టౌన్ హాల్ మీటింగ్స్, కళాశాలల దగ్గర యువతకు అవగాహన కల్పించేలా వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. విజయవాడ పార్లమెంటు పరిధిలోని మిగిలిన 6 నియోజకవర్గాల్లో కిలారు నాగశ్రవణ్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

### ఏపీ భవిష్యత్తు కోసం మొదటి ఓటు వేయండి

'రాష్ట్ర భవిష్యత్తు యువత చేతిలోనే ఉంది. మనం వేసే ఓటు రాష్ట్రాభివృద్ధికి తోడ్పడాలి. నిరుద్యోగ సమస్యలు, విద్య, వైద్యం, న్యాయం, భద్రత అందించగలిగే వారికే ఓటు వేయాలి. తొలి ఓటును తెలివిగా వేయాలి. కులం మతం కాదు, నాయకుడి సమర్థత చూసి ఓటేయాల్సిన బాధ్యత యువతపై ఉంది. నేను ఒక్కడినే ఓటు వేయకపోతే పోయేదేముందని అనుకోకుండా, ఒక్క ఓటు మన భవిష్యత్తును, రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయిస్తుందనే అవగాహన యువ ఓటర్లలో కల్పించడమే మా కార్యక్రమాల ప్రధాన ఉద్దేశం. "ఏపీ భవిష్యత్తు కోసం మీ మొదటి ఓటు వేయండి" అన్న పిలుపుతో యువతను చైతన్యం చేస్తాం.

-దేవినేని చందు

## హవ్వా..! ఇదేం తనిఖీ?



### నడుస్తున్న రొయ్యూరు క్వారీని వదిలి మూడున్నరేళ్ల క్రితం మూతపడిన క్వారీలో తనిఖీ

ఎక్కడైనా నడుస్తున్న క్వారీలో తనిఖీలు నిర్వహించి పర్యావరణ అనుమతులు పరిశీలిస్తారు. మూడున్నరేళ్ల క్రితం మూతపడిన క్వారీలో తనిఖీలు జరపటం విడ్డూరమే. తోట్లవల్లూరు మండలంలో మంగళవారం ఇదే జరిగింది.



తవ్వకాలులేని క్వారీలో కలెక్టర్, మైనింగ్, ఎస్ఈబీ అధికారుల బృందం

**తోట్లవల్లూరు, ఫిబ్రవరి 13 :** కృష్ణానదిలో పర్యావరణానికి హాని కలిగించే విధంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు నాగేంద్ర అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడు. క్వారీలకు అనుమతులు పరిశీలించి నివేదిక అందించాలని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్... అధికారులను ఆదేశించింది. దీంతో కలెక్టర్ రాజాబాబు ఆధ్వర్యంలో అడిషనల్ ఎస్పీ వెంకటేశ్వరరావు పలువురు అధికారుల బృందం పాములలంక వైపున పెద్దఏటిపాయలోని నార్తువల్లూరు క్వారీకి మంగళవారం వచ్చింది. ఇక్కడ ఇసుక తవ్వకాలు మూడున్నరేళ్ల క్రితమే నిలిపేశారు. కలెక్టర్ రాజాబాబు తోట్లవల్లూరు మండలంలో ఎక్కడెక్కడ క్వారీలున్నాయని అధికారులను వివరాలు అడగడంతో రొయ్యూరు క్వారీ విషయం వెలుగులోకి వచ్చింది. రొయ్యూరు క్వారీకి అనుమతులు లేవని, స్థానిక తహసీల్దార్ తవ్వకాలను నిలిపివేశారని కలెక్టర్ గుర్తుచేశారు. రొయ్యూరు క్వారీకి పర్యావరణ అనుమతులు (ఈసీ) వచ్చాయని, ఆ సర్వే నెంబరు ఎన్జీటీ పరిధిలో లేదని, తవ్వకాలకు దర ఖాస్తు పెట్టకున్నారని మైనింగ్ సర్వేయర్ రామలక్ష్మీ కలెక్టర్‌కు చెప్పటం విశేషం.

### ● బృందం వెళ్లిపోయాక యథేచ్ఛగా తవ్వకాలు

కలెక్టర్ బృందం వస్తుందని ముందుగానే సమాచారం అందుకున్న రొయ్యూరు క్వారీ సిబ్బంది మధ్యాహ్నం వరకు తవ్వకాలు ఆపేశారు. అధికారులు వెనుదిరిగిన తరువాత యథాతథంగా యంత్రాలతో ఇసుక తవ్వకాలు మొదలు పెట్టేశారు. తహసీల్దార్ కుసుమకుమారి ఇప్పటికి రెండుసార్లు రొయ్యూరు క్వారీలో తవ్వకాలను ఆపేయించగా మళ్లీ తవ్వకాలు జరుపుతున్నారు. సోమవారం రొయ్యూరు క్వారీపై స్పందనలో లుక్కా వెంకట శ్రీనివాసరావు ఫిర్యాదు కూడా చేశారు.



## ఏపీటీడీసీలో ఇష్టారాజ్యం

### పర్యాటక యూనిట్లను ప్రైవేటు సంస్థలకు కారుచౌకగా కట్టబెట్టే కుట్ర

- అధికారులను అసమర్థులుగా చూపే ప్రయత్నం
- విజిలెన్స్ దాడుల చేయిస్తున్న ఉన్నత అధికారులు
- విజయవాడ డివిజన్‌లోనూ విజిలెన్స్ బృందాల తనిఖీ
- ప్రైవేటు సంస్థలకు ఇచ్చేందుకు టెండర్లు

దొంగే... దొంగ.. దొంగ.. అన్నట్టుంది పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) తీరు. నిర్వహణ సరిగాలేకపోవడానికి అధికారుల అసమర్థతే కారణమని చూపే ప్రయత్నం జరుగుతోంది. విజయవాడ డివిజన్‌లోని పర్యాటక యూనిట్లను ఉన్నతాధికారులు పనిగట్టుకుని దెబ్బతీస్తున్నారు. అందులో భాగంగానే పర్యాటక యూనిట్ల నిర్వహణను గాలికొదిలేసి సిబ్బందిని సాగనంపుతున్నారు. ఉన్న అధికారులను కూడా అవినీతిపరులుగా చూపే ప్రయత్నం చేస్తున్నారు. పర్యాటక యూనిట్లు పూర్తిగా పడకేసేలా చేసి కారుచౌకగా ప్రైవేటు సంస్థల, వ్యక్తుల చేతిలో పెట్టేందుకు టెండర్లు కూడా పిలవడం గమనార్హం.

**(ఆంధ్రజ్యోతి, విజయవాడ) :** నిన్నటి వరకు పర్యాటక యూనిట్ల ద్వారా వచ్చే ఆదాయాన్ని పిండుకున్నారే తప్ప.. వాటి నిర్వహణకు డబ్బులు విదల్చలేదు. రాష్ట్రంలోనే అతిపెద్ద భవానీ ద్వీపంతోపాటు విజయవాడ డివిజన్ పరిధిలోని హరిత బెర్మ్‌పార్క్, సూర్యలంక వంటి యూనిట్ల నిర్వహణకు ఈ నాలుగేళ్లలో పైసా కూడా ఇవ్వలేదు. దీంతో ఆదాయం తగ్గింది. ఈ సాకుతో పర్యాటక యూనిట్లలో పనిచేసే వారందరినీ అసమర్థులుగా చిత్రీకరించారు. వారి స్థానాల్లో తమ సొంత మనుషులను నియమించేందుకు నిబంధనలను తుంగలోతొక్కారు. తాము అనుకున్న ప్రైవేటు వ్యక్తులను పర్యాటక యూనిట్లలోకి తీసుకు వచ్చారు. ఒక పథకం ప్రకారం ఇలా చేశాక పర్యాటక యూనిట్ల ద్వారా ఆదాయం రావటం లేదన్న వాదన తీసుకువచ్చారు. వాటిని హోల్‌సేల్‌గా ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టేందుకు టెండర్లు పిలిచారు.

### ● ఆరోపణలను తిప్పికొట్టేందుకు విజిలెన్స్ తనిఖీలు

పర్యాటక యూనిట్లను ప్రైవేటుపరం చేయాలన్న కుట్రపై ఆరోపణలను ఎదుర్కొనేందుకు ఇప్పుడు విజిలెన్స్ బృందాలను నియమించారు. ఈ విజిలెన్స్ బృందాల తనిఖీల్లో పర్యాటక యూనిట్లలో కొందరు మేనేజర్ల అవినీతి బాగోతాలు వెలుగులోకి వస్తున్నాయి. మొన్నటికి మొన్న కడప యూనిట్ మేనేజర్‌గా నియమించిన వ్యక్తి ఏడు బుకింగ్‌ల డబ్బులను సంస్థకు జమ చేయకుండా సొంత ఖాతాకు మళ్లించుకున్న వ్యవహారం విజిలెన్స్ దాడిలో వెలుగు చూసింది. తాజాగా దిండి రిసార్ట్‌లో రూ.కోటి విలువైన స్కామ్ వెలుగు చూసింది. విజయవాడ డివిజన్‌లో కూడా విజిలెన్స్ తనిఖీలు జరుగుతున్నాయి. ఇప్పటివరకు ఎలాంటి అక్రమాలనూ గుర్తించనప్పటికీ.. రానున్న రోజుల్లో ఏం జరుగుతుందో వేచి చూడాల్సిందే. ఇలాంటి పరిస్థితులు ఏపీటీడీసీ అధికారులే ఓ పథకం ప్రకారం కల్పించటం వివాదాస్పదమౌతోంది.

- మిగతా 4లో

# ఉద్యోగుల ఉద్యమ కేక!



పోరు పిడికిలి బిగించిన ఏపీఎన్జీవో నేతలు

## నేటి నుంచే ఏపీజేఏసీ ఆధ్వర్యంలో పోరుబాట

### నేడు జిల్లా వ్యాప్తంగా నల్లబ్యాడ్జీలతో ఆందోళన

- కలెక్టర్లు, సబ్‌కలెక్టర్లు, తహసీల్దార్లకు సమస్యలపై మెమోరాండాల సమర్పణ
- ఐదేళ్లు కావస్తున్నా.. నెరవేరని సమస్యలు
- ఇచ్చిన హామీలు వాయిదాలతో సరి..

ప్రభుత్వ నిర్లక్ష్యంపై ఉద్యోగులు ఉద్యమ శంఖారావం పూరించారు. ఇచ్చిన హామీలను కూడా అమలు చేయకుండా వాయిదాలతో కాలయాపన చేస్తున్న ప్రభుత్వంతో తాడో, పేడో తేల్చుకునేందుకు బుధవారం నుంచి పోరుబాట పట్టారు. ఎన్నికల ముందైనా ఒత్తిడి తీసుకురావాలన్న కసితో ఉద్యమానికి సిద్ధమయ్యారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేలాది మంది ఉద్యోగులు ప్రత్యక్ష పోరాటానికి పూనుకున్నారు. ఏపీజేఏసీ పిలుపు మేరకు ఏపీఎన్జీవో సంఘంతో పాటు ఉపాధ్యాయ సంఘాలు, పెన్షనర్ల సంఘాలు, కార్మిక సంఘాలన్నీ ఆందోళనకు సిద్ధమయ్యాయి.

**(ఆంధ్రజ్యోతి, విజయవాడ) :** ఉద్యోగులు తొలిరోజు ఉద్యమ కార్యాచరణలో భాగంగా.. నల్లబ్యాడ్జీలు ధరించి విధుల్లో పాల్గొననున్నారు. భోజన విరామ సమయంలో ఆందోళనలు చేపట్టనున్నారు. గతంలో మాదిరిగా సుదీర్ఘకాలం పాటు ఉద్యమ కార్యాచరణను సాగదీయకుండా ఈనెల 27వ తేదీ వరకే అగ్ర నాయకత్వం కార్యాచరణను ఇచ్చింది. ఎన్నికల నోటిఫికేషన్‌ను కూడా దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్న దిశగా కార్యాచరణను కుదించింది. దీంతో ఒకే రోజున అనేక కార్యక్రమాలను నిర్వహించాల్సి వస్తోంది. బుధవారం నల్లబ్యాడ్జీలతో నిరసనలే కాకుండా.. జిల్లా, డివిజన్, మండల స్థాయిలో కూడా ఉద్యమానికి ఊపు తేవటానికి వీలుగా కూడా కార్యక్రమాలను తీసుకుంది. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల కలెక్టర్లకు తమ డిమాండ్లతో కూడిన మెమోరాండాలు జేఏసీ నేతలు ఇవ్వనున్నారు. డివిజన్ల స్థాయిలో సబ్ కలెక్టర్లు, ఆర్డీవోలకు అందించనున్నారు. మండల స్థాయిలో తహసీల్దార్లకు మెమోరాండాలు అందించనున్నారు. బుధవారం జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమాలను ఉధృతంగా నిర్వహించనున్నారు. నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరైనప్పటికీ భోజన విరామ సమయంలో ఎక్కడికక్కడ ఆఫీసుల్లో ఆందోళనలు తెలపాలని నిర్ణయించారు. గురువారం కూడా ఆందోళనలు సాగుతాయి. తాలూకాల స్థాయిలో పాఠశాలల్లో నిరసనలు చేపట్టనున్నారు. శుక్రవారం నుంచి ఉద్యమం డోస్ పెంచుతారు. ధర్నాలు, ర్యాలీలు నిర్వహిస్తారు.

- మిగతా 4లో

## ఉద్యమం అనివార్యం

- డిమాండ్లు పరిష్కారమయ్యేవరకూ పోరాటం
- ఐదు దశాబ్దాల్లో ఇలాంటి పరిస్థితి రాలేదు
- ఎన్టీఆర్ జిల్లా ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు విద్యాసాగర్

- 4లో..

## 'సైబర్' ఏసీపీగా తేజేశ్వరరావు

### ● మచిలీపట్నం డీఎస్పీకి స్థానచలనం

**విజయవాడ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) :** ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్ సైబర్ క్రైం ఏసీపీగా తేజేశ్వరరావు నియమితులయ్యారు. చిత్తూరు జిల్లా స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా ఉన్న ఆయనను ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్‌కు బదిలీ చేశారు. రాష్ట్రంలో పలువురు డీఎస్పీల బదిలీల ఉత్తర్వులు మంగళవారం వెలువడ్డాయి. విజయవాడ ట్రాఫిక్ 1 ఏసీపీ ఆర్.రామచంద్రరావును కాకినాడ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు బదిలీ చేశారు. తెనాలిలో పనిచేస్తున్న బి.జనార్ధనరావును ట్రాఫిక్ ఏసీపీగా పంపారు. ట్రాఫిక్ 4 ఏసీపీగా ఉన్న సురేష్‌కుమార్‌రెడ్డిని పోలవరం డీఎస్పీగా బదిలీ చేశారు. ఆయన స్థానంలోకి తిరుపతి సీసీఎస్ డీఎస్పీ ఎం.జనార్ధన్‌ను నియమించారు.

**● నెలలోనే ఏమైంది?**

మచిలీపట్నం డీఎస్పీగా ఉన్న జె.రాంబాబును తాజాగా విడుదల చేసిన ఉత్తర్వుల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు బదిలీ చేశారు. తొలి విడతగా జరిగిన బదిలీల్లో రాంబాబును మచిలీపట్నంలో నియమించారు. ఆయన విధుల్లో చేరి నెల రోజులైనా పూర్తికాలేదు. ఇంతలోనే రాంబాబును బదిలీ చేశారు. ఆయన స్థానంలో నెల్లూరు స్పెషల్‌బ్రాంచ్ డీఎస్పీ ఎండీ అబ్దుల్‌సుభాన్‌ను నియమించారు.



స్వామి, అమ్మవార్లకు నూతన పట్టువస్త్రాలు సమర్పిస్తున్న బొప్పన సత్యనారాయణ

## వైభవంగా సుబ్బారాయుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

**మోపిదేవి, ఫిబ్రవరి 13 :** మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్షిక కళ్యాణ బ్రహ్మోత్సవాలు మంగళవారం ఉదయం వైభవంగా ప్రారంభమయ్యాయి. దేవదాయ శాఖ, చల్లపల్లి రాజా వంశీయుల తరపున ఆలయ పర్యవేక్షకులు బొప్పన సత్యనారాయణ స్వామి, అమ్మవార్లకు నూతన పట్టువస్త్రాలను సమర్పించారు. పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తుల జయజయ ధ్వానాల నడుమ వేదమంత్రోచ్చరణలతో శాస్త్రోక్తంగా స్వామి, అమ్మవార్లను ప్రధాన అర్చకులు బుద్ధు పవన్ కుమార్ శర్మ, వేదపండితులు కొమ్మూరి ఫణికుమార్ బ్రహ్మత్వంలో అర్చక బృందం స్వామివారిని పెండ్లి కుమారుడిని గావించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.ఎస్.చంద్రధరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

**స్వామివారికి వెండి నాగపడగ బహూకరణ**

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మచిలీపట్నంకు చెందిన కె.రామకృష్ణ, సుబ్రహ్మణ్యేశ్వరరావులు వెండి నాగపడగను బహూకరించారు. మంగళవారం ఉదయం కుటుంబసమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు.

**ఆలయానికి ఎద్దుల బండి వితరణ..**

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి హైదరాబాద్‌కు చెందిన అమరం శ్రీకాంత్-దీప్తిలు ఎద్దుల బండిని అందజేశారు. స్వామివారి గ్రామోత్సవంలో ఊరేగింపునకు వినియోగించే నివిత్తం బండిని రూ.2.40లక్షల వ్యయంతో ప్రత్యేకంగా తయారుచేయించి ఈవో ఎస్.ఎస్. చంద్రధరరావుకు మంగళవారం అందజేశారు.

## ఐఐటీ జేఈఈ మెయిన్స్‌లో మెరిసిన విద్యార్థులు



అన్నే భరత్, జి.శిరీష, కె.డైసీ కిమ్

**ఉయ్యూరు, ఫిబ్రవరి 13 :** ఐఐటీ జేఈఈ మెయిన్స్‌లో శ్రీ శ్రీనివాస విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని విద్యాసంస్థల డైరెక్టర్ పచుచూరి శ్రీనివాసరావు అన్నారు. విలేకరుల సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ, ఐఐటీ జేఈఈ మెయిన్స్‌లో తమ కళాశాల విద్యార్థులు అన్నే భరత్ (99.7శాతం), టి.శివరామకృష్ణ (99.3శాతం) జి.శిరీష, కె.డైసీ కిమ్ మంచి ఫలితాలు సాధించారన్నారు. అదే విధంగా 23 మంది విద్యార్థులు 90 శాతం కంటే ఎక్కువ సాధించారని తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులను ఆయన అభినందించారు.

## అంగన్వాడీల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**కృష్ణలంక, ఫిబ్రవరి 13 :** విజయవాడ రూరల్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో మినీ అంగన్వాడీ కార్యకర్త, సహాయకుల ఖాళీల భర్తీకి అర్హులైన మహిళా అభ్యర్థులు ఈనెల 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సమగ్ర శిశు సేవ అభివృద్ధి పథక అధికారిణులు జి.మంగమ్మ, టి.నాగమణిలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మినీ అంగన్వాడీ కార్యకర్తలకు సంబంధించి గొల్లపూడి-16 (గొల్లపూడి గ్రామం/బీసీ-ఎ), అంగన్వాడీ సహాయకులకు సంబంధించి ఎనికేపాడు (ఎనికేపాడు గ్రామం/బీసీ-డి), గుణదల-4 (2వ డివిజన్, ఓసీ), ద్వారకానగర్-1 (17వ డివిజన్, ఓసీ), తారకరామానగర్ (18వ డివిజన్, ఓసీ) ఖాళీ పోస్టులను భర్తీ చేయనున్నట్లు ఆమె తెలిపారు.

విజయవాడ అర్బన్ పరిధిలోని ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సీడీపీవో టి.నాగమణి తెలిపారు. 45వ డివిజన్ న్యూ జోజినగర్-3 ఓసీ కేటగిరిలో, 63వ డివిజన్ రాజీవ్‌నగర్-7 ఓసీ ఆర్థికంగా బలహీన వర్గం కేటగిరిలో, 63వ డివిజన్ రాజీవ్ నగర్ వడ్డెర కాలనీ ఓసీ కేటగిరిలో, 59వ డివిజన్ లూనా సెంటర్-2 ఓసీ కేటగిరిలో అంగన్వాడీ సహాయకుల పోస్టులు భర్తీ చేయనున్నట్లు ఆమె తెలిపారు.

అంగన్వాడీ సహాయకురాలి పోస్టులకు 1-7-2023 నాటికి 21 సంవత్సరాలు నిండి 35 సంవత్సరాలలోపు వయస్సు కలిగి 10వ తరగతి ఉత్తీర్ణత పొంది స్థానికంగా వివాహితురాలై వుండాలన్నారు. అభ్యర్థులు కుల ధ్రువీకరణ, నివాస ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, రేషన్ కార్డులను గెజిటెడ్ అధికారితో అటెస్ట్ చేయించి, రెండు ఫొటోలు జతచేసి ఈనెల 20వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు కానూరు సీడీపీవో విజయవాడ అర్బన్ కార్యాలయంలో వ్యక్తిగతంగా అందజేయాలని ప్రకటనలో కోరారు.

## పోలీస్ కంట్రోల్ రూమ్ వద్ద కారు దగ్ధం

» ఇంజన్‌లో షార్ట్‌సర్క్యూట్.. త్రుటిలో తప్పిన ప్రమాదం



**వన్‌టౌన్, ఫిబ్రవరి 13 :** విజయవాడలోని పోలీస్‌కంట్రోల్ రూమ్ వద్ద మంగళవారం రాత్రి ఓ కారు దగ్ధమైంది. అక్కడే విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ ఆర్ఎస్ఐ బేగ్ వెంటనే స్పందించడంతో కారులో ఉన్నవారికి త్రుటిలో ప్రమాదం తప్పింది. వన్‌టౌన్‌కు చెందిన పులవర్తి వెంకట రామ లింగేశ్వరరావు తారాపేటలో పైపుల వ్యాపారం చేస్తున్నాడు. ఇతనికి భార్య ఇద్దరు కుమార్తెలు. రామలింగేశ్వరరావు కుమార్తెలు నిరుపమ, నిఖిలలు తమ కారు నెంబర్ ఏపీ 39ఎన్‌కే 1064లో వ్యక్తిగత పనుల నిమిత్తం గవర్నరుపేట వెళ్ళారు. పనులు ముగించుకుని తిరిగి ఇంటికి బయలుదేరారు. పోలీస్ కంట్రోల్ రూమ్ వద్దకు వచ్చేసరికి ఇంజన్‌లో నుంచి మంటలు పెద్ద ఎత్తున వచ్చాయి. ఈ విషయం తెలుసుకున్న ట్రాఫిక్ ఆర్ఎస్ఐ బేగ్ కారులో ఉన్న నిరుపమ, నిఖిలను బయటకు తీసుకుని వచ్చి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం తెలియజేశారు. ఫైర్ సిబ్బంది ఘటనా స్థలికి వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. బేగ్ వెంటనే స్పందిచడంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. ఈ సమయంలో కొద్దిసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. ఈ విషయం తెలుసుకున్న టూ టౌన్ ట్రాఫిక్ సీఐ మహేందర్, కారు ఓనర్ రామలింగేశ్వరరావు దంపతులు ఘటన స్థలం వద్దకు వెళ్ళి నిరుపమ, నిఖిలను పరామర్శించారు. కారు ఇంజన్‌లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ అయినట్లు ఫైర్, ట్రాఫిక్ సిబ్బంది తెలిపారు.

## 15న అగ్రిగోల్డ్ బాధితుల న్యాయ పోరాట దీక్ష

**అమరావతి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) :** జగన్ ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయనందుకు నిరసనగా ఈనెల 15న విజయవాడలో న్యాయ పోరాట దీక్ష నిర్వహించనున్నట్లు అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ అసోసియేషన్ తెలిపింది. అగ్రిగోల్డ్ బాధితులకు పూర్తి న్యాయం చేస్తామని, ఆరు మాసాల్లోగా వడ్డీతో సహా డిపాజిట్లను చెల్లిస్తామని, మరణించిన బాధిత కుటుంబాలకు రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు కోసం చివరి బడ్జెట్ వరకు వేచి చూసి నిరాశకు గురయ్యామని, ఇక చివరి హెచ్చరికగా ఈనెల 15న విజయవాడలోని ధర్నాచౌక్‌లో న్యాయపోరాట దీక్ష చేపట్టాలని నిర్ణయించినట్లు ఆ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈవీ నాయుడు, వి.తిరుపతిరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## ఆయిల్‌పామ్ బోర్డు ఏర్పాటు చేయాలి

**కేంద్రానికి రైతు నేతల విజ్ఞప్తి**

**అమరావతి, ఫిబ్రవరి13 (ఆంధ్రజ్యోతి):** జాతీయస్థాయిలోఆయిల్‌పామ్ బోర్డును ఏర్పాటుచేయాలని ఆయిల్‌పామ్ ఫార్మర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు కేంద్రప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆయిల్‌పామ్‌కు ప్రస్తుతమున్న టన్ను రూ.18వేల ధర రైతులకు గిట్టుబాటు కావట్లేదని కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. సాగుఖర్చులను అంచనావేసి, టన్ను పండ్ల మద్దతు ధర రూ.20వేలు ప్రకటించాలని కోరారు.

## ఏపీటీడీసీలో ఇష్టారాజ్యం

(3వ పేజీ తరువాయి)

విజయవాడలో భవానీద్వీపం, హరిత బెర్మ్‌పార్క్‌ల ద్వారా ఆదాయం వస్తోంది. అయినా విజయవాడతో పాటు అనేక పర్యాటక యూనిట్లను ప్రైవేటువ్యక్తుల చేతుల్లో పెట్టేందుకు టెండర్లు పిలిచారు. టెండర్ల నోటిఫికేషన్‌కు సంబంధించి తమకు నచ్చిన సంస్థలు, వ్యక్తులకే ముందస్తుగా సమాచారం ఇచ్చారు. ఇవన్నీ రహస్యంగా జరిగిపోయాయి. పర్యాటక యూనిట్లను ప్రైవేటుపరం చేసేటపుడు ప్రస్తుతం వస్తున్న ఆదాయాన్ని మించి సాధించేలా ఒప్పందాలు చేసుకోవాల్సి ఉంటుంది. రెవెన్యూ షేర్‌ను కూడా అదే ప్రాతిపదికన నిర్దేశించాలి. కానీ విజయవాడలోని హరిత బెర్మ్‌పార్క్, భవానీ ద్వీపంలో ద్వారా ఏటా రూ.10 కోట్ల ఆదాయం వస్తుంటే రూ.5 కోట్ల లోపే కట్టబెట్టేందుకు తెగపడ్డారు. ఏపీటీడీసీలోని పర్యాటక యూనిట్లన్నింటినీ ఒకపక్క ప్రైవేటుపరం చేసేందుకు టెండర్లు పిలవగా.. మరోపక్క ప్రైవేటు మనుషులను తీసుకునేందుకు సిద్ధమయ్యారు. యూనిట్లను ప్రైవేటీకరణ చేసేటపుడు ఇంకా ప్రైవేటుగా సిబ్బందిని తీసుకోవాల్సిన అవసరం ఏమిటో ఏపీటీడీసీ ఉన్నతాధికారులే చెప్పాలి. ప్రైవేటు సంస్థలు పెట్టుకోవాల్సిన సిబ్బందిని కూడా ఏపీటీడీసీ అధికారులే పథకం ప్రకారం నియమిస్తున్నారని తెలుస్తోంది. ఇలా ప్రైవేటు సిబ్బందిని తీసుకోవటం కూడా ప్రైవేటు సంస్థలకు లాభం కలుగజేసేందుకేనని తెలుస్తోంది.

# ఉద్యమం అనివార్యం

» డిమాండ్లు పరిష్కారమయ్యేవరకూ పోరాటం
» ప్రభుత్వానికి సహకరించాం.. సమయమిచ్చాం
» వాయిదాలే తప్ప సమస్యలు పరిష్కారం కాలేదు
» ఐదు దశాబ్దాల కాలంలో ఇలాంటి పరిస్థితి రాలేదు
» ఎన్జీవో ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్

**విజయవాడ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) :** 'ప్రభుత్వ ఉద్యోగులకు న్యాయంగా రావాల్సిన బకాయిలను సత్వరమే చెల్లించాలని, వారు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని గత నాలుగేళ్లుగా ప్రభుత్వానికి వివిధ రూపాల్లో విజ్ఞప్తి చేశాం. చర్చల పేరుతో ప్రతిసారీ వాయిదాలే తప్ప పురోగతి లేదు. ఇక మావల్ల కాదు. ఉద్యోగ వర్గాల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమానికే సిద్ధమయ్యాం' అని ఏపీఎన్జీఓస్ అసోసియేషన్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ అన్నారు. గాంధీనగర్‌లోని ఎన్జీవో భవన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగుల డిమాండ్ల సాధన కోసం గతంలో ప్రకటించిన ఉద్యమ కార్యాచరణ యధావిధిగా కొనసాగుతుందన్నారు. దీనిలో భాగంగా 14వ తేదీ బుధవారం నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరవుతామన్నారు. తహసీల్దారు, సబ్‌కలెక్టర్, కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పించటం జరుగుతుందన్నారు. 15, 16 తేదీల్లో నల్ల బ్యాడ్జీలతో విధుల్లో పాల్గొనటంతో పాటు మధ్యాహ్న భోజన విరామ సమయంలో తాలూకా కేంద్రాలు, పాఠశాలల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 17వ తేదీన తాలూకా కేంద్రాల్లో ర్యాలీలు, ధర్నా చేపడతామన్నారు. 20వ తేదీన జిల్లా కలెక్టరేట్ల వద్ద ర్యాలీలు, ధర్నాలు నిర్వహిస్తామని, 21 నుంచి 24 వరకు రాష్ట్ర నేతలు అన్ని జిల్లాల్లో పర్యటించి సన్నాహక సభల్లో పాల్గొంటారని తెలిపారు. 27వ తేదీన చేపట్టనున్న 'చలో విజయవాడ'కు ఉద్యోగులను సిద్ధం చేస్తామని చెప్పారు. అపరిష్కృతంగా వున్న అన్ని సమస్యలు పరిష్కారమయ్యేంతవరకు విశ్రమించేది లేదన్నారు. ప్రభుత్వం చర్చలకు పిలిచిన ప్రతిసారీ మాటలే తప్ప ఒక్క సమస్యను కూడా సంపూర్ణంగా పరిష్కరించలేదన్నారు. మంగళవారం మంత్రుల బృందంతో జరిగిన సమావేశంలో కూడా మంత్రులు కొత్త వాయిదాలు కోరారే గాని పాత వాయిదాల గురించి ప్రస్తావన లేకుండా మాట్లాడటం వల్ల ఉద్యోగులకు ఒరిగిందేమీ లేదన్నారు. ఉద్యోగులు గొంతెమ్మ కోరికలు కోరడం లేదన్నారు. ఎప్పుడూ లేని విధంగా ఈ ప్రభుత్వం 11 సార్లు జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాలు నిర్వహించినా నిష్ప్రయోజనమన్నారు. డీఏలు, పీఆర్‌సీల మాట దేవుడెరుగు.. కనీసం జీపీఎఫ్ నిధులు ఎంత పెండింగ్ ఉన్నాయనేది తెలపడం లేదన్నారు. ఇలాంటి దుస్థితిని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొన్న చరిత్ర గతంలో ఎప్పుడూ లేదన్నారు. ఇటువంటి ఇబ్బందికర పరిస్థితుల్లోనే ఉద్యోగ సంఘాలు ఉద్యమ బాటను ఎంచుకున్నాయన్నారు. సమావేశంలో జిల్లా జేఏసీ కన్వీనర్ ఎండీ ఇక్బాల్, ఉపాధ్యాయ సంఘాల నుంచి యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఖాసిం, ఎన్టీఆర్ జిల్లా ఎస్టీయూ అధ్యక్షుడు ఎస్‌కె ఇమ్రాన్ సాహెబ్, పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దాలి నాయుడు, విష్ణువర్ధన్ పబ్లిక్ సెక్టార్ ఉద్యోగుల సంఘం చైర్మన్ ఎ.సాంబశివరావు, ఐటీఐ ఉద్యోగుల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కిషోర్‌బాబు, గ్రామ సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు శశిధర్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.సతీష్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ బీవీ రమణ, విజయవాడ నగర కార్యదర్శి సంపత్‌కుమార్, మధుసూధనరావు, మహిళా కార్యదర్శి కె.శివలీల, ఏపీ జేఏసీ లోని వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## తిన్నింటి వాసాలు లెక్కించే రకం నాని

» కేశినేనిపై బొండా ఉమా ధ్వజం

**పాయకాపురం, ఫిబ్రవరి 13 :** కేశినేని నాని తిన్నింటి వాసాలు లెక్కించే రకమని, కుక్కకు ఉన్న విశ్వాసం కూడా ఆయనకు లేదని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు ధ్వజమెత్తారు. మంగళవారం విలేకర్ల సమావేశంలో ఉమా మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీలో ఎంపీగా ఉన్న సమయంలో ఆర్థికంగా రూ. 2 వేలకోట్లు నష్టపోయానని కేశినేని నాని తప్పుడు ప్రచారం చేస్తున్నాడన్నారు. 2014 ఎన్నికల్లో ఆస్తులు రూ. 37,68,10,451, అప్పులు రూ. 66,69,45,927 అలాగే 2019 ఎన్నికల్లో ఆస్తులు రూ.66,07,62,440 అప్పులు రూ. 51,23,32,955 ఉన్నాయని అఫిడవిట్‌లో పేర్కొన్నాడని చెప్పారు. మరి రూ.2వేల కోట్లు ఏవిధంగా నష్టపోయాడో నాని చెప్పాలన్నారు. తెలుగుదేశం హయాంలో కేశినేని ట్రావెల్స్ ద్వారా ప్రభుత్వాన్ని చంద్రబాబునాయుడిని కూడా మోసం చేశారని ఆరోపించారు. చంద్రబాబుపై అవాకులు చవాలకులు పేలితే బండారం మొత్తం బయట పెడతామని హెచ్చరించారు. నేతలు పరుచూరి ప్రసాద్, నవనీతం సాంబశివరావు, గరిమెళ్ల చిన్నా, లబ్బా వైకుంఠం తదితరులు పాల్గొన్నారు.

## యువత బ్రాండ్ అంబాసిడర్లు కావాలి

» కలెక్టర్ దిల్లీరావు



ఫారం-6లను విద్యార్థులకు అందజేస్తున్న కలెక్టర్ దిల్లీరావు

**కృష్ణలంక, ఫిబ్రవరి 13 :** ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకొనేలా చేయడంలో యువత బ్రాండ్ అంబాసిడర్లుగా నిలవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.దిల్లీరావు అన్నారు. త్వరలో సాధారణ ఎన్నికలు జరుగనున్న నేపధ్యంలో ఓటర్లను చైతన్యపరచడం-భాగస్వామ్యం చేయడం (స్వీప్) కార్యక్రమం మంగళవారం నగరంలోని సిద్ధార్థ మహిళా కళాశాలలో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య పరిరక్షణకు నైతిక విలువలతో కూడిన ఓటింగ్ కీలకమన్నారు. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకోవాలని అలాగే అందరినీ ప్రోత్సహించాల్సిన బాధ్యత యువతపై వుందన్నారు. విజయవాడ అర్బన్‌లో 84 శాతానికి పైగా పోలింగ్ శాతం పెంచేందుకు స్వీప్ కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. జిల్లాలో యువ ఓటర్ల నమోదుకు విద్యాసంస్థల భాగస్వామ్యంతో ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టినట్లు తెలిపారు. ఈవీఎంకు సంబంధించి బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్ గురించి కలెక్టర్ విద్యార్థులకు క్షుణంగా వివరించారు. ఫారం-6లను అధికారులతో కలిసి విద్యార్థులకు అందజేశారు.

స్వీప్ నోడల్ అధికారి యు.శ్రీనివాసరావు మాట్లాడుతూ, కలెక్టర్ ప్రత్యేక కృషి కారణంగా అర్హులైన యువ ఓటర్లను పెద్దఎత్తున ప్రోత్సహించడం మంచి ఫలితాలు ఇచ్చినట్లు తెలిపారు. కళాశాల డైరక్టర్ టి.విజయలక్ష్మి ఓటు హక్కు ప్రాధాన్యత గురించి విద్యార్థులకు వివరించారు. దేవినేని సీతారావమ్మ ఫౌండేషన్ అధ్యక్షులు దేవినేని మధుసూదనరావు, మనం ఓటు వేద్దాం.. మన భవిష్యత్తును తీర్చిదిద్దుకుందాం అంటూ అవగాహన కల్పించారు. ఎన్నికల డిప్యూటీ తహసిల్దార్ ఎస్వీ రవీంద్రనాథ్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల ఉద్యమ కేక!

(3వ పేజీ తరువాయి)

చివరగా అగ్ర నాయకత్వాలు జిల్లాస్థాయిలో నిర్వహించే సభలతో సుడిగాలి పర్యటనలు చేస్తూ ఉద్యోగుల్లో ఉద్యమ కాక రేపనున్నారు. ఆ తర్వాత ఈ నెల 27వ తేదీన చలో విజయవాడ నిర్వహిస్తారు. ఆ తర్వాత కూడా ప్రభుత్వం దిగిరాకపోతే సమ్మె దిశగా ఉద్యోగులు కదిలే అవకాశం ఉంది. ప్రస్తుతం ఏపీజేఏసీ ఒక్కటే ఉద్యమానికి పిలుపు ఇచ్చింది. మరో ప్రధానమైన 'ఏపీజేఏసీ అమరావతి' ఉద్యమానికి సిద్ధం కాలేదు. దీని పరిధిలోని ప్రధానమైన రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీసు తదితర శాఖలకు చెందిన ఉద్యోగులు ఎన్నికల విధుల్లోకి వెళ్లడం, జిల్లాలు కూడా మారిపోవటంతో.. ఉద్యమం దిశగా నిర్ణయం తీసుకోలేదు. విజయవాడలోని ఏపీ రెవెన్యూ భవన్‌లో ఏపీజేఏసీ నేతలు వచ్చి సంప్రదింపులు జరిపినప్పటికీ చర్చలు ఫలించలేదు. ఏపీ జేఏసీ పిలుపునిచ్చిన ఉద్యమం చివరిదశ దాకా వెళితే.. ఛలో విజయవాడకు కానీ, ఆ తర్వాత సమ్మెకు పిలుపునిస్తే ఏపీజేఏసీ అమరావతి కూడా మద్దతు ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**ఉద్యమ బాటలోకి ఎందుకంటే..**

ఉద్యోగులు దాచుకున్న ఏపీజీఎల్ఐ, జీపీఎఫ్ వంటి డబ్బులను కూడా ప్రభుత్వం వాడేసుకుంది. దీంతో వారికి చెల్లింపులు జరపటం లేదు. వీటితో పాటు సరెండర్ లీవ్స్ ద్వారా ఉద్యోగులు ఎన్‌క్యాష్‌మెంట్ పొందుతారు. వీటిని కూడా ప్రభుత్వం చెల్లించకుండా బకాయి పెట్టింది. ఉద్యోగులకు ప్రతి ఆరు నెలలకు ప్రకటించాల్సిన డీఏలను పెండింగ్‌లో పెట్టేసింది. ఇవన్నీ చూస్తుండగానే కొండలా పేరుకుపోవటంతో.. ఉద్యోగులలో ఆందోళన నెలకొంది. అధికారంలోకి రాగానే గతంలో ప్రకటించిన ఐఆర్‌ను 27 శాతం ప్రకటించిన ప్రభుత్వం.. పీఆర్సీ నివేదిక వచ్చిన తర్వాత తూచ్ అంటూ గత ప్రభుత్వం ప్రకటించిన 25 శాతం కంటే కూడా మరో రెండు శాతం తగ్గించి 23 శాతం చేసింది. దీని పేరుతో ఇప్పటికే ఎక్కువ ఇచ్చేసిన మొత్తాన్ని రికవరీ చేసేందుకు తెగపడింది. పెన్షనర్లకు సంబంధించిన అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ 10 శాతాన్ని కూడా కోల్పోవాల్సి వచ్చింది. పీఆర్సీ బకాయిలను కూడా చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టింది. ఇలా చూస్తే వేల కోట్ల రూపాయలు బకాయిలుగా పేరుకుపోయాయి. వీటి కోసం ఉద్యోగులు ఉద్యమం చేసిన ప్రతిసారీ చర్చలకు పిలవటం.. చెల్లింపులకు షెడ్యూల్ ప్రకటించడం పరిపాటిగా మారింది. జీతాలు సక్రమంగా అందుకోలేని పరిస్థితి ఏర్పడింది. సీపీఎస్ రద్దు అమలు కాలేదు. ఇలా ప్రతిశాఖ పరిధిలోనూ ఉద్యోగులు ఆర్థిక, ఆర్థికేతర సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు.

## నడిరోడ్డుపైనే ఆసరా సభ!

» పోలీసుల ట్రాఫిక్ ఆంక్షలు
» ప్రయాణికులకు తప్పని అవస్థలు
» కంకిపాడులో అధికార పెద్దల నిర్వాకం



అడుగడుగున ట్రాఫిక్ మళ్లింపు

**కంకిపాడు, ఫిబ్రవరి 13 :** కంకిపాడులో మంగళవారం నిర్వహించిన వైఎస్సార్ ఆసరా సభ స్థానిక ప్రజలకు శాపమైంది. మంత్రి జోగి రమేశ్ సభ పేరుతో మంగళవారం మండల కేంద్రమైన కంకిపాడును పోలీసులు తమ అధీనంలోకి తీసుకున్నారు. ఎక్కడక్కడ ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ప్రధాన సెంటర్‌లో బస్సులు, వాహనాలు రాకుండా ట్రాఫిక్ మళ్లించారు. దీంతో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మంగళవారం మంత్రి, పెనమలూరు నియోజకవర్గ సమన్వయ కర్త జోగి రమేశ్ వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమాన్ని చేపట్టారు. కంకిపాడులోని ప్రధాన రహదారిపై సభకు ఏర్పాట్లు చేయడంతో మధ్యాహ్నం 2 గంటల నుంచే ట్రాఫిక్ ఆంక్షలు విధించటం శోచనీయం.

**అక్క చెల్లెమ్మలు మండుటెండలో.. కార్యకర్తలు ఏసీలోనా.. : మహిళల ఆగ్రహం**

ఇటీవల మంత్రి జోగి పెనమలూరు నియోజకవర్గ సమన్వయ కర్తగా నియమించిన సమయంలో వైసీపీ శ్రేణులతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశాన్ని కంకిపాడులో ఓ ఏసీ కళ్యాణమండపంలో భారీ ఎత్తున ఏర్పాటు చేశారు. అయితే మంగళవారం డ్వాక్రా మహిళల ఆసరా కార్యక్రమాన్ని నడిరోడ్డుపై మండుటెండలో నిర్వహించటంపై మహిళలు మండిపడుతున్నారు. కార్యకర్తలకు ఏసీలోనూ, అక్క, చెల్లెమ్మలు అంటూ తమకు మండుటెండలోనా అంటూ మహిళలు ఆగ్రహం చేశారు.

**అధికార పార్టీ నేతలకు బుజ్జగింపులు**

వైఎస్సార్ ఆసరా సభ అలిగిన అధికార పార్టీ నేతలను బుజ్జగించే కార్యక్రమంలా సాగింది. సభ నిర్వహిస్తుండగా గ్రామ అధ్యక్షుడు ఓంకారం, మండల పరిషత్ ఉపాధ్యక్షులు దూళిపూడి కిషోర్‌లు హాజరు కావడం లేదనే సమాచారంతో మంత్రి వారిని బుజ్జగించేందుకు స్వయంగా వారి ఇళ్లకు వెళ్లడాన్ని పలువురు విమర్శించారు.

## వైసీపీ బూత్ ఏజెంట్ల సమావేశానికి వలంటీర్లు!

**తిరువూరు:** పట్టణంలోని 16వ వార్డులో వైసీపీ బూత్ ఏజెంట్ల సమావేశంలో వార్డు వలంటీర్లు పాల్గొనటంపై పలువురు విమర్శించారు. మంగళవారం వార్డుకు చెందిన నేత ఇంటి వద్ద పార్టీ నాయకులు, బూత్ ఏజెంట్లతో పాటు వలంటీర్లు పాల్గొన్నారు. వార్డులో పింఛన్లు ఇతర సంక్షేమ పథకాలు పొందిన వారిని తమవైపు తిప్పుకునే కుట్రలో భాగంగా వైసీపీ నాయకులు బూత్ ఏజెంట్ల సమావేశానికి వలంటీర్లను పిలిపించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎన్నికలకు సంబంధించి ఎటువంటి కార్యక్రమాల్లో వలంటీర్లు పాల్గొరాదనే ఆదేశాలు ఉన్నా అది అమలు కావడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.



## ధాన్యం కొనుగోలులో నిండా మునిగారు

» ఆర్బీకేలతో రైతులకు తీవ్ర నష్టం
» అధికారుల తీరుపై ధ్వజమెత్తిన అధికార పార్టీ నేతలు



అధికారులను నిలదీస్తున్న వైస్ ఎంపీపీ, సభ్యులు

**కూచిపూడి, ఫిబ్రవరి 13 :** ధాన్యం కొనుగోలులో ఈ ఏడాది రైతులు నిండా మునిగారని, బస్తాకు సగటున 200ల వరకు రైతులు నష్టాన్ని చవిచూడాల్సి వచ్చిందని, ఆర్బీకేల ద్వారా రైతులకు తీవ్ర నష్టం జరిగిందని సాక్షాత్తు అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మొవ్వ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కొండేటి ఇందిర అధ్యక్షతన మంగళవారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ కందుల కోటేశ్వరరావు మాట్లాడుతూ, ఆర్బీకే అధికారులు, మిల్లర్లు, దళారులు కుమ్మక్కై రైతులకు గిట్టుబాటు ధర లేకుండా చేశారని దుయ్యబట్టారు. బస్తాకు 200ల వరకు రైతులు నష్టపోయినట్లు తెలిపారు. రైతు ధాన్యాన్ని ఆర్బీకేకు తీసుకు వెళ్లగా అధికారులు సవాలక్ష ఆంక్షలు పెట్టి తిరిగి దళారుల వద్దకే వెళ్లే విధంగా ఎత్తుగడలు వేశారనివాపోయారు. అయ్యంకి సర్పంచ్ నాగబోయిన సునీల్ మాట్లాడుతూ, ఆర్బీకేలో సమాధానం చెప్పే వారే లేకుండాపోయారని, దళారులకు కుర్చీలు వేసి సకల మర్యాదలు చేసి రైతులను పట్టించుకోకపోవటంతో తన 30 ఎకరాల్లో పంటను మధ్య దళారులకే అమ్ముకోవాల్సి వచ్చిందన్నారు. మంత్రిపాలెం సర్పంచ్ పంది కృష్ణ, వేములమడ సర్పంచ్ సీతారామయ్యలు ధాన్యం కొనుగోలులో రైతులు పడిన కష్టాలు, ఆర్బీకేల్లో సిబ్బంది అధికారులు రైతుల పట్ల వ్యవహరించిన తీరుపై సమావేశంలో నిలదీశారు. ఎన్టీఆర్ జిల్లాలో ఒక రూలు, కృష్ణా జిల్లాలో మరొక రూల్ పెట్టారని మండిపడ్డారు.

**నిడుమోలు ఆర్బీకేలో అవకతవకలు!**

నిడుమోలు ఆర్బీకేలో రూ.50 లక్షల వరకు అవకతవకలు జరిగినట్లు విమర్శలు వచ్చాయని గ్రామ ఉపసర్పంచ్ డొక్కు మురళీ ఆరోపించారు. ఈ క్రాప్ నమోదుకు ఆర్బీకేలో రూ.1000ల చొప్పున వసూలు చేశారని ఆరోపించారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు ఉన్నాయని, నిధులు విడుదలైన వెంటనే పనులు పూర్తి చేసి సమస్యను పరిష్కరిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్ చెప్పారు. ఎంపీపీ ఇందిర, జడ్పీటీసీ రాజులపాటి పార్వతీ, ఎండీవో చంద్రశేఖర్‌రావు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## 18న మల్లేశ్వరస్వామి ఆలయ స్వర్ణశిఖర కుంభాభిషేకం

**వన్‌టౌన్ ఫిబ్రవరి 13 :** ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో మల్లేశ్వరాలయ పునఃప్రారంభ కార్యక్రమాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. బుధవారం (14 వతేదీ) ఉదయం 9 గంటలనుంచి శాంతిపాఠం విశేష సంకల్పం, గణపతిపూజ, పుణ్యాహవచనం, 16 మాతృకల పూజ, ఆచార్య, ఋత్విక్ వరణం, దీక్షా ధారణ, రక్షా బంధనం, పంచగవ్య ప్రాశనం, నాందీ దేవత పూజ, యాగశాల సంస్కారం, యాగశాల ప్రవేశం, ద్వారపూజ, 16 స్తంభాల పూజ, కర్కరి స్థాపన, అఖండదీప ప్రజ్వలన కార్యక్రమాలను నిర్వహిస్తారు. సాయంత్రం 3 గంటల నుంచి వాస్తు మండప ఆవాహన, వాస్తుహోమం, వాస్తు పర్యగ్నికరణ, క్షేత్ర పాలక యోగిని నవగ్రహసహిత ప్రధానమంటప ఆవాహనలు, అంకురారోపణం, అగ్నిమధనం, నీరాజనం, మంత్ర పుష్పం తదితరాలను క్రమానుగతంగా నిర్వహిస్తారు. 15వ తేదీ గురువారం ఉదయం 8 నుంచి 12 గంటలవరకు శాంతి పాఠం, గణపతి పూజ, కర్మణః పుణ్యాహవాచనం, మంటప పూజ, మంటపదేవత హోమాలు, మూలమంత్ర హోమాలు, తిరిగి సాయంత్రం 3 నుంచి 7 గంటల వరకు సంభార హోమాలు, అంగ హోమాలు, లింగ హోమాలు, మంటప పూజలు, నీరాజనం, మంత్రపుష్పం కార్యక్రమాలుంటాయి. 16 తేదీ ఉదయం 8 గంటల నుంచిశాంతిపాఠం, గణపతిపూజ, పుణ్యాహవచనం, మంటప పూజలు, మంటప హోమాలు, అంగ హోమాలు, జలాదివాస కార్యక్రమాలను నిర్వహిస్తారు. సాయంత్రం అధివాస హోమాలు, మంటపపూజలు,నీరాజనం, మంత్రపుష్పం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తారు. 17 వతేదీ ఉదయం శాంతిపాఠం, గణపతి పూజ, పుణ్యాహవచనం, మంటప పూజలు, మంటప హోమాలు, అంగ హోమాలు, సాయంత్రం ధాన్యాదివాసం, ఫలాదివాసం, పుష్పాదివాసం, శయ్యాదివాసం, నీరాజనం మంత్రపుష్పం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తారు. 18 వతేదీ ఉదయం 8 గంటల నుంచి కీలక ఘట్టం ప్రారంభమవుతుంది. శాంతి పాఠం, గణపతిపూజ, కర్మణః పుణ్యాహవచనం, అధివాస హోమాలు, గర్భన్యాసం, ధాతున్యాసం, బీజన్యాసం, రత్న న్యాసం నిర్వహిస్తారు. అనంతరం ముహూర్త సమయానికి యంత్రస్థాపన చేస్తారు. విగ్రహస్థాపనం, కళాన్యాసం, కళా హోమాలు, పూర్ణాహుతి, అవభృదం, కల్యాణోత్సవం. ఆశీర్వచనం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తారు.

## 16న గవర్నర్ జగ్గయ్యపేట రాక



**జగ్గయ్యపేట :** జగ్గయ్యపేటలో నిర్మించిన 150 అడుగుల జాతీయ స్థూపాన్ని ఆవిష్కరించేందుకు ఈ నెల 16న గం.11.లకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ రానున్నట్టు మునిసిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు గవర్నర్ కార్యాలయం నుంచి సమాచారం వచ్చిందని, రాష్ట్రానికి ముఖద్వారంగా ఉన్న జగ్గయ్యపేట శాంతినగర్‌లో రూ.30లక్షలు వెచ్చించిన స్థూపాన్ని గవర్నర్ నజీర్ ఆవిష్కరిస్తారని ప్రజలు కార్యక్రమానికి తరలిరావాలని ప్రకటనలో కోరారు.

## కోరిక తీర్చలేదని కడతేర్చాలనుకున్నాడు..

» వివాహిత హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్టు

**జగ్గయ్యపేట, ఫిబ్రవరి 13 :** పట్టణంలో మిల్క్‌బూత్ నిర్వాహకురాలు, వివాహిత హత్యాయత్నం కేసులో నిందితుడిని బుధవారం జగ్గయ్యపేట సీఐ జానకీరాం అరెస్టుచేసి కోర్టుకు హాజరు పరిచారు. ఈ నెల 7న సీతారాంపురంలో వివాహితపై హత్యాయత్నం సంచలనం సృష్టించింది. సీసీ పుటేజీ, పోలీసు కాల్‌డేటా ఆధారంగా ముగ్గురు సీఐల ఆధ్వర్యంలో ఆరుగురు ఎస్సైలు సిబ్బందితో దర్యాప్తు చేపట్టారు. వత్సవాయి మండలం చిట్యాల గ్రామానికి చెందిన ఎలక్ట్రీషియన్ సయ్యద్ జాన్ సైదా అలియాస్ బాజీ జగ్గయ్యపేటలో ఉంటున్నాడు. పాల బూత్ నిర్వాహకురాలు గిద్దా సత్యశ్రీ(35)తో పరిచయం పెంచుకుని ఆమెకు ఆర్థిక సాయం చేశాడు. ఆ చనువుతో కోరిక తీర్చాలని కోరగా.. ఆమె నిరాకరించటంతో పాటు భర్తకు చెప్పటం, ఆపై హెచ్చరించటంతో కక్ష పెంచుకున్నాడు. ఆర్నెల్లుగా ఆమెను హతమార్చాలని పథకం పన్ని గొడ్డలిని తయారు చేయించాడు. ఈ నెల 7న భర్త లేని సమయంలో మిల్క్‌బూత్ నుంచి రాత్రి ఒంటరిగా మోపెడ్‌పై వస్తున్న ఆమెను ముఖానికి మాస్కు ధరించి సైదా గొడ్డలితో దాడిచేసి పల్సర్ బైక్‌పై పరారయ్యాడు. సాంకేతికత ఆధారంగా పోలీసులు నిందితుడిని గుర్తించారు. బంధువుల ఇంట్లో ఉండగా అదుపులోకి తీసుకున్నారు.

## ఎ.కొండూరు వైసీపీలో భగ్గుమన్న వర్గపోరు!

» ఎంపీటీసీ భర్తపై దాడి

**విజయవాడ, ఫిబ్రవరి 13 :** ఎ.కొండూరు మండలం వైసీపీలో వర్గ విభేదాలు బగ్గుమన్నయి. అరుపులు, కేకలతో మంగళవారం సాయంత్రం స్థానిక మండల పరిషత్ కార్యాలయం దద్దరిల్లింది. మండలంలో కొంతకాలంగా నివురుగప్పిన నిప్పులా ఉన్న విభేదాలు బయటపడ్డయి. త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నిమిత్తం మండలంలోని వైసీపీశ్రేణులు ఆదివారం నిర్వహించనున్న ఆత్మీయ సమావేశం కోసం మండల పరిషత్ కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఇటీవల విజయవాడలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు కార్యకర్తలను తరలించేందుకు ఖర్చుల నిమిత్తం గ్రామాలకు కొంత డబ్బు అందజేశారు. ఆ డబ్బు కొందరికి ఇవ్వలేదని, పార్టీ కార్యక్రమాలకు కొందరు నేతలను పిలవక వర్గ రాజకీయాలు నడుపుతున్నరని సమావేశంలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఒక సర్పంచ్ భర్తకు, ఒక ఎంపీటీసీ భర్తకు తీవ్ర వాగ్వాదం జరగ్గా కొందరు ఎంపీటీసీ భర్తపై దాడి చేశారు. మరో సర్పంచ్ భర్త మండల వైసీపీ కన్వీనర్, ఇతర నాయకులపై మీరు వర్గ రాజకీయలు నడుపుతున్నారు.. ప్రజాప్రతినిధులను గౌరవించడంలేదు.. కనీసం పార్టీ కార్యక్రమాలు చెప్పడంలేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో సమావేశ కార్యాలయం అరుపులు, కేకలతో ఎదురుగా ఉన్న పోలీసులు రంగప్రవేశం చేసి గొడవను సర్దుపరచారు. పార్టీ కార్యక్రమాలు ప్రభుత్వ కార్యాలయంలో ఏర్పటు చేయడం పట్ల రాజకీయ పార్టీల నుండి వ్యతిరేకత వ్యక్తమౌతుంది. ఇందుకు అనుమతి ఇచ్చిన ఎంపీడీవోపై చర్యలు తీసుకోవలని వివిధ రాజకీయ పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి.



**బ్రాయిలర్ ధరలు**

అమరావతి (రూ.లలో)

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 143, 152, 163 |
| చికెన్ విత్ స్కిన్ | 274 |
| చికెన్ స్కిన్‌లెస్ | 284 |

**నెక్ కోడిగుడ్డు ధర**

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.36

## 18న జరిగే నిరసనను జయప్రదం చేయాలి



**అజిత్‌సింగ్‌నగర్, ఫిబ్రవరి 13 :** వాంబేకాలనీ వాసులకు ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ చేయాలని కోరుతూ ఈనెల 18న తలపెట్టిన నిరసన దీక్షలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్. బాబూరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు 60వ డివిజన్ వాంబేకాలనీలో ఆయన మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ కాలనీవాసులకు ఉచిత ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ చేస్తామని వైసీపీ ప్రభుత్వం మోసం చేసిన విధానాన్ని స్థానికులకు వివరించారు. ఈనెల 18న ఇళ్ల పట్టాల సాధనకై 24 గంటలపాటు తలపెట్టిన నిరసనలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని కోరారు.

# రహదారి భద్రతా నిబంధనలు పాటించాలి

### ట్రాఫిక్ డీసీపీ కడియం చక్రవర్తి

**పటమట, ఫిబ్రవరి 13 :** రహదారి భద్రతా నిబంధనలు పాటించి ప్రమాదాలు నివారించాలని ట్రాఫిక్ డీసీపీ కడియం చక్రవర్తి సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా కార్యక్రమాన్ని పురస్కరించుకుని మంగళవారం బెంజిసర్కిల్ వద్ద ఎన్ఆర్ఐ విద్యా సంస్థలు, టెక్ మహీంద్రా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ట్రాఫిక్ డీసీపీ కడియం చక్రవర్తి రహదారి భద్రతపై ముద్రించిన పోస్టర్లను ఆవిష్కరించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని, హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని, సీట్ బెల్టు పెట్టుకోవాలని సూచించే ప్లకార్డులను పట్టుకుని రోడ్డు మీద ప్రయాణించే వాహనదారులకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ సీఐ రాజేంద్రప్రసాద్, టెక్ మహీంద్ర రిక్రూట్‌మెంట్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి, ఎన్ఆర్ఐ కాలేజ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సురేంద్రబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.




రహదారి భద్రత పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న ట్రాఫిక్ పోలీస్ ఉన్నతాధికారులు, ఎన్ఆర్ఐ, టెక్ మహీంద్రా ప్రతినిధులు

### ఆటోడ్రైవర్లకు అవగాహన సదస్సు

**సత్యనారాయణపురం :**. త్రీ టౌన్ ట్రాఫిక్ స్టేషన్ పరిధిలోని గాయత్రి కల్యాణ మండపంలో మంగళవారం రోడ్డు ప్రమాదాల నివారణపై ఆటోడ్రైవర్లకు అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ డీసీపీ కె. చక్రవర్తి మాట్లాడుతూ వాహనాలను నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చన్నారు. అవగాహన లోపం, అధిక వేగం, నిర్లక్ష్యం, మద్యం సేవించి వాహనాలు నడపడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్, ట్రిపుల్ డ్రైవింగ్, ఓవర్ టేకింగ్ తదితర తప్పుల వలన ప్రమాదాల బారిన పడే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. అనంతరం ఆటో డ్రైవర్లతో రహదారి నిబంధనలకు లోబడి వాహనాలు నడుపుతామని ప్రతిజ్ఞ చేయించారు. ట్రాఫిక్ ఏడీసీపీ డి. ప్రసాద్, ట్రాఫిక్ ఏసీపీ జి. శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

# వైసీపీ ప్రభుత్వంలో దోచుకోవడం.. దాచుకోవడమే

### బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ పాదయాత్రలో బొండా ఉమా

**ధర్నాచౌక్, ఫిబ్రవరి 13:** వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో ఎక్కడ చూసినా దోచుకోవడం... దాచుకోవడమేనని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు ధ్వజమెత్తారు. ఇసుక బకాసురులు రాత్రికి రాత్రే అనుమతులు లేకుండా ఇసుకను ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారని ఆరోపించారు. 36వ డివిజన్‌లో మంగళవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ పాదయాత్రలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే 'పూర్ టూ రిచ్' నమ్మకం, భరోసాను కల్పించే విధంగా వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రజలు అష్ట కష్టాలు పడుతుంటే వైసీపీ నేతలు వికృత చేష్టలు చేస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ ఎల్లప్పుడూ ప్రజల పక్షమేనన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నవనీతం సాంబశివరావు, డివిజన్ అధ్యక్షుడు సీహెచ్.శ్రీనివాసరావు, ఇమ్మడి రాము, ఎస్‌సీ.బానుసింగ్, ముప్పా వెంకటేశ్వరరావు, వల్లూరి మధు పాల్గొన్నారు.

**ఐరన్‌యార్డులో ..**

**భవానీపురం :** ఐరన్‌యార్డులోని ముఠా కార్మికుల సమస్యలపై ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం బాధాకరమని పశ్చిమ తెలుగు యువత అధ్యక్షుడు రాళ్లపల్లి మాధవ ఆవేదన వ్యక్తం చేశారు. 43వ డివిజన్ ఐరన్‌యార్డులో మంగళవారం బాబు ష్యూరిటీ -భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో షాపులను సందర్శించి ముఠా కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేలాది కార్మికుల పనిచేస్తున్నా సరిపడా మరుగుదొడ్లు, విశ్రాంతి తీసుకోవడానికి సౌకర్యాలు లేవని కార్మికులు ఏకరవు పెట్టారు. టీడీపీ మేనిఫెస్టోపై ముద్రించిన కరపత్రాలను వారికి అందజేశారు. రానున్న ఎన్నికల్లో వైసీపీకి బుద్ధి చెప్పాలని కోరారు. టీడీపీ సీనియర్ నాయకులు మోరబోయిన రాంబాబు, గూడెల మహేష్, కాటంరాజు, పైడిపాటి సాయి, ఆకుల దినేష్‌లు పాల్గొన్నారు.



నూడిల్స్ వ్యాపారితో మాట్లాడుతున్న బొండా ఉమా




ఐరన్‌యార్డులో కరపత్రాలు ఇచ్చి మాట్లాడుతున్న మాధవ, రాంబాబు



విద్యాధరపురం, ఫిబ్రవరి 13: రాష్ట్రంలో పేదలకు టిడ్కో ఇళ్లు రాలేదు కానీ బకాయిలు కట్టాలంటూ బ్యాంకుల నుంచి నోటీసులొచ్చాయని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నే వెంకట నారాయణ ప్రసాద్ (అన్న) అన్నారు. ఈ మేరకు మంగళ వారం ఒక ప్రకటన చేశారు. జగన్‌రెడ్డి అధికారంలోకి రాగానే 25 లక్షల ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పి మాట తప్పి మడమ తిప్పారంటూ విమర్శించారు. చంద్రబాబు చేపట్టిన టిడ్కో ఇళ్లు ప్రజలకు అందితే తనకు రాజకీయ లబ్ధి ఉండదని జగన్‌రెడ్డి పేదల సొంత ఇంటి కలను నిర్వీర్యం చేశాడన్నారు. ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి జగన్ మోసానికి ప్రజలు బుద్ధి చెప్పే రోజు తొందర్లోనే ఉందన్నారు. టీడీపీ-జనసేన కూటమి చేపట్టిన కార్యక్రమాలకు పెద్ద ఎత్తున జనస్పందన ఉందని ఇదే సైకో జగన్ పాలనకు వ్యతిరేకతకు నిదర్శనమన్నారు.

## టిడ్కో ఇళ్లు రాలేదు...బకాయి చెల్లించాలంటూ నోటీసులొచ్చాయి

### టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నే అన్న







## సంచార జాతులను మోసం చేసిన జగన్‌రెడ్డి

### టీడీపీ బీసీ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకటగురుమూర్తి

**విద్యాధరపురం, ఫిబ్రవరి 13:** సంచార జాతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా సీఎం జగన్‌రెడ్డి మోసం చేశారని టీడీపీ బీసీ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకటగురుమూర్తి అన్నారు. ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం సంచార జాతుల ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్‌రెడ్డి సంచార జాతులకు ఎమ్మెల్సీ ఇస్తానని చెప్పి ఇవ్వలేదన్నారు. టీడీపీ హయాంలో ఏర్పాటు చేసిన సంచార జాతుల కార్పొరేషన్‌ను జగన్‌రెడ్డి నిర్వీర్యం చేశారన్నారు. ఎస్‌సీ, ఎస్‌టీలకు మాదిరే సంచార జాతులకు కూడా ఎట్రాసిటీ యాక్ట్ తీసుకువస్తానని అమలు చేయలేదన్నారు. రానున్న ఎన్నికల్లో సంచార జాతుల వారంతా చంద్రబాబును గెలిపించి ముఖ్యమంత్రిని చేస్తే సంచార జాతుల రాజకీయ, ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. కొత్త నాగేంద్రకుమార్(నాగబాబు), నాయకులు గంజెం రాఘవేంద్రరావు, ఫెంద్ర రమేష్, మరక శ్రీనివాస్, కత్తుల మణికంఠ, ఎస్‌వి గోపాల్, రుద్రాక్షల కులయప్ప, ఇందిర, మధు, ప్రభు, నారాయణ, వెంకటేష్ తదితరులు ఎంబీసీ (మోస్ట్ బ్యాక్‌వర్డ్ క్లాస్) నాయకులు పాల్గొన్నారు.

## చెక్ బౌన్స్ కేసులో వ్యక్తి అరెస్ట్

**విద్యాధరపురం, ఫిబ్రవరి 13:** చెక్‌బౌన్స్ కేసులో హెచ్‌బీ కాలనీకి చెందిన ముదిగొండ శివాజీని మంగళవారం భవానీపురం పోలీసులు అరెస్టు చేశారు. ఇబ్రహీంపట్నానికి చెందిన ఓ వ్యక్తికి శివాజీ సుమారు రూ.70వేలు ఇవ్వాల్సి ఉంది. అందుకుగాను శివాజీ చెక్ ఇచ్చాడు. అయితే ఆ చెక్‌ను ఆ వ్యక్తి బ్యాంక్ ఖాతాలో జమ చేయగా బౌన్స్ అయింది. ఈ విషయంపై పలుసార్లు శివాజీని అడుగగా స్పందించలేదు. దీంతో ఆ వ్యక్తి కోర్టుకు వెళ్లాడు. కేసు కోర్టులో నడుస్తున్నా వాయిదాలకు హాజరు కాకపోవడంతో శివాజీకి అరెస్టు వారెంట్ జారీ అయింది. దీంతో భవానీపురం పోలీసులు శివాజీని అరెస్టు చేసి కోర్టు హాజరుపరచగా రిమాండ్ విధించారు.

## పౌష్టికాహారం పంపిణీ

**భవానీపురం, ఫిబ్రవరి 13 :** 45వ డివిజన్ ఏకలవ్యనగర్‌లో ఉన్న అంగన్‌వాడీ సెంటర్‌లో మంగళవారం కార్పొరేటర్ మైలవరపు మాధురి లావణ్య లబ్ధిదారులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, వైసీపీ నాయకులు ముత్తా వాసు, వెంకట్రావు, కోటేశ్వరి, రాంబాబులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ మహిళా దినోత్సవం

**భవానీపురం, ఫిబ్రవరి 13 :** స్థానిక ఊర్మిళానగర్‌లోని గాంధీ దేశం సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్ కార్యాలయంలో జాతీయ మహిళా దినోత్సవం మంగళవారం ట్రస్ట్ వ్యవస్థాపకుడు గాంధీ నాగరాజన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భారత కోకిల సరోజిని నాయుడు చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ట్రస్ట్‌లో ఆశ్రయం పొందుతూ ఒకటవ తరగతి చదువుతున్న బిందు అనే చిన్నారితో కేక్ కట్ చేయించి కార్మికులకు పంచిపెట్టారు. ట్రస్ట్ సభ్యులు బంగారు భారతి, ఆర్.శివరంజని పాల్గొన్నారు.









## నిరుద్యోగులను నట్టేట ముంచిన జగన్‌రెడ్డి

● జనసేన అధికార ప్రతినిధి పోతిన మహేశ్



**వన్‌టౌన్, ఫిబ్రవరి 13:** సీఎం జగన్‌రెడ్డి నిరుద్యోగులను నట్టేట ముంచిన ఘనుడని జనసేన అధికార ప్రతినిధి, విజయవాడ పశ్చిమ ఇన్‌చార్జి పోతిన మహేశ్ అన్నారు. 38వ డివిజన్‌లో మంగళవారం జరిగిన ఇంటింటికి రాబోయే టీడీపీ-జనసేన కార్యక్రమంలో ఆయన స్థానికులను కలిసి టీడీపీ-జనసేన ప్రభుత్వ అవసరాన్ని తెలియచేశారు. కరపత్రాలను పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశ్చిమలో అవినీతికి చిరునామా వైసీపీ నాయకులేనన్నారు. టిడ్కో నివాసాలను లబ్ధిదారులకు అప్పగించలేదు కానీ, లబ్ధిదారులకు బకాయి కట్టాలంటూ బ్యాంకుల నుంచి నోటీసులు వస్తున్నాయన్నారు. పశ్చిమలో అభివృద్ధిపై తాము చర్చకు సిద్ధమన్నారు.

### గంగానమ్మ గుడి రోడ్డులో...

## పొంగుతున్న మ్యాన్‌హోల్...రోడ్డుపైకి మురుగు

**కృష్ణలంక, ఫిబ్రవరి 13:** స్థానిక 22వ డివిజన్‌లోని గంగానమ్మ గుడి వీధిలో మ్యాన్‌హోల్‌లు పొంగిపొర్లుతూ మురుగునీరు రోడ్డుపైకి చేరుతోంది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డుపైకి చేరిన మురుగునీరు వలన దుర్వాసనతో పాటు దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. వీఎంసీ సిబ్బంది మురుగునీరు తోడే వాహనం తీసుకొచ్చి చర్యలు తీసుకొంటున్నా అవి తాత్కాలికంగా వుంటున్నాయి తప్పించి శాశ్వత పరిష్కారం వుండటంలేదని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా వీఎంసీ అధికారులు స్పందించి రోడ్డుపైకి మురుగునీరు చేరకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



మ్యాన్‌హోల్ నుంచి రోడ్డుపైకి వస్తున్న మురుగునీరు

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**విద్యాధరపురం, ఫిబ్రవరి 13:** భవానీపురం పరిధిలోని 11కేవీ గాంధీబొమ్మ ఫీడర్‌లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ ఈఈ బి.వి సుధాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంక్ సెంటర్, సుధాకర్ మెడికల్ షాపు రోడ్డు, గాంధీబొమ్మ రోడ్డు, చర్చి రోడ్డు, కోళ్లఫారం రోడ్డు, డాల్ఫిన్ బార్ రోడ్డు, ఆర్‌టీసీ వర్క్‌షాపు రోడ్డులలో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

## సైడ్ డ్రెయిన్ ఆక్రమించి నిర్మాణం

● చోద్యం చూస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు



**రాణిగారితోట, ఫిబ్రవరి 13:** సైడ్ డ్రెయిన్లు ఆక్రమించి నిర్మాణాలు సాగిస్తున్నా టౌన్‌ప్లానింగ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవరించడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. రాణిగారితోట 17వ డివిజన్ మెయిన్ రోడ్డులో ఉన్న ఒక పెద్ద కిరాణా షాపు యాజమాని తన ఇష్టారాజ్యంగా సైడ్ డ్రెయిన్ ఆక్రమించి నిర్మాణాన్ని పూర్తిచేశాడు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాన్ని చేశాడు. సైడ్ డ్రెయిన్ దాటి రోడ్డుపైకి వచ్చి మరీ షాపును నిర్మించాడు. దీంతో సైడ్ డ్రెయిన్‌లో చెత్తను తొలగించే అవకాశం లేకపోవడంతో శానిటేషన్ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఇలా నిర్మాణాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిసున్నాయి.

## ద్విచక్రవాహనం చోరీ

**అజిత్‌సింగ్‌నగర్, ఫిబ్రవరి 13 :** ద్విచక్రవాహనం చోరీ జరిగిన ఘటనపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం న్యూ రాజరాజేశ్వరిపేట ప్రాంతానికి చెందిన పైడినాయుడు ఓ షాపులో గుమస్తాగా పనిచేస్తున్నాడు. ఈనెల 6న రాత్రి ద్విచక్రవాహనాన్ని పార్క్ చేసి ఇంట్లోకి వెళ్లి మరుసటి రోజు ఉదయం చూడగా ద్విచక్రవాహనం కనిపించలేదు. అప్పటి నుంచి అన్ని ప్రాంతాలు వెతికినా ద్విచక్రవాహనం కనపడకపోవడంతో అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## టిడ్కో గృహాల పరిశీలన

**విజయవాడ రూరల్, ఫిబ్రవరి 13 :** జక్కంపూడి గ్రామంలో నిర్మిస్తున్న టిడ్కో గృహాలను నగరమేయర్ రాయన భాగ్యలక్ష్మి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరలో టిడ్కో గృహాలను అందుబాటులోకి తీసుకురావాలని, నాణ్యతలోపాలు లేకుండా నిర్మాణాలు జరగాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ సత్యవతి, చీఫ్ ఇంజనీర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు సమస్యలను అధిగమించాలి

**ఉంగుటూరు, ఫిబ్రవరి 13 :** విద్యార్థులు తమ సృజనాత్మకతకు ఎదురయ్యే సమస్యలను కొత్తనైపుణ్యాలు, దృక్పథాలతో అధిగమించాలని, తద్వారా ఆయా రంగాల్లో విజయ అవకాశాలను మరింతగా మెరుగుపర్చుకోవాలని కృష్ణశ్రీ పరిపూర్ణ ఫౌండేషన్ డైరెక్టర్, సామాజికవేత్త, పేరిచర్ల శ్రీలత అన్నారు. విద్యార్థుల్లో గెలుపు అవకాశాలను ఏ విధంగా మెరుగుపరచుకోవచ్చు అనే అంశంపై మంగళవారం తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాలలో అవగాహనా సదస్సు జరిగింది. ఈ సదస్సులో శ్రీలత కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు సలహాలు, సూచనలు చేశారు. మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా ఎప్పటికప్పుడు విద్యార్థులు తమ ప్రతిభాపాటవాలు, నైపుణ్యాలను మెరుగుపరచు కోవాలన్నారు. చైర్మన్ సుంకర రామబ్రహ్మం, ప్రిన్సిపాల్ జీవీకేఎస్‌వీ ప్రసాద్, డైరెక్టర్ కె.రాజశేఖరరావు, సీఎస్‌సీ అండ్ ఏఐ విభాగాధిపతి కేపీఎస్‌వీ సత్యశ్రీ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## దుర్గగుడి మహామండపం వద్ద భక్తులకు అనువుగా షెడ్లు

**వన్‌టౌన్, ఫిబ్రవరి 13:** దుర్గగుడి మహామంపడం వద్ద షెడ్డులను భక్తులకు అనువుగా తీర్చిదిద్దారు. ఇప్పటి వరకు షెడ్డులలో దేవస్థానం సిబ్బంది, పోలీసులు, ఇంకా ఇతరులు తమ వాహనాలను పార్కింగ్ చేసి విధులకు వెళ్లిపోయేవారు. రద్దీ సమయాల్లో అమ్మవారి దర్శనం ఆలస్యం అవుతున్న సందర్భంలో భక్తులు దర్శనం చేసుకుని వచ్చి షెడ్డులో కాస్తంతా సేపు విశ్రమించేందుకు అవకాశం లేకుండా పోయింది.

షెడ్డులో వాహనాలను పార్కింగ్ చేయడం వల్ల భక్తులు పడుతున్న ఇబ్బందుల పై ఆంధ్రజ్యోతిలో పలు కథనాలు వచ్చాయి. తాజాగా ఈ షెడ్లలో వాహనాలను పార్కింగ్ చేయడం నిషేధించారు. ఈఈలు కోటేశ్వరరావు, రమాదేవిలు చొరవ తీసుకుని భక్తులకు అనువుగా షెడ్డును తీర్చిదిద్దారు. ఇప్పుడు భక్తులు కాస్తంత విశ్రమించి సేదతీరుతున్న వైనం ఉంది.








ఆంధ్రజ్యోతి

నవ్య చిత్రజ్యోతి

బుధవారం • 14 ఫిబ్రవరి 2024

cinema@andhrajyothy.com

# జాతీయ చలనచిత్ర అవార్డుల్లో కీలక మార్పులు

ప్రతిభ ప్రదర్శించిన నటీనటులు, సాంకేతిక నిపుణులకు, ఉత్తమ విలువలు కలిగిన చిత్రాలను ఎంపిక చేసి ప్రతి ఏటా ఇచ్చే జాతీయ చలనచిత్ర అవార్డుల్లో కీలక మార్పులు చోటు చేసుకోనున్నాయి. ఇప్పటి వరకూ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ పేరు మీద ఇచ్చే 'ఉత్తమ తొలి చిత్ర దర్శకుడు' అవార్డ్‌ను ఇకపై ఆ పేరుతో కాకుండా 'ఉత్తమ తొలి చిత్ర దర్శకుడు' పేరుతో ఇస్తారు. అంటే అందులో ఉన్న 'ఇందిరాగాంధీ' పేరు తొలిగించారన్న మాట. ఈ విభాగంలో దర్శకుడితో పాటు నిర్మాతకు కూడా ప్రైజ్ మనీ ఇచ్చేవారు. ఇకపై దర్శకుడికి మాత్రమే ప్రైజ్ మనీ ఇస్తారు.

అలాగే బాలీవుడ్ నటి నర్గిస్ పేరు మీద జాతీయ సమైకత్యను పెంపొందించే చిత్రానికి ఓ అవార్డ్ ఇస్తున్నారు. ఇకపై ఆ అవార్డులో నర్గిస్ పేరు కూడా ఉండదు. 'జాతీయ, సామాజిక, పర్యావణ విలువలు పెంపొందించే ఉత్తమ చిత్రం' పేరుతో ఆ అవార్డ్ అందజేస్తారు.

కేంద్ర సమాచార శాఖ అదనపు కార్యదర్శి నీర్జా శేఖర్ నేతృత్వంలోని కమిటీ సమావేశమై జాతీయ చలనచిత్ర అవార్డులలో కీలక మార్పులు చేస్తూ ఏకగ్రీవ నిర్ణయం తీసుకుంది. ఈ కమిటీలో కేంద్ర ప్రభుత్వ అధికారులతో పాటు సెన్సార్ బోర్డ్ ఛైర్మన్ ప్రసూన్ జోషి, సినీ ప్రముఖులు ప్రియదర్శన్, విపుల్ షా, ఛాయాగ్రాహకుడు నల్లముత్తు కూడా ఉన్నారు. జాతీయ చలనచిత్ర అవార్డులు 2022 కోసం ఎంట్రీలు స్వీకరించడానికి జనవరి 30తో గడువు ముగియడంతో ఈ కమిటీ సమావేశమై పలు కొత్త నిర్ణయాలు తీసుకుంది. ఈ విషయాన్ని కమిటీ సభ్యుడైన దర్శకుడు ప్రియదర్శన్ ధ్రువీకరించారు. 'నేను కూడా కొన్ని సూచనలు చేశాను. సౌండ్ విభాగానికి కూడా అవార్డులు ఇవ్వాలన్నది వాటిలో ఒకటి' అని ఆయన వెల్లడించారు.

### కీలక మార్పులు ఇవే

- చలనచిత్ర పరిశ్రమకు ఇతోధిక సేవలు అందించిన చలనచిత్ర ప్రముఖులకు ఇచ్చే దాదాసాహెబ్ ఫాల్కే అవార్డ్‌కు ఇంతవరకూ రూ పది లక్షలు నగదు ఇస్తున్నారు. ఆ మొత్తాన్ని ఇపుడు రూ 15 లక్షలకు పెంచారు.
- స్వర్ణకమలం అవార్డ్ పొందిన వారికి ఇకపై రూ. మూడు లక్షలు, రజిత కమలం పొందిన వారికి రూ రెండు లక్షలు అందజేస్తారు. ఉత్తమ చిత్రం, ఉత్తమ తొలి చిత్రం, పూర్తి వినోదాత్మక చిత్రం, ఉత్తమ దర్శకుడు, ఉత్తమ బాలల చిత్రం .. విభాగాలకు స్వర్ణ కమలం అందిస్తారు. ఇక మిగిలిన అన్ని విభాగాలు.. అంటే ఉత్తమ ప్రబోధాత్మక చిత్రం, నటనా విభాగంలో వచ్చే అవార్డులు, ఉత్తమ స్ర్కీన్‌ప్లే, ఉత్తమ సంగీత దర్శకుడు.. ఇలాంటి అన్ని అవార్డులకు రజిత కమలం అందిస్తారు.
- ఇప్పటివరకూ 'బెస్ట్ ఏనిమేషన్ ఫిల్మ్', 'బెస్ట్ స్పెషల్ ఎఫెక్ట్ ఫిల్మ్' అంటూ విడివిడిగా అవార్డులు ఇస్తున్నారు. ఇకపై ఈ రెంటినీ కలిపేసి 'బెస్ట్ ఎవిజీసీ'(యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్) పేరుతో అవార్డులు ఇస్తారు.
- బెస్ట్ ఆడియోగ్రఫీ విభాగంలో మూడు సబ్ కేటగిరిలు ఉన్నాయి. 'సౌండ్ రికార్డిస్ట్', 'సౌండ్ డిజైనర్', 'ఫైనల్ మిక్స్‌డ్ ట్రాక్ రికార్డిస్ట్' అని. ఇకపై ఇవన్నీ కలిపి 'బెస్ట్ సౌండ్ డిజైనర్' పేరుతో అవార్డ్ ఇస్తారు. ప్రైజ్ మనీని కూడా యాభై వేల నుంచి రెండు లక్షల రూపాయలకు పెంచారు.
- ఉత్తమ సంగీత దర్శకుడు పేరుతో ఇచ్చే అవార్డ్‌ను ఇకపై 'ఉత్తమ నేపథ్య సంగీతం' పేరుతో ఇవ్వనున్నారు.
- ప్రత్యేక జ్యూరీ అవార్డ్‌ను తొలగించి ఆ స్థానంలో ఫీచర్ ఫిల్మ్‌కు ఒక అవార్డ్, నాన్ ఫీచర్ ఫిల్మ్‌కు ఒక అవార్డ్ ను ఇచ్చే అధికారాన్ని జ్యూరీకి ఇచ్చారు
- నాన్ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో ఇచ్చే కొన్ని అవార్డులు తొలిగించారు. మరికొన్ని కలిపేశారు. 'బెస్ట్ స్ర్కిప్ట్' పేరుతో కొత్తగా ఒక అవార్డును ఏర్పాటు చేశారు.

# పాచికల ఆట నేపథ్యం



వైవిధ్యమైన కథాంశాలు ఎన్నుకుని సినిమాల్లో నటించే మలయాళ అగ్ర నటుడు మమ్ముట్టి తెలుగు ప్రేక్షకులకూ సుపరిచితులే. అనువాద చిత్రాలతో కాకుండా నేరుగా కొన్ని తెలుగు సినిమాల్లో ఆయన నటించారు. ఇప్పుడు మరో విభిన్న కథా చిత్రం 'భ్రమ యుగం'తో ఆయన ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. రాహుల్ సదాశివన్ దర్శకత్వంలో వైనాట్ స్టూడియో నిర్మించిన చిత్రం ఇది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో రూపొందుతున్న ఈ చిత్రం ట్రైలర్‌ను ఇటీవల అబుదాబీలో విడుదల చేశారు. చాలా కాలం తర్వాత బ్లాక్ అండ్ వైట్‌లో తయారైన ఈ సినిమా ట్రైలర్ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతి కలిగిస్తోంది. పాచికల ఆట నేపథ్యంలో అనుక్షణం ఉత్కంఠ కలిగించే విధంగా చిత్రం ఉంటుందని దర్శకనిర్మాతలు చెబుతున్నారు. ఓ గాయకుడి జీవితంలో జరిగిన అనూహ్య సంఘటనల నేపథ్యంలో రూపుదిద్దుకున్న ఈ చిత్రం ఈ నెల 15న విడుదల కానుంది. మొదట మలయాళంలో మాత్రమే విడుదల చేసి, ఆ తర్వాత మిగిలిన భాషల్లో రిలీజ్ చేయాలని నిర్మాణ సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. 'భ్రమయుగం' చిత్రానికి సినిమాటోగ్రఫీ: షెహనాద్ జలాల్, సంగీతం: క్రిస్టో జేవియర్, మాటలు: టి.డి. రామకృష్ణన్, నిర్మాతలు: చక్రవర్తి రామచంద్ర, ఎస్.శశికాంత్.



# మరోసారి జోడీ

మాధవన్, కంగనా రనౌత్ జంట ముచ్చటగా మూడోసారి ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'తను వెడ్స్ మను', 'తను వెడ్స్ మను రిటర్న్స్' చిత్రాలు సూపర్ హిట్ అయ్యాయి. తాజాగా మరోసారి ఈ జంట స్క్రీన్ షేర్ చేసుకోబోతోంది. ఈ విషయాన్ని కంగన, మాధవన్ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా సోమవారం ప్రకటించారు. 'ఓ సర్‌ప్రైజ్ మూవీ కోసం నా అభిమాన నటుడితో మరోసారి కలసి నటించబోతున్నాను' అని కంగన తెలిపారు. మాధవన్‌తో దిగిన ఫొటోను ఆమె షేర్ చేశారు. ప్రతిభావంతురాలైన కంగనా రనౌత్‌తో కలసి నటించేందుకు ఆసక్తిగా ఉన్నాను అని మాధవన్ పేర్కొన్నారు. అయితే వీరు చేయబోయే సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా ప్రకటించాల్సి ఉంది.

# వినోదాల విందు



హీరో రవితేజ, సుధీర్ కుమార్ కుర్రుతో కలసి నిర్మిస్తున్న చిత్రం 'సుందరం మాస్టర్'. హర్ష చెముడు, దివ్యశ్రీపాద ప్రధాన పాత్రలు పోషించారు. కల్యాణ్ సంతోష్ దర్శకుడు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. ఈ నెల 23న ప్రేక్షకుల ముందుకు రానుంది. మిర్యాల మెట్ట అనే మారుమూల గ్రామానికి ఇంగ్లీష్ టీచర్‌గా వెళ్లిన సుందరం అక్కడ ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నాడనేది వినోదాత్మకంగా తెరకెక్కించినట్లు యూనిట్ తెలిపింది. ఈ చిత్రానికి సంగీతం: శ్రీ చరణ్ పాకాల. సినిమాటోగ్రఫీ: దీపక్

# హ్యాట్రిక్ సాధిస్తామనే నమ్మకం ఉంది

రాజేశ్ దండా



'పంపిణీదారుడిగా నాకు పన్నెండేళ్ల అనుభవం ఉంది. సందీప్ కిషన్, నేను, దర్శకుడు ఆనంద్ స్నేహితులం. హాస్య మూవీస్ సంస్థను ప్రారంభించి తీయాలనుకున్న మొదటి సినిమా 'ఊరు పేరు భైరవకోన'. ఆనంద్ చెప్పిన కథ కొత్తగా ఉండడంతో ఇలాంటి కంటెంట్‌తో సినిమా తీస్తే హిట్ అవుతుందనే నమ్మకంతోనే ఈ సినిమా తీశాం. సందీప్ కిషన్ కెరీర్‌లోనే హయ్యెస్ట్ బడ్జెట్ చిత్రం ఇది. బిజినెస్ కూడా అదే స్థాయిలో జరిగింది. అందుకే విడుదలకు ముందే హ్యాపీగా ఉన్నాం' అన్నారు నిర్మాత రాజేశ్ దండా. సందీప్ కిషన్ హీరోగా ఆయన నిర్మించిన 'ఊరు పేరు భైరవకోన' చిత్రం ఈ నెల 16న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం మీడియాతో చిత్ర విశేషాలు పంచుకొన్నారు. నచ్చిన కథలు చేసుకుంటూ వెళుతున్నామని చెబుతూ 'మా సంస్థ సక్సెస్ ట్రాక్‌ను 'ఊరు పేరు భైరవకోన' కొనసాగించి హ్యాట్రిక్ అందిస్తుందనే నమ్మకం ఉంది. ప్రీమియర్ షోలన్నీ ఫుల్ కావడం ఈ సినిమాపై ఉన్న క్రేజ్‌కు అద్ధం పడుతుంది. మా దర్శకుడు చెబితే సినిమాకు కచ్చితంగా సీక్వెల్ ఉంటుంది. ఈ కథకు సీక్వెల్, ప్రీక్వెల్ .. రెండూ చేయచ్చు. ఆ ఆలోచన ఉంది' అని ఆయన చెప్పారు. చిత్రంలోని అంశాల గురించి వివరిస్తూ 'ఇదొక ఫాంటసీ థ్రిల్లర్. 'భైరవకోన' అనే ఊరులో ఎవరూ ఊహించని సంఘటనలు జరుగుతుంటాయి. అలాగే గరుడ పురాణం పుస్తకంలో మిస్ అయిన పేజీలకు, ఈ కథకు ఉన్న లింక్ కూడా ఆసక్తికరంగా ఉంటుంది. చిత్రంలో 47 నిముషాల అద్భుతమైన సీజీ వర్క్ ఉంది. సందీప్ కిషన్ సినిమా కోసం చాలా కష్టపడ్డారు. తనే ఈ సినిమాకు హెల్ప్ అయ్యాడనే విధంగా నటించాడు. ప్రేక్షకులకు అద్భుతమైన అనుభూతినిచ్చే సినిమా ఇది' అని రాజేశ్ చెప్పారు. నిర్మాత అనిల్ సుంకరతో ఉన్న అనుబంధం గురించి చెబుతూ 'మొదట నేను కథ వింటాను. నాకు నచ్చితే అనిల్ వింటారు. అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తారు. ఈ సినిమాలో కూడా ఆయన ఓ విలువైన సూచన చేశారు. అది బాగా హెల్ప్ అయింది' అని తెలిపారు.

# సామాజిక బాధ్యతతో సినిమా తీశాం



వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందిన చిత్రం 'రాజధాని ఫైల్స్'. అఖిలన్, వీణ, వినోద్‌కుమార్, వాణీ విశ్వనాథ్ కీలక పాత్రలు పోషించారు. భాను దర్శకత్వంలో కంఠంనేని రవిశంకర్ నిర్మించారు. ఈ నెల 15న చిత్రం విడుదలవుతున్న సందర్భంగా మేకర్స్ ప్రీ రిలీజ్ ఫంక్షన్ నిర్వహించారు. ఇందులో నిర్మాత మాట్లాడుతూ రైతులు స్వచ్ఛందంగా ఇన్ని వేల ఎకరాల భూములు ఇస్తే దానిని ఎగతాళి చేస్తూ, వారిని మానసిక క్షోభకు గురి చేసిన సంఘటనలు ఈ మధ్య కాలంలో చోటు చేసుకున్నాయి. దానిని స్ఫూర్తిగా తీసుకుని రైతుల పక్షాన ఒక సినిమా తీయాలని అనుకున్నాం. అయితే ఈ సినిమా ఏ పార్టీకి వ్యతిరేకం కాదు. రైతుల కన్నీళ్లు తుడిచే విధంగా సమాజాన్ని చైతన్యపరుస్తూ ఓ సామాజిక బాధ్యతతో ఈ సినిమా నిర్మించాం.. దర్శకుడు భాను అద్భుతంగా తీశారు. సినిమాకు అఖండ విజయం అందించి రైతులకు సంఘీభావం తెలియజేయాలి' అని కోరారు. ఇందులో తను రైతు పాత్ర పోషించాననీ, ఇది పొలిటికల్ ఫిల్మ్ కాదనీ, రైతుల ఆవేదనని తెలియజేసే కథ అని వినోద్‌కుమార్ చెప్పారు. ఈ సినిమాలో తను భాగం అయినందుకు ఆనందంగా ఉందని వాణీ విశ్వనాథ్ చెప్పారు. ఏడు వందల మంది రైతులతో ఈ సినిమా తీశామని దర్శకుడు భాను చెప్పారు. రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతులు, మహిళలు ఇందులో నటించారని తెలిపారు. అందరికీ ఉపయోగపడే సినిమా ఇదన్నారు.

# శివనాగిని విడుదలకు సిద్ధం

సురేశ్, మమతా రాహుత్ హీరో హీరోయిన్లుగా రూపొందుతున్న చిత్రం 'శివనాగిని'. సుమన్, షాయాజీషిండే, అజయ్ ఘోష్ కీలకపాత్రలు పోషించారు. మొండెం శ్రీధర్ దర్శకత్వంలో చదలవాడ హరిబాబు నిర్మించారు. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమైంది. తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేసి సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ "శివనాగిని'లో 30 నిమిషాల గ్రాఫిక్ సీక్వెన్స్ ఉంది. మారెడుమల్లి అడవుల్లో అద్భుతమైన లొకేషన్లలో చిత్రీకరణ చేశాం. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం' అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: జాన్ పోట్ల. సినిమాటోగ్రఫీ: యామేష్



# ఎమోషనల్ సిద్ధాంతం



ఒకప్పటి బాలనటుడు దీపక్ సరోజ్ హీరోగా అరంగేట్రం చేస్తున్న 'సిద్ధార్థ్ రాయ్' చిత్రం ఈ నెల 23న విడుదల కానుంది. యశస్వీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలోని నువ్వు నమ్మిన 'సిద్ధాంతం' అంటూ సాగే పాటను మంగళవారం విడుదల చేశారు. సినిమాలో చాలా కీలకమైన ఈ పాటను సంగీత దర్శకుడు రథన్ పవర్‌ఫుల్ ఎమోషనల్ నంబర్‌గా కంపోజ్ చేశారు. బాలాజీ రాసిన ఈ పాట కథలోని లోతుని తెలియజేస్తుంది. సింగర్ శరత్ సంతోష్ మనసుని హత్తుకొనే విధంగా ఈ పాట పాడారు.. ఈ పాటలో దీపక్ అభినయం ఆకట్టుకొనే విధంగా ఉంది. యూనిక్ కాన్సెప్ట్‌తో రూపొందిన ఈ చిత్రాన్ని జయ అడపాక, ప్రదీప్ పూడి, సుధాకర్ బోయిన నిర్మిస్తున్నారు.

# స్నేహ గీతం



ఇంద్ర, కోమల్ నాయర్, దీప్, స్వాతి శర్మ ప్రధాన తారాగణంగా స్నేహం గొప్పతనాన్ని తెలిపే కథాంశంతో రూపొందిన చిత్రం 'ట్రెండ్ మారినా ఫ్రెండ్ మారదు'. లక్ష్మణ్ జెల్ల దర్శకత్వంలో చంద్ర ఎస్ చంద్ర, డాక్టర్ విజయ రమేశ్ రెడ్డి నిర్మించారు. ఈ చిత్రం నుంచి 'నా కల' అంటూ సాగే గీతాన్ని సంగీత దర్శకుడు ఘంటాడి కృష్ణ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ 'చిత్రీకరణ దాదాపు పూర్తయింది. కొత్త, పాత నటుల కాంబినేషన్‌లో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాం' అన్నారు. గాయని సునీత ఆలపించిన ఈ గీతం ప్రేక్షకులను అలరిస్తుందని దర్శకుడు అన్నారు. ఇందులో తన పాత్ర సరికొత్తగా ఉండబోతోందని ఇంద్ర చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: శ్రావణ్ భరద్వాజ. సినిమాటోగ్రఫీ: రాహుల్ మాచినేని

# హృదయాన్ని కదిలించే ప్రేమకథ



అభిషేక్ పచ్చిపాల, నజియాఖాన్ జంటగా నటించిన చిత్రం 'జస్ట్ ఎ మినిట్'. పూర్ణస్ యశ్వంత్ దర్శకత్వంలో అర్షద్ తస్వీర్, డాక్టర్ ప్రకాశ్ దర్మపురి నిర్మించారు. ఇటీవలే చిత్రబృందం ఆడియోను విడుదల చేసింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'గాఢతతో నిండిన ప్రేమకథాంశంతో రూపొందించిన చిత్రం 'జస్ట్ ఎ మినిట్'. ఈ సినిమాకు సంగీతం ప్రత్యేకాకర్షణ' అన్నారు. 'ఆద్యంతం ఆసక్తిని రేకెత్తించి, ప్రతి ఒక్కరి హృదయాన్ని కదిలించే సున్నితమైన ప్రేమకథా చిత్రం ఇది' అని నిర్మాతలు చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: ఎస్ కే బాజీ. సినిమాటోగ్రఫీ: అమీర్

## మేని మెరుపులకు...

- బౌల్‌లో టేబుల్ స్పూన్ అలోవెరా జెల్, టేబుల్ స్పూన్ రోజ్ వాటర్ కలిపి మెత్తగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించిన తర్వాత పదిహేను నిముషాల తర్వాత మంచి నీళ్లతో కడిగేయాలి. దీనివల్ల చర్మం స్మూత్‌గా ఉంటుంది.
- రెండు టేబుల్ స్పూన్ల అలోవెరా జెల్, ఆరు చుక్కల నిమ్మరసం కలిపి చర్మానికి మసాజ్ చేసినట్లు పట్టించాలి. అరగంట తర్వాత శుభ్రం చేసుకోవాలి. ఇలా తరచూ చేస్తుంటే చర్మం మీద ట్యానింగ్ తగ్గిపోయి చర్మంలో మెరుపు వస్తుంది.
- ముఖం మరీ జిడ్డుగా ఉండేవాళ్లు ఈ ఫేస్‌ప్యాక్‌ను వేసుకోవాలి. టేబుల్ స్పూన్ ముల్తాన్ మట్టి, టీస్పూన్ అలోవెరా జెల్, టీ స్పూన్ రోజ్ వాటర్ లేదా పాలు తీసుకుని కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి ఆరిన తర్వాత కడిగేయాలి. ఇలా తరచూ చేస్తుంటే చర్మంలో జిడ్డు కనపడకుండా ఉంటుంది.
- టేబుల్ స్పూన్ అలోవెరా జెల్, చిటికెడు పసుపు కలిపి చూర్ణంలా చేసుకోవాలి. ఈ చూర్ణాన్ని ముఖం మీద పట్టించి ఇరవై నిముషాల తర్వాత మంచి నీటితో శుభ్రపరచుకోవాలి. ఇలా చేయటం వల్ల ముఖ చర్మం మీద ఉండే నొప్పులు తొలగిపోతాయి. చర్మం ఆరోగ్యంగా ఉంటుంది.
- బౌల్‌లో సగం అరటిపండును చూర్ణం చేయాలి. ఇందులోకి టేబుల్ స్పూన్ అలోవెరా జెల్ వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని రెండువారాలకోసారి పట్టిస్తే ఎండిపోయినట్లుండే మచ్చలు తొలగిపోతాయి.



- రెండు టేబుల్ స్పూన్ల అలోవెరా జెల్, టీ స్పూన్ తేనె, టీ స్పూన్ పెరుగు కలపాలి. ఈ మిశ్రమాన్ని బాగా కలిపాక ముఖానికి పట్టించి ఆరిన తర్వాత శుభ్రపరచాలి. ఇలా తరచూ చేస్తుంటే చర్మంలో దాగి ఉండే మట్టి తొలగిపోతుంది.
- బౌల్‌లో రెండు టేబుల్ స్పూన్ల అలోవెరా జెల్, టీస్పూన్ కీరా దోస రసం వేసి కలపాలి. అవసరం అనుకుంటే టీస్పూన్ రోజ్ వాటర్ కలపొచ్చు. చర్మానికి పట్టించి ఆరిన తర్వాత కడిగేయాలి. దీనివల్ల చర్మం రిఫ్రెష్‌గా ఉంటుంది.
- గుప్పెడు వేపాకులను తీసుకుని మంచి నీళ్లతో శుభ్రం చేశాక పేస్ట్‌లా చేసుకోవాలి. దీన్ని బౌల్‌లో వేసి ఇందులోకి రెండు టేబుల్ స్పూన్ల అలోవెరా జెల్, టీస్పూన్ తేనె వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని తరచూ పట్టించటం వల్ల పుండ్లు, మొటిమల్లాంటి సమస్యలు తగ్గిపోతాయి.
- కేవలం అలోవెరా జెల్ ఉన్నా ముఖానికి పట్టించి ఆరిన తర్వాత శుభ్రంగా కడిగేసుకోవాలి. ఇలా చేస్తుంటే చర్మంలో కాంతి వస్తుంది.

## ఇంట్లో అలంకరణ ఇలా..

- ఇంటి అలంకరణ అంటే ఎక్కువ వస్తువులు ఉంచినంత మాత్రాన రిచ్ అనిపించుకోదు. ఇంట్లోకి అడుగుపెట్టగానే రిచ్‌లుక్ ఉండాలంటే మాత్రం క్వాలిటీ ఫర్నిచర్, రెండు లేదా మూడు కుర్చీలు ఉంటే సరి. టేబుల్ మీద మొక్కను



ఉంచటం వల్ల అందంగా కనిపిస్తుంది. కొత్త లుక్ వస్తుంది.
- హాల్ పెద్దదిగా ఉంటే ఇల్లు అద్భుతంగా కనిపిస్తుంది. దీంతో పాటు ఇంట్లోకి వెలుతురు ధారాళంగా వచ్చేట్లు పెద్ద కిటికీలు ఏర్పరుచుకోవాలి. గాలి, వెలుతురు రావటం వల్ల సహజంగా అనిపిస్తుంది.
- ఇంటీరియర్ డిజైనింగ్‌కు అధిక సొమ్ము కేటాయించాల్సిన అవసరం లేదు. ఏ వస్తువు ఎక్కడ ఉంటే బావుంటుందనే ఆలోచన ఉంటే సరి.
- హాల్‌లో ఒకటో రెండో పెయింటింగ్స్ ఉంటే బావుంటుంది. జ్ఞాపకాలతో ఉంటే ఇంకా మంచిది.
- హాల్‌లో అయినా బెడ్ రూమ్‌లో అయినా థిక్ రంగులు వాడకూడదు. లైట్ కలర్స్ వేయించుకోవాలి. ముఖ్యంగా లైట్స్ విషయంలో కూడా జాగ్రత్తలు తీసుకోవాలి.
- కిడ్స్ రూమ్‌ను డెకరేట్ చేసుకోవటం అంటే గోడలంతా స్టిక్కర్లు, బొమ్మలు కాకుండా.. పిల్లల ఫొటోలతో పాటు వారు గీసిన బొమ్మలను పెయింటింగ్‌లా వేయించుకోవచ్చు. తద్వారా పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.
- కిటికీలకు మెరిసే పరదాలు, ఫ్లవర్ పాట్స్ ఇంట్లో పెడితే అందంగా కనపడుతుంది.

లవ్ లైఫ్

ప్రేమిస్తే... ప్రాణం ఇస్తామనడం గొప్పేమీ కాదు.
ఇంకా చెప్పాలంటే అసలు అది ప్రేమే కాదు.
మరి..? ఆ ప్రేమను నిలబెట్టుకోవడంలోనే అసలైన జీవితం ఉందంటున్నారు మనోవికాస నిపుణులు.
'నీ సావాసం నా శ్వాసకు సంగీతం' అంటూ ఒకరి కోసం ఒకరు పరితపించి... తీరా ఇష్టపడి ఒక్కటయ్యాక 'ప్రేమ లేనె లేదని' ఎవరికి వారుగా జీవిస్తే ఇక ఆ ప్రేమకు అర్థమేముంటుంది!
అందుకే దృఢమైన బంధం కోసం జంటలకు కొన్ని సూచనలు చేస్తున్నారు. అవే ఇవి...




# బంధం దృఢంగా

### విమర్శలు వదిలి:

కొందరు తమ అభిప్రాయాలను సూటిగా చెప్పకుండా విమర్శనాత్మక ధోరణిలో వెళుతుంటారు. లేదంటే వెటకారంగా మాట్లాడుతుంటారు. అనురాగ బంధంలో ఇలాంటివి తగవు. ఒక్కోసారి మీరు పాజిటివ్ కోణంలో చేసిన చిన్నపాటి విమర్శ కూడా మీ భాగస్వామి మనసుకు తీవ్రమైన బాధ కలిగించవచ్చు. ఆ బాధను మీతో పంచుకోలేక... కొన్నాళ్లకు తను ఒంటరిననే అనుభూతికి లోనయ్యే ప్రమాదం ఉంది. అది ఎన్నో రకాల అనర్థాలకు దారి తీస్తుంది. కనుక విమర్శనాత్మకంగా కాకుండా, విషయం వారికి అర్థమయ్యేలా వివరించి చెప్పే ప్రయత్నం చేయాలి. ఒకవేళ మీ వైఖరివల్ల భాగస్వామి మనసు నొచ్చుకుందని భావిస్తే... తనకు నచ్చింది చేసి పెట్టండి. లేదంటే అలా బయటకు వెళ్లి ఆహ్లాదంగా గడిపిరండి.

### పంతాలు పక్కనపెట్టి..:

వివాహ బంధంలో భార్యాభర్తల మధ్య వివాదాలు సాధారణం. చిన్న చిన్న విషయాలకే భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతుంటాయి. దాంతో ఎడమొహం... పెడమొహంలా సాగుతుంటుంది కాపురం. అలాంటి సందర్భాల్లో ఆవేశపడకుండా... ఒకరిని ఒకరు అర్థం చేసుకొని, జీవిత భాగస్వామి ఆలోచనలు, అభిప్రాయాలను గౌరవించాలి. చిన్న చిన్న మనస్పర్థలను పట్టించుకోకుండా, పంతాలకు పోకుండా అవసరమైతే ఒక అడుగు వెనక్కి తగ్గాలి.

### సరదాగా కాసేపు:

ఇప్పుడు భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేస్తున్నవారే. దీనివల్ల ఇంట్లో ఇద్దరూ కలిసి కాసేపు గడిపే సమయం లభించడంలేదు. ఇంటికి రాగానే ఎవరి పనుల్లో వారు బిజీ అయిపోతున్నారు. అలాకాకుండా... ఆఫీసు నుంచి ఇంటికి వచ్చిన వెంటనే ఏ టీవీకో, మొబైల్‌కో అతుక్కుపోకుండా కొంత సమయం జీవిత భాగస్వామితో సరదాగా గడపాలి. పనిలో చికాకులన్నీ పక్కనపెట్టి... ఒకరితో ఒకరు మనసు విప్పి మాట్లాడుకోవాలి. అప్పుడే బంధంలోని మాధుర్యం ఏవిటో అర్థమవుతుంది.

### అలాంటి మాటలు వద్దు:

'అనవసరంగా నిన్ను పెళ్లి చేసుకున్నాను. నిన్న నీలో ప్రేమను చూశాను. ఇవాళ దెయ్యాన్ని చూస్తున్నాను' లాంటి ఎత్తిపొడుపులు తగవు.

ఇవి ఎదుటివారిలో అభద్రతా భావాన్ని పెంపొందిస్తాయి. భాగస్వామి నుంచి అలాంటి మాటలు వచ్చినప్పుడు మరింత రెచ్చగొట్టకూడదు. దగ్గరకు తీసుకొని, నచ్చజెప్పే ప్రయత్నం చేస్తే తనకు మీ మీద గౌరవం, నమ్మకం పెరుగుతాయి.

### ఒకరికి ఒకరుగా:

భారీ పార్టీలు, బడా బహుమతులు ఇస్తేనే భాగస్వామికి మీ ప్రేమ అర్థమవుతుందని అనుకోవద్దు. అనురాగ బంధంలో ఒకరికి ఒకరు ఇచ్చుకొనే చిన్న చిన్న బహుమతులు కూడా అద్భుతమే. అవి మీలోని ప్రేమకు ప్రతిరూపాలుగా మీ భాగస్వామి మదిలో ఎప్పటికీ నిలిచిపోతాయి.

అలాగే సన్నిహితుల మధ్య ఇచ్చే చిన్నపాటి విందు అయినా ప్రత్యేకంగానే ఉంటుంది.

### రసరమ్యంగా..:

బలమైన బంధానికి శృంగారం ఎంతో ముఖ్యం. చాలామంది యువతుల ఫిర్యాదు ఏంటంటే... పెళ్లి తరువాత తమ భర్తలో మన్మథుడు మాయమవుతున్నాడని. అంటే అస్సలు రొమాంటిక్‌గానే ఉండరట. కనుక వైవాహిక జీవితంలో సంపాదన, పిల్లలు, వారి భవిష్యత్తు గురించి ఆలోచనలే కాకుండా.. కాస్తంత శృంగారం కూడా పండించాలంటున్నారు నిపుణులు. ముఖ్యంగా షిఫ్ట్ జాబ్స్ చేస్తున్న భార్యాభర్తలు రోజులో కొంత సమయం తమ కోసం తాము కేటాయించుకోవాలి. అప్పుడప్పుడూ సర్‌ప్రైజ్ గిఫ్టులు, డిన్నర్ డేట్‌లతో అనుబంధంలో ఉత్సాహం నింపుతుండాలి.

**ఆది క్వీన్ ఆఫ్ హెర్బ్స్...**
**ఇది 58 ఏళ్ల యనుంగ్ జమోహ్ లెగోను అరుణాచల్‌ప్రదేశ్ ప్రజలు ఆప్యాయంగా పిలుచుకొనే ముద్దుపేరు.**
**సంప్రదాయ మూలికా వైద్య సంరక్షకురాలుగా అపూర్వమైన సేవలు అందించడమే కాదు, లక్షమందికి పైగా శిక్షణ ఇచ్చారు. ఇంటింటా కిచెన్ హెర్బల్ గార్డెన్స్ ఏర్పాటుకు దోహదం చేశారు. ఈ ఏడాది పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన జమోహ్ గురించి ఆమె మాటల్లోనే...**





# మూలికా రాణి

"మన ఆరోగ్యానికి ఏ సమస్య వచ్చినా దాన్ని నయం చేసే సాధనాలు ప్రకృతిలోనే ఉన్నాయి. మన పూర్వీకులు ఆరోగ్యంగా ఉండేవారంటే దానికి కారణం... వారి జీవితాలు ప్రకృతితో ముడిపడి ఉండడమే. మనం ప్రకృతిసిద్ధమైన జీవనానికి క్రమంగా దూరం అవుతున్నాం. దీనివల్ల అనేక మొండి వ్యాధులు మనల్ని పీడిస్తున్నాయి. వాటి బారిన పడకుండా ఉండాలన్నా, స్వస్థత పొందాలన్నా ప్రకృతే శరణ్యం. ఈ సంగతులన్నీ మా అమ్మ నాకు బోధించింది. ఆమె మూలికలతో చికిత్స చేసేది. మా నాన్న సోషల్ వర్కర్. అమ్మతో పాటే చిన్నప్పుడు అడవుల్లోకి వెళ్ళి మూలికలు సేకరించేదాన్ని. క్రమంగా వాటి విలువేవిటో నాకు అర్థమయింది. మాది అరుణాచల్ ప్రదేశ్‌లోని ఈస్ట్ సియాంగ్ జిల్లా. మొక్కల పెంపకం అంటే ఆసక్తి ఉండడంతో... వ్యవసాయశాస్త్రం చదువుకున్నాను. వ్యవసాయ శాఖలో ఉద్యోగిగా చేరాను. అదే సమయంలో అమ్మ నుంచి నేర్చుకున్న వైద్యాన్ని కొనసాగించాను. మొక్కలు, మూలికల్లో ఓషధీ గుణాలను అధ్యయనం చేయడం, వాటితో రోగులకు చికిత్స చేయడం అభిరుచిగా మారింది. గత ముప్ఫయ్యేళ్ళలో పదివేలమందికి పైగా రోగులకు చికిత్స అందించాను.

అరుదైన మూలికా జాతులెన్నో అంతరించిపోతూ ఉండడం ఎంతో ఆందోళన కలిగించడంతో... వాటిని పరిరక్షించడం, పెంచడం, వాటి ఓషధీ గుణాలను ప్రచారం చేయడం అవసరం అనుకున్నాను. నేను 'ఆది' గిరిజన తెగకు చెందినదాన్ని. మా తెగవారు వందల ఏళ్ళుగా అనుసరిస్తున్న సంప్రదాయిక వైద్య విధానంపై ప్రజలకు అవగాహన శిబిరాలు నిర్వహించాను. ఉత్సాహం ఉన్నవారికి వైద్యంలో శిక్షణ ఇచ్చాను. మా రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకూ లక్షమందికి పైగా ఈ శిక్షణ ద్వారా నైపుణ్యం సాధించారు. ప్రధానంగా స్వయం సహాయక బృందాల మహిళల కోసం నిర్వహించిన శిక్షణ కార్యక్రమాలు మంచి ఫలితాన్ని ఇచ్చాయి. తమ నిత్య జీవితంలో ఎదురయ్యే ఆరోగ్య సమస్యలను మూలికా వైద్యం ద్వారా వారు పరిష్కరించుకోవడమే కాదు, చుట్టుపక్కల వారికి చికిత్సలు కూడా చేస్తున్నారు.

**ఎన్నెన్నో సవాళ్ళు...**

సంప్రదాయ వైద్య విధానాన్ని పునరుద్ధరించడం ఒక ఎత్తయితే... దానికి అవసరమైన మూలికల గుర్తింపు, సేకరణ, పెంపకం, పరిరక్షణ మరో ఎత్తు. దీనికోసం ఆర్థికంగానూ, వ్యక్తిగతంగానూ ఎన్నో సవాళ్ళను ఎదుర్కొన్నాను. నిరుత్సాహపరిచిన వారు కొందరైతే, సంప్రదాయ వైద్యాన్ని నిరసించినవారు, ఇదంతా మానెయ్యాలని బెదిరించిన వారు మరికొందరు.

వారాల తరబడీ అడవుల్లో తిరిగిన సందర్భాలు అనేకం. ఓషధీ మొక్కల కొరత ఉండకూడదనే ఆలోచనతో... ప్రతి సంవత్సరం కనీసం అయిదువేల మొక్కలు నాటడం నియమంగా పెట్టుకున్నాను. అలాగే, ప్రకృతిసిద్ధమైన వైద్య ప్రత్యామ్నాయాలు అందుబాటులో ఉండడం కోసం మా జిల్లాలో ఇంటింటా హెర్బల్ కిచెన్ గార్డెన్స్ ఏర్పాటుకు ప్రోత్సహించాను. ఇప్పుడు ఎన్నో జిల్లాలు దీన్ని అనుసరిస్తున్నాయి. ఎసిడిటీ, మలేరియా, పచ్చకామెర్లు, అపెండిసైటిస్, పైల్స్, ఉబ్బసం, ర్యాబిస్, మధుమేహం, మూత్రపిండాల్లో రాళ్ళు, దగ్గు, టాన్సిల్స్, సైనస్ లాంటి ఎన్నో సమస్యలను మూలికా వైద్యంలో మంచి పరిష్కారాలున్నాయి. అయితే ఏ వ్యాధికి ఏ విధంగా చికిత్స చేయాలనే అవగాహన తప్పనిసరి. నేను ఇచ్చే శిక్షణ ప్రధానంగా దానిమీదే ఆధారపడి ఉంటుంది. రాష్ట్ర వ్యవసాయశాఖలో డిప్యూటీ డైరెక్టర్ హోదాలో పదవీ విరమణ చేశాక... ఇప్పుడు నా సమయం మొత్తాన్ని శిక్షణకు, ప్రచారానికి కేటాయిస్తున్నాను. దీనికి వ్యవసాయదారైన నా భర్త గుమిన్ లెగో, నలుగురు పిల్లల సహకారం ఎంతో ఉంది. సంప్రదాయ వైద్యం నాకు ఆసక్తిగా మొదలైంది. అభిరుచిగా, బాధ్యతగా, ఆ తరువాత జీవిత లక్ష్యంగా మారిపోయింది. అదే ఇప్పుడు 'పద్మశ్రీ' పురస్కారాన్ని కూడా తెచ్చిపెట్టింది. గతంలో పలు గౌరవాలు అందుకున్నా ఇది నాకు ఎంతో ప్రత్యేకం.

దేశంలోని ప్రతి ప్రాంతానికీ తనదైన సంప్రదాయ వైద్య విధానం ఉంది. ఆ విధానాల పరిరక్షణకు నాకు దక్కిన ఈ గుర్తింపు ప్రేరణ కలిగిస్తుందని ఆశిస్తున్నాను."

## ఎముకల గట్టిదనం కోసం...

- సపోటా పండులో పిండిపదార్థాలెక్కువ. సులువుగా జీర్ణమవుతుంది. యాంటీ వైరల్, యాంటీ ఇన్‌ఫ్లమేషన్, యాంటీ బ్యాక్టీరియా గుణాలు వీటిలో ఉన్నాయి. తద్వారా ఇన్ఫెక్షన్ల బాధ ఉండదు.
- మినరల్స్‌తో పాటు కాల్షియం, పాస్ఫరస్, కాపర్, ఐరన్ ఉండటం వల్ల ఈ పండు తింటే ఎముకలు గట్టిగా ఉంటాయి. ఆర్థరైటిస్ సమస్యలు ఉండవు. కండరాల పటిష్టత ఉంటుంది.
- విటమిన్ ఎ, సి ఉండటం వల్ల వ్యాధినిరోధక శక్తి పెరుగుతుంది. సీజనల్ సమస్యలైన దగ్గు, జలుబు లాంటివి దరిచేరవు.
- సపోటా పండును సోర్స్ ఆఫ్ ఎనర్జీ అంటారు. అందుకే చిన్న పిల్లలకు మెత్తగా చేసి తినిపించాలి.



పండు ఇష్టపడకపోతే జ్యూస్ రూపంలో ఇవ్వాలి. వర్కవుట్స్ చేసేవారు, గర్భిణీలు సత్వర శక్తి కోసం ఈ పండును తింటే మంచిది.
- జుట్టు పెరగటానికి ఉపయోగపడే కొల్లాజన్ ఈ పండులో ఉండటం వల్ల కేశాలకు మంచిది. చర్మ ఆరోగ్యం మెరుగవుతుంది.
- ఇందులో పొటాషియం ఉండటం వల్ల రక్త ప్రసరణ సాఫీగా ఉంచుతుంది.
- ఈ పండ్లు తినటం వల్ల యాంగ్జయిటీ, డిప్రెషన్ లక్షణాలు తగ్గే అవకాశాలెక్కువ. అలా మానసిక ఆరోగ్యానికి మంచిది.

ఫ్యాషన్

# రెడ్ ఫర్ లుక్

వాలంటైన్స్ డే వచ్చేసింది. ఈ రోజు ఎంచుకునే డ్రస్, మెచ్చిన మనిషికి నచ్చేలా, మన ఒంటికి నప్పేలా ఉండాలి. ప్రత్యేకించి ప్రేమికుల రోజు నాడు ధరించదగిన రెడ్ కలర్ డ్రస్సుల్లో ఇవి కొన్ని!





ఎరుపు రంగు ప్రేమ, అనురాగాల్లాంటి బలమైన భావోద్వేగాలకు చిహ్నం. ప్రేమకు చిహ్నంగా ఎరుపు రంగు గులాబీలను బహూకరించడం వాలంటైన్స్ డే ప్రత్యేకత. కాబట్టి నేడు ఎరుపు రంగు దుస్తుల్లో నచ్చిన మోడర్న్ డ్రస్‌ను ఎంచుకోవచ్చు.

ఎరుపు కళ్లను కట్టి పడేస్తుంది. పిల్లల ఆటబొమ్మల మొదలు పెద్దలు నడిపే కార్ల వరకూ ఎరుపు రంగు విశ్వవ్యాప్త ఆదరణ పొందుతూ ఉంటుంది. కాబట్టి వేలంటైన్స్ డే నాడు ఎరుపు దుస్తులతో పాటు ధరించే యాక్సెసరీస్ కూడా ఎరుపు రంగులో ఉండేలా చూసుకోవాలి. హై హీల్స్, పర్స్, జ్యువెలరీ, లిప్‌స్టిక్... ఇలా ఎరుపు రంగు యాక్సెసరీలను ఈ రోజు కోసం ఎంచుకోవాలి.







# ఎంఎస్‌పీకి చట్టబద్ధత ఎందుకు?


» రైతులెందుకు పట్టుబడుతున్నారు?
» ప్రభుత్వానికి ఉన్న ఇబ్బందులేంటి?

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13: వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించిన కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ)కు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ రైతులు ఆందోళనకు దిగారు. దీనికి ప్రధాన కారణం ప్రైవేటు వ్యాపారుల దోపిడీనే అనేది రైతు సంఘాలు చెబుతున్న మాట. ప్రస్తుతం ప్రభుత్వం సేకరించే బియ్యం, గోధుమలకు ఎంఎస్‌పీ నిర్ణయిస్తోంది. అయితే.. దీనికి చట్టబద్ధత లేనికారణంగా ప్రైవేటు వ్యాపారులు తమకు తోచినంత చేతిలో పెడుతున్నారు. దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఒక్క చెరకుకు మాత్రమే దేశవ్యాప్తంగా ఎంఎస్‌పీ హామీ ధర లభిస్తోంది. చక్కెర కర్మాగారాలు చట్టబద్ధంగా చెరకుకు ధర చెల్లిస్తున్నాయి. మిగిలిన పంటలకు ఈ తరహా హామీ లేదు. కేంద్రం తీసుకువచ్చిన వివాదాస్పద మూడు రైతు చట్టాలను వెనక్కి తీసుకున్న అనంతరం.. మోదీ ప్రభుత్వం రైతు సమస్యల పరిష్కారం కోసం వ్యవసాయ శాఖ మాజీ సెక్రటరీ సంజయ్ అగర్వాల్ నేతృత్వంలో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. దీనిలో పలువురు మేధావులు, మంత్రులు సహా నాలుగు రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులను కూడా నియమించింది. అయితే, పంజాబ్, హరియాణ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు ఈ కమిటీలో అవకాశం కల్పించలేదు. ఈ కమిటీ ఇప్పటి వరకు నివేదికను సమర్పించలేదు. ఈ కమిటీ పరిశీలనకు పంపించిన విషయాల్లో ఎంఎస్‌పీకి చట్టబద్ధత అంశాన్ని పేర్కొనకపోవడం గమనార్హం. అయితే, ఎంఎస్‌పీకి సంబంధించిన అంశాలపై సూచనలు చేయాలని మాత్రం పేర్కొన్నారు. కమిషన్ ఫర్ అగ్రికల్చర్ కాస్ట్స్ అండ్ ప్రైసెస్(సీఏసీపీ)ను మరింత స్వతంత్రంగా పనిచేసేలా సూచనలు ఇవ్వాలని కోరారు. వ్యవసాయ మార్కెట్ల వ్యవస్థను మరింత బలోపేతం చేయడం ద్వారా రైతుల ఉత్పత్తులకు అత్యధిక విలువ దక్కేలా చూడడం, ఎగుమతుల అవకాశాలను పెంచడంపై దృష్టి సారించడం వంటి బాధ్యతలను అప్పగించారు. ఇదిలావుంటే, సీఏసీపీ సిఫారసుల మేరకు 22 పంటలకు ఎంఎస్‌పీలను ప్రభుత్వం ప్రకటించింది. అయితే, ప్రభుత్వం జాతీయ ఆహార భద్రత చట్టం కింద గోధుమలు, బియ్యం సేకరణకే పరిమితమైంది. దీంతో వాటికే ఎంఎస్‌పీ లభిస్తోంది. వీటితోపాటు కొన్నింటిని(పత్తి, ఆవాలు, శనలు, వేరు శనగలు, పప్పులు) అప్పుడప్పుడు మాత్రమే సేకరిస్తున్నారు. దీంతో రైతులు వీటిని ప్రైవేటు వ్యాపారులకు విక్రయించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలోనే ఎంఎస్‌పీకి చట్టబద్ధతను కోరుతున్నారు.

### ఇవీ సంక్లిష్టతలు

- ఎంఎస్‌పీ పరిధిలోకి వచ్చే ఉత్పత్తులు ఏపీఎంసీ (మార్కెట్ కమిటీలు)ల్లో విక్రయించడం లేదు. దీంతో కొనుగోలుదారు, విక్రయించిన రైతుల రికార్డులు అందుబాటులో ఉండడం లేదు. ఇలాంటి లావాదేవీలకు ఎంఎస్‌పీ గ్యారెంటీ సాధ్యం కాదు.
- చిన్నకారు రైతులు తమ ఉత్పత్తులను గ్రామీణ వ్యాపారులకే విక్రయిస్తున్నారు. వీరంతా ఏపీఎంసీ పరిధిలో లేరు.
- 2018లో మహారాష్ట్రలో ఎంఎస్‌పీని అమలు చేశారు. ఎంఎస్‌పీని ఉల్లంఘించిన వ్యాపారులను జైలుకు కూడా పంపించారు. దీంతో వ్యాపారులు పంట కొనుగోళ్లను బహిష్కరించారు. దీంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది.
- ఉత్పత్తులు ఇబ్బడిముబ్బడిగా పెరిగినప్పుడు ఎంఎస్‌పీ చెల్లించి కొనుగోలు చేసేందుకు వ్యాపారులు సిద్ధంగా లేకపోతే.. ఆ ఉత్పత్తులను రైతుల నుంచి కొనుగోలు చేసి, నిల్వ చేసుకునే పరిస్థితి ప్రభుత్వానికి లేదు.

### లోకం తీరు




# రైతుల చలో ఢిల్లీ ఉద్రిక్తం

## డ్రోన్లతో బాష్పవాయు ప్రయోగం చేసిన పోలీసులు.. రణరంగంలా పంజాబ్, హరియాణా సరిహద్దులు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పొలాలనన్నీ హలాలదున్నీ ఇలాతలంలో హేమం పిండగ, జగానికంతా సౌఖ్యం నిండగ విరామమెరుగక పరిశ్రమించే.. రైతన్నల 'చలో ఢిల్లీ' కార్యక్రమం ఉధృతంగా సాగుతోంది. రైతే రాజు అనే పాలకులే.. రాజధానికి చేరకుండా రైతులకు అడుగడుగునా సృష్టించిన అడ్డంకులను ఎదుర్కొంటూ, బాష్పవాయు ప్రయోగాలను, పోలీసు బలప్రయోగాలను, నిర్బంధకాండను ఛేదించుకుంటూ ముందుకు సాగుతోంది. అన్ని పంటలకు కనీస మద్దతు ధర హామీ చట్టం, రుణమాఫీ, రైతులకు ఫించన్లు తదితర డిమాండ్ల అమలు కోసం సంయుక్త కిసాన్ మోర్చా, కిసాన్ మజ్దూర్ మోర్చా 'చలో ఢిల్లీ' నిరసనకు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. సోమవారం అర్ధరాత్రి కేంద్రమంత్రులతో రైతు నేతల చర్చలు విఫలం కావడంతో మంగళవారం ఉదయం 10 గంటలకు.. 200 రైతు సంఘాల ఆధ్వర్యంలో పంజాబ్, హరియాణా, ఉత్తరప్రదేశ్ నుంచి లక్ష మందికి పైగా రైతులు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆరు నెలలకు సరిపడా ఆహారం, ఇతర నిత్యావసరాలను తీసుకుని వందలాది ట్రాక్టర్ ట్రాలీల్లో, ఇతర వాహనాల్లో బయల్దేరారు. అయితే హరియాణాలో బీజేపీ సర్కారు ఉండడంతో.. రైతులు రాజధానికి చేరకుండా అడ్డుకునేందుకు పలు ప్రాంతాల్లో అడ్డంకులు సృష్టించింది. 15 జిల్లాల్లో 144 సెక్షన్ విధించింది. 64 కంపెనీల పారామిలటరీ బలగాలను.. రాష్ట్ర పోలీసు శాఖకు చెందిన 50 కంపెనీల బలగాలను రంగంలోకి దించింది. పంజాబ్‌తో సరిహద్దులున్న అంబాలా, జింద్, ఫతేహాబాద్, కురుక్షేత్ర, సిర్సా ప్రాంతాల్లో వారు ముళ్లకంచెలు, కాంక్రీట్ బారియర్లు పెట్టారు. అల్లర్లను నియంత్రించే వాహనాలను, జలఫిరంగులను మోహరించారు. వాటిని ఛేదించుకుని ముందుకు వెళ్లే ప్రయత్నం చేసిన రైతులపై బాష్పవాయు ప్రయోగం చేశారు. ముఖ్యంగా.. పంజాబ్, హరియాణా సరిహద్దు శంభు వద్ద పదివేలకు పైగా రైతులు చేరుకుని నిరసన తెలుపుతూ.. పోలీసులపైకి రాళ్లు విసరడం, వంతెనపై ఉన్న బారికేడ్లను కిందికి విసరడంతో పోలీసులు వారిపై డ్రోన్ల ద్వారా టియర్ గ్యాస్ ప్రయోగించారు. వాటర్ క్యానన్లను ప్రయోగించి రైతులను నిరోధించారు. ఇరువర్గాల మధ్య కొన్ని గంటలపాటు ఈ ఘర్షణ కొనసాగింది. పోలీసులు ప్రయోగించిన ఓ రబ్బర్ బుల్లెట్ తగిలి సత్వీర్ అనే రైతు కంటికి తీవ్రగాయమైంది. గాయం కారణంగా కిందపడ్డ సత్వీర్ పైకి లేచేలోపే పోలీసులు అతడున్న చోటుకు టియర్ గ్యాస్ షెల్ విసిరారు. ఇంతలో అక్కడున్న రైతులు అతణ్ని చేతులపై ఎత్తుకుని ఆస్పత్రికి తరలించే యత్నం చేశారు. కొన్నిచోట్ల రైతులు రహదారులపై అమర్చిన కాంక్రీట్ బారికేడ్లను దాటుకుని ముందుకెళ్లేందుకు తమ ట్రాక్టర్లను పక్కనే ఉన్న పొలాల్లోకి దించి.. ఆ అడ్డంకులను దాటాక మళ్లీ రోడ్లపైకి తెచ్చారు. ఢిల్లీకి వేల సంఖ్యలో వాహనాల్లో బయల్దేరిన రైతులు కొన్ని ఎక్స్‌కవేటర్లను కూడా తీసుకొచ్చారు. దారి మధ్యలో బారికేడ్లను తొలగించేందుకు వాటిని వినియోగించారు. చాలాచోట్ల పోలీసులు టియర్ గ్యాస్ షెల్స్ ప్రయోగించినప్పుడు అవి తమ వద్ద పడగానే.. రైతులు వాటిపై జనపనార సంచులు కప్పేసి పొగ వ్యాపించకుండా ఉండేందుకు ప్రయత్నించారు. కాగా.. ఖట్టర్ సర్కారు హరియాణాను కశ్మీర్ లోయలా మార్చేసిందని కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ కమిటీ నేత శర్వణ్ సింగ్ పంధర్ మండిపడ్డారు.



### రైతులు నామినేట్ చేయలేదు..

కనీస మద్దతు ధరపై 2022 జూలైలో తాము ఏర్పాటు చేసిన కమిటీలో.. రైతు సంఘాలు తమ ప్రతినిధులను నామినేట్ చేయలేదని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. 2022 జూలై 12న ఈ కమిటీని ఏర్పాటుపై కేంద్రం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆ కమిటీలో.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులు, రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఆర్థికవేత్తలు ఉంటారని పేర్కొంది. వ్యవసాయ శాఖ మాజీ కార్యదర్శి సంజయ్ అగర్వాల్ నేతృత్వంలో ఏర్పాటయ్యే కమిటీలో మొత్తం 29 మంది సభ్యులుంటారని వెల్లడించింది. అందులో 25 మంది పేర్లను ప్రభుత్వం పేర్కొంది. మరో ముగ్గురి పేర్లను.. కిసాన్ సంయుక్త మోర్చా ప్రతిపాదిస్తే చేరుస్తామని వివరించింది. కానీ ఆ పేర్లను రైతులు ఇప్పటికీ నామినేట్ చేయలేదని తాజాగా వెల్లడించింది. కాగా, రైతులపై మిలటరీ, బాష్పవాయు ప్రయోగం దుర్మార్గమని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ మండిపడ్డారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మాట్లాడారు. మోదీ ప్రభుత్వం తక్షణమే రైతులతో చర్చలు జరపాలని ఆయన డిమాండ్ చేశారు.

### ఢిల్లీ చుట్టూ బారికేడ్ల కోట..

రైతులు ఢిల్లీలోకి అడుగుపెట్టకుండా పోలీసులు ముళ్లకంచెలు, కాంక్రీట్ శ్లాబ్‌లతో రోడ్లపై కోట కట్టారంటే అతిశయోక్తి కాదు. హరియాణా, పంజాబ్, యూపీ రాష్ట్రాలతో ఢిల్లీకి ఉన్న సరిహద్దుల వద్ద సిమెంటు దిమ్మలు, ముళ్ల కంచెలు, బారికేడ్లు ఏర్పాటు చేశారు. గతంలో రైతు ఉద్యమాలకు ప్రధాన నిరసన స్థలాలుగా ఉన్న సింఘూ, టిక్రీ సహా ఇతర పాయింట్ల వద్ద పోలీసులను భారీగా మోహరించారు. నిరసనల నేపథ్యంలో నగరంలో పోలీసులు ఆంక్షలతో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలుచోట్ల భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఎర్రకోట ప్రాంగణాన్ని తాత్కాలికంగా మూసివేస్తున్నామని.. సందర్శకులను అనుమతించట్లేదని పురావస్తు శాఖకు చెందిన సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. మరోవైపు.. 'చలో ఢిల్లీ' పేరుతో ప్రజలను ఇబ్బంది పెట్టడానికి ప్రయత్నిస్తున్న రైతులపై సుమోటోగా చర్యలు తీసుకోవాలని కోరుతూ 'సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్'.. సీజేఐ జస్టిస్ చంద్రచూడ్‌కు విజ్ఞప్తి చేసింది. ఢిల్లీలో ఆంక్షలున్న నేపథ్యంలో లాయర్లు కేసు విచారణకు హాజరు కాలేకపోతే, ఆయా కేసుల్లో ప్రతికూల తీర్పులు ఇవ్వకుండా కోర్టులను ఆదేశించాలని కోరింది. లాయర్లు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయి ఆలస్యమైతే తాము సర్దుకుపోతామని సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది.

## ఎంఎస్‌పీ చట్టంపై తొందరపడం!

» కేంద్ర మంత్రి అర్జున్ ముండా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13: వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించిన కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) చట్టాన్ని తొందరపడి తీసుకురాలేమని కేంద్ర వ్యవసాయ మంత్రి అర్జున్ ముండా తేల్చి చెప్పారు. ప్రస్తుతం ఎంఎస్‌పీకి చట్టం చేయాలని కోరుతూ రైతులు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మంత్రి పలు విషయాలు వెల్లడించారు. 'ఎంఎస్‌పీ చట్టాన్ని తొందరపడి తీసుకురాలేం. వ్యవసాయ అనుబంధ రంగాలకు చెందిన వారితో చర్చలు జరపాల్సి ఉంది. ముఖ్యంగా రైతులు కూడా నిర్మాణాత్మక చర్చలకు రావాల'ని పేర్కొన్నారు. ఎంఎస్‌పీకి హామీ ఇచ్చే పాలసీని అన్ని రాష్ట్ర ప్రభుత్వాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని నిర్ణయించాల్సి ఉంటుందని చెప్పారు. వాస్తవానికి వ్యవసాయం అనేది రాష్ట్రాల అంశమన్నారు. 'ఒకవేళ జాతీయ స్థాయిలో మేం ఏదైనా నిర్ణయం తీసుకుంటే.. రేపు రాష్ట్రాల వాదనను పరిగణనలోకి తీసుకోలేదని అంటార'ని తెలిపారు. రైతులు ఇప్పటికే ఎంఎస్‌పీని బలోపేతం చేయాలన్న ఉద్దేశంతో ఏర్పడిన సంజయ్ అగర్వాల్ నేతృత్వంలోని కమిటీలో భాగం కావాలని, లేదా కొత్త కమిటీని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రైతు సమస్యలపై చర్చించేందుకు, పరిష్కరించేందుకు కేంద్రం సిద్ధంగానే ఉంటుందన్నారు. ఇప్పటికైనా రైతులు ఒక తేదీ నిర్ణయించాలన్నారు. కానీ, వారు చర్చలకు ముందుకు రాకపోవడం వల్లే సమస్య వస్తోందని, దీని వెనుక రాజకీయ ప్రేరేపితం ఉందని భావిస్తున్నట్టు తెలిపారు. రాజకీయ లబ్ధి ఆశించేవారిపట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. రెండు దఫాల చర్చల్లో రైతులు లేవనెత్తిన అనేక డిమాండ్లకు అంగీకరించామన్నారు.

## రాజస్థాన్ నుంచి రాజ్యసభకు సోనియా

» నేడు జైపూర్‌లో నామినేషన్ సమర్పణ

న్యూఢిల్లీ, జైపూర్, ఫిబ్రవరి 13: కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ రాజస్థాన్ నుంచి రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేయనున్నారని మంగళవారం పార్టీ వర్గాలు తెలిపాయి. ఆమె బుధవారం జైపూర్ వెళ్లి నామినేషన్ పత్రాలు సమర్పించనున్నారని సమాచారం. ఆమె వెంట కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కుమారుడు రాహుల్ గాంధీ, కుమార్తె ప్రియాంక గాంధీ వాద్రా వెళ్లనున్నారు. నామినేషన్ పత్రాల సమర్పణకు గురువారం చివరి రోజు కాగా, 27న ఎన్నికలు జరుగుతాయి. ప్రస్తుతం సోనియా తొలిసారిగా ఎగువ సభలో అడుగుపెట్టనున్నారు. ఆమె ఖాళీ చేసిన రాయ్‌బరేలీ నుంచి ప్రియాంక పోటీ చేసే అవకాశం ఉన్నట్టు పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

### మరోసారి రాజ్యసభకు జయాబచ్చన్!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13: ఉత్తరప్రదేశ్ నుంచి జయాబచ్చన్‌ను సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) మరోసారి రాజ్యసభకు నామినేట్ చేసింది. అలాగే మాజీ ఎంపీ రామ్‌జీలాల్ సుమన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అలోక్ రంజన్..లను తమ పార్టీ తరఫున రాజ్యసభకు అభ్యర్థులుగా ప్రకటించింది. పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్, ప్రధాన కార్యదర్శి శివపాల్ సింగ్ యాదవ్, పలువురి సమక్షంలో వీరు మంగళవారం నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. జయాబచ్చన్ ఇప్పటికే నాలుగు సార్లు ఎగువసభకు ఎన్నికయ్యారు. తాజాగా అయిదోసారి ఆమె రాజ్యసభకు నామినేట్ అయ్యారు. మరోవైపు బిహార్ సీఎం నితీశ్ కుమార్‌కు సన్నిహితుడైన జేడీ(యూ) ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్ ఝాను బిహార్ నుంచి పార్టీ తరఫున రాజ్యసభ అభ్యర్థిగా జేడీ(యూ) ప్రకటించింది.

### బీజేపీలో చేరిన అశోక్ చవాన్

ముంబై, ఫిబ్రవరి 13: మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అశోక్ చవాన్ బీజేపీలో చేరారు. మంగళవారం ముంబైలోని బీజేపీ కార్యాలయంలో ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్, పలువురు కీలక నేతల సమక్షంలో ఆయన కాషాయ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా చవాన్ మాట్లాడుతూ.. ఇది తన సొంత నిర్ణయమని చెప్పారు. తన రాజకీయ జీవితంలో ఇది కొత్త ప్రయాణమని ఆయన అన్నారు. రాష్ట్రంలో బీజేపీని బలోపేతం చేస్తానని చవాన్ తెలిపారు. ఈ క్రమంలో చవాన్‌కు బీజేపీ తరఫున రాజ్యసభ సీటు దక్కడం ఖాయమయినట్లు తెలుస్తోంది. చవాన్ దాదాపు 4 దశాబ్దాల పాటు కాంగ్రెస్ పార్టీలో కొనసాగారు.

# కనీస మద్దతు ధరకు చట్టబద్ధత

» లోక్‌సభ ఎన్నికల్లో ఇదే మా 'మొదటి గ్యారంటీ': ఖర్గే
» శ్రమకు తగిన ప్రతిఫలం అడిగితే జైళ్లా ?: రాహుల్



అంబికాపూర్, ఫిబ్రవరి 13 : పంజాబ్, హరియాణాకు చెందిన వేలాది మంది రైతులు 'చలో ఢిల్లీ' పేరిట ఆందోళనకు దిగిన వేళ కాంగ్రెస్ పార్టీ కీలక ప్రకటన చేసింది. కేంద్రంలో అధికారం చేపట్టిన వెంటనే పంటల కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ)కు చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చింది. సార్వత్రిక ఎన్నికలకు కాంగ్రెస్ ఇచ్చే తొలి గ్యారంటీ ఇదేనని ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రకటించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెంటనే ఈ గ్యారంటీని అమలు చేస్తామని స్పష్టం చేశారు. ఛత్తీస్‌గఢ్‌లోని అంబికాపూర్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మంగళవారం నిర్వహించిన భారత్ జోడో న్యాయ యాత్రలో పాల్గొన్న ఖర్గే ఈ ప్రకటన చేశారు. ప్రజాస్వామ్యానికి విలువ ఇవ్వని మోదీ ఇచ్చే గ్యారంటీలను నమ్మవద్దని ప్రజలకు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. మోదీ ఓ హిట్లర్, నియంత అని అన్నారు. రైతులు తమ హక్కుల కోసం ఢిల్లీ సరిహద్దుల్లో పోరాడుతుంటే ఇనుప కంచెలు వేసి అడ్డుకుంటున్నారని.. ప్రజాస్వామ్యం అంటే ఇదేనా? అని ప్రశ్నించారు. పీఎం పంటల బీమా పథకం వల్ల దేశంలోని ప్రైవేటు బీమా కంపెనీలు పదేళ్లలో రూ.40వేల కోట్ల లాభాలు పొందాయని ఖర్గే తెలిపారు. ధనవంతులను మాత్రమే పట్టించుకునే మోదీకి రైతులు, పేదల సమస్యలు మాత్రం పట్టవని ఆరోపించారు. తాను వెనుకబడిన తరగతికి చెందిన వాడినని, టీ వ్యాపారిని అని మోదీ పదేపదే చెప్పుకుంటారని విమర్శించారు. టీ నేకాదు మోదీ దేనినైనా అమ్ముకోవచ్చునని కానీ దేశాన్ని, ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మకూడదని ఖర్గే అన్నారు. దేశంలోని ఓడరేవులు, విమానాశ్రయాలు, రహదారులు, గనులను అదానీకి కట్టబెట్టినప్పుడు మోదీకి వెనుకబడి తరగతుల ప్రజలు గుర్తు రాలేదని ఖర్గే విమర్శించారు.

### కాంగ్రెస్ గ్యారంటీతో 15 కోట్ల మందికి లబ్ధి : రాహుల్

తమ కష్టానికి తగిన ప్రతిఫలం ఇవ్వాలనే డిమాండ్‌తో ఆందోళనకు దిగిన రైతులపై టియర్ గ్యాస్ ప్రయోగం, జైళ్లలో బంధించడం వంటి చర్యలకు పాల్పడిన కేంద్ర ప్రభుత్వం తీరుపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇండియా కూటమి అధికారం చేపట్టిన వెంటనే కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పిస్తామని తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన గ్యారంటీ అమలైతే దేశంలోని 15 కోట్ల మంది రైతులు, వారి కుటుంబాల జీవితాలు మారుతాయంటూ హర్షం వ్యక్తం చేశారు. అంబికాపూర్, ఉదయ్‌పూర్‌లో నిర్వహించిన భారత్ జోడో న్యాయ యాత్రలో ప్రసంగించిన రాహుల్.. కేంద్ర ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. ఎంఎస్ స్వామినాథన్‌ను భారత రత్నతో గౌరవించిన కేంద్ర ప్రభుత్వం రైతులు, వ్యవసాయం కోసం ఆయన చేసి సూచనలను మాత్రం పట్టించుకోదని విమర్శించారు. ఇండియా కూటమి అధికారం చేపట్టిన తర్వాత స్వామినాథన్ సిఫారసులను అమలు చేస్తామని ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం తీరు వల్ల దేశంలోని కొద్ది మంది మాత్రమే లబ్ధి పొందుతున్నారని, మిగిలిన వారంతా జీఎస్టీలు చెల్లిస్తూ, ఆకలితో అలమటిస్తున్నారని అన్నారు. కుల గణనతో సామాజిక న్యాయం సాధ్యమని రాహుల్ ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. కాగా, కనీస మద్దతు ధరకు చట్టబద్ధతపై కాంగ్రెస్ ఇచ్చిన గ్యారంటీ ఓ విప్లవాత్మక నిర్ణయమంటూ ఆ పార్టీ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. రైతులు, రైతు కుటుంబాల సంక్షేమం కోసం విప్లవాత్మక ప్రకటన చేసిన కాంగ్రెస్ పార్టీ హరిత, శ్వేత విప్లవాలకు పునాది వేసిందని ఆ పార్టీ జనరల్ సెక్రటరీ జైరాం రమేశ్ అభిప్రాయపడ్డారు. అన్నదాతల కోసం తమ పార్టీ చరిత్రాత్మక నిర్ణయం తీసుకుందని కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ప్రియాంక గాంధీ వాద్రా పేర్కొన్నారు.

## జేఈఈ మెయిన్స్‌లో మనోళ్ల సత్తా

(మొదటి పేజీ తరువాయి)

ముతవరపు అనూప్, హందేకర్ విదిత్, మదినేని వెంకట సాయి తేజ, కల్లూరి శ్రియాషస్ మోహన్, తవ్వ దినేశ్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన షేక్ సూరజ్, తోట సాయి కార్తీక్, ఏ వెంకట తనీశ్ రెడ్డి 100 పర్సంటైల్ స్కోరు సాధించారు. రాజస్థాన్, మహారాష్ట్రల నుంచి ముగ్గురేసి, హరియాణ, ఢిల్లీ నుంచి ఇద్దరేసి, గుజరాత్, కర్ణాటక, తమిళనాడు నుంచి ఒక్కొక్కరు చొప్పున టాప్ స్కోరర్లలో ఉన్నారు. టాప్ 23 మందిలో అందరూ అబ్బాయిలే కాగా.. వారిలో నలుగురు ఓబీసీ వర్గానికి చెందినవారు. మిగిలిన వారంతా జనరల్ క్యాటగిరీ. హైదరాబాద్‌కు చెందిన రిషి శేఖర్ శుక్లా జాతీయ స్థాయిలో రెండో ర్యాంకు, ఏపీకి చెందిన షేక్ సూరజ్ మూడో ర్యాంకు సాధించారు. కాగా, ఈసారి 100 పర్సంటైల్ సాధించిన వారిలో అమ్మాయిలు, జనరల్ (ఈడబ్ల్యూఎస్), ఎస్సీ, ఎస్టీల నుంచి ఎవరూ లేరు. ఈసారి రెండోవిడత జేఈఈ మెయిన్స్ ఏప్రిల్‌లో జరగనుండగా.. జేఈఈ అడ్వాన్స్‌డ్‌ను మే 26న నిర్వహిస్తారు. ఈ పరీక్షల్లో వచ్చిన ర్యాంకుల ఆధారంగా దేశవ్యాప్తంగా ఉన్న 23 ఐఐటీల్లో ప్రవేశాలు కల్పిస్తారు. కాగా, టాప్ పర్సంటైల్ సాధించిన అభ్యర్థుల్లో పలువురు తమ లక్ష్యం ఐఐటీ బాంబేలో కంప్యూటర్ సైన్స్ చదవడమేనని చెబుతున్నారు. 100 పర్సంటైల్ సాధించిన వారిలో కొందరు తమ సంతోషాన్ని 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.

### రెండో ర్యాంకు ఊహించలేదు: రిషి శేఖర్ శుక్లా

చాలా సంతోషంగా ఉంది. 100 పర్సంటైల్ వస్తుందని, జాతీయ స్థాయిలో రెండో స్థానంలో నిలుస్తానని ఊహించలేదు. ఆకాశ్ కాలేజీ ఫ్యాకల్టీ మంచి తర్ఫీదు ఇచ్చారు. అమ్మానాన్నలు, అధ్యాపకుల ప్రోత్సాహంతోనే ఇది సాధ్యమైంది. ఐఐటీ బాంబేలో కంప్యూటర్ సైన్స్ చేయాలన్నదే లక్ష్యం. రోజుకు 8-9 గంటలు చదివాను. నాన్న రిషి శేఖర్ ఇస్రోలో శాస్త్రవేత్త. అమ్మ వందన కూడా సైంటిస్టే.

### మా అక్కనే నాకు స్ఫూర్తి: ముతవరపు అనూప్

ఇంజనీరింగ్ చదవాలనే కోరికకు ఐఐటీ చెన్నైలో బీటెక్ చేస్తున్న మా అక్క హరితనే స్ఫూర్తి. చిన్నప్పటి నుంచి ఫిజిక్స్, మ్యాథ్స్ నాకు చాలా ఇష్టం. నాన్న రాజ్‌కుమార్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, అమ్మ గృహిణి. అమ్మానాన్నల తోడ్పాటుతో పాటు లెక్చరర్ల గైడెన్స్‌తోనే 100 పర్సంటైల్ సాధ్యమైంది. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మంచి ర్యాంకు సాధించి ఐఐటీ బాంబేలో కంప్యూటర్ సైన్స్ చదవడమే నా లక్ష్యం.

## వైసీపీ ఎంపీ వేమిరెడ్డి టీడీపీలోకి!

(మొదటి పేజీ తరువాయి)

ఇస్తున్న వారిలో ఈయన ప్రముఖుడు. ఎవరితోనూ వివాదాలకు వెళ్లరని, హుందాగా వ్యవహరిస్తారని రాజకీయ వర్గాల్లో మంచి పేరుంది. ఈసారి నెల్లూరు లోక్‌సభ స్థానానికి జగన్ ఆయన్ను వైసీపీ అభ్యర్థిగా ఖరారుచేశారు. అయితే దాని పరిధిలోని అసెంబ్లీ అభ్యర్థుల విషయంలో ఆయన సీఎంతో విభేదించారు. కొందరు అభ్యర్థులను మార్చాలంటూ వేమిరెడ్డి చేసిన సూచనలను జగన్ పట్టించుకోలేదు. దీంతో మనస్తాపానికి గురైన ఆయన.. కొన్ని రోజులుగా వైసీపీ నాయకత్వానికి అందుబాటులో లేకుండాపోయారు. అనంతర పరిణామాల్లో వేమిరెడ్డి దంపతులను టీడీపీ నేతలు తమ పార్టీలోకి ఆహ్వానించారు. దీంతో ఆయన సోమవారం చంద్రబాబుతో సమావేశమై తాజా రాజకీయ పరిణామాలు, జిల్లా పరిస్థితులపై చర్చించారు. ఆయనతో పాటు ఆయన భార్య ప్రశాంతి కూడా టీడీపీలో చేరుతున్నారని ఆ పార్టీ వర్గాలు ధ్రువీకరించాయి. ప్రశాంతి ప్రస్తుతం తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) బోర్డు సభ్యురాలిగా ఉన్నారు. ఆ పదవికి ఆమె త్వరలో రాజీనామా చేయనున్నట్లు తెలిసింది. టీడీపీలో వీరి చేరికతో ఆ జిల్లాలో భారీ సంచలనాలు చోటుచేసుకుంటాయని రాజకీయ వర్గాలు అంటున్నాయి. ఇంకోవైపు.. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి కూడా వైసీపీని వీడి.. టీడీపీలో చేరే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. ఈ ఇద్దరూ కూడా కొంత కాలంగా వైసీపీ అధిష్ఠానంతో అంటీముట్టనట్లు ఉంటున్నారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి స్థానంలో ఆదాలను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేగా నిలపాలని వైసీపీ పెద్దలు గతంలోనే నిర్ణయించారు. మాగుంటకు మాత్రం ఒంగోలు ఎంపీగా అవకాశమిచ్చేందుకు జగన్ నిరాకరించారు. వీరిద్దరూ వైసీపీ నాయకత్వం పట్ల విముఖంగా ఉన్నారని.. టీడీపీ వైపు వెళ్లాలన్న ఆలోచనతో ఉన్నారని రాజకీయ వర్గాల్లో వినవస్తోంది. ఈ పరిణామాలు నిజమైతే నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో వైసీపీ గట్టి దెబ్బ తినడం ఖాయమని రాజకీయ పరిశీలకులు అంటున్నారు.

## ఆ డీఎస్పీ మళ్లీ చిత్తూరుకు..!

» సుధాకర్‌రెడ్డిని వదులుకోలేని పెద్దిరెడ్డి

అమరావతి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే అత్యంత వివాదాస్పద డీఎస్పీగా పేరుగాంచిన సుధాకర్‌రెడ్డి మళ్లీ చిత్తూరుకు వచ్చారు. ఎన్నికల నేపథ్యంలో చిత్తూరు జిల్లా పలమనేరు నుంచి ఆళ్లగడ్డకు బదిలీ అయిన ఆయన, వారం పూర్తయినా అక్కడ జాయిన్ కాలేదు. మంగళవారం మళ్లీ ఆయన్ను చిత్తూరు ఎస్‌బీకి మారుస్తూ డీజీపీ ఆదేశాలు జారీ చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ సుధాకర్‌రెడ్డి చిత్తూరు జిల్లాలోనే పనిచేశారు. చిత్తూరు ఎస్బీ డీఎస్పీగా, చిత్తూరు టౌన్ డీఎస్పీగా, పలమనేరు డీఎస్పీగా మొత్తం నాలుగేళ్లు పనిచేయగా, ఎన్నికల నేపథ్యంలో తాజాగా బదిలీ అయ్యారు. ఎక్కడ పనిచేసినా అధికారపార్టీకి వీరవిధేయుడిగా, ప్రతిపక్షాలను ఇబ్బంది పెట్టేలా పనిచేశారు. చంద్రబాబు, పెద్దిరెడ్డి నియోజకవర్గాలు కుప్పం, పుంగనూరు ఉన్న సబ్ డివిజన్ పలమనేరులో డీఎస్పీగా చేరినప్పటి నుంచి ఆయన పేరు రాష్ట్రవ్యాప్తంగా మారు మోగింది. గతేడాది జనవరిలో చంద్రబాబును కుప్పం నియోజకవర్గంలో పర్యటించకుండా జీవో 1 పేరుతో అడ్డుకోవడంతో సుధాకర్‌రెడ్డి గురించి బయటికి ఎక్కువగా తెలిసింది. గతేడాది ఆగస్టులో పెద్దిరెడ్డి నియోజకవర్గం పుంగనూరులో చంద్రబాబు పర్యటించకుండా పోలీసులు అడ్డుకున్న వివాదంలో వందల మంది టీడీపీ శ్రేణుల మీద కేసులు పెట్టి జైళ్లకు పంపించడంలో సుధాకర్‌రెడ్డి పాత్ర కీలకం. లోకేశ్ యువగళం పాదయాత్ర ప్రారంభానికి ముందు, ప్రారంభమయ్యాక అనేకరకాల నిబంధనలతో పోలీసులు అడ్డుకున్నారు. అప్పుడు కూడా సుధాకర్ రెడ్డి కీలక పాత్ర పోషించారు.

# కోటి ఇళ్లకు సౌరశక్తి

## నెలకు ఫ్రీగా 300 యూనిట్లు.. ఈ పథకంతో మరింత ఆదాయం: మోదీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13: దేశంలో సౌరశక్తి వినియోగాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో 'ప్రధానమంత్రి సూర్య ఘర్: ముఫ్త్ బిజిలీ యోజన'ను ప్రధాని మోదీ మంగళవారం ప్రకటించారు. ఈ పథకం కింద ఒక కోటి ఇళ్లకు నెలకు 300 యూనిట్ల వరకు ఉచితంగా కరెంటును అందిస్తామని తెలిపారు. కోటి ఇళ్లకు విద్యుత్ కాంతులను అందించాలని నిర్ణయించామని, ఈ పథకానికి రూ.75 వేల కోట్లకుపైగా వ్యయం అవుతుందని వెల్లడించారు. ఈ మేరకు ఎక్స్‌లో మోదీ వివరాలను తెలియజేశారు. లబ్ధిదారుల బ్యాంకుఖాతాలకు ప్రత్యక్షంగా నగదు బదిలీ చేయటం దగ్గరి నుంచి రాయితీల మీద బ్యాంకు రుణాలను అందించేవరకూ ప్రజల మీద ఎటువంటి ఆర్థికభారం పడకుండా కేంద్రం తగు చర్యలు తీసుకుంటుందని ప్రధాని చెప్పారు. ఈ పథకానికి సంబంధించిన వారందరినీ ఒక జాతీయ ఆన్‌లైన్ పోర్టల్‌తో అనుసంధానిస్తామన్నారు. ముఫ్త్ బిజిలీ యోజన గురించి క్షేత్రస్థాయిలో అందరికీ తెలిసేలా గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థలు కృషి చేయాలని, ఈ మేరకు తమ పరిధిలో ఉన్న ఇళ్ల పైకప్పులపై సౌరశక్తి వ్యవస్థలను నెలకొల్పేలా లబ్ధిదారులను ప్రోత్సహిస్తే ఆయా సంస్థలకు రాయితీలు కల్పిస్తామన్నారు. ఈ పథకం ఆదాయాన్ని, ఉద్యోగావకాశాలను సృష్టించటంతోపాటు కరెంటు బిల్లుల భారాన్ని కూడా గణనీయంగా తగ్గిస్తుందని చెప్పారు. సౌరశక్తి వినియోగాన్ని, సుస్థిరాభివృద్ధి ప్రగతిని ముందుకు తీసుకెళ్దామని, పీఎం సూర్య ఘర్: ముఫ్త్ బిజిలీ యోజనను బలోపేతం చేద్దామని వినియోగదారులకు ముఖ్యంగా యువతకు ప్రధాని పిలుపునిచ్చారు. https://pmsuryaghar.gov.in/ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### ఎన్నో ప్రయోజనాలు.

ఈ పథకం ద్వారా లబ్ధిదారులకు ఏటా సగటున రూ.15,000 నుంచి రూ.18,000 వరకూ ప్రయోజనం చేకూరుతుంది. 'ప్రధానమంత్రి సూర్య ఘర్: ముఫ్త్ బిజిలీ యోజన వల్ల సౌరశక్తి ప్యానెళ్ల తదితరాల తయారీ, విక్రయం, విద్యుత్ సరఫరా రంగాల్లో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు భారీ ఎత్తున అవకాశాలు లభించటమేగాక విద్యుత్ సామగ్రి ఏర్పాటు, నిర్వహణ పరంగా పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు కూడా అందుబాటులోకి వస్తాయి.



### ఎలా దరఖాస్తు చేసుకోవాలి?

- https://pmsuryaghar.gov.in/ వెబ్‌సైట్‌లోకి వెళ్లి తమ రాష్ట్ర డిస్కంను ఎంచుకోవాలి.
- విద్యుత్ కన్స్యూమర్ నెంబరును, మొబైల్ నెంబరును, ఈ-మెయిల్ అడ్రస్ నమోదు చేయాలి.
- కన్స్యూమర్ నెంబరు, మొబైల్ నెంబరు ద్వారా లాగిన్ కావాలి.
- ఇంటి పైకప్పు మీద సోలార్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకోవటం కోసం దరఖాస్తు చేయాలి.
- అనుమతి లభించగానే రిజిస్టర్డ్ వ్యాపారి ద్వారా సోలార్ ప్లాంట్‌ను ఇంటి పైకప్పు మీద ఏర్పాటు చేయించాలి.
- సోలార్ ప్లాంట్ వివరాలను సమర్పించి, నెట్ మీటరు కోసం దరఖాస్తు చేసుకోవాలి.
- నెట్‌మీటరు ఏర్పాటు, డిస్కంతో తనిఖీ తర్వాత పోర్టల్ నుంచి ఒక సర్టిఫికేట్ లభిస్తుంది.
- పోర్టల్‌లో మీ బ్యాంకు ఖాతా వివరాలను, ఒక ఖాళీ చెక్కు ఫొటోను అప్‌లోడ్ చేయాలి. దీంతో ప్రక్రియ ముగుస్తుంది. ఇది జరిగిన 30 రోజుల్లో మీ బ్యాంకు ఖాతాలో సబ్సిడీ జమ అవటం ప్రారంభమవుతుంది.

## జగన్ స్కామ్‌లు కోర్టుకు వివరించా

» గణాంకాలతో సహా తెలియజేశా: రఘురామ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన స్కీముల గురించి కాకుండా, వాటిలోని స్కామ్‌ల గురించి మాత్రమే మాట్లాడానని వైసీపీ రెబల్ ఎంపీ రఘురామకృష్ణంరాజు చెప్పారు. వాటిలో ఆయనకు ఎంత ఆయాచిత లబ్ధి చేకూరిందో గణాంకాలతో సహా న్యాయస్థానానికి వివరించానన్నారు. రచ్చబండ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ స్కీముల పేరిట జరిగిన స్కాములపై విచారణ చేపట్టాలని కోర్టును కోరానన్నారు. 'రాష్ట్రంలో 4 లక్షలకు పైగా ఉన్న వలంటీర్లకు ప్రభుత్వ ధనాన్ని రూ.200 చొప్పున కేటాయించి, జగన్ దినపత్రికను మాత్రమే కొనుగోలు చేయాలని మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. సచివాలయంలోని 11 మంది సిబ్బంది కూడా ఆ పత్రికనే కొనుగోలు చేసి చదవాలన్నారు. ఒక సచివాలయానికి ఒక పత్రిక వేస్తే సరిపోయే దానికి, 11 మంది సిబ్బందితో కొనిపించి, ప్రతిరోజూ ఆ పత్రిక ఆరు లక్షల కాపీలను అమ్ముకుంటున్నారు. దీన్ని ప్రజాకర్షక పథకం అంటారా? ప్రజల కోసం తీసుకొచ్చిన స్కీం అంటారా? రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న గృహ నిర్మాణాలకు సింహభాగం భారతి సిమెంట్‌ను సరఫరా చేస్తున్నారు. ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి రాష్ట్ర ప్రభుత్వంతో ఎటువంటి వ్యాపార లావాదేవీలూ నిర్వహించడానికి వీలు లేదు. భారతి సిమెంట్స్‌లో 49 శాతం వాటా జగన్ కుటుంబ సభ్యులదే . ఇది స్కీమ్ అంటారా? స్కాం అంటారా?' అని ప్రశ్నించారు. మద్యం కంపెనీల లైసెన్స్ ఎవరెవరికి ఇచ్చారో, గతంలో ఉన్న లైసెన్సును ఎవరెవరు తీసుకున్నారో విచారించాలని కోరినట్లు తెలిపారు. ఇసుక కుంభకోణాన్ని ప్రశ్నించినట్లు చెప్పారు. రిషికొండ వద్ద పర్యావరణ ఉల్లంఘనపై నియమించిన పర్యావరణ కమిటీ చైర్మన్ గౌరప్పన్ తుది నివేదికపై సంతకం చేయడానికి ముందే గుండెపోటుతో మరణించడం అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. అది సహజ మరణమని ఎవరికీ అనిపించడం లేదని తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించినట్లయితే రిషికొండపై నిర్మించిన భవంతిని కొట్టి వేయాలని సుప్రీంకోర్టు ఆదేశించే అవకాశం ఉన్న నేపథ్యంలో.. ఆయన చనిపోవడం వెనుక బలమైన కారణాలే ఉండవచ్చని పేర్కొన్నారు. యాత్ర-2 దర్శకుడు రాఘవకు ఏ ప్రాతిపదికన హార్సిలీ హిల్స్‌లో రెండెకరాల స్థలాన్ని వైసీపీ ప్రభుత్వం కేటాయించిందని ఆయన ప్రశ్నించారు. ఎవరైనా స్టూడియో నిర్మించుకుంటామంటే.. ప్రభుత్వం తరఫున స్థలం కేటాయిస్తామని ఏదైనా స్కీం పెట్టారా? సొంతంగా పనికిమాలిన సినిమాలు తీయించుకొని ప్రభుత్వ స్థలాలను పప్పు బెల్లాల్లా పంచేయటం భావ్యమేనా? అని నిలదీశారు. మన జీవితాలతో ఆడుకున్న వారితో ఇప్పుడు ఆడుకోవలసిన సమయం ఆసన్నమైందన్నారు.

## మత్స్య వర్సిటీ తాత్కాలిక పోస్టుల పొడిగింపు

అమరావతి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మత్స్య విశ్వవిద్యాలయ నిర్వహణ కోసం తాత్కాలిక పద్ధతిలో మంజూరు చేసిన 22 పోస్టుల్లో నియమితులైన ఉద్యోగులకు ప్రభుత్వం మరో రెండేళ్లు పొడిగింపు ఇచ్చింది. అలాగే, శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ వర్సిటీలో ఐదుగురు వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ల సేవల్ని ఏడాదిపాటు డిప్యూటేషన్‌పై వినియోగించుకునేందుకు ప్రభుత్వం అనుమతించింది. ఈ మేరకు మంగళవారం వేర్వేరుగా ఉత్తర్వులు జారీ అయ్యాయి.

# జీరో ఖాళీలు.. డ్రామానే!

» వచ్చే ఏడాది నుంచి 'జీరో' లక్ష్యమట
» ఐదేళ్లపాటు టీచర్ల కొరతతోనే బోధన
» ఇంతకాలం 'జీరో ఖాళీలు' గుర్తులేదా?
» పిల్లలు తగ్గిపోతున్నా పట్టించుకోలేదు
» నిరుద్యోగుల గోడు వినిపించుకోలేదు
» రాజకీయ లబ్ధి కోసం 'జీరో' నాటకం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

*దాదాపు ఐదేళ్లపాటు ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయకుండా, ఖాళీలను అలానే కొనసాగించిన జగన్ ప్రభుత్వం ఇప్పుడు అకస్మాత్తుగా 'జీరో ఖాళీలు' అనే అనే నినాదాన్ని వినిపిస్తోంది. విద్యార్థులకు ఎక్కడా టీచర్ల కొరత ఉండదని ప్రచారం చేస్తోంది. అయితే, మరి ఐదేళ్లపాటు టీచర్ల కొరతతోనే బోధన చేయించామని అంగీకరిస్తోందా? 6వేల మంది టీచర్లు లేకుండా పాఠాలు చెప్పించిందా? అనే ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సి ఉంది.*

"ఇప్పుడు డీఎస్సీ నోటిఫికేషన్‌తో 6,100 పోస్టులు భర్తీ చేస్తున్నాం. ఇకపై ఏటా ఎప్పటి ఖాళీలు అప్పుడే భర్తీ చేస్తాం. టీచర్ పోస్టుల్లో 'జీరో వేకెన్సీ' ఉండాలన్నదే మా ప్రభుత్వ లక్ష్యం. టీచర్ల కొరత రాకూడదు. అవసరమైతే విద్యా సంవత్సరం మధ్యలో రిటైర్ అయిన టీచర్లను ఆ ఏడాది ముగిసేవరకూ కొనసాగిస్తాం" - ఉపాధ్యాయ పోస్టుల విషయంలో జగన్ ప్రభుత్వం ప్రకటించిన తాజా విధానమిది. అయితే.. ఇప్పటి వరకు 6100 పోస్టులు ఖాళీగా ఉన్నట్టే కదా? అనేది తల్లిదండ్రుల ప్రశ్న. మెగా డీఎస్సీ వేసి టీచర్ ఖాళీలన్నీ భర్తీచేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన జగన్.. ఖాళీల విషయంలో తొలి నుంచీ తొండి చేస్తున్నారు. మొదట మూడేళ్లపాటు అసలు టీచర్ పోస్టుల అవసరమే లేదని చెప్పిన ప్రభుత్వం ఆ తర్వాత ఒకసారి తక్కువ ఖాళీలున్నాయని, మరొకసారి అసలు లేవని, కొన్నిసార్లు ఖాళీలున్నా వాటిని భర్తీ చేయాల్సిన అవసరం లేదని వింత వాదనలు వినిపించింది. దీంతో ఇక డీఎస్సీ ఉండదని అం దరూ అంచనాకొచ్చారు. అయితే, ఎన్నికలకు ముందు అకస్మాత్తుగా డీఎస్సీని ప్రకటించింది. ఇంతకాలం లేని ఖాళీలు ఇప్పుడు ఎక్కడి నుంచి వచ్చాయి? అనేది ప్రశ్న. అంతేకాదు, 6100 ఖాళీలున్నప్పుడు ఇన్నేళ్లు ఎందుకు వాటిని గుర్తించలేదు? అంటే ఖాళీలున్నా లేవని ప్రభుత్వం ఇంతకాలం డ్రామా ఆడిందని, ఎన్నికలకు ముందు వాటిని బయట పెట్టిందని నిరుద్యోగులు అంటున్నారు.

### వ్యతిరేకత పెరగడంతో

టీచర్ పోస్టుల భర్తీ విషయంలో నిరుద్యోగులు, తల్లిదండ్రుల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగిపోతోంది. గతంలో ప్రతి ప్రాథమిక పాఠశాలలో కనీసం ఇద్దరు టీచర్లు ఉంటే ఇప్పుడు దాదాపు 10 వేల పాఠశాలలు ఏకోపాధ్యాయుడితోనే నడుస్తున్నాయి. ఆ ఒక్క టీచర్ ఏదైనా కారణంతో సెలవు పెడితే ఆరోజు పాఠశాలకు సెలవే. పైగా, గత విద్యా సంవత్సరంలో చేసిన రేషనలైజేషన్‌తో 4,250 బడుల్లో కేవలం రెండే తరగతులు మిగిలాయి. మరోవైపు మెగా డీఎస్సీ అని హామీ లిచ్చి ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వకపోవడంతో నిరుద్యోగుల్లో వ్యతిరేకత పెరిగింది. గుర్తించిన ప్రభుత్వం ఇప్పుడు డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది. ఇప్పుడు ఎన్నికలకు ముందు ఒకే ఒక్క నోటిఫికేషన్ ఇచ్చి, ఇకపై ఏటా డీఎస్సీ నోటిఫికేషన్లు ఇస్తామని చెప్పడండం వెనుక ఎన్నికల వ్యూహం దాగి ఉందని స్పష్టమవుతోంది.

### బోధనేతర అంశాలపైనే దృష్టి

విద్యా రంగంలో బోధన అనేది అత్యంత కీలకం. సరిపడ టీచర్లు ఉంటే బోధన సక్రమంగా సాగుతుంది. కానీ, జగన్ ప్రభుత్వం టీచర్లపై పెట్టాల్సిన దృష్టి బోధనేతర అంశాలపై ఎక్కువ పెట్టింది. అధికారంలోకి వస్తూనే నాడు-నేడు పథకాన్ని ప్రారంభించింది. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన దీని ఉద్దేశం. ఉద్దేశం మంచిదే అయినా పథకం అమలులో ప్రభుత్వం విఫలమైంది. రెండేళ్ల కిందట పూర్తి చేస్తామన్న పనులు ఇప్పటికీ పూర్తికాలేదు. చివరి విడత పనులు ఎప్పుడు మొదలవుతాయో కూడా తెలియదు. అలాగే, ఖర్చులు తగ్గించుకునేందుకు ప్రశ్నా పత్రాలను వాట్సా్‌ప్‌లో పంపించే కొత్త విధానాన్ని ప్రారంభించింది. వాటిని టీచర్లతో బోర్డులపై రాయిస్తూ పరీక్షలు నిర్వహిస్తోంది. మధ్యాహ్న భోజనం పథకాన్ని అద్భుతంగా మార్చామని చెబుతున్నా దాదాపు సగం మంది పిల్లలు ఇంటి నుంచే భోజనం తెచ్చుకుంటున్నారు. అలాగే, పిల్లలకు అవసరం లేకపోయినా ట్యాబ్‌ల పంపిణీ చేపట్టింది. వాటిని ఎవరూ వినియోగించకపోయినా రెండేళ్ల నుంచి ట్యాబ్‌లు ఇస్తోంది. ఇలా బోధనేతర అంశాలపైనే దృష్టిపెట్టిన ప్రభుత్వం బోధనా విధానాలను మెరుగుపరిచే విషయాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది.

# ఏమిచ్చినా మీ రుణం తీర్చుకోలేం!

» ఏ కష్టమొచ్చినా అండగా ఉంటాం
» కార్యకర్తలతో నారా భువనేశ్వరి
» శ్రీసత్యసాయి జిల్లాలో 'నిజం గెలవాలి' యాత్ర
» బాబు అరెస్టుతో మృతిచెందిన వారికి నివాళి

పుట్టపర్తి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): 'తెలుగుదేశం పార్టీ కార్యకర్తలే మా కుటుంబానికి కొండంత బలం. ఏమిచ్చినా వారి రుణం తీర్చుకోలేం. అధైర్య పడవద్దు.. పార్టీ కోసం కష్టపడి, ప్రాణాలు కోల్పోయిన కార్యకర్తల కుటుంబాలను పార్టీ ఎప్పటికీ మరవదు. మీకు అండగా ఉంటామని చెప్పడానికే నేను మీ ఇంటికి వచ్చా.' అని టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. వైసీపీ ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు పెట్టినా ఎక్కడా కుంగిపోకుండా, పడిపోకుండా నిలబడదామని, వచ్చే ఎన్నికల్లో గెలుపు టీడీపీదేనని భువనేశ్వరి అన్నారు. 'నిజం గెలవాలి' యాత్రలో భాగంగా శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి, కదిరి నియోజకవర్గాల్లో ఆమె మంగళవారం పర్యటించారు. చంద్రబాబు అరెస్టును జీర్ణించుకోలేక మృతి చెందిన కార్యకర్తల కుటుంబాలకు ఆమె భరోసా కల్పించారు. పుట్టపర్తిలోని శ్రీసత్యసాయి విమానాశ్రయానికి ప్రత్యేక విమానంలో చేరుకున్న ఆమెకు మాజీ మంత్రులు పరిటాల సునీత, పల్లె రఘునాథరెడ్డి, పార్టీ ఉమ్మడి జిల్లా నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి ఆమె నేరుగా ఆమె పుట్టపర్తి మండలం నిడిమామిడి గాజులకుంట గ్రామానికి చేరుకున్నారు. టీడీపీ కార్యకర్త మునిమడుగు బావయ్య కుటుంబాన్ని పరామర్శించారు. బాబయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యుల యోగక్షేమాలను తెలుసుకున్నారు. అనంతరం ఓబుళదేవర చెరువు మండలం గాజుకుంటపల్లికి చేరుకుని మేకల రామచంద్ర కుటుంబాన్ని, కదిరిలో మద్దిగల్ల ప్రకాష్ కుటుంబాన్ని, తనకల్లు మండలం కొర్తికోటలో షేక్ బుడేన్ సాబ్, కదిరి రూరల్ మండలం ముష్టిపల్లిలో చంద్ర, తలుపులలో చిన్నకోట్ల మహేశ్వర కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఒక్కో కుటుంబానికి రూ.3 లక్షల ఆర్థిక సాయాన్ని చెక్కు రూపంలో అందజేశారు. కాగా, నిజం గెలవాలి యాత్రకు వచ్చిన భువనేశ్వరికి స్థానికుల నుంచి అడుగడునా ఆత్మీయ స్వాగతం లభించింది. ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ ఆమె ముందుకు సాగారు. కదిరి పట్టణంలోని 8వ వార్డులో బాధిత కుటుంబాన్ని పరామర్శించి వస్తున్న భువనేశ్వరి, అక్కడే ఉన్న బీసీ హాస్టల్ విద్యార్థినులతో కాసేపు ముచ్చటించారు. వారిని దగ్గరకు తీసుకొని, చదువు, హాస్టల్ వసతి, భోజనం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు.



శ్రీసత్యసాయి జిల్లా కదిరిలో పార్టీ కార్యకర్త ప్రకాష్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నారా భువనేశ్వరి

## స్లాట్లను పాటించని భక్తులకు ఉచిత దర్శనం

తిరుమల, ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి): నిర్దేశించిన టైంస్లాట్లను పాటించని పక్షంలో రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన భక్తులకు టోకెన్ రహిత దర్శన(ఉచిత దర్శనం) భక్తులతో కలిపి వైకుంఠం క్యూకాంప్లెక్స్ నుంచి దర్శనానికి అనుమతిస్తామని టీటీడీ స్పష్టం చేసింది. భక్తులు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని నిర్దేశించిన సమయానికి దర్శనానికి రావాలని కోరింది. కాగా, సూర్యజయంతి సందర్భంగా ఈనెల 16న తిరుమలలో రథసప్తమి వేడుకలు జరుగనున్నాయి.

## గేట్లు తెరిచే ఉంచుతాం: అచ్చెన్న

టెక్కలి, ఫిబ్రవరి 13: 'వైసీపీకి చెందిన పలువురు నేతలు, ప్రజాప్రతినిధులు చాలామంది నాతో టచ్‌లో ఉన్నారు. టీడీపీలోకి ఎవరు చేరాలన్నా గేట్లు తెరిచే ఉంచుతాం. ఎన్నికల తర్వాత గేట్లు మూసివేస్తాం' అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు అన్నారు. మంగళవారం శ్రీకాకుళం జిల్లా టెక్కలి పార్టీ కార్యాలయంలో ఆయన కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. 'టీడీపీ, జనసేన విజయం ఖాయం. వైసీపీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు. ఏ వర్గమూ సంతృప్తిగా లేదు. ఆ పార్టీకి ఇవే చివరి ఎన్నికలు' అని అచ్చెన్న అన్నారు.

## బకాయిలపై శ్వేతపత్రం విడుదల చేయాలి: అశోక్‌బాబు

అమరావతి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులతో సహా వివిధ వర్గాలకు చెల్లించాల్సిన బకాయిలపై ప్రభుత్వం తక్షణమే శ్వేత పత్రం విడుదల చేయాలని టీడీపీ ఎమ్మెల్సీ పర్చూరి అశోక్‌బాబు డిమాండ్ చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడారు. 'ఆర్థిక అంశాలపై జరిపే చర్చల్లో ఆర్థిక మంత్రి లేకుండా ఉద్యోగ సంఘాలతో చర్చలు ఎలా కొలిక్కి వస్తాయే ప్రభుత్వం, ఉద్యోగ నేతలు చెప్పాలి' అని అశోక్‌బాబు అన్నారు.

## ఆస్తుల కోసమే రాజధాని నాటకం: బీటెక్ రవి

అమరావతి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): రాజధాని లేని రాష్ట్రంగా మిగిల్చిన జగన్ రెడ్డి.. మొన్న అమరావతి, నిన్న వైజాగ్, నేడు హైదరాబాద్ అంటున్న వైసీపీ నేతలు మరి రేపు ఏమంటారోనని పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి మంగళవారం ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు అమరావతే రాజధాని అని చెప్పి, ఉమ్మడి రాజధాని పేరుతో హైదరాబాద్‌లో బినామీ భూముల్ని కాపాడుకోవటానికి కొత్త నాటకానికి తెరతీస్తున్నారు. ఒక్క రాజధానే కట్టలేక మూడు రాజధానులంటూ మోసం చేసిన జగన్‌రెడ్డి చరిత్రహీనుడిగా మారారు' అని రవి అన్నారు.

## 16న 'గ్రామీణ బంద్-పారిశ్రామిక సమ్మె' విజయవంతం చేయండి: సీపీఐ

అమరావతి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక, సంయుక్త కిసాన్ మోర్చా ఈ నెల 16న చేపట్టిన 'గ్రామీణ బంద్ - పారిశ్రామిక సమ్మె'ను రైతులు, కార్మికులు, ప్రజాసంఘాలు విజయవంతం చేయాలని సీపీఐ పిలుపు నిచ్చింది. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ తలపెట్టిన బంద్‌కు తమ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.



## జేఈఈ మెయిన్‌లో ఎస్ఆర్ ప్రభంజనం



మనీశ్, తేజస్వి

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 13 : దేశంలోని ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థల్లో ఇంజనీరింగ్ కోర్సుల ప్రవేశాల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించే జేఈఈ మెయిన్-2024(సీజన్-1) పరీక్ష ఫలితాల్లో ఎస్ఆర్ విద్యా సంస్థలకు చెందిన అభ్యర్థులు ప్రభంజనం సృష్టించారని సంస్థ చైర్మన్ ఏ.వరదారెడ్డి వెల్లడించారు. మంగళవారం విడుదలైన ఫలితాల్లో దొంతుల మనీశ్ 99.99 శాతం పర్సంటైల్ సాధించి ఎస్ఆర్ విద్యాసంస్థల కీర్తి ప్రతిష్ఠలను జాతీయ స్థాయిలో నిలబెట్టారని ఆయన తెలిపారు. అలాగే తుమ్మ తేజస్వి 99.95 శాతం, ఆర్.దీపాన్ష్ రెడ్డి 99.19 శాతం, పి.నిహాల్ శ్రీవాత్సవ్ 99.91 శాతం పర్సంటైల్ సాధించారని పేర్కొన్నారు. భవిష్యత్‌లో కూడా అత్యుత్తమమైన ర్యాంకులు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతామని చెప్పారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను వరదారెడ్డి అభినందించారు.

## సత్తా చాటిన శ్రీ చైతన్య విద్యార్థులు

హైదరాబాద్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్ ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యార్థులు సత్తా చాటారు. 300కి 300 మార్కులతో 100 పర్సంటైల్‌తో పాటు రెండు సబ్జెక్టుల్లో 13 మంది విద్యార్థులు 100 పర్సంటైల్ సాధించారు. మ్యాథ్స్‌లో 34 మంది అభ్యర్థులు, ఫిజిక్స్‌లో 68 మంది, కెమిస్ట్రీలో 58 మంది విద్యార్థులు 100 పర్సంటైల్ సాధించారు. మొత్తం సబ్జెక్టుల్లో 100 పర్సంటైల్స్ 162 వచ్చాయి. ఈ సందర్భంగా శ్రీ చైతన్య విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ శ్రీ మాట్లాడారు. పర్సంటైల్‌లో అయినా, ప్రోగ్రామ్స్‌లో అయినా శ్రీ చైతన్య విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని తెలిపారు. అనితర సాధ్యమైన ప్రోగ్రాములు, మైక్రో షెడ్యూల్స్, ఇంటర్నల్ ఎగ్జామ్స్, అత్యుత్తమ ఫ్యాకల్టీ వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయయని పేర్కొన్నారు. ర్యాం కులు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఫ్యాకల్టీని సుష్మ శ్రీ అభినందించారు.

## నారాయణ విద్యార్థుల ఆల్ టైమ్ రికార్డు

హైదరాబాద్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): జేఈఈ ఫలితాల్లో నారాయణ విద్యార్థులు అరుదైన ఘనతను సాధించారు. యం.సాయితేజ(240310661132), షేక్ సూరజ్(240310038821), ఆర్యన్ ప్రకాశ్(240310099049), పి. రోహన్ సాయి (240310106660), హెచ్.విదిత్(240310608827), యం.అనూప్(240310552251).. 300 మార్కులకు 300 సాధించి జయకేతనం ఎగరేశారు. దేశవ్యాప్తంగా 23 మంది విద్యార్థులు 100 పర్సంటైల్ సాధించగా.. అందులో 8 మంది నారాయణ విద్యార్థులే. ఈ సందర్భంగా నారాయణ విద్యా సంస్థల డైరెక్టర్లు డాక్టర్ పి. సింధూర, పి.శరణి మాట్లాడారు. వివిధ సబ్జెక్టుల్లో 125 మంది నారాయణ విద్యార్థులు 100 పర్సంటైల్ సాధించడం గర్వించదగిన విషయమని అన్నారు. ఇంతటి ఘన విజయం సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపకులకు అభినందనలు తెలిపారు.

## అద్భుత ఫలితాలు సాధించిన రెసొనెన్స్

హైదరాబాద్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): దేశంలోని ఐఐటీ, ఎన్ఐటీ వంటి ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థల్లో ఇంజనీరింగ్ ప్రవేశాల కోసం నిర్వహించిన జేఈఈ మెయిన్ పరీక్షలో రెసొనెన్స్ విద్యా సంస్థల విద్యార్థులు అద్భుతమైన ప్రదర్శనతో చరిత్ర సృష్టించారు. టాప్ స్కోర్ సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, బోధనా సిబ్బందిని మాదాపూర్‌లోని రెసొనెన్స్ జూనియర్ కళాశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రెసొనెన్స్ హైదరాబాద్ సెంటర్స్ డైరెక్టర్ పూర్ణ చంద్రరావు మాట్లాడారు. దేశవ్యాప్తంగా జరిగిన జేఈఈ పరీక్షలో రెసొనెన్స్ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను సాధించారని తెలిపారు. ఐఐటీ, ఎన్ఐటీ, ఎన్ఈఈటీ, మెడికల్ ప్రవేశ పరీక్షలలో అగ్ర శ్రేణి ర్యాంకర్లను తయారు చేయడంలో రెసొనెన్స్ జాతీయ స్థాయిలో ప్రసిద్ధి చెందిన అత్యుత్తమ శిక్షణా సంస్థ అని పూర్ణ చంద్రరావు పేర్కొన్నారు.

## జేఈఈ మెయిన్లో సత్తా చాటిన భాష్యం విద్యార్థులు



జిష్ణు సాయి, మనీష్ చౌదరి

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 13 : జేఈఈ మెయిన్- 2024 ఫలితాల్లో భాష్యం ఐఐటీ జేఈఈ అకాడమీ విద్యార్థులు 99.99 పర్సంటైల్‌తో జాతీయ స్థాయిలో టాపర్లుగా నిలిచారని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ మంగళవారం తెలిపారు. రామకృష్ణ మాట్లాడుతూ తమ విద్యార్థులు ఎం.జిష్ణు సాయి, కే.మనీష్ చౌదరి 99.99 పర్సంటైల్ ఓపెన్ కేటగిరీలో టాపర్లుగా నిలిచారని చెప్పారు. అదే విధంగా 99.9 పర్సంటైల్ 21 మంది, 99.7 పర్సంటైల్ 47 మంది, 99.5 పర్సంటైల్ 62 మంది, 99 పర్సంటైల్ 110 మంది విద్యార్థులు సాధించారని తెలిపారు. సబ్జెక్టులవారీగా 100 శాతం పర్సంటైల్ సాధించిన వారు 9 మంది ఉన్నారని వెల్లడించారు. విద్యార్థులను చైర్మన్ భాష్యం రామకృష్ణ, డైరెక్టర్ హనుమంతరావు అభినందించారు.

# జగన్ అప్పుల పిచ్చికి లక్షల మంది విద్యార్థులు బలి!

» ప్రపంచ బ్యాంక్ అప్పు కోసం విద్యారంగం నాశనం
» ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గిన 5 లక్షల మంది
» రాష్ట్రవ్యాప్తంగా 4,700 పాఠశాలలు మూత
» టీడీపీ అధికార ప్రతినిధి నీలాయపాలెం ధ్వజం



అమరావతి, ఫిబ్రవరి 13(ఆంధ్ర జ్యోతి): జగన్ అప్పుల పిచ్చికి రాష్ట్రంలో లక్షల మంది విద్యార్థులు బలయ్యారని తెలుగుదేశం పార్టీ ఆరోపించింది. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆ పార్టీ అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్ కుమార్ విలేకరులతో మాట్లాడుతూ 'ప్రపంచ బ్యాంక్ అప్పు కోసం సీఎం జగన్ విద్యారంగాన్ని సర్వ నాశనం చేశాడు. ఆయన హయాంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఐదు లక్షలు తగ్గిపోయింది. రాష్ట్రవ్యాప్తంగా 4,700 పాఠశాలలు మూతబడ్డాయి. అందుబాటులో పాఠశాలలు లేక పేదలు పిల్లలను చదివించలేని పరిస్థితి తెచ్చారు. ఏపీ ప్రభుత్వ పాఠశాల విద్యా శాఖ గణాంకాల ప్రకారం 2021-22లో 43 లక్షల మంది ప్రభుత్వ పాఠశాలల్లో చదివేవారు. 2023 జూలై నాటికి ఈ సంఖ్య 37 లక్షలకు పడిపోయింది. జగన్ అసమర్థ పాలన, పనికిమాలిన నిర్ణయాల వల్ల 5 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు దూరమయ్యారు. సాల్ట్ పేరుతో రాష్ట్రంలో విద్యా రంగం అభివృద్ధికి ప్రపంచ బ్యాంక్ నుంచి రుణం తీసుకోవడానికి జగన్ ప్రభుత్వం 2021లో ఒక ఒప్పందం కుదుర్చుకొంది. ఈ ప్రాజెక్టు కోసం ప్రపంచ బ్యాంక్ నుంచి రూ.2200 కోట్లు రుణం తీసుకొన్నారు. ఈ రుణం కావాలంటే విద్యా శాఖ పరిధిలో మానవ వనరులపై పెట్టే ఖర్చు తగ్గించుకోవాలని ప్రపంచ బ్యాంక్ షరతు పెట్టింది. దానికి అంగీకరిస్తూ జగన్ ప్రభుత్వం సంతకం పెట్టింది. అందుకే ఈ నాలుగున్నరేళ్లలో ఒక్కసారి కూడా ఉపాధ్యాయుల నియామకానికి పరీక్షలు పెట్టలేదు. ఉపాధ్యాయ పోస్టులు అసలు ఖాళీ లేవని చూపించడానికి ప్రభుత్వ పాఠశాలలను విలీనం చేశారు. ఆ పేరుతో ఖాళీ పోస్టులు రద్దు చేశారు. గతంలో ఒక ఊరిలో ప్రాథమిక పాఠశాలలు రెండు మూడు ఉండేవి. హేతుబద్ధీకరణ పేరుతో మూడు నుంచి ఐదు తరగతులను ప్రాథమిక పాఠశాలల నుంచి తీసివేసి ప్రాథమికోన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. విద్యార్థులు లేరన్న సాకు చూపి పాఠశాలలు మూసివేస్తున్నారు' అన్నారు. 2019-20లో రాష్ట్రంలో 63 వేల పాఠశాలలు ఉంటే 2023-24 నాటికి 58 వేలు మాత్రమే మిగిలాయన్నారు. టీడీపీ హయాంలో 18వేల టీచర్ పోస్టులు భర్తీ చేస్తే జగన్ హయాంలో ఇంతవరకూ ఒక్క పోస్టూ భర్తీ చేయలేదని, ఉపాధ్యాయులు లేకే ఇన్ని వేల పాఠశాలలు మూతపడ్డాయని చెప్పారు. 'ప్రైవేటు పాఠశాలల్లో ఐదు లక్షల మంది విద్యార్థులు పెరిగితే, ప్రభుత్వ పాఠశాలల్లో అంతే సంఖ్యలో తగ్గిపోయారు. విద్యారంగ ఉద్ధరణ అంటే ఇదేనా? రూ.50 వేల కోట్లు ఖర్చు చేసి ప్రభుత్వ బడులను సంపూర్ణంగా మార్చేశామని ప్రగల్భాలు పలికారు. 15వేల పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్ల కంటే గొప్పగా తీర్చిదిద్దామన్నారు. అయినా విద్యార్థులు ఎందుకు వెళ్లిపోయారు? 9వేల పాఠశాలలను ఏకోపాధ్యాయ పాఠశాలలుగా నడుపుతున్నారు. ఈ ప్రయోగాలతో ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం సన్నగిల్లి తల్లిదండ్రులు పిల్లలను ప్రైవేటుకు పంపుతున్నారు' అని ఆయన విమర్శించారు.

## 'రాజధాని ఫైల్స్' విడుదలను ఆపండి

» ట్రైలర్ సీఎం జగన్ ప్రతిష్ఠను దిగజార్చేలా ఉంది
» హైకోర్టును ఆశ్రయించిన వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
» ముగిసిన వాదనలు.. మధ్యంతర ఉత్తర్వులపై నిర్ణయం వాయిదా

అమరావతి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రాజధాని ఫైల్స్ సినిమా విడుదలను నిలువరించాలని కోరుతూ వైసీపీ దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఇరువైపుల వాదనలు ముగియడంతో మధ్యంతర ఉత్తర్వుల జారీ వ్యవహారంపై నిర్ణయాన్ని ధర్మాసనం వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్.జయసూర్య మంగళవారం ఉత్తర్వులిచ్చారు. ఏపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రతిష్ఠను దిగజార్చేలా రాజధాని ఫైల్స్ సినిమాను తీశారని, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిలిం సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) ధ్రువపత్రాన్ని రద్దు చేయాలని కోరుతూ వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం మంగళవారం విచారణకు రాగా.. పిటిషనర్ తరఫున న్యాయవాది వీఆర్ఎన్ ప్రశాంత్ వాదనలు వినిపించారు. ఇటీవల విడుదలైన ట్రైలర్ ముఖ్యమంత్రి జగన్ ప్రతిష్ఠను దిగజార్చేలా ఉందన్నారు. ఈ నెల 15న చిత్రాన్ని విడుదల చేయబోతున్నారని, దీన్ని నిలువరిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని అభ్యర్థించారు. నిర్మాతల తరఫున సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధరరావు వాదనలు వినిపిస్తూ.. గతేడాది డిసెంబరులో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిలిం సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) ధ్రువపత్రాన్ని జారీ చేసిందని, సినిమాలో ఎవరినీ కించపరిచేలా సన్నివేశాలు లేవని, ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయవద్దని కోరారు. కేంద్ర సమాచార, ప్రచార మంత్రిత్వశాఖ తరఫున న్యాయవాది జూపూడి యజ్ఞదత్ వాదనలు వినిపిస్తూ.. చట్ట నిబంధనల మేరకే సీబీఎఫ్‌సీ ధ్రువపత్రాన్ని జారీ చేసిందన్నారు. వాదనలు ముగియడంతో మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసేందుకు న్యాయమూర్తి నిర్ణయాన్ని వాయిదా వేశారు.



కుప్పం ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయాన్ని ముట్టడించిన వైసీపీ సర్పంచులు, ఎంపీటీసీలు, తాళం వేసిన కార్యాలయం

## ఆదుకుంటారా... మమ్మల్ని వదులుకుంటారా?

» సీఎం జగన్‌కు వైసీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీల హెచ్చరిక
» రూ.17 కోట్ల నీటి బిల్లుల కోసం ఆందోళన
» ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయానికి తాళం

కుప్పం, ఫిబ్రవరి 13: చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో తాగునీటి సరఫరా బిల్లుల కోసం వైసీపీ సర్పంచులు, ఎంపీటీసీలు ఆందోళనకు దిగారు. ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయానికి తాళాలు వేశారు. ఎమ్మెల్సీ ఇంటి వద్ద నిరసన తెలిపారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, వి.కోట నుంచి మంగళవారం వైసీపీ సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు కుప్పంలోని వైసీపీ ఎమ్మెల్సీ భరత్ ఇంటికి చేరుకున్నారు. నీటి బిల్లులు వెంటనే చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. మూడు నాలుగు రోజుల్లో సీఎం పర్యటన ఉందని, ఆలోగా బిల్లుల చెల్లింపునకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అయినప్పటికీ ఆయన ఇంటి ముందే చాలాసేపు కూర్చున్నారు. అనంతరం ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయానికి చేరుకుని తాళాలు వేసి, ధర్నా చేశారు. మొదటి మూడు నెలల బిల్లులు చెల్లించిన ప్రభుత్వం.. ఆ తర్వాత పైసా కూడా ఇవ్వలేదని వాపోయారు. నిండా అప్పుల్లో మునిగిపోయి ట్యాంకర్లు, ద్విచక్ర వాహనాలు కూడా తెగనమ్ముకోవాల్సి వచ్చిందన్నారు. మంత్రి పెద్దిరెడ్డికి, ఎమ్మెల్సీ భరత్, పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడకు ఎన్నిమార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదన్నారు. తమ రూ.17 కోట్ల బకాయిలు చెల్లించి ఆదుకోవాలని, లేదంటే తమను వదులుకోవడానికి సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు.

## మెగా డీఎస్సీ కోసం సీఎం నివాస ముట్టడికి యత్నం



నెల్లూరులో మంత్రి కాకాణి ఇంటి ముందు బైఠాయించిన యూత్ కాంగ్రెస్ నాయకులు

- ఏబీవీపీ కార్యకర్తలను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- నెల్లూరులో మంత్రి కాకాణి నివాసం ముట్టడి
- యూత్ కాంగ్రెస్ నాయకుల అరెస్ట్

తాడేపల్లి టౌన్, ఫిబ్రవరి 13: మెగా డీఎస్సీని 25 వేల పోస్టులతో వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ విద్యార్థి సంఘ నేతలు, కార్యకర్తలు మంగళవారం తాడేపల్లిలో సీఎం నివాస ముట్టడికి యత్నించారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. యూత్ కాంగ్రెస్ నాయకులు నెల్లూరులోని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి నివాసాన్ని ముట్టడించారు. వివరాల్లోకి వెళితే... మంగళవారం ఉదయం ఏబీవీపీ నేతలు, కార్యకర్తలు తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం వైపునకు ఒక్కసారిగా దూసుకొచ్చారు. ముందుగా కంగుతిన్న పోలీసులు తెప్పరిల్లి ఆందోళనకారులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఇరు వర్గాల మధ్య పెనుగులాట చోటుచేసుకుంది. పలువురు కార్యకర్తలు స్వల్పంగా గాయపడ్డారు. అదుపులోకి తీసుకున్న ఏబీవీపీ నేతలను వ్యానుల్లో ఎక్కించి మంగళగిరి పోలీసు స్టేషన్‌కు తరలించారు. కాగా, విషయం తెలుసుకున్న బీజేపీ జాతీయ కార్యదర్శి వై సత్యకుమార్ పోలీసు స్టేషన్‌కు వచ్చి అదుపులో వున్న వారిని పరామర్శించారు. వైసీపీ ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ ఉపాధి కోసం కాదని, అది ఎన్నికల డీఎస్సీ మాత్రమేనని ఆరోపించారు. వైసీపీ నేతలు సిద్ధమంటూ ప్రచారాలు చేసుకుంటున్నారని, విద్యార్థులు కూడా వైసీపీని గద్దెదించేందుకు సిద్ధంగా ఉన్నారని సత్యకుమార్ వ్యాఖ్యానించారు. కాగా, యూత్ కాంగ్రెస్ నాయకులు నెల్లూరులోని రాష్ట్ర మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి నివాసాన్ని ముట్టడించారు. అంతకు ముందు డైకాస్ రోడ్డు నుంచి మంత్రి నివాసం వరకు ర్యాలీ నిర్వహించారు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని ఆందోళనకారులను అడ్డుకున్నారు. దీంతో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విషయం తెలుసుకున్న డీసీసీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి వేదాయపాళెం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సీఐతో మాట్లాడి వారిని విడిపించారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు రామారావు మాట్లాడుతూ, సీఎం జగన్‌ను గద్దె దించడానికి నిరుద్యోగులు సిద్ధంగా ఉన్నారని అన్నారు.

## నిరుద్యోగులను పొట్టన పెట్టుకుంటారా..!



- నోటిఫికేషన్ ఇచ్చి 30 రోజుల్లో పరీక్ష పెట్టడం ఏమిటి..?
- నా తొమ్మిది ప్రశ్నలకు జగన్, సకల శాఖల మంత్రి సమాధానం చెప్పాలి: షర్మిల

అమరావతి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): దగా డీఎస్సీని ప్రశ్నిస్తే వ్యక్తిగత విమర్శలు చేస్తారా? అంటూ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నిలదీశారు. మంగళవారం ఎక్స్ వేదికగా డీఎస్సీ నోటిఫికేషన్‌పై ఆమె స్పందించారు. 'మహానేత వైఎస్ఆర్ 52 వేల పోస్టులతో మెగా డీఎస్సీ వేస్తే.. వారసుడుగా చెప్పుకునే జగన్ కేవలం ఆరు వేలతో దగా డీఎస్సీ వేశారు. ప్రశ్నిస్తే వ్యక్తిగత విమర్శలు చేసే వైసీపీ నేతలు, వీళ్లను మోసే సోషల్ మీడియాకు ఒక సవాల్ అంటూ తొమ్మిది ప్రశ్నలు సంధిస్తూ, సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. '2019 సార్వత్రిక ఎన్నికల్లో హామీ ఇచ్చిన 25,000 టీచర్ పోస్టుల భర్తీ ఎక్కడ? ఎన్నికలకు నెలన్నర ముందు ఆరువేల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వడంలో ఆంతర్యం ఏమిటి? టెట్, డీఎస్సీ కలిపి నోటిఫికేషన్ ఇస్తే అభ్యర్థులు దేనికి ప్రిపేర్ అవ్వాలి? నోటిఫికేషన్ ఇచ్చిన 30 రోజుల్లో పరీక్షలు పెట్టడం దేశంలో ఎక్కడైనా ఉందా? టెట్‌కు 20 రోజులు, ఆ తర్వాత కేవలం ఆరు రోజుల వ్యవధిలో డీఎస్సీ ఎలా సాధ్యం? వైఎస్ఆర్ హయాంలో 100 రోజుల గడువు ఇచ్చిన సంగతి జగన్‌కి గుర్తులేదా? మానసిక ఒత్తిడికి గురిచేసి నిరుద్యోగులను పొట్టన పెట్టుకోవాలని కుట్ర చేస్తున్నారా? ఇది కక్ష సాధింపు చర్యకాదా? నవరత్నాలు, జాతి రత్నాలు అని చెప్పుకొనే జగన్, ఆయన చట్టూ ఉండే సకల శాఖల మంత్రులు ఈ తొమ్మిది ప్రశ్నలకు సమాధానం చెప్పాలి' అని వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు.

### ఓటర్ల తుది జాబితాపై
## సుప్రీం సంతృప్తి

- 'సంవిధాన్' ట్రస్టు పిల్‌ను కొట్టేసింది: సీఈవో

అమరావతి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): దేశంలో త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల తుది జాబితా-2024 రూపొందించేందుకు ఎన్నికల సంఘం అనుసరిస్తున్న ప్రక్రియ పట్ల సుప్రీంకోర్టు సంతృప్తి వ్యక్తం చేసింది. సంవిధాన్ బచావో ట్రస్టు దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై సోమవారం సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. సంవిధాన్ బచావో ట్రస్టు దాఖలు చేసిన పిల్(రిట్ పిటిషన్ నెంబరు 1288బై 2023)ను కొట్టివేసింది. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం మంగళవారం ఈ విషయాన్ని వెల్లడించింది. డూప్లికేట్, ఘోస్ట్ ఓటర్లను తొలగించడానికి కేంద్ర ఎన్నికల సంఘం తగిన చర్యలు తీసుకోలేదని నిందించే అవకాశం లేదని సుప్రీంకోర్టు పేర్కొందని, ఈ విషయంలో తదుపరి ఆదేశాలు అవసరం లేదందని వివరించింది.

### 'రెడ్‌బుక్' కేసు 21కి వాయిదా

విజయవాడ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్‌పై రెడ్‌బుక్‌కు సంబంధించి దాఖలైన పిటిషన్ విచారణను విజయవాడ ఏసీబీ కోర్టు ఈనెల 21వ తేదీకి వాయిదా వేసింది. కొందరు అధికారుల పేర్లు రెడ్‌బుక్‌లో రాసుకుంటున్నామని.. తాము అధికారంలోకి వచ్చాక వారి సంగతి చూస్తామని లోకేశ్ వ్యాఖ్యలు చేశారని సీఐడీ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.

### రేపు మీరు రావాల్సిందే..

- వైసీపీ రెబల్స్‌కు స్పీకర్ కార్యాలయం నోటీసు

అమరావతి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): వైసీపీ రెబల్ ఎమ్మెల్యేలు ముగ్గురికి స్పీకర్ కార్యాలయం మరోమారు నోటీసులు పంపింది. వ్యక్తిగతంగా స్పీకర్ వద్ద 15వ తేదీ 12 గంటలకు హాజరు కావాలని పేర్కొంది. కాగా, ముగ్గురు రెబల్ ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఉండవల్లి శ్రీదేవి, మేకపాటి చంద్రశేఖరరెడ్డి ఇప్పటికి రెండుసార్లు నోటిసులకు స్పందించలేదు సరికదా మరింత గడువు కోరారు. అయితే వారు కోరిన గడువు ఇవ్వకుండా గురువారం తనముందు హాజరుకావాల్సిందేనంటూ స్పీకర్ నోటీసు జారీ చేశారు.

# ఉద్యమానికి మేం సిద్ధం

- సర్కారుకు నోటీసు అందజేసిన ఏపీ జేఏసీ
- నేటి నుంచి ఉద్యమ కార్యాచరణ
- 27న చలో విజయవాడకు పిలుపు
- రూ.25వేల కోట్ల ఉద్యోగుల బకాయిలు, 30% ఐఆర్ మంజూరు చేయాలని డిమాండ్

అమరావతి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ అలసత్వాన్ని, బకాయిల వాయిదాల పర్వాన్ని నిరసిస్తూ ఏపీ జేఏసీ అమరావతి ఉద్యమానికి మేం సిద్ధమని గర్జిస్తోంది. ఐఆర్ 30 శాతం ఇవ్వాలని, వేలాదికోట్ల బకాయిలు చెల్లించాలంటూ ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేసింది. ఈ మేరకు మంగళవారం సీఎస్ జవహర్‌రెడ్డి అందుబాటులో లేకపోవడంతో సచివాలయంలోని ఆయన కార్యాలయంలో... ఏపీ జేఏసీ ఛైర్మన్, సెక్రటరీ జనరల్ హృదయరాజు ఏపీ జేఏసీ ఉద్యమ కార్యాచరణ నోటీసును అందజేశారు. బుధవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమ కార్యాచరణ చేపట్టనున్నట్లు ప్రకటించారు. 12వ పీఆర్సీ కమిషన్ వేసినప్పటికీ కాలయాపన జరుగుతోందని, ధరలు విపరీతంగా పెరిగిన కారణంగా తక్షణమే మధ్యంతర భృతి 30 శాతం ప్రకటించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఉద్యోగులకు చెల్లించాల్సిన రూ. 25 వేల కోట్ల బకాయిలను తక్షణమే చెల్లించాలన్నారు. 2004కు ముందు నోటిఫికేషన్ ద్వారా నియమితులైన ఉద్యోగ ఉపాధ్యాయులు, పోలీసులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, గురుకుల సొసైటీ పబ్లిక్ సెక్టార్ ఉద్యోగులకు 60 నుంచి 62 ఏళ్లకు పదవీ విరమణ వయస్సును పెంచాలని, జిల్లా పరిషత్, ఎయిడెడ్, మున్సిపల్ యాజమాన్యాలలో చనిపోయిన కుటుంబాల్లో ఒకరికి తక్షణమే ఉద్యోగం కల్పించాలని, సీపీఎస్, జీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పెన్షనర్లకు అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ 10, 15 శాతాలను కొనసాగించాలని, ఎన్ఎంఆర్, కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ పార్ట్ టైం ఫుల్ టైం ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, ప్రతి నెలా 1న జీతాలు, పెన్షన్లు మంజూరు చేయాలని.. డిపార్టుమెంట్ల వారీగా ఉన్న దాదాపు 49 సమస్యలతో కూడిన డిమాండ్ల పత్రాన్ని సీఎస్ కార్యాలయంలో, జీఏడీ అదనపు కార్యదర్శి శ్రీనివాసరావుకు అందజేసినట్లు జేఏసీ నేతలు తెలిపారు. ఈ నోటీసుతో 3 దశల ఆందోళన కార్యక్రమ షెడ్యూల్‌ను జత చేశారు.

### ఉద్యమ కార్యాచరణ ఇలా...

- ఈ నెల 14న ఉద్యోగులందరూ నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవడం, తహసీల్దార్, సబ్ కలెక్టర్, కలెక్టర్లకు మెమోరాండాలను సమర్పించడం.
- 15, 16వ తేదీల్లో నల్లబ్యాడ్జీలు ధరించి మధ్యాహ్న భోజన విరామ సమయంలో తాలుకా, పాఠశాలల్లో నిరసనలు.
- 17న తాలుకా కేంద్రాల్లో ర్యాలీలు, ధర్నాల నిర్వహణ.
- 20న జిల్లా కేంద్రాల్లో(కలెక్టరేట్ల వద్ద) ర్యాలీ, ధర్నా కార్యక్రమాలు
- 21 నుంచి 24వ తేదీ వరకు జిల్లా కేంద్రాల్లో పర్యటనలు
- 27వ తేదీన చలో విజయవాడ

### ఉద్యోగ సంఘాలన్నీ చేతులెత్తేశాయి!

- ఐదేళ్లుగా సర్కారు అడుగులకు మడుగులు..
- ఒక్క సమస్యకూ పరిష్కారం చూపలేకపోయాయి
- ప్రభుత్వం భయపడి చర్చలకు పిలిచినట్లు బిల్డప్‌లు
- పదవులు, రాజకీయ లబ్ధికి ఆశపడి లాలూచీలు
- ఉద్యోగ సంఘాలపై ఎస్సీ, ఎస్టీ ఈయూ విమర్శ



దేవరపల్లి సురేష్‌బాబు

విజయవాడ(వన్‌టౌన్), ఫిబ్రవరి 13: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే విషయంలో ఉద్యోగ సంఘాలు చేతులెత్తేశాయని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్‌బాబు విమర్శించారు. విజయవాడలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఉద్యోగుల డిమాండ్లపై ప్రభుత్వాన్ని ఒప్పించడంలో, ఒత్తిడి తేవడంలో జాయింట్ కౌన్సిల్ సభ్యత్వ సంఘాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. సోమవారం ప్రభుత్వంతో సమావేశం అనంతరం ఆయా ఉద్యోగ సంఘాలు పొంతనలేని వ్యాఖ్యలు చేయడంతోనే ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో తాము అశక్తులమని చెప్పకనే చెప్పాయన్నారు. మంత్రివర్గ ఉపసంఘం, సీఎస్, ఉన్నతాధికారుల సమక్షంలో జరిగిన సమావేశ విషయాలను ప్రభుత్వమే వెల్లడించాలి తప్ప.. ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడడమేమిటన్నారు. ఐదేళ్ల నుంచి ఇదే తంతు జరుగుతోందని విమర్శించారు. ఉద్యోగ సంఘ నాయకులు తాము చేసే ఉద్యోగానికి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఇబ్బందులూ రాకుండా సర్కారు అడుగులకు మడుగులొత్తుతున్నారని విమర్శించారు. పదవీ విరమణ తరువాత ఏవో పదవులు, రాజకీయ ప్రయోజనాలు ఆశించే ప్రభుత్వంపై ఒత్తిడి తేలేకపోతున్నరన్నారు.

## హైకోర్టు జడ్జీలు, ఏసీబీ కోర్టు న్యాయాధికారిపై.. అభ్యంతరకర పోస్టులను తక్షణం తొలగించండి

- గూగుల్ ఎల్ఎల్‌సీకి హైకోర్టు ఆదేశం
- ఈ కేసులో మరికొందరికి నోటీసులు.. ఇచ్చేందుకు గడువు కోరిన ఏజీ
- సానుకూలంగా స్పందించిన ధర్మాసనం.. విచారణ 6 వారాలకు వాయిదా
- కౌంటర్లు వేయాలని ప్రతివాదులకు నిర్దేశం

అమరావతి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు న్యాయమూర్తులు, ఏసీబీ కోర్టు న్యాయాధికారిని దూషిస్తూ పెట్టిన అభ్యంతరకర పోస్టులను తక్షణం తొలగించాలని గూగుల్ ఎల్ఎల్‌సీ(యూట్యూబ్)ను హైకోర్టు ఆదేశించింది. ఇప్పటికే ఆ పోస్టులు తొలగించామని ఎక్స్ కార్ప్, ఫేస్‌బుక్(మెటా) చెప్పిన వివరాలను నమోదు చేసింది. అడ్వకేట్ జనరల్ ఎస్.శ్రీరామ్ అభ్యర్థన మేరకు మీడియా సంస్థలు శ్రేయ బ్రాడ్‌కాస్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్(టీవీ5), మహా న్యూస్, ఫైరా మీడియాలను ప్రతివాదులుగా చేరుస్తూ ప్రభుత్వం దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌ను అనుమతించింది. వారికి నోటీసులు జారీ చేసింది. అభ్యంతరకర పోస్టులు పెట్టిన మరికొందరిని గుర్తించాల్సి ఉందని, వారికి నోటీసులిచ్చేందుకు సమయం ఇవ్వాలన్న ఏజీ వినతికి సానుకూలంగా స్పందించింది. తదుపరి విచారణను ఆరువారాలకు వాయిదా వేసింది. కౌంటర్లు దాఖలు చేయాలని ఇప్పటికే నోటీసులు అందుకున్న ప్రతివాదులను ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు, జస్టిస్ మండవ కిరణ్మయితో కూడిన ధర్మాసనం మంగళవారం మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు జ్యుడీషియల్ రిమాండ్ విధించడం, ఆయన దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసిన అనంతరం ఇద్దరు హైకోర్టు న్యాయమూర్తులు, ఏసీబీ కోర్టు న్యాయాధికారిని దూషిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినవారిపై కోర్టుధిక్కరణ చర్యలు చేపట్టాలని కోరుతూ ఏజీ హైకోర్టులో క్రిమినల్ ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం ఇటీవల విచారణకు రాగా.. పోస్టులు పెట్టినందుకు కోర్టు ధిక్కార చర్యలు ఎందుకు ప్రారంభించకూడదో వివరణ ఇవ్వాలని ఆదేశిస్తూ మొత్తం 26 మందికి న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. ప్రతివాదులుగా పేర్కొన్న ఫేస్‌బుక్ అకౌంట్లకు సంబంధించి వాస్తవ యజమానులను గుర్తించి నోటీసులివ్వాలని డీజీపీని ఆదేశించింది. ఈ వ్యాజ్యం మంగళవారం మరోసారి విచారణకు రాగా ఏజీ వాదనలు వినిపిస్తూ... అభ్యంతరకర పోస్టులను తొలగించాలని వివరాలు అందజేసినప్పటికీ యూట్యూబ్ అందుకు అంగీకరించడం లేదని.. కోర్టు ఉత్తర్వులు ఉంటేనే తొలగిస్తామని అంటోందని తెలిపారు. యూట్యూబ్ చర్యను కోర్టుధిక్కరణగా పరిగణించాలని కోరారు. కాగా, కోర్టు ఆదేశాలిస్తే అభ్యంతరకర పోస్టులు తొలగించేందుకు అభ్యంతరం లేదని గూగుల్ ఎల్ఎల్‌సి(యుట్యూబ్) తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సంజయ్ హువయ్య కోర్టుకు తెలిపారు. సంబంధిత కోర్టు లేదా అధీకృత అధికారి ఆదేశాలు ఉన్నప్పుడే అభ్యంతరకర పోస్టులను తొలగించగలమని తెలిపారు.



మై ఫస్ట్ ఓట్ సీబీఎన్‌లో పాల్గొన్న తెలుగు యువత నేతలు

### నా మొదటి ఓటు చంద్రబాబుకే..

చిట్టినగర్, ఫిబ్రవరి 13: కొత్తగా ఓటు హక్కు పొందిన యువత తమ మొదటి ఓటు చంద్రబాబుకేనంటూ మంగళవారం 51వ డివిజన్‌లోని కేబీఎన్ కాలేజీ ఎదురుగా ఫ్లకార్డుల ప్రదర్శన నిర్వహించారు. టీడీపీ నేత కేశినేని శివనాథ్ (చిన్ని), జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ ఆదేశాలతో పశ్చిమ తెలుగు యువత అధ్యక్షుడు ఆర్.మాధవ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో మొదటిసారి ఓటు హక్కు పొందిన యువత పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాధవ మాట్లాడుతూ 18ఏళ్లు నిండి ఓటు హక్కు పొందినవారంతా మొదటిసారి తమ ఓటును చంద్రబాబుకే వేయాలన్నారు. ఆయన సీఎంగా ఉంటే రాష్ట్రంలో పరిశ్రమలు వచ్చి ఉపాధి అవకాశాలుంటాయన్నారు. నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి నిరుద్యోగికి రూ.3వేలు నిరుద్యోగ భృతి ఇవ్వనున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌రెడ్డికి, వైసీపీకి బుద్ధి చెప్పాలన్నారు. తెలుగుయువత నేతలు షేక్ గాలీబ్ షహీద్, ధనేకుల హరికృష్ణ, బి.రామలక్ష్మి, కె.వరలక్ష్మి, డి.రాజశేఖరరెడ్డి, కాటంరాజు, గూడెల రామనాగిరెడ్డి, గడ్డిపాటి కిరణ్ దినేష్, పాల్గొన్నారు.



అన్నారెడ్డి వెంకట తనీష్‌ను అభినందిస్తున్న కళాశాల ప్రతినిధులు

### జేఈఈ మెయిన్‌లో శ్రీ చైతన్య విద్యార్థి విజయకేతనం

విద్యాధరపురం, ఫిబ్రవరి 13: జేఈఈ మెయిన్-2024 సెక్షన్-1 ఫలితాల్లో చైతన్య ఐఐటీ అకాడమీ విద్యార్థి అన్నారెడ్డి వెంకట తనీష్‌రెడ్డి 300 మార్కులకు 300 మార్కులు సాధించి విజయకేతనం ఎగురవేశాడు. మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో చైతన్య ఐఐటీ అకాడమీ ఎగ్జిక్యూటివ్ డీన్ కె.శ్రీనివాసరావు, ఏజీఎం ఎం.మురళీకృష్ణ మాట్లాడుతూ నగరంలో మొత్తంగా 99 పర్సంటైల్‌కు పైగా సాధించిన విద్యార్థులు 288 మంది ఉన్నారని ఇదో రికార్డు అని అన్నారు. జేఈఈ మెయిన్స్-2024 సెక్షన్-1 ఫలితాల్లో తమ విద్యార్థి అన్నారెడ్డి వెంకట తనీష్‌రెడ్డి 300 మార్కులు సంపాదించాడని అతడితో పాటు అసాధారణ ప్రతిభ కనబరిచిన విద్యార్థులందరికీ అభినందనలు తెలుపుతున్నామన్నారు. ఎగ్జిక్యూటివ్ డీన్స్ పీవీఆర్, మురళీరావు, కృష్ణారెడ్డి, శరత్ పాల్గొన్నారు.

### అక్రమ మార్గంలో పాత మెటీరియల్ తరలింపు



వ్యాన్‌లో తరలిస్తున్న పాత మెటీరియల్

వన్‌టౌన్, ఫిబ్రవరి 13: దేవస్థాన చరస్థిర ఆస్తులకు సంబంధించి ఏ కార్యక్రమాన్ని తలపెట్టిన ఉన్నతాధికారుల నుంచి అనుమతి తప్పనిసరి. అయితే వన్‌టౌన్‌లోని విజయేశ్వరాలయంలో ఇందుకు భిన్నంగా ఉంది. ఆలయంలోని పాత మెటిరీయల్‌ను ఎటువంటి టెండర్‌ను పిలవకుండానే సి బ్బంది తమ ఇష్టానుసారం విక్రయించుకుంటున్న పరిస్థితి. ఉన్నతాధికారుల అనుమతి లేకుండా ఉద్యోగి శేషు నేరుగా విక్రయించేసిన వైనం వెలుగులోకి వచ్చింది. ఆలయ కమిటీకి గానీ, ఈవోకు గానీ తెలియకుండా మంగళవారం పాత మెటిరీయల్‌ను విక్రయించాడు. ఇతను కొన్నేళ్ల నుంచి ప్రైవేట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇతడికి ఓ అధికారపార్టీ ఎమ్మెల్యే అండదండలుండడంతో అధికారులను కూడా లెక్కచేయకుండా ఒంటెద్దు పోకడతో ఇష్టానుసారం వ్యవహరిస్తున్నాడు. దీనిపై ఈవో గుర్రం శ్రీనివాస్‌ని వివరణ అడుగగా మూడేళ్ల నుంచి పనికిరాకుండా ఉన్న పాత ఇనుప సామానులను శేషు విక్రయించినది వాస్తవమేనన్నారు.

# కయ్యానికి 'సిద్ధం'

● వైసీపీలోకి చేరికల నేపథ్యంలో కట్టిన బ్యానర్లు, జెండాలు ● టీడీపీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత ● ఏ క్షణమైనా గొడవలు జరిగే ప్రమాదం

కృష్ణలంక, ఫిబ్రవరి 13: వైసీపీకి చెందిన నేతలు, ద్వితీయ శ్రేణి కార్యకర్తలు టీడీపీ, జనసేన పార్టీల వారితో కయ్యానికి 'సిద్ధం' అంటూ కాలుదువ్వుతున్నారు. కొద్దిరోజుల క్రితం సత్యం గారి హోటల్ సెంటర్‌లో జాతీయ రహదారిపై వైసీపీ సిద్ధం అంటూ భారీ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. పక్కనే జనసేనకు చెందిన నేతలు, కార్యకర్తలు మేము సిద్ధం అంటూ మరో ఫ్లెక్సీని పక్కనే ఏర్పాటు చేయడంతో అధికార పార్టీ నేతలు పోలీసుల చేత జనసేన ఫ్లెక్సీని తొలగించి వైసీపీ ఫ్లెక్సీని అలానే ఉంచేశారు. ఇదిలా ఉండగా ఆదివారం సాయంత్రం వైసీపీ వారు ఇతర పార్టీల్లో నుంచి తమ పార్టీలోకి చేరికలంటూ ఓ సభ నిర్వహించారు. అదీ టీడీపీ 21వ డివిజన్ పార్టీ కార్యాలయం ఎదురుగానే. కార్యక్రమం పూర్తయ్యాక వైసీపీ బ్యానర్లు, జెండాలు, ఫ్లెక్సీలు తొలగించకుండా అలానే ఉంచేశారు. దీంతో ఏ క్షణాన పై రెండు పార్టీలకు చెందిన నేతలు, కార్యకర్తలు గొడవలకు దిగుతారేమోనని వ్యాపారస్థులు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. మంగళవారం టీడీపీ నేతలు కొందరు కృష్ణలంక పోలీసు స్టేషన్‌కు వెళ్లి తమ పార్టీ కార్యాలయం వద్ద వైసీపీ వారు కావాలని కట్టి తొలగించకుండా ఉంచిన జెండాలు, బ్యానర్లను తీయించాలని ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. అయితే పోలీసులు అధికార పార్టీ వారికి మోకరిల్లి జెండాలు, బ్యానర్లు తీయించకుండా వుంచుతారో, తీయిస్తారో వేచిచూడాల్సిందే.



టీడీపీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన వైసీపీ జెండాలు, బ్యానర్లు



### నాఫ్కాబ్ డైరెక్టర్‌గా చలసాని ఎన్నిక

పాయకాపురం, ఫిబ్రవరి 13: అర్బన్ బ్యాంకులు, క్రెడిట్ సొసైటీల జాతీయ సమాఖ్య (నాఫ్కాబ్-నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్స్ అండ్ క్రెడిట్ సొసైటీస్) డైరెక్టర్‌గా ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్ చలసాని రాఘవేంద్రరావు ఎన్నికయ్యారు. న్యూఢిల్లీలోని నేషనల్ కో-ఆపరేటివ్ యూనియన్ ఆడిటోరియంలో సోమవారం అత్యంత ఉత్కంఠభరితంగా జరిగిన ఎన్నికల్లో రాఘవేంద్రరావు 211 ఓట్లు సాధించారు. దేశంలో వివిధ రాష్ట్రాల ఫెడరేషన్ల మద్దతుతో 'సహకార్ సే సమృద్ధి 24' ప్యానల్ నుంచి ఏడుగురు అభ్యర్థులు పోటీ చేయగా వారిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి చలసాని రాఘవేంద్రరావు అత్యధికంగా 211 ఓట్లతో గెలుపొందారు. ఆయన ఈ పదవిలో ఐదేళ్లు కొనసాగనున్నారు. కృష్ణాజిల్లా నూజివీడుకు చెందిన చలసాని రాఘవేంద్రరావు ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్స్ టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యుడిగా, ది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్స్ అండ్ క్రెడిట్ సొసైటీ ఫెడరేషన్ కార్యదర్శిగా పని చేస్తున్నారు. ఆయన్ను తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన సహకార వేత్తలు అభినందనలు తెలిపారు.

## 16న సమ్మెకు ఉద్యోగుల మద్దతు

ధర్నాచౌక్, ఫిబ్రవరి 13: ఉద్యోగ, కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెకు మధ్యతరగతి ఉద్యోగుల వేదిక మద్దతు ప్రకటించింది. ఆ రోజున జరిగే ఆందోళనల్లో పాల్గొంటామని వేదిక నేతలు తెలిపారు. గాంధీనగర్‌లోని ఎన్జీవోహోంలో మధ్య తరగతి ఉద్యోగుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వివిధ సంఘాల నేతలు మాట్లాడారు. కేంద్రప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలతో దేశప్రజలపైన భారాలు పెరిగాయన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను నేటికి అమలు చేయలేదని విమర్శించారు. మతం, కులం పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెడుతున్నారన్నారు. 500కుపైగా రైతు సంఘాలు, 500ల ఉద్యోగ, కార్మిక, ప్రజాసంఘాలు ఈ ఆందోళనలో పాల్గొంటాయన్నారు. వేదిక కన్వీనర్ ఆర్.అజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి అజయ్‌కుమార్, ఏపీ ఎన్జీవో నేత ఏ.విద్యాసాగర్, బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ నేత ఎల్.బాలాజీ, ఎల్ఐసీ ఉద్యోగ సంఘం నేత సీహెచ్. కళాధర్, బ్యాంకు ఉద్యోగ సంఘం నేత ఎస్.వి.రమణ, సీఐటీయూ జిల్లా నేతలు ఎన్‌సీహెచ్. శ్రీనివాస్, యంవీ.సుధాకర్, ఆర్టీసీ ఉద్యోగ సంఘం నేత ఎస్‌కే.జిలానీ, నేతలు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మధ్యతరగతి ఉద్యోగుల సంఘ నేతలు

## బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీకి చర్యలు చేపట్టండి: కలెక్టర్

కృష్ణలంక, ఫిబ్రవరి 13: విభిన్న ప్రతిభావంతులకు సంబంధించి నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీకి త్వరగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్.దిల్లీరావు అధికారులను ఆదేశించారు. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం, అర్జీల పరిష్కారానికి ప్రత్యేకంగా ఏర్పడిన జిల్లాస్థాయి కమిటీ సమావేశం మంగళవారం కలెక్టర్ దిల్లీరావు అధ్యక్షతన వర్చువల్‌గా జరిగింది. బ్యాక్‌లాగ్ నియామకాలు, సదరం సర్టిఫికెట్ల జారీ, అర్హులైన వారు ఓటు నమోదు చేసుకొనేలా ప్రోత్సహించడం, హోం ఓటింగ్ సదుపాయం వంటి అంశాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల హక్కుల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది నోటిపై చేసిన రూల్స్ ప్రకారం జిల్లాస్థాయిలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, ప్రణాళిక ప్రకారం సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రప్రభుత్వం ప్రజాసంక్షేమం లక్ష్యంగా అమలు చేస్తున్న పథకాల ద్వారా విభిన్న ప్రతిభావంతులకు పూర్తిస్థాయిలో ఫలాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. త్వరలో సాధారణ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో అర్హులైన వారు ఇంకా ఎవరైనా ఉంటే ఓటు నమోదు చేయించుకోవాలన్నారు. పోలింగ్ స్టేషన్ల వద్ద ర్యాంప్, వీల్‌ఛైర్లు వంటి ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తున్నామని కలెక్టర్ వివరించారు. విభిన్న ప్రతిభావంతులు, టీజీ, వయోవృద్ధులు సంక్షేమ అధికారి వాద్రేవు కామరాజు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, డీఎస్ఈవో యూవీ సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, చార్లెస్, చేయూత స్పెషల్ స్కూల్ ప్రెసిడెంట్ డాక్టర్ కృష్ణకుమారి, మనోవికాస కేంద్రం రాజు, జోగేశ్వరరావు పాల్గొన్నారు.

### జూదాల నియంత్రణకు చర్యలు చేపట్టాలి: ఎస్పీ

గన్నవరం: ప్రజలకు మెరుగైన సేవలందించాలని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మీ సూచించారు. స్థానిక డీఎస్పీ, పోలీస్ స్టేషన్‌ను ఆయన మంగళవారం తనిఖీ చేసి కేసుల వివరాలను తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించారు. కోడిపందేలు, పేకాట ఇతర జూదాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. రౌడీషీటర్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డీఎస్పీ జయసూర్య, సీఐ ప్రసాద్ పాల్గొన్నారు.

### ప్రమాద రహిత సర్వీస్ డ్రైవర్లకు సత్కారం

బస్టేషన్, ఫిబ్రవరి 13: రోడ్డు భద్రతా మాసోత్సావాల ముగింపు సందర్భంగా ఆర్టీసీ అధికారులు అత్యధిక ప్రమాద రహిత సర్వీస్ కలిగిన డ్రైవర్లను సత్కరించారు. రోడ్డు భద్రతా మాసోత్సవ ముగింపు ఎన్టీఆర్ కృష్ణాజిల్లాలకు సంబంధించి నగరంలోని డిపో గ్యారేజీలో మంగళవారం జరిగింది. విద్యాధరపురం డిపోకు చెందిన కె.కోటేశ్వరరావు(32 ఏళ్ల 11 నెలల సర్వీసు), గవర్నర్‌పేట డిపోకు చెందిన ఆర్.సాంబశివరావు (32 ఏళ్ల 6 నెలల సర్వీసు), డి.శ్రీనివాసరావు (32 ఏళ్ల 5 నెలల సర్వీసు), కృష్ణాజిల్లాకు చెందిన మచిలీపట్నం డిపో డ్రైవర్ కేఎస్ రావ్ (32 ఏళ్ల 5 నెలల సర్వీసు), ఎం ప్రసాద్ (31 ఏళ్ల 3 నెలల సర్వీసు), గన్నవరం డిపోకు చెందిన ఎస్.వీ రావు (32 ఏళ్ల 4 నెలల సర్వీసు)లకు బహుమతి ప్రదానం, జ్ఞాపికను అందజేశారు. అలాగే ప్రతి డిపోకు ముగ్గుర్ని ఎంపిక చేసి బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. జోనల్ ఛైర్మన్ పిన్నింటి మహేష్, కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ టి.జమలపూర్ణమ్మ, డీసీపీ కృష్ణకాంత్ పాటిల్, డీటీసీ పూరేంద్ర, ప్రజారవాణా అధికారిణి వాణిశ్రీ, ప్రజారవాణా అధికారి ఎం.ఏసుదానం, డీసీటీఎం జాన్‌సుధాకర్, డిప్యూటీ డీసీటీఎం బషీర్ అహ్మద్, డిప్యూటీ సీఎంఈ (జోన్-2) వి.నీలిమ పాల్గొన్నారు.

### క్రమశిక్షణతోనే క్రీడాకారుల రాణింపు

● ఏసీపీ అశోక్‌కుమార్ గౌడ్



వన్‌టౌన్, ఫిబ్రవరి 13: క్రమశిక్షణతోనే క్రీడాకారులు రాణిస్తారని ఏసీపీ అశోక్‌కుమార్ గౌడ్ అన్నారు. కృష్ణావిశ్వవిద్యాలయం అంతర కళాశాలల పురుషుల హ్యాండ్‌బాల్ టోర్నమెంట్ ముగింపు వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. మంగళవారం కేబీఎన్ కళాశాలలో బహుమతి ప్రదానోత్సవ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలోలనూ విద్యార్థులు రాణించాలన్నారు. తాను కేబీఎన్ కాలేజీ పూర్వ విద్యార్థినని, తాను అనేక బహుమతులు గెలుచుకున్నానన్నారు. కృష్ణా వర్సిటీ క్రీడా విభాగాధిపతి డాక్టర్ జేఎం లావణ్యలత మాట్లాడుతూ విశ్వవిద్యాలయం క్రీడలను ప్రోత్సాహిస్తుందన్నారు. హ్యాండ్‌బాల్ టోర్నమెంట్ పురుషుల విభాగం చాంపియన్‌గా కేబీఎన్ కళాశాల ఓవరల్ చాంపియన్‌గా నిలిచింది. రెండు, మూడు స్థానాల్లో డీఆర్ కళాశాల, ఎస్ఆర్ఆర్ కళాశాలల జట్లు నిలిచాయి. కళాశాలల క్రీడావిభాగాధిపతి డీ. హేమచంద్రారావు, అధ్యాపకుడు మన్నే స్వామి, బాయన రాములు పాల్గొన్నారు.

### షూటింగ్‌లో ఉమామహేష్‌కు రెండు స్వర్ణాలు

విజయవాడ స్పోర్ట్సు, ఫిబ్రవరి 13: స్పెయిన్‌లో ఈ నెల 10న ప్రారంభమైన ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో జూనియర్ కేటగిరిలో భారత్‌కు ప్రాతినిథ్యం వహించిన నగర యువ షూటర్ మద్దినేని ఉమామహేష్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ షూటింగ్‌లో వ్యక్తిగత విభాగంలో సోమవారం రాత్రి స్వర్ణంతో సత్తా చాటగా, మిక్స్‌డ్ ఈవెంట్‌లో మంగళవారం రాత్రి రెండో స్వర్ణం తన ఖాతాలో వేసుకున్నాడు. ఉమామహేశ్‌ను రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ రాష్ట్ర సెక్రటరీ డి.రాజ్‌కుమార్, కోచ్ నాగిశెట్టి సుబ్రహ్మణ్యేశ్వరరావు అభినందించారు.

### ఖేలో ఇండియా వర్సిటీ షూటింగ్‌కు నాగభువన

కురుక్షేత్రలో ఇటీవల జరిగిన ఆలిండియా వర్సిటీ నేషనల్ రైఫిల్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో నగరానికి చెందిన కర్రి నాగభువన 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో 573 పాయింట్లను సాధించి ఈ నెల 21 నుంచి 27 వరకు అస్సామ్‌లో జరిగే ఖేలో ఇండియా వర్సిటీ గేమ్స్‌కు ఎంపికైంది. ది ఇండియన్ అకాడమీ ఆఫ్ స్పోర్ట్సుకు చెందిన నాగ భువనకు అకాడమీలో మంగళవారం జరిగిన అభినందన సభలో కోచ్ నాగిశెట్టి సుబ్రహ్మణ్యేశ్వరరావు శాలువాతో సత్కరించారు. అకాడమీ షూటర్లు అభినందిస్తూ వర్సిటీ స్థాయిలోను పతకం సాధించాలని ఆకాంక్షించారు.

## అన్నదాతవైపు కన్నెత్తి చూడని జగన్

- ఏపీలో అప్పుల్లో కూరుకుపోయిన 90% మంది రైతులు
- కౌలు రైతుల ఆత్మహత్యల్లో 2వ స్థానంలో రాష్ట్రం
- రైతు వ్యతిరేక వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి: పురందేశ్వరి



విజయవాడలో జరిగిన బీజేపీ రైతు గర్జన సభలో నాగలి పట్టిన పురందేశ్వరి

అమరావతి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రప్రదేశ్ రైతులు 90 శాతం మంది అప్పుల్లో కూరుకు పోయారు. కౌలు రైతుల ఆత్మహత్యల్లో మన రాష్ట్రం దేశంలోనే 2వ స్థానంలో ఉంది. రైతు పక్షపాత ప్రభుత్వంగా చెప్పుకొంటూ నాలుగున్నరేళ్ల అన్నదాత వైపు కన్నెత్తి చూడని జగన్ పాలనలో కర్షకుల దుస్థితి ఇది' అంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడలో మంగళవారం కిసాన్ మోర్చా నిర్వహించిన 'రైతు గర్జన' సభలో ఆమె మాట్లాడారు. 'అన్నపూర్ణగా పేరుగాంచిన ఆంధ్రప్రదేశ్‌లో అన్నదాతల దయనీయ పరిస్థితి చూస్తుంటే బాధ కలుగుతోంది. వైసీపీ పాలనలో వ్యవసాయంతో పాటు ఆక్వా, పాడి ఉత్పాదన కూడా తగ్గిపోయింది. ఇది రైతు ప్రభుత్వం ఎలా అవుతుందో చెప్పాలి. మూడు వేల కోట్ల రూపాయలతో ధరల స్థిరీకరణ నిధి, నాలుగు వేల కోట్ల రూపాయలతో ప్రకృతి వైపరీత్య నిధి.. ఇలాంటి మాటలు చెప్పడంలో ఆరితేరిన ముఖ్యమంత్రి తుఫాను బాధిత రైతుల్ని పరామర్శించేందుకు కనీసం పొలాల్లోకి రాలేదు. ఆహార భద్రత అందించిన మహానుభావుడు స్వామినాథన్ వంటి వారిని నరేంద్ర మోదీ ప్రభుత్వం భారత రత్నతో గౌరవిస్తుంటే... అన్నమయ్య ప్రాజెక్టు బాధితుల్ని ఆదుకోవాలన్న కనీస స్పృహ కూడా ఏపీ సీఎంకి లేదు. రైతు వ్యతిరేక వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించి నేరుగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తోన్న మోదీకి మద్దతు పలకాలి' అని పురందేశ్వరి విజ్ఞప్తి చేశారు. బీజేపీ జాతీయ కార్యదర్శి వై సత్య కుమార్ మాట్లాడుతూ... రైతు భరోసా నిధులు ఖాతాల్లో వేసినట్లు బటన్ నొక్కి నటించే జగన్‌ను ఇంటికి పంపే బటన్ నొక్కేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. నరేంద్ర మోదీ దేశంలోని రైతులకు ఇచ్చే రూ.6,000 తమవిగా, కేంద్రం పంటలకు మద్దతు ధర ప్రకటిస్తే ఆ ఘనత తమదిగా ప్రచారం చేసుకునే వైసీపీ తీరు చూస్తే అసహ్యం వేస్తోంది' అని అన్నారు. పంట నష్టపోయిన రైతులకు కనీస పరిహారం కూడా ఇవ్వని వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి అన్నారు. మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్, కిసాన్ మోర్చా జాతీయ ఉపాధ్యక్షుడు సురేశ్‌రెడ్డి, మైనార్టీ మోర్చా అధ్యక్షుడు షేక్ బాజీ తదితరులు మాట్లాడారు.

## పవన్ హెలికాప్టర్ ల్యాండింగ్‌కు నో!

- ఉభయగోదావరి జిల్లాల పర్యటన రద్దు
- ప్రభుత్వ దురుద్దేశమే కారణం: జనసేన

భీమవరం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఉభయగోదావరి జిల్లాల పర్యటన రద్దయింది. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో బుధవారం నియోజకవర్గ ఇన్‌చార్జులు, ముఖ్యనాయకులతో ఆయన భేటీ కావాల్సి ఉంది. అందుకు తగ్గట్టుగా పార్టీ ప్రణాళిక సిద్ధంచేసుకుంది. స్థానిక విష్ణు ఇంజనీరింగ్ కళాశాలలోని హెలిప్యాడ్ వద్ద దిగేందుకు కళాశాల యాజమాన్యం నుంచి అనుమతి కూడా తీసుకున్నారు. కానీ, అక్కడ అనువుగా ఉండదంటూ ఆర్అండ్‌బీ అధికారులు అనుమతి నిరాకరించారు. దాంతో పవన్ కల్యాణ్ పర్యటనను రద్దు చేసుకోవాల్సి వచ్చింది. జనసేన పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు కొటికల పూడి గోవిందరావు జిల్లా కలెక్టర్‌ను కలిసినా ఫలితం లేకపోయింది. ప్రభుత్వం దురుద్దేశంతోనే అనుమతులు ఇవ్వలేదంటూ జనసేన నాయకులు మండిపడుతున్నారు.

## ఎమ్మెల్యే ఏలూరికి 41ఏ నోటీసు

- హైకోర్టు అక్షింతలతో తీరు మార్చుకున్న పోలీసులు
- 22న మార్టూరు స్టేషన్‌కు రావాలని సూచన

మార్టూరు, ఫిబ్రవరి 13: టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, పరుచూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు పోలీసులు సీఆర్‌పీసీ 41ఏ సెక్షన్ కింద నోటీసులు అందజేశారు. బాపట్ల జిల్లా మార్టూరు మండలం ఇసుక దర్శిలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం సాయంత్రం మార్టూరు ఏఎస్ఐ సైదా, హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ స్వయంగా ఆయన్ను కలిసి నోటీసు ఇచ్చారు. ఈ నెల 22న మార్టూరు పోలీసు స్టేషన్‌లో హాజరుకావాలని స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి ఈ నోటీసు పంపారు. అయితే ముందస్తు కార్యక్రమాలు ఉన్నందున ఆ రోజు హాజరుకాలేనని ఎమ్మెల్యే తెలిపారు. ఎప్పుడు హాజరయ్యేదీ తర్వాత తెలియజేస్తానని వారికి చెప్పారు. ఏడేళ్ల శిక్ష పడే సెక్షన్లున్న కేసులో అరెస్టు చేసేందుకు ప్రయత్నించడాన్ని తప్పుబట్టింది. 41ఏ నోటీసులిచ్చి విచారించాలని ఆదేశించింది. హైకోర్టు అక్షింతలతో పోలీసులు తమ వైఖరి మార్చుకుని ఏలూరికి నోటీసులిచ్చారు.

## రాష్ట్ర ప్రయోజనాల కోసమే పొత్తు: ఎం ఏ షరీఫ్

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 13: 'ఒక్కసారి ఓటు వేయండన్న జగన్ మాటల్లో నిజమే ఉంది. మరోసారి ఓటు వేయొద్దని చెప్పకనే చెప్పినట్లు ఆనాడు జగన్ చెప్పిన మాటను రాష్ట్ర ప్రజలు అర్థం చేసుకున్నారు. ఈసారి ఓటు వేసేందుకు ఏ ఒక్కరూ సంసిద్ధంగా లేరు' అని శాసనమండలి మాజీ చైర్మన్ ఎం ఏ షరీఫ్ అన్నారు. మంగళవారం రాత్రి పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురజాల నియోజకవర్గస్థాయి మైనారిటీల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో షరీఫ్ మాట్లాడుతూ... 'చంద్రబాబు ఏ పార్టీతోనైనా పొత్తు పెట్టుకోవాల్సి వస్తే రాష్ట్ర ప్రయోజనాల కోసమే తప్ప సొంత ప్రయోజనాల కోసం కాదు. ఐదేళ్లుగా ఏపీలో అరాచక పాలన సాగుతోంది. ఒక్కచాన్స్ అంటూ మాయ మాటలు చెప్పి మన ఓట్లు గుంజేసుకున్న జగన్ మైనారిటీలను దగా చేశాడు. రూ.100కు బటన్ నొక్కి రూ.1,000 లాగేస్తున్న వైసీపీ ప్రభుత్వానికి రోజులు దగ్గరలో పడ్డాయి. అబ్దుల్ కలాం లాంటి గొప్ప వ్యక్తిని రాష్ట్రపతిని చేసే క్రతువులో చంద్రబాబు ప్రముఖ పాత్ర పోషించాడు. చంద్రబాబు హయాంలో ఏ ముస్లింకు అన్యాయం జరుగలేదు. నాకొక కన్ను ముస్లింలు... రెండవ కన్ను హిందువు అన్న చంద్రబాబునే ముస్లింలు నమ్ముతున్నారు' అని చెప్పారు. కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ షేక్ నాగుల్ మీరా, జనసేన నాయకులు నాయబ్ కమాల్, ఎండీ నజీర్, నసీర్‌అహ్మద్, బాబావలి, అమీర్‌అలీ తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఇద్దరు అదనపు న్యాయమూర్తులకు పదోన్నతి

- శాశ్వత జడ్జీలుగా జస్టిస్ చక్రవర్తి, జస్టిస్ టి.మల్లికార్జునరావు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో అదనపు న్యాయమూర్తులుగా పనిచేస్తున్న జస్టిస్ బొప్పన వరాహ లక్ష్మీనరసింహ చక్రవర్తి, జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావులను అదే కోర్టులో శాశ్వత న్యాయమూర్తులుగా నియమించాలని సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. అలాగే బదిలీపై మధ్యప్రదేశ్ హైకోర్టుకు వెళ్లిన జస్టిస్ దుప్పల వెంకటరమణకు కూడా శాశ్వత న్యాయమూర్తిగా పదోన్నతి ఇవ్వాలని పేర్కొంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బీఆర్ గవాయ్‌తో కూడిన త్రిసభ్య కొలీజియం మంగళవారం సమావేశమై ఈ మేరకు సిఫారసులు చేసింది. 'నిరుడు ఫిబ్రవరి 24న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కొలీజియం ఈ ముగ్గురు అదనపు న్యాయమూర్తులను శాశ్వత న్యాయమూర్తులుగా నియమించాలని ఏకగ్రీవంగా సిఫారసు చేసింది. దానితో రాష్ట్ర ముఖ్యమంత్రి, గవర్నర్ కూడా ఏకీభవించారు. భారత ప్రధాన న్యాయమూర్తి నియమించిన ఇద్దరు సుప్రీంకోర్టు న్యాయమూర్తుల కమిటీ.. ఈ అదనపు న్యాయమూర్తుల తీర్పులను విశ్లేషించింది. తీర్పుల నాణ్యత బాగుందని నివేదించింది' అని సర్వోన్నత న్యాయస్థానం ఒక ప్రకటనలో వెల్లడించింది. వీరితో పాటు పంజాబ్-హరియాణా హైకోర్టులోని పది మంది అదనపు న్యాయమూర్తులు.. జస్టిస్ కుల్‌దీప్ తివారీ, జస్టిస్ గుర్బీర్ సింగ్, జస్టిస్ దీపక్ గుప్తా, జస్టిస్ అమర్‌జోత్ భట్టి, జస్టిస్ రీతూ ఠాగూర్, జస్టిస్ మనీషా బాత్రా, జస్టిస్ హర్‌ప్రీత్‌కౌర్ జీవన్, జస్టిస్ సుఖ్వీందర్ కౌర్, జస్టిస్ సంజీవ్ బెర్రీ, జస్టిస్ విక్రమ్ అగర్వాల్‌లను కూడా శాశ్వత న్యాయమూర్తులుగా నియమించాలని కొలీజియం సూచించింది.





కురుపాంలో లోకేశ్ నిర్వహించిన శంఖారావం సభకు హాజరైన జనం

# జైలు ఖాయం

(మొదటి పేజీ తరువాయి)

ప్రతి మహిళకు ముద్దులు పెట్టారని.. తర్వాత గుద్దులు గుద్దుతున్నారని విమర్శించారు. జాబ్ కేలెండర్ కాస్తా.. ఆయన పత్రిక కేలెండర్‌లా మారిందని ఎద్దేవాచేశారు. విశాఖ రైల్వే జోన్ ప్రధాన కార్యాలయానికి జగన్‌రెడ్డి భూములు కేటాయించలేదని.. కనీసం ఒక్క పరిశ్రమను కూడా ఉత్తరాంధ్రకు తీసుకురాలేదని ఆక్షేపించారు. రూ.500 కోట్లతో విశాఖ రుషికొండపై ప్యాలెస్ కట్టుకున్నాడని.. రేపు ఆ ప్యాలెస్‌ను ప్రజల కోసం ఉపయోగించే బాధ్యత టీడీపీ-జనసేన ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. 'విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు. అయితే విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరించేందుకు ప్రయత్నిస్తున్నారు. అవసరమైతే దానిని టీడీపీ-జనసేన ప్రభుత్వమే కొనుగోలు చేసి కాపాడుకుంటుంది' అని స్పష్టం చేశారు. మనం కొన్న భూమి పత్రాలపైన జగన్‌రెడ్డి ఫొటోలు పెట్టుకుంటున్నాడని.. సర్వే రాళ్లపైనా ఆయన బొమ్మలేనని ఆక్షేపించారు. మీ బిడ్డ, మీ బిడ్డ అంటూ భూములు లాక్కునే ప్రయత్నం చేస్తున్నాడని ఆరోపించారు. 45 ఏళ్ల దాటిన ఎస్టీ మహిళలకు పింఛన్ ఇస్తానని మోసం చేశాడని తెలిపారు. ఇంకా ఏమన్నారంటే..

### మాట తప్పాడు..

2.3 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు, ఏడాదికి 6,500 కానిస్టేబుల్ ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఎన్నికలకు ముందు చెప్పి ఇప్పుడు మాట తప్పాడు.. మడం తిప్పాడు. ఫీజు రీయింబర్స్‌మెంట్, విదేశీ విద్య ఎత్తేశాడు. బీసీ, ఎస్సీ, ఎస్టీ స్టడీ సర్కిళ్లను పూర్తిగా మూసివేసి విద్యార్థులకు అన్యాయం చేశాడు. ఇప్పుడు ఎన్నికలకు రెండు నెలల ముందు డీఎస్సీ నోటిఫికేషన్ పేరుతో డ్రామా ఆడుతున్నాడు. టీచర్ పోస్టులను తక్కువగా చూపాడు. అలాగే గ్రూప్-2 ఉద్యోగాలు కూడా 800 మాత్రమే చూపాడు. ఆ పరీక్ష ఐదు లక్షల మంది రాశారు. రూ.లక్షలు ఖర్చు పెట్టి కోచింగ్‌లు తీసుకుంటున్నారు. ఉద్యోగాలు లేక రాష్ట్రంలో పెద్ద ఎత్తున నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. అధైర్యపడవద్దు. రెండే రెండు మాసాలు ఓపిక పట్టండి. టీడీపీ-జనసేన ప్రభుత్వం వస్తుంది. ఏటా జాబ్ కేలెండర్ ఇస్తాం. ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తాం. జగన్ బల్లపైన బ్లూబటన్ నొక్కి రూ.10 వేసి.. కింద ఉన్న రెడ్‌బటన్ నొక్కి వంద రూపాయలు కాజేస్తున్నాడు. టీడీపీ తీసుకొచ్చిన వంద సంక్షేమ కార్యక్రమాలను రద్దు చేసిన ఏకైక ముఖ్యమంత్రి ఈయనే. చంద్రబాబు, పవన్ కలిసి 'సూపర్‌సిక్స్' రూపొందించారు. యువతకు 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇస్తాం. స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికీ రూ.15 వేలు ఇస్తాం. ప్రతి రైతుకు ఏటా రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తాం. మహిళలకు ఉచితంగా మూడు సిలెండర్లు ఇస్తాం. 18 ఏళ్ల నుంచి 59 ఏళ్ల లోపు మహిళలకు ప్రతి నెలా రూ.1,500 ఇస్తాం. ఐదేళ్లలో రూ.90 వేలు ఇస్తాం. మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే హక్కు కూడా కల్పిస్తాం.

### బాంబులకే భయపడని కుటుంబం మాది..

చట్టాలను ఉల్లంఘించి టీడీపీ నాయకులను, కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేసి అక్రమ కేసులు బనాయించిన వారి పేర్లు రెడ్‌బుక్‌లో రాశాను. దానికి డిమాండ్ బాగా పెరిగింది. చివరకు రెడ్ బుక్‌పై కూడా కేసు పెట్టారు. నాపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టావు. హత్యాయత్నం కేసు పెట్టావు. ఎన్ని కేసులు పెట్టుకుంటావో పెట్టుకో. తగ్గేదేలే. బాంబులకే భయపడని కుటుంబం మాది. కేసులకు భయపడతామా? తప్పు చేస్తే వచ్చి అరెస్టు చేసుకోండి. జగన్ ప్రభుత్వంపై పోరాడుతూ.. అక్రమ కేసులు ఎదుర్కొంటున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలకు నామినేటెడ్ పదవులిస్తాం.

### బిల్డప్ బాబాయ్..

జగన్‌ను చూస్తే బిల్డప్ బాబాయ్ గుర్తుకొస్తాడు. రూ.కోట్లు ఖర్చు పెట్టి యాత్ర-2 తీసి సినిమా చూడమంటే వైసీపీ ఎమ్మెల్యేలే పారిపోతున్నారు. 73 ఏళ్ల చంద్రబాబును అక్రమంగా జైల్లో పెడితే ఆయన చేసిన మంచి పనులు రోజుకొకటి బయటకు వచ్చాయి. జగన్‌ను జైల్లో పెడితే ఆయన చేసిన కుంభకోణాలు బట్టబయలయ్యాయి.

**కష్టించే తత్వం...**

ఉత్తరాంధ్ర ప్రజల రక్తంలోనే కష్టించే తత్వం ఉంది. మంచి పనిచేస్తే జీవితాంతం గుర్తు పెట్టుకుంటారు. ఎవరైనా హాని చేస్తే తాటతీస్తారు. గరిమెళ్ల సత్యనారాయణ, సర్దార్ గౌతు లచ్చన్న, ఎర్రన్నాయుడు పుట్టిన గడ్డ ఇది. ఇంత పవిత్ర భూమిపై మాట్లాడడం నా అదృష్టంగా భావిస్తున్నా.

**తల్లి, చెల్లే నమ్మడం లేదు**

సొంత తల్లి, చెల్లే జగన్‌రెడ్డిని నమ్మడం లేదు. అధికారంలోకి వచ్చాక వారిని ఇంటి నుంచి గెంటేశాడు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడితే షర్మిలపై వైసీపీ పేటీఎం కుక్కలు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నాయి. రెండు నెలలు ఆగండి. వారికి తగిన బుద్ధి చెబుతాం. సొంత చెల్లెళ్లకే రక్షణ కల్పించలేకపోతే రాష్ట్రంలోని మహిళలకు ఏం రక్షణ కల్పిస్తారు?

# 'తూర్పు'న పది సీట్లు క్లియర్!

### చినరాజప్ప, నెహ్రూ, బుచ్చయ్య సహా టీడీపీ అభ్యర్థులు ఖరారు

- 6 స్థానాలపై కొనసాగుతున్న కసరత్తు
- జనసేనకు మూడు సీట్లు
- మరో 2 స్థానాలపై తర్జనభర్జన

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పది స్థానాల్లో అభ్యర్థులపై టీడీపీకి పూర్తి స్పష్టత వచ్చింది. జిల్లాలో మొత్తం 19 అసెంబ్లీ స్థానాలకు గాను ఆరు సీట్లకు సంబంధించి ఇంకా స్పష్టత రావలసి ఉందని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఖరారైన పది మంది అభ్యర్థుల్లో.. పార్టీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడి కుమార్తె దివ్య-తుని, వరుపుల సత్యప్రభ-ప్రత్తిపాడు, నిమ్మకాయల చినరాజప్ప-పెద్దాపురం, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి-అనపర్తి, దాట్ల సుబ్బరాజు, బండారు సత్యానందరావు-కొత్తపేట, వేగుళ్ల జోగేశ్వరరావు-మండపేట, గోరంట్ల బుచ్చయ్య చౌదరి- రాజమండ్రి రూరల్, జ్యోతుల నెహ్రూ-జగ్గంపేట.. ఉన్నారు. రాజమండ్రి అర్బన్‌లో ఆదిరెడ్డి కుటుంబానికే టికెట్ ఖరారైంది. గత ఎన్నికల్లో ఇక్కడ టీడీపీ నుంచి ఎర్రన్నాయుడి కుమార్తె ఆదిరెడ్డి భవాని గెలిచారు. ఈసారి ఆమె స్థానంలో భర్త వాసు అక్కడ పోటీ చేయాలని అనుకున్నారు. పార్టీ నాయకత్వం కూడా ఇందుకు తొలుత అనుమతి ఇచ్చింది. కానీ సర్వేల్లో భవాని వైపే మొగ్గు వ్యక్తమవుతుండడంతో పునరాలోచనలో పడినట్లు ప్రచారం జరుగుతోంది. కాకినాడ రూరల్, రాజానగరం, రాజోలు సీట్లను పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించినట్లు సమాచారం. ఇందులో రాజానగరం, రాజోలు సీట్లలో తమ పార్టీ పోటీ చేస్తుందని ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అధికారికంగా ప్రకటించారు. ఇవి గాక జిల్లాలో మరో రెండు సీట్లను జనసేన ఆశిస్తోంది. వాటిలో పిఠాపురం ఒకటి. ఇక్కడ టీడీపీ మాజీ ఎమ్మెల్యే వర్మ బలమైన అభ్యర్థిగా ఉన్నారు. దీంతో ఈ సీటుపై ఆసక్తి నెలకొంది. ఈ రెండు స్థానాలపై తర్జనభర్జన జరుగుతోంది. మరో ఐదు స్థానాలపై టీడీపీ కసరత్తు కొలిక్కి రాలేదు. రామచంద్రపురం టికెట్ కోసం వాసంశెట్టి సుభాష్, డాక్టర్ కాడా వెంకటరమణ, రెడ్డి సుబ్రమణ్యం, పిల్లి అనంతలక్ష్మి, కుడిపూడి వెంకటేశ్వరరావు, రెడ్డి అనంతకుమారి, మేడిశెట్టి సత్యనారాయణ తదితరులు పోటీలో ఉన్నట్లు సమాచారం. అమలాపురంలో మాజీ ఎమ్మెల్యే ఆనందరావు వైపు మొగ్గు ఉన్నా మాజీ ఎంపీ బుచ్చిమహేశ్వరరావు కుమార్తె సత్యశ్రీ పేరు కూడా పరిశీలనలోకి వచ్చింది. ఆమె పేరు పి.గన్నవరాని(ఎస్సీ)కి కూడా పరిశీలిస్తున్నారు. ఆమెతోపాటు అక్కడ మహాసేన రాజేశ్, గంటి హరీశ్, మోకా బాల గణపతి, మోకా ఆనందసాగర్ పేర్లపై అధినాయకత్వం కసరత్తు చేస్తోంది. రంపచోడవరం(ఎస్టీ)లో మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి, శిరీషాదేవి, సున్నం వెంకటరమణ పేర్లు పరిశీలనలో ఉన్నాయి. కాకినాడ అర్బన్ సీటుపైనా టీడీపీ ఇంకా స్పష్టతకు రాలేదు. ఇక్కడ వనమాడి సుస్మిత, వనమాడి వెంకటేశ్వరరావు, పెనుపోతు తాతారావు, గుణ్ణం చంద్రమౌళి పేర్లు వినిపిస్తున్నాయి.

**'తూర్పు'న ఖరారైన టీడీపీ అభ్యర్థులు..**

| నియోజకవర్గం | అభ్యర్థి |
|---|---|
| తుని | యనమల దివ్య |
| ప్రత్తిపాడు | వరుపుల సత్యప్రభ |
| పెద్దాపురం | నిమ్మకాయల చినరాజప్ప |
| అనపర్తి | నల్లమిల్లి రామకృష్ణారెడ్డి |
| ముమ్మిడివరం | దాట్ల సుబ్బరాజు |
| కొత్తపేట | బండారు సత్యానందరావు |
| మండపేట | వేగుళ్ల జోగేశ్వరరావు |
| రాజమండ్రి అర్బన్ | ఆదిరెడ్డి కుటుంబం |
| రాజమండ్రి రూరల్ | గోరంట్ల బుచ్చయ్య చౌదరి |
| జగ్గంపేట | జ్యోతుల నెహ్రూ |
| రాజానగరం | జనసేన |
| రాజోలు (ఎస్సీ) | జనసేన |
| కాకినాడ రూరల్ | జనసేన |



# హైదరాబాద్ కావాలట!

### మరో రెండేళ్లు 'ఉమ్మడి'గా ఉండాలట

- జగన్ చిన్నాన్న వైవీ సుబ్బారెడ్డి ప్రకటన

విశాఖపట్నం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఒక్క రాజధాని అమరావతిని అటకెక్కించారు. మూడు రాజధానులంటూ ఊదరగొట్టారు. అందులోనూ విశాఖను పరిపాలనా రాజధానిగా ప్రకటించేశారు. ఇప్పుడు.. అన్నీ పక్కనపెట్టి మరో రెండేళ్లు హైదరాబాద్‌నే ఉమ్మడి రాజధానిగా ఉంచాలని కేంద్రాన్ని కోరతారట! ఇది ఎవరో చెప్పిన మాట కాదు! సీఎం జగన్ బాబాయ్, వైసీపీ కీలక నేత వైవీ సుబ్బారెడ్డి చెప్పిన మాట. మంగళవారం ఆయన విశాఖలో మాట్లాడుతూ.. "రాష్ట్ర విభజన సమయంలో హైదరాబాద్ పదేళ్లు ఉమ్మడి రాజధానిగా ఉంటుందని చట్టం చేశారు. ఆ గడువు ఈ జూన్‌తో ముగిసిపోతుంది. రాష్ట్రంలో మళ్లీ వైసీపీయే అధికారంలోకి వస్తుంది. సీఎంగా జగన్ విశాఖ నుంచి పాలన ప్రారంభిస్తారు. ప్రస్తుతం కొత్త రాజధానిని నిర్మించే పరిస్థితి లేదు. అందువల్ల... కనీసం రెండేళ్లయినా హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిగా ఉంచాలని కేంద్రాన్ని కోరుతాం. ఈ అంశం మా మేనిఫెస్టోలో కూడా ఉంటుంది" అని వైవీ అన్నారు. కాగా, రాజధాని లేని రాష్ట్రంగా నవ్యాంధ్ర ఏర్పడింది. రాజధాని ఏర్పడేదాకా, గరిష్ఠంగా పదేళ్లు హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా ఉంటుంది. అయితే.. అమరావతిని రాజధానిగా ప్రకటించి, కార్యాలయాలన్నీ తరలించేశారు. కేంద్రం కూడా అమరావతి ని రాజధానిగా నోటిఫై చేసింది. జగన్ వచ్చాక ఏపీ వాటాగా వచ్చిన భవనాలన్నీ అప్పటి కేసీఆర్ ప్రభుత్వానికి అప్పగించారు.

# హార్సిలీహిల్స్‌పైకే 'యాత్ర'!

- బ్రేకులుపడ్డ ప్రతిపాదనపై సీఎంవో ఒత్తిడి
- ఆరు నూరైనా కేటాయించాల్సిందే..
- అధికారులను పరుగులుపెట్టించిన వైనం
- యాత్ర-2 దర్శకుడికి భూ సంతర్పణకు వేగంగా పూర్తి అవుతున్న సన్నాహాలు
- సబ్ డివిజన్ కోసం ఫైల్ సిద్ధం
- హార్సిలీహిల్స్‌లో మినీస్టూడియో ఎవరికి లాభం?
- సీమలో చిత్రపరిశ్రమ అభివృద్ధి కోసమట!
- యాత్ర-2 దర్శకుడి వ్యాఖ్యలపై సందేహాలు
- రంగంలోకి కూలి మీడియా.. తప్పేంటంటూ అడ్డగోలు వాదన

(రాయచోటి, ఆంధ్రజ్యోతి)

యాత్ర-2 దర్శకుడు మహేంద్రరెడ్డికి హార్సిలీహిల్స్‌లో భూపందేరానికి జరుగుతున్న ప్రయత్నాలను ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు నిరసిస్తున్నాయి. ఇదేం అడ్డగోలు కేటాయింపు అంటూ మేధావులు ఆగ్రహిస్తున్నారు. జగన్‌ను గొప్పగా చిత్రీకరిస్తూ సినిమా తీసిన దర్శకుడి కోసం క్రీడా శిక్షణా కేంద్రానికి ఇచ్చిన భూవిని కూడా ప్రభుత్వం లాగేసుకుంటుందంటూ 'ఆంధ్రజ్యోతి' రాసిన వరుస కథనాలు కలకలం రేపాయి. ఎన్నికల వేళ ఇదేం తంటా అంటూ అధికారులు సైతం ముందుకెళ్లడానికి వెనుకాడారు. భూకేటాయింపు వ్యవహారానికి దాదాపు బ్రేకులు పడిన వాతావరణమే కనిపించింది. ఈ తరుణంలో ముఖ్యమంత్రి కార్యాలయం మంగళవారం హడావుడిగా తెరపైకి వచ్చింది. దర్శకుడు మహేంద్రరెడ్డికి రెండు ఎకరాల భూమిని సంతర్పణ చేసేందుకే ముఖ్యమంత్రి నిర్ణయించుకున్నట్లు అధికారులకు సీఎంవో తేల్చిచెప్పినట్టు తెలిసింది. ఆరు నూరైనా ఆ భూమిని కేటాయించాల్సిందేనని స్థానిక రెవెన్యూ అధికారులపై తీవ్ర ఒత్తిళ్లు తెచ్చినట్టు సమాచారం. వాస్తవానికి సీఎంవో నుంచి హుకుం అందే సమయానికి మదనపల్లె ఆర్డీవో, బి.కొత్తకోట తహసీల్దార్లు సాధారణ ఎన్నికల శిక్షణలో భాగంగా తిరుపతిలో ఉన్నారు. మధ్యాహ్నం వారు హుటాహుటిన మదనపల్లెకు వచ్చారు. మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఫైల్ సిద్ధం చేయడంలో చిన్నా,పెద్ద అధికారులు బిజీబిజీగా గడిపారు. ప్రస్తుతం శాప్ ఆధీనంలో ఉన్న సర్వేనంబరు 571/1లోని 3.74 ఎకరాలలో రెండు ఎకరాలు స్వాధీనం చేసుకునేందుకు ఫైల్ సిద్ధం చేసి, సాయంత్రానికి ఆర్డీవో హరిప్రసాద్ ముందుంచారు. ఎవరికైనా కేటాయించిన (సంస్థలైనా.. వ్యక్తులైనా.. ప్రభుత్వ శాఖలైనా) భూమిని మరొకరికి ఇవ్వాలంటే సాధారణంగా పెద్దతతంగమే ఉంటుంది. ముందు గతంలో కేటాయించిన వ్యక్తి నుంచి దానిని వెనక్కు తీసుకోవాలి. ఎందుకు వెనక్కి తీసుకుంటున్నారో.? అతనికి నోటీసు ద్వారా తెలియజేయాలి. నోటీసుకు సమాధానం ఇచ్చిన తర్వాత.. ప్రొసీజర్ ప్రకారం స్వాధీనం చేసుకోవాలి. లేదంటే.. న్యాయపరమైన ఇబ్బందులు ఎదురవుతాయి. ఇవేవీ పాటించకుండానే మంగళవారం రెవెన్యూ అధికారులు శాప్ ఆధీనంలో ఉన్న ఆ స్థలాన్ని వెనక్కి తీసుకునే ప్రక్రియ మొదలుపెట్టారని సమాచారం. అయితే, ఏ కారణాలతో క్రీడా శిక్షణా కేంద్రానికి కేటాయించిన స్థలాన్ని వెనక్కు తీసుకుంటున్నారు? ఈ విషయం గురించి అడిగితే.. మాకు తెలియదనే సమాధానం అధికారుల నుంచి వస్తోంది.

### అప్పనంగా భూమి కాజేసే యత్నం..

"ఇక్కడే పుట్టి ఇక్కడే చదువుకున్నా. అందుకే ఈ ప్రాంతం అభివృద్ధి కోసం మినీ స్టూడియో కట్టాలని అనుకున్నా. నా స్టూడియో కోసం యాభై, వందల ఎకరాలు అడగలేదు. మీరు చేయరు. చేసేవాడిని చేయనీయరు. కేవలం రెండు ఎకరాల్లో మినీస్టూడియో కట్టాలని అనుకుంటే మాత్రం రాద్ధాంతం చేస్తున్నారు.." ఇవీ యాత్ర-2 దర్శకుడు, నిర్మాత మహేంద్రరెడ్డి వ్యాఖ్యలు. ఇదేసమయంలో దర్శకునికి మద్దతుగా.. పేటీఎం బ్యాచ్ రంగంలోకి దిగింది. మినీస్టూడియో కట్టుకోవడానికి రెండు ఎకరాలు కేటాయిస్తే తప్పేంటి.. అంటూ ఎదురుదాడి ప్రారంభించింది. గతంలో అక్కినేని నాగేశ్వరరావు, కృష్ణ తదితరులు స్టూడియోలు కట్టుకోడానికి ప్రభుత్వాలు భూములు ఇవ్వలేదా అంటూ వాదనకు దిగుతోంది. అయితే హార్సిలీహిల్స్‌లో మినీస్టూడియో ఏర్పాటు చేస్తే... ఎవరికి లాభం? అసలు హార్సిలీహిల్స్ విలువ ఏంటి....ఇక్కడ ప్రైవేటు వ్యక్తులకు భూములు ధారాదత్తం చేయవచ్చా...ఒకవేళ చేసినా ఈ ప్రాంత ప్రజలకు ఏమేరకు దానివల్ల లాభం అనే కోణం ఇక్కడ ముఖ్యమైంది. రెండు ఎకరాల్లో మినీస్టూడియో అంటే, షూటింగులు జరుపుకోవడానికి దాదాపుగా వీలు ఉండకపోవచ్చు. షూటింగ్ తర్వాత.. డబ్బింగ్, రీరికార్డింగ్, ఎడిటింగ్ పనులు మాత్రమే ఇక్కడ చేసుకోవచ్చు. ఈ పనుల వల్ల రాయలసీమలో సినీరంగ అభివృద్ధి ఏ విధంగా జరుగుతుంది అనేది దర్శకుడే చెప్పాలి. ఇదంతా విలువైన భూమిని కొట్టేసే ఎత్తుగడ మాత్రమేనని పలువురు తేల్చేస్తున్నారు. మరోవైపు హార్సిలీహిల్స్‌లో ఉన్న భూమి విస్తీర్ణం 103 ఎకరాలు మాత్రమే.. ఇందులోనే.. ఏపీ టూరిజం, భారత్‌స్కౌట్స్ అండ్ గైడ్స్, రైల్వే, శానిటోరియం, బిల్డింగ్ సొసైటీ, సీడీపీఎంఎస్ తదితర 16శాఖలకు భూములను కేటాయించారు. పర్యాటక శాఖ ఆధీనంలో ఇంకా సుమారు 30 ఎకరాల వరకు భూమి ఉంది. హార్సిలీహిల్స్‌పై తక్కువ స్థలం ఉండడంతో.. ఇక్కడి భూమి అత్యంత విలువైనదిగా చెప్పవచ్చు. ఈ హిల్స్ చాలా ఎత్తులో ఉండడంతో ఇక్కడ ఎప్పుడూ చల్లగా ఉంటుంది. ఈ ప్రాంతాన్ని చూడడానికి.. ఇక్కడ గడపడానికి మన రాష్ట్రం నుంచే కాకుండా.. బయట రాష్ట్రాల నుంచీపర్యాటకులు వస్తూ ఉంటారు. దీంతో సంవత్సరం పొడవునా.. ప్రత్యేకించి వేసవిలో ఇక్కడ పర్యాటకుల సందడి ఎక్కువగా ఉంటుంది. పర్యాటకుల కోసం ఇక్కడ ఏపీ టూరిజం శాఖ ఆధ్వర్యంలో రెస్టారెంటు, కాటేజీలు ఉన్నాయి. ప్రైవేటు వ్యక్తుల ఆధ్వర్యంలో గెస్ట్‌హౌస్‌లు, హోటళ్లు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే, ఇక్కడ భూమి తీసుకుని, ఏదైనా వినోద కేంద్రం పెడితే లాభసాటిగా ఉంటుందని దర్శకుడు యోచిస్తున్నట్టు సమాచారం.

# వేడుక వెలవెల

### 'ఆడుదాం ఆంధ్రా' ముగింపు కార్యక్రమం తుస్సు

**జనం లేక గ్యాలరీలు ఖాళీ**

విశాఖపట్నం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన 'ఆడుదాం.. ఆంధ్రా' క్రీడా పోటీల ముగింపు వేడుకలు జనం లేకపోవడంతో వెలవెలబోయాయి. రాష్ట్ర ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించి ఈ క్రీడా పోటీల ముగింపు వేడుకలను నిర్వహించింది. ప్రభుత్వ ఆలోచనకు తగినట్టుగా విశాఖలోని పీఎం పాలెం స్టేడియంలో వైసీపీ నేతలు, అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ స్టేడియంలో 25 వేల మంది కూర్చునే అవకాశం ఉంది. ఆ మేరకు జనం తరలింపునకు 585 ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు. విశాఖలోని ప్రతి వార్డు నుంచి కనీసం 350 మందిని తరలించేలా ప్రణాళిక సిద్ధం చేశారు. కానీ, వేడుక ప్రారంభమయ్యేసరికి స్టేడియంలో జనం కనిపించలేదు. దీంతో పార్టీ నేతలతోపాటు అధికారులు కూడా కలవరపాటుకు గురయ్యారు. సీఎం జగన్ స్టేడియంలోకి వచ్చేలోగానైనా ఎంతోకొంతమందిని లోపలకు తీసుకురావాలని పార్టీ నేతలు, పోలీసులు తాపత్రయపడినా ఫలి తం దక్కలేదు. స్టేడియం పైఅంతస్తులోని గ్యాలరీలన్నీ ఖాళీగానే ఉండగా, కింద ఒక్క గ్యాలరీలో కూడా జనం పూర్తిగా కనిపించలేదు. కనీసం ఐదు వేల మంది కూడా రాలేదు. అలా వచ్చిన వారిలో అత్యధికులు డ్వాక్రా మహిళలు, వలంటీర్లే. దీంతో క్రికెట్ మ్యాచ్ నిర్వహించి నా కనీసం స్పందన కనిపించలేదు. అయితే, జనం భారీ గా వచ్చేస్తారనే ధీమాతో అధికారులు ముందుగా సీఎం జగన్ స్టేడియంలోకి రాగానే ఓపెన్‌టాపు జీపులో మైదానం చుట్టూ తిరుగుతూ అందరికీ అభివాదం చేస్తారని ప్రకటించారు. సీఎం జగన్ సాయంత్రం 6 గంటలకు స్టేడియంలోకి ప్రవేశించారు. అయితే, గ్యాలరీలన్నీ జనం లేక ఖాళీగా కనిపించడంతో తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. ఓపెన్‌టాపు జీపులో మైదానం చుట్టూ తిరిగేందుకు సైతం నిరాకరించారు.




కార్యక్రమం ప్రారంభం కాకముందే స్టేడియం నుంచి బయటకు వచ్చేస్తున్న మహిళలు

## ఏటా 'ఆడుదాం.. ఆంధ్రా'

### ముగింపు వేడుకల్లో సీఎం జగన్

'ఆడుదాం.. ఆంధ్రా' సక్సెస్ అయిందని, ఇకపై ఏటా నిర్వహిస్తామని సీఎం జగన్ తెలిపారు. విశాఖలోని ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో మంగళవారం 'ఆడుదాం.. ఆంధ్రా' ముగింపు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. 'ఆడుదాం ఆంధ్రా' ప్రధాన ఉద్దేశం ఆరోగ్యం, వ్యాయామం, క్రీడల పట్ల బాల, బాలికలకు అవగాహన పెంచడమేనన్నారు. క్రీడా నైపుణ్యం ఉన్నప్పటికీ సరైన గుర్తింపు లభించని మట్టిలో మాణిక్యాలను గుర్తించి, వారికి శిక్షణ ఇచ్చి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని చెప్పారు. క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్ క్రీడ ల్లో గత 47 రోజులుగా పోటీలు నిర్వహించగా 25.4 లక్షల మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు.

# జగన్.. జంతర్ మంతర్

(మొదటి పేజీ తరువాయి)

రూ.70 కోటట్లు విడుదల చేస్తూ మంగళవారం ఒక తప్పుడు జీవో కూడా విడుదల చేసింది. ఇదంతా... బ్యాంకులకు చెల్లించాల్సి వచ్చే రూ.1200 కోట్ల అప్పును తప్పించుకునేందుకే! ఆ భవనాలు పూర్తి కావడం అబద్ధం! అక్కడ అధికార్లు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు ఉండడం అబద్ధం! వారి కోసం రూ.70 కోట్లు అద్దె కడుతున్నామనడం కూడా అబద్ధమే!

### ఇదీ అసలు విషయం...

అమరావతిలో చంద్రబాబు హయాంలో ప్రజాప్రతినిధులు, ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, గెజిటెడ్, నాన్ గెజిటెడ్, గ్రూప్ 4 ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా వసతి భవన నిర్మాణం చేపట్టారు. అప్పట్లోనే 75 శాతం వరకు నిర్మాణం పూర్తయింది. వాటిని చంద్రబాబు హయాంలో బ్యాంకుల కన్సార్షియం నుంచి రూ.1,950 కోట్లు అప్పు తెచ్చి నిర్మించారు. 2017లో ఈ ప్రాజెక్టుల అంచనాలు తయారు చేసినప్పుడు రూ.2,560 కోట్లుగా నిర్ధారించారు. ఇందులో రూ.500 కోట్లు ప్రభుత్వం ఇవ్వాలి. మిగిలిన వాటిలో రూ.1950 కోట్లు బ్యాంకులు అప్పుగా ఇచ్చాయి. జగన్ హయాంలో ఐదేళ్లుగా పనులేమీ జరగలేదు. ప్రభుత్వం తన వాటాగా ఇవ్వాల్సిన వాటిలో రూ.500 కోట్లను ఇవ్వనేలేదు. నిర్మాణాలు పూర్తవడం మినహా ఇతర సౌకర్యాలేమీ ఆ భవనాలకు లేవు. ఒప్పందం ప్రకారం, 2023 ఫిబ్రవరి నాటికి నిర్మాణం పూర్తయిపోవాలి. కానీ, కాలేదు. అయితే, బ్యాంకు అధికారులు అడిగినప్పుడల్లా పూర్తయిందని, 2023 ఫిబ్రవరి నుంచి అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు అక్కడ నివాసముంటున్నారని అబద్ధం చెప్పారు. పూర్తిస్థాయిలో ఈ భవనాలను సిద్ధం చేయడం కోసం బ్యాంకులు గడువును 2024 ఫిబ్రవరి వరకు పెంచాయి. ఆ గడువు కూడా రానేవచ్చింది. ఇక అప్పు తిరిగి చెల్లించాల్సిందే. ఇప్పుడు ఏడాది నుంచి ప్రభుత్వం తాను చెప్తున్న అబద్ధాన్ని మరింత గట్టిగా చెప్పడం కోసం మంగళవారం అబద్ధాలతో కూడిన మరో జీవో ఇచ్చింది.

### జీవోలో ఏముందంటే..

2023 ఫిబ్రవరి నుంచి అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు ఆ భవనాల్లో ఉంటున్నందుకు 11 నెలల అద్దె రూ.70 కోట్లను సీఆర్‌డీఏ చెల్లించేందుకు అనుమతిస్తూ సాధారణ పరిపాలనా విభాగం (జీఏడీ) మంగళవారం జీవో ఇచ్చింది. సాధారణంగా ఒక ప్రాజెక్టు గడువు దాటిపోతే బ్యాంకులు ఆ ప్రాజెక్టును మొండిబకాయిగా ప్రకటిస్తాయి. ఇదే జరిగితే తీసుకున్న అప్పు అంతా ఒకేసారి బ్యాంకుకు చెల్లించాలి. సీఆర్డీఏ దివాలా స్థితిలో ఉంది కావున, గ్యారంటీ ఇచ్చిన ప్రభుత్వం మెడకే అది చుట్టుకుంటుంది. అందుకే 'అద్దె డ్రామాలు' మొదలుపెట్టింది.

### అదే అధికార్లు, ఉద్యోగులకు మళ్లీ రూ.40 కోట్లు

అదే ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులకు వసతి కోసం ప్రభుత్వం ఏడాదికి రూ.40 కోట్లు ఖర్చు చేస్తోంది. ఉద్యోగులకు ఉచిత వసతి గడువును ఇటీవలే పొడిగించారు. ఉద్యోగుల కోసం 134 ఫ్లాట్లను ప్రభుత్వం అద్దెకు తీసుకుంది. మంగళగిరి రెయిన్‌ట్రీలో, నవలూరు, ఉండవల్లి, గుంటూరు, తాడంకిలో ఈ ఫ్లాట్లున్నాయి. వీటికోసం ప్రభుత్వం నెలకు రూ.25 లక్షల అద్దె చెల్లిస్తోంది. ఇవి కాకుండా రాష్ట్రంలో అఖిలభారత సర్వీసు అధికారులకు అకామ్‌డేషన్ కోసం ఒక్కొక్కరికి నెలకు రూ.40,000 చెల్లిస్తున్నారు. రాష్ట్రంలో ఐఏఎస్, ఐఎఫ్ఎస్, ఐపీఎస్‌లు కలిసి దాదాపు 500 మంది ఉన్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు అకామ్‌డేషన్ కోసం ఒక్కొక్కరికి నెలకి రూ.50,000 ఇస్తున్నారు. ఇవన్నీ కలిపితే ఏడాదికి రూ.40 కోట్లు ఖర్చు కనిపిస్తోంది.

# సంతకాలతో సరి!

(మొదటి పేజీ తరువాయి)

అనేక కంపెనీలు ఉత్తుత్తి ఎంవోయూలు మాత్రమే చేసుకున్నట్లు స్పష్టమైంది. 'సంతకాలు చేశారుకానీ... తర్వాతి సంగతేమిటో తెలియదు. స్పందన కోసం ఎదురు చూస్తున్నాం'.. అన్నదే ఐటీ శాఖ ఇచ్చిన 'సమాచారం'. కడప, కర్నూలు, అనంతపురం లాంటి జిల్లాల్లో కొన్ని ఐటీ కంపెనీల ఏర్పాటుకు ఒప్పందాలు కుదిరినా అవి వెనక్కి తగ్గాయని వెల్లడించింది.

### ఇదీ వాటి లెక్క....

ఐటీ శాఖ తెలిపిన ప్రకారం... విశాఖ గ్లోబల్ సమ్మిట్‌లో 88 కంపెనీలతో ఒప్పందాలు కుదిరాయి. అందులో 65 ఐటీ, 23 ఎలక్ట్రానిక్ కంపెనీలు ఉన్నాయి. అయితే, ఒప్పందాలు కుదిరాక కంపెనీల ఏర్పాటుపై స్పందించేందుకు కంపెనీలు ఆసక్తిచూపలేదు. దీనర్థం.. ఇక అవి రానట్లే. మరికొన్ని కంపెనీలు 'మేం రావడంలేదు' అంటూ రాష్ట్రానికి గుడ్‌బై చెప్పేశాయి. వాటి ప్రతిపాదిత పెట్టుబడి భారీగానే ఉంది.

### వాటిపై 'సొంత' ముద్ర...

మరోవైపు ప్రభుత్వ పారిశ్రామిక పాలసీతో సంబంధం లేకుండా, ప్రభుత్వం నుంచి రాయితీలు పొందకుండా సొంతంగా విస్తరణ యూనిట్లను ఏర్పాటు చేసుకున్న కంపెనీలు తమ వల్లే వచ్చాయని జగన్ సర్కారు డబ్బా కొట్టుకుంటోంది. అందులో 'ఫ్లిప్‌కార్ట్' యూనిట్ ఒకటి. తాజాగా... ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి రూ.4178 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటు చేస్తున్న పరిశ్రమలకు వర్చువల్‌గా శంకుస్థాపనలు చేయబోతున్నట్లు ప్రకటించారు. 657 కోట్ల రూపాయల పెట్టుబడులకు సంబంధించిన ఆగ్రో యూనిట్లను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. దీనిపై సొంత మీడియాలో, కూలి మీడియాలో ఊదరగొడుతున్నారు. ఇన్నేళ్లలో తరిమేసిన కంపెనీలు ఎన్ని, విశాఖ సదస్సులో కుదిరిన ఎంవోయూలు ఏమయ్యాయి? ఆ మాట మాత్రం అడగొద్దు!

### పురోగతి పేరిట మస్కా

విశాఖ గ్లోబల్ సమ్మిట్‌లో ఒప్పందాలు చేసుకున్న కంపెనీలు భారీ పెట్టుబడులు పెడుతామని చెప్పాయి. ఆ పెట్టుబడులకు అతీగతీ లేదు. ఈ విషయం నేరుగా చెబితే పరువు పోతుందనే ఉద్దేశంతో... 'ఒప్పందాల అమలు పురోగతిలో ఉంది' అని ప్రభుత్వం చెబుతుండటం గమనార్హం. 'పురోగతి' అంటే ఏమిటి? కంపెనీల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైందా? కనీసం భూమిని కేటాయించారా? నిర్మాణాలు జరుగుతున్నాయా? ఇలాంటి వివరాలేవీ బయటపెట్టడంలేదు. 'పురోగతి'లో ఉన్నాయని చెబుతున్న ఎంవోయూలన్నీ భారీ పెట్టుబడులవే కావడం గమనార్హం. ఎస్2పీ సోలార్ సిస్టమ్(850 కోట్లు), సన్నీ ఓపోటెక్ లిమిటెడ్(2500కోట్లు), టీసీఎల్(5వేల కోట్లు), రఫే(వెయ్యికోట్లు)... ఇలా అనేక కంపెనీలతో కుదిరిన ఎంవోయూలు 'పురోగతి'లో ఉన్నట్లు ఐటీ శాఖ చెబుతోంది. కొన్నింటికి భూములు కేటాయించారని, కొందరు డీపీఆర్ సమర్పించారని తెలిపింది. మొత్తంగా చూస్తే... ఎంవోయూ కుదుర్చుకున్న తర్వాత.. అసలు ఏ విషయం చెప్పకుండా వదిలేసిన కంపెనీలే ఎక్కువగా ఉన్నట్లు స్పష్టమవుతోంది.

**2023 మార్చి 3, 4 తేదీల్లో విశాఖ సదస్సులో కుదిరిన కొన్ని ఒప్పందాల పరిస్థితి ఇది...**

| కంపెనీ | పెట్టుబడిహామీ | ఉద్యోగ హామీ | లొకేషన్ | తాజా పరిస్థితి |
|---|---|---|---|---|
| పల్సెస్‌గ్రూప్ | 525 కోట్లు | 10వేల మందికి | ఐటీ హిల్స్, విశాఖ | కంపెనీ స్పందన కోసం ఎదురుచూపు |
| వైజాగ్ టెక్‌పార్క్ లిమిటెడ్ | 21,844 కోట్లు | 39,815 మందికి | విశాఖ | పురోగతిలో ఉంది |
| ఆటోస్టేట్ టెక్నాలజీస్ | 350 కోట్లు | 3వేల మందికి | ఐటీ హిల్స్, విశాఖ | కంపెనీ స్పందన కోసం ఎదురుచూపు |
| టెక్‌వైసెన్ సాఫ్ట్‌వేర్ ప్రైవేటు లిమిటెడ్ | 300 కోట్లు | 2500 మందికి | ఐటీ హిల్స్, విశాఖ | కంపెనీ స్పందన కోసం ఎదురుచూపు |
| టెక్నోజెన్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ | 250 కోట్లు | 1000 మందికి | తుడా ఐటీపార్క్, తిరుపతి | కంపెనీ స్పందన కోసం ఎదురుచూపు |
| ఫ్లూయెంట్‌గ్రిడ్ లిమిటెడ్ | 100 కోట్లు | 500 మందికి | ఐటీ హిల్స్, విశాఖ | కంపెనీ కోసం ఎదురుచూపు |
| అద్వశ్రీఇన్ఫోటెయిన్‌మెంట్ | 100 కోట్లు | 1000 మందికి | ఐటీ పార్క్, తిరుపతి | కంపెనీ స్పందన ఎదురుచూపు |
| అచాట్ పయిమెంట్స్ లిమిటెడ్ | 100 కోట్లు | 2వేల మందికి | విశాఖపట్టణం | కంపెనీ స్పందన కోసం ఎదురుచూపు |
| వివిధ టెక్నాలజీస్ ఐఎన్‌సీ | 100 కోట్లు | 1350 మందికి | తిరుపతి | కంపెనీ స్పందన కోసం ఎదురుచూపు |
| ఆరుష్ సాఫ్ట్‌వేర్ | 59 కోట్లు | 1800 మందికి | ఐటీ హిల్స్-విశాఖ | కంపెనీ స్పందన కోసం ఎదురుచూపు |
| 7సీస్ఎంటర్‌టైన్‌మెంట్ లిమిటెడ్ | 56 కోట్లు | 500 మందికి | విజయవాడ | కంపెనీ స్పందన కోసం ఎదురుచూపు |
| లాస్య ఐటీ సొల్యూషన్స్ | 25 కోట్లు | 100 మందికి | విశాఖ-తిరుపతి | కంపెనీ స్పందన కోసం ఎదురుచూపు |
| రూట్‌హోట్ | 6 కోట్లు | 70మందికి | తిరుపతి | కంపెనీ స్పందన కోసం ఎదురుచూపు |
| నాజ్‌సాఫ్ట్ లిమిటెడ్ | 2 కోట్లు | 250మందికి | ఐటీ హిల్స్-విశాఖ | కంపెనీ స్పందన కోసం ఎదురుచూపు |
| కెకెఎమ్ అగ్రిప్రాజెక్టుఎలక్ట్రానిక్స్ | 135 కోట్లు | 2400 మందికి | విశాఖ | కంపెనీ వెనక్కి తగ్గింది |
| స్కైలైట్ విర్చువల్ టెక్నాలజీస్ | 80 కోట్లు | 200 మందికి | విశాఖ | కంపెనీ వెనక్కి తగ్గింది |
| ఓరియంట్ ఫైట్స్ లిమిటెడ్ | 50 కోట్లు | 1000 మందికి | కర్నూలు | కంపెనీ వెనక్కి తగ్గింది |

సుప్రీంలో జగన్ అక్రమాస్తుల కేసు

# విచారణ వాయిదా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసు విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. ఈ కేసులో సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తులు ఒకేసారి జరిగినా.. సీబీఐ కేసుల్లో తీర్పు వచ్చే దాకా ఈడీ కేసుల్లో తుది తీర్పు నిలిపివేయాలని తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఈడీ గతంలో సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఆ పిటిషన్‌పై మంగళవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. నిర్ణయాధికారం సీఆర్‌పీసీ సెక్షన్ 309 ప్రకారం ట్రయల్ కోర్టుకే ఉంటుందని అభిప్రాయపడింది. ఈ మేరకు ఆదేశాలిస్తామని తెలుపగా.. ఈ కేసుతో పాటు వేరే కేసులు కూడా ఉన్నాయని ఈడీ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. దీంతో తదుపరి విచారణను ధర్మాసనం రెండు వారాలకు వాయిదా వేసింది.

# ఇంకో రూ.2,000 కోట్ల అప్పు

- 68,000 కోట్లకు చేరిన మంగళవారం అప్పులు

అమరావతి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం కొత్తగా మరో రూ.2,000 కోట్లు అప్పు తెచ్చింది. రిజర్వ్ బ్యాంకు నిర్వహించిన వేలంలో ప్రభుత్వం సెక్యూరిటీలు విక్రయించి రూ.2,000 కోట్ల అప్పు తెచ్చింది. దీనిపై 7.4 శాతం వడ్డీ పడింది. ఈ రూ.2,000 కోట్లతో కలిపి ఈ ఆర్థిక సంవత్సరంలో జగన్ సర్కార్ తెచ్చిన మంగళవారం అప్పులు రూ.68,000 కోట్లకు చేరుకున్నాయి.


# ఒక్కరోజే 223 అతిసారం కేసులు

- నీరసించిన 24 మంది జీజీహెచ్‌కు తరలింపు
- హెల్త్ బులెటిన్‌ను నిలిపివేసిన ఆసుపత్రి వర్గాలు
- పై స్థాయి నుంచి ఒత్తిడే కారణం?

గుంటూరు(మెడికల్), ఫిబ్రవరి 13: గుంటూరు నగరంలో డయేరియా ప్రబలిన శారదా కాలనీ, ఇందిరా ప్రియదర్శిని కాలనీ, లాంచెస్టర్ రోడ్ తదితర ప్రాంతాల్లో మంగళవారం ఒక్కరోజే కొత్తగా 223 అతిసారం కేసులు వెలుగు చూశాయి. వీరిలో నీరసంగా ఉన్న 24 మందిని మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి(జీజీహెచ్)కి తరలించారు. కాగా, జీజీహెచ్ అధికారులు పై నుంచి వచ్చిన ఒత్తిడితో మంగళవారం హెల్త్ బులెటిన్ విడుదల చేయలేదు. కాగా, గుంటూరు నగరంలో అనారోగ్యాలకు కారణమౌతున్న పానీపూరిని నిషేధించాలని ప్రాంతీయ నీటి పరిశోధనశాల బ్యాక్టీరియాలజిస్ట్ డాక్టర్ జి.శోభారాణి.. గుంటూరు నగర పాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరికి లేఖ రాశారు.

# సజ్జలకు 2 చోట్ల ఓట్లు

- భార్య, కొడుకు, కోడలికి కూడా..
- మంగళగిరి, పొన్నూరు నియోజకవర్గాల్లో ఓటర్లుగా నమోదు
- ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధం
- ఎక్కడో ఒక చోట ఓట్లు తొలగించాలని ఫామ్-7 సమర్పించని సజ్జల ఫ్యామిలీ



గుంటూరు జిల్లా పొన్నూరు నియోజకవర్గంలో పోలింగ్ బూత్ నంబరు 31లో ఓటర్లుగా నమోదైన సజ్జల కుటుంబ సభ్యులు



మంగళగిరి నియోజకవర్గంలోని 132వ పోలింగ్ బూత్‌లో ఓటర్లుగా నమోదైన సజ్జల కుటుంబ సభ్యులు

గుంటూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): నిత్యం నీతులు వల్లె వేసే సకల శాఖా మంత్రి సజ్జల రామకృష్ణారెడ్డికి రాష్ట్రంలో రెండు చోట్ల ఓట్లు ఉన్నాయి. ఆయన సతీమణి, కుమారుడు, కోడలు కూడా రెండు చోట్ల ఓటర్లుగా నమోదయ్యారు. ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా సజ్జల కుటుంబం రెండు చోట్ల ఓట్లు నమోదు చేసుకొన్నారు. గుంటూరు లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని పొన్నూరు, మంగళగిరిలో వారికి ఓట్లు ఉన్నాయి. సజ్జల సతీమణి లక్ష్మి, సజ్జల, కుమారుడు భార్గవ, కోడలు నవ్య పొన్నూరు నియోజకవర్గంలోని పోలింగ్ బూత్ నంబరు 31లో సీరియల్ నంబర్లు 799, 800, 801, 802లో ఓటర్లుగా నమోదై ఉన్నారు. వీరికి ఏటీఐ సీరియల్‌తో ఎపిక్ నంబర్లు కూడా ఉన్నాయి. అలానే మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గంలోని పోలింగ్ బూత్ నంబరు 132లో 1089, 1090, 1091, 1105లో సజ్జల కుటుంబం ఓటర్లుగా నమోదైంది. ఇక్కడ ఎన్‌వైటీ సీరియల్‌తో ఎపిక్ కార్డులు పొందారు. ఇలా రెండు చోట్ల ఓటర్లుగా నమోదు కావడం ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధం. ఫామ్-7 సమర్పించి వాటిలో ఏదో ఒక ఓటు తొలగించాలని ఈఆర్‌వోకు దరఖాస్తు చేసుకోవాలి. అయితే ఎస్ఎస్ఆర్-2024 ప్రారంభమైన తర్వాత సజ్జల కుటుంబం ఆ పని చేయలేదు. కనీసం ఎన్నికల అధికారులు కూడా ఈ డబుల్ ఎంట్రీలను గుర్తించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. డబుల్ ఎంట్రీలు, డెమోగ్రాఫిక్, ఫొటోగ్రాఫిక్ సిమిలర్ ఎంట్రీలను ఇట్టే కనిపెట్టే సాఫ్ట్‌వేర్‌ను రూపొందించామని, దానిని అమలు చేయడం ద్వారా ఎన్నో డబుల్, ట్రిపుల్ ఎంట్రీలను తొలగించామని ఎన్నికల అధికారులు చెబుతుండటం ఒట్టి మాటలేనని తేలిపోతున్నాయి.

### ఎన్నెన్నో సందేహాలు..

సాధారణ ఓటర్లకు అయితే ఫొటోలు ఒకేలా లేకపోయినా మీకు ఫలాన చోట్ల ఓట్లు ఉన్నాయని అధికారులు నోటీసులు పంపించి, వాటిలో ఏ ఓటు ఉంచుకోదలిచారో తమకు తెలియజేయాలని సూచిస్తారు. అదే అధికార పార్టీ నేతలకు వేర్వేరు చోట్ల ఓట్లున్నా వాటి జోలికి పోవడం లేదు. సజ్జల కుటుంబానికి చెందిన ఓట్లే రెండు చోట్ల ఉన్నాయంటే ఇక చోటా మోటా వైసీపీ నాయకులు ఎన్ని చోట్ల డబుల్, ట్రిపుల్ ఎంట్రీలు చేయించుకున్నారోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బీఎల్‌వోలు, ఏఈఆర్‌వో, ఈఆర్‌వోతో పాటు ఇతర ఎన్నికల అధికారులను వైసీపీ తన గుప్పిట్లో పెట్టుకొని ఓటర్ల జాబితాలో చేయని అక్రమాలంటూ ఏవీ లేవు. ప్రతిపక్ష పార్టీలకు సానుభూతిపరులుగా ఉండే ఓటర్లను తొలగించారనే ఆరోపణలు ఉన్నాయి. వైసీపీ సానుభూతిపరులు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినా ఆ ఓట్లను యథాతథంగా కొనసాగించారు. ఓటర్ల జాబితాలో వైసీపీ అక్రమాలకు పాల్పడుతోందంటూ టీడీపీ, జనసేన, బీజేపీ పలుమార్లు ఎన్నికల సంఘం రాష్ట్ర, కేంద్ర అధికారులను కలిసి ఫిర్యాదులు కూడా చేశాయి. గుంటూరులో కంటితుడుపు చర్యగా అక్రమంగా ఫామ్-7లు పెట్టారని నలుగురిపై కేసులు పెట్టి చేతులు దులుపుకొన్నారు. ఇప్పుడు ఏకంగా ప్రభుత్వ పెద్దే బాధ్యతారహితంగా రెండు చోట్ల ఓటరుగా నమోదు కావడంపై అధికారులు ఏమి సమాధానం చెబుతారని ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

### క్యాంప్ ఆఫీసు క్లర్కు... రెడ్ హ్యాండెడ్‌గా బుక్: నరేంద్ర

సజ్జల కుటుంబం రెండు చోట్ల ఓట్లు పొందడంపై టీడీపీ నేత ధూళిపాళ్ల నరేంద్రకుమార్ 'ఎక్స్' (ట్విటర్)లో స్పందించారు. 'క్యాంపు ఆఫీసు క్లర్కు... రెడ్‌హ్యాండెడ్‌గా బుక్' అంటూ చేసిన పోస్టు సామాజికమాధ్యమాల్లో వైరల్ అవుతోంది. 'రెండు చోట్ల దొంగ ఓట్లతో సలహాల రెడ్డి అడ్డంగా దొరికాడు. పొన్నూరులో ఒక ఓటు.. మంగళగిరలో మరో ఓటు' అంటూ ధూళిపాళ్ల నరేంద్ర ఎక్స్‌లో పోస్టు చేసి కేంద్ర ఎన్నికల సంఘం, సీఈవో ఆంధ్ర, గుంటూరు కలెక్టర్‌కు ట్యాగ్ చేశారు. ఫేక్ ఓటర్స్, డూప్లికేట్ ఓటర్స్, వైసీపీ క్రిమినల్ పాలిటిక్స్, ఏపీ హేట్స్ జగన్ అంటూ హ్యాష్‌ట్యాగ్ చేశారు. ఆధారాలతో సహా సజ్జల దొంగ ఓట్లను ధూళిపాళ్ల బహిర్గతం చేయడం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.



ఆంధ్రతో ఆడుకున్నది


# చాలు మహాప్రభో!

- జగన్ చిత్రపటానికి నమస్కరించి నిరసన తెలిపిన జన జాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు

పెదవాల్తేరు (విశాఖపట్నం), ఫిబ్రవరి 13: గత ఐదేళ్లుగా ఆంధ్రప్రదేశ్‌తో ఆడుకున్నది చాలు మహాప్రభో అంటూ సీఎం జగన్ చిత్రపటానికి జన జాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు నమస్కరించారు. 'ఆడుదాం...ఆంధ్ర' ముగింపు కార్యక్రమానికి మంగళవారం ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి హాజరైన నేపథ్యంలో ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై ఆయన స్పందించారు. ఆంధ్రతో ఆడుకున్నది చాలంటూ వ్యంగ్యంగా నిరసన తెలిపారు. మూడు రాజధానుల పేరుతో ముఖ్యమంత్రి జగన్ మాయ మాటలు చెప్పి, అసలు ఆంధ్రప్రదేశ్‌కు రాజధానే లేకుండా చేశారన్నారు. పోలవరం ప్రాజక్టును పూర్తి చేయలేక గాలికి వదిలేశారన్నారు. వైసీపీ అసమర్థ పాలనను తెలుసుకున్న ప్రజలు పోలవరం గురించి మాట్లాడుకోవడం మానేశారన్నారు.

# హోదా ఇవ్వకుంటే బీజేపీ ఓటమి కోసం పనిచేస్తాం

- విభజన హామీలు అమలు చేయాలి: చలసాని శ్రీనివాస్



డాబాగార్డెన్స్ (విశాఖపట్నం), ఫిబ్రవరి 13: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వకుండా, విభజన హామీలను అమలు చేయకుండా వచ్చే ఎన్నికల్లో బీజేపీ పోటీ చేస్తే కచ్చితంగా ఓడించే ప్రయత్నం చేస్తామని ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ అన్నారు. 'రాబోయే ఎన్నికల్లో బీజేపీ ఎక్కడ పోటీ చేస్తే అక్కడ కచ్చితంగా ఓడించే ప్రయత్నం చేస్తాం. గతంలో కర్ణాటకలో కూడా మేం ఇదే విధంగా ప్రయత్నించాం. ప్రత్యేక హోదా, విభజన హామీలన్నీ అమలు చేస్తే బీజేపీ అధికారంలోకి వచ్చినా మాకు అభ్యంతరం లేదు. సాధన సమితి చిత్తశుద్ధితో గత పదేళ్లుగా పోరాడుతుంది. ఏ రోజూ వెనకడుగు వేయలేదు. ఎన్నికల సమయంలో దానిని వివిధ పార్టీలు రాజకీయ అస్త్రంగా వాడుకోవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం. చిత్తశుద్ధితో పోరాడి మేనిఫెస్టోలో పెట్టి సాధించాలని కోరుతున్నాం. స్వతంత్ర్యంగా రాష్ట్ర హక్కుల కోసం చంద్రబాబు, పవన్ కల్యాణ్ పోరాడాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ (బీజేపీ) పొత్తు వద్దు.' అని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక హోదా సాధన సమితి ప్రధాన కార్యదర్శి వీవీ లక్ష్మీనారాయణ, సీపీఐ, సీపీఎం నేతలు ఎం.పైడిరాజు, జగ్గునాయుడు, ఆచార్య జీ అప్పలనాయుడు, హోదా సాధన సమితి సహాయ కార్యదర్శి కునిశెట్టి సురేశ్‌బాబు, జీవీ శాస్త్రి, ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ సీ రమేష్, ఆంధ్ర మేధావుల వేదిక అధ్యక్షులు శీతల్ మదన్ తదితరులు పాల్గొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● బుధవారం 14 ఫిబ్రవరి 2024

మద్రాస్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)- డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. వీటిని ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తారు. ప్రోగ్రామింగ్, డేటా సైన్స్ విభాగాల్లో ఒకటి ఎంచుకోవచ్చు. సంస్థ నిర్వహించే క్వాలిఫయర్ ఎగ్జామ్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి 8 నెలలు. ఒక్కో ప్రోగ్రామ్‌లో 8 కోర్సులు, రెండు ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటాయి. వీటికి మొత్తం 35 క్రెడిట్స్ నిర్దేశించారు. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు, ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు దరఖాస్తు చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు. వర్కింగ్ ప్రొఫెషనల్స్, నిరుద్యోగులు సహా ఆసక్తిగలవారందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. ఈ ప్రోగ్రామ్‌లు పూర్తిచేసినవారు ఇంజనీరింగ్ అర్హత లేకున్నా ప్రోగ్రామర్లుగా, డేటా సైంటిస్ట్‌లుగా రాణించవచ్చు.

# ఐఐటీ మద్రాస్‌లో డిప్లొమా



## ప్రోగ్రామ్ వివరాలు

- 'డిప్లొమా ఇన్ ప్రోగ్రామింగ్'లో కంప్యూటేషనల్ థింకింగ్, ప్రోగ్రామింగ్ ఇన్ పైథాన్, డేటాబేస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్, ప్రోగ్రామింగ్-డేటా స్ట్రక్చర్స్-అల్గారిథమ్స్ యూజింగ్ పైథాన్, మోడరన్ అప్లికేషన్ డెవలప్‌మెంట్ - 1 & 2, ప్రోగ్రామింగ్ కాన్సెప్ట్ యూజింగ్ జావా, సిస్టమ్ కమాండ్స్ కోర్సులు ఉంటాయి. మోడరన్ అప్లికేషన్ డెవలప్‌మెంట్‌కు సంబంధించి రెండు ప్రాజెక్ట్‌లు పూర్తిచేయాల్సి ఉంటుంది.
- 'డిప్లొమా ఇన్ డేటా సైన్స్'లో మేథమెటిక్స్ & స్టాటిస్టిక్స్ ఫర్ డేటా సైన్స్, మెషిన్ లెర్నింగ్ ఫౌండేషన్స్ - టెక్నిక్స్ - ప్రాక్టీస్, బిజినెస్ డేటా మేనేజ్‌మెంట్, బిజినెస్ అనలిటిక్స్, టూల్స్ ఇన్ డేటా సైన్స్ కోర్సులు ఉంటాయి. బిజినెస్ డేటా మేనేజ్‌మెంట్‌కు సంబంధించి ఒక ప్రాజెక్ట్, మెషిన్ లెర్నింగ్ ప్రాక్టీస్‌కు సంబంధించి మరో ప్రాజెక్ట్ పూర్తిచేయాలి.
- ప్రోగ్రామ్‌లో భాగంగా ఆన్‌లైన్ వీక్లీ అసైన్‌మెంట్‌లు, మంత్లీ క్విజ్‌లు, ప్రోగ్రామింగ్ ఎగ్జామ్‌లు, వైవా, ఎండ్ టర్మ్ ఎగ్జామ్ ఉంటాయి.

## క్వాలిఫయర్ ఎగ్జామ్ వివరాలు

- 'డిప్లొమా ఇన్ ప్రోగ్రామింగ్'లో ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో ఇంగ్లీష్, ఆప్టిట్యూడ్, బేసిక్ మేథమెటిక్స్ పేపర్లు ఉంటాయి. ఇంగ్లీష్ పేపర్ 25 మార్కులకు ఉంటుంది. ఇందులో రీడింగ్ కాంప్రహెన్షన్, లిజెనింగ్ ఎబిలిటీ, గ్రామర్, రైటింగ్ అంశాలనుంచి ప్రశ్నలు ఇస్తారు. మేథమెటిక్స్ పేపర్‌లో సెట్ థియరీ, నెంబర్ సిస్టమ్, కోఆర్డినేట్ జామెట్రీ, క్వాడ్రాటిక్ ఫంక్షన్స్, పాలినామియల్స్, ఫంక్షన్స్, లాగరిథమ్స్, గ్రాఫ్ థియరీ అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఆప్టిట్యూడ్ పేపర్‌లో లాజికల్ రీజనింగ్ నుంచి ప్రశ్నలు ఇస్తారు. పరీక్ష సమయం 3 గంటలు.
- 'డిప్లొమా ఇన్ డేటా సైన్స్'లో ప్రవేశానికి నిర్వహించే ఎగ్జామ్‌లో ఇంగ్లీష్, ప్రోగ్రామింగ్ ఇన్ పైథాన్, మేథమెటిక్స్, స్టాటిస్టిక్స్ పేపర్లు ఉంటాయి. ఇంగ్లీష్, మేథమెటిక్స్ పేపర్లు పై ప్రోగ్రామ్‌నకు నిర్వహించే వాటి మాదిరిగానే ఉంటాయి. పైథాన్ పేపర్‌లో వేరియబుల్స్, బేసిక్ టైప్స్-స్ట్రింగ్-ఇంటీజర్-ఫ్లోట్-బూలియన్, ఆపరేటర్స్ అండ్ ఎక్స్‌ప్రెషన్స్, బేసిక్ ఇన్‌పుట్-ఔట్‌పుట్, స్ట్రింగ్స్-స్లైసింగ్-ఇండెక్సింగ్-మెథడ్స్, కండిషనల్ స్టేట్‌మెంట్స్, లూప్స్, లిస్ట్స్, ఫంక్షన్స్, కలెక్షన్స్, ఫైల్ హ్యాండిలింగ్ అంశాల నుంచి ప్రశ్నలు ఇస్తారు. స్టాటిస్టిక్స్ పేపర్‌లో డేటా, స్కేల్స్ ఆఫ్ మెజర్‌మెంట్, డేటా ఫ్రీక్వెన్సీ, వేరియబుల్స్, ప్రాబబిలిటీ, వేరియెన్స్ తదితర అంశాలనుంచి ప్రశ్నలు ఇస్తారు. పరీక్ష సిలబస్‌లో లేనప్పటికీ కంప్యూటేషనల్ థింకింగ్‌కు సంబంధించిన మల్టిపుల్ ఇటరేషన్స్, ఫిల్టరింగ్, ఫ్లో చార్ట్, సైడ్ ఎఫెక్ట్‌లు, గ్రాఫ్, మాట్రిక్స్, ట్రీ, బ్యాక్ ట్రాకింగ్, క్లాసిఫికేషన్ తదితర సాంకేతిక అంశాలపై అవగాహన ఉండాలి. పరీక్ష సమయం 4 గంటలు.
- క్వాలిఫయర్ ఎగ్జామ్‌లో అర్హత సాధించాలంటే జనరల్ అభ్యర్థులకు ఒక్కో పేపర్‌లో కనీసం 40 శాతం చొప్పున మొత్తమ్మీద కనీసం 50 శాతం మార్కులు; ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఒక్కో పేపర్‌లో కనీసం 35 శాతం చొప్పున మొత్తమ్మీద కనీసం 45 శాతం మార్కులు; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఒక్కో పేపర్‌లో కనీసం 30 శాతం చొప్పున మొత్తమ్మీద కనీసం 40 శాతం మార్కులు రావాలి. వీరు మాత్రమే సంబంధిత డిప్లొమా ప్రోగ్రామ్‌నకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

**ముఖ్య సమాచారం**

- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.70,500
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.6,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.3,000; ఎస్సీ, ఎస్టీ కేటగిరీలకు చెందిన దివ్యాంగులకు రూ.1500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 29
- **క్వాలిఫయర్ ఎగ్జామ్ తేదీ:** ఏప్రిల్ 28
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్, విజయవాడ, గుంటూరు, భీమవరం, విశాఖపట్నం, రాజమండ్రి, అనంతపురం, కడప, కర్నూలు, తిరుపతి.
- **ప్రోగ్రామ్ రిజిస్ట్రేషన్:** మే 15, 16
- **తరగతులు ప్రారంభం:** మే 31 నుంచి
- **వెబ్‌సైట్:** diploma.iitm.ac.in

## బిర్లా ఇన్‌స్టిట్యూట్‌లో

# ఫెలో ప్రోగ్రామ్‌లు

గ్రేటర్ నోయిడాలోని బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీ(బీఐఎంటీఈసీహెచ్)- మేనేజ్‌మెంట్ విభాగంలో ఫెలో ప్రోగ్రామ్, ఎగ్జిక్యూటివ్ ఫెలో ప్రోగ్రామ్‌లను అందిస్తోంది. వీటికి ఏఐసీటీఈ గుర్తింపు ఉంది. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. వీటిలో 18 నెలలు కోర్సు వర్క్, 30 నెలలు రీసెర్చ్ వర్క్ ఉంటాయి. వారాంతాల్లో కోర్సు వర్క్‌కు సంబంధించిన తరగతులు నిర్వహిస్తారు.

**రీసెర్చ్ అంశాలు:** బిజినెస్ కమ్యూనికేషన్, ఎకనామిక్స్, ఫైనాన్స్-ఇన్సూరెన్స్-రిస్క్ మేనేజ్‌మెంట్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, మార్కెటింగ్ అండ్ రిటైల్, హెచ్‌ఆర్, ఆపరేషన్స్ అండ్ డెసిషన్ సైన్స్, స్ట్రాటజీ-ఇన్నొవేషన్-అంత్రప్రెన్యూర్‌షిప్, సస్టయినబిలిటీ-సీఎస్‌ఆర్

**అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ/మేనేజ్‌మెంట్/ఎకనామిక్స్/సోషల్ సైన్స్/కామర్స్/హ్యూమానిటీస్ విభాగాల్లో ప్రథమ శ్రేణి మార్కులతో మాస్టర్స్ డిగ్రీ/ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్ ప్రోగ్రామ్ పూర్తిచేసి ఉండాలి. బీకాం డిగ్రీతోపాటు ద్వితీయ శ్రేణి మార్కులతో సీఏ/సీఎస్/ఐసీడబ్ల్యూఏఐ పూర్తిచేసినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఎగ్జిక్యూటివ్ ఫెలో ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి బోధన/మేనేజ్‌మెంట్/ఎగ్జిక్యూటివ్ విభాగాల్లో కనీసం అయిదేళ్ల అనుభవం ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 మార్చి 31 నాటికి ఫెలో ప్రోగ్రామ్‌నకు 45 ఏళ్లు, ఎగ్జిక్యూటివ్ ఫెలో ప్రోగ్రామ్‌నకు 50 ఏళ్లు మించకూడదు.

**ఎంపిక:** రీసెర్చ్ ప్రపోజల్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. క్యాట్ 2023లో 60 శాతానికి పైగా స్కోర్/జీమ్యాట్(2018 జూన్ నుంచి 2024 జనవరి)లో 400కు పైగా స్కోర్/నెట్-మేనేజ్‌మెంట్(2021/ 2022)లో 75 శాతానికి పైగా స్కోర్ ఉన్నవారికి అదనంగా అయిదు శాతం వెయిటేజీ ఇస్తారు.

**స్కాలర్‌షిప్:** ఫెలో ప్రోగ్రామ్‌లో చేరిన అభ్యర్థులకు మొదటి ఏడాది నెలకు రూ.40,000; రెండో ఏడాది నెలకు రూ.45,000; చివరి రెండేళ్లు నెలకు రూ.50,000 చెల్లిస్తారు. ల్యాప్‌టాప్, సాఫ్ట్‌వేర్ కొనుగోలు; జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించే సెమినార్‌లు, కాన్ఫరెన్స్‌లకు హాజరయ్యేందుకు వన్ టైం రీసెర్చ్ గ్రాంట్ కింద రూ.1,80,000 ఇస్తారు.

**ముఖ్య సమాచారం**

- **దరఖాస్తు ఫీజు:** రూ.3,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 15
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** జూలై 13 నుంచి
- **వెబ్‌సైట్:** fpm.admissions.bimtech.ac.in



## లిటిల్స్




## మీకు తెలుసా?

- మనదేశంలో హిమాలయాలతో పాటు నేపాల్, భూటన్, చైనా, మయన్మార్ దేశాల్లో ఉండే ఈ పక్షిని 'బ్లడ్ ఫీజంట్' అని పిలుస్తారు.
- 43 సెం.మీ. ఉండే ఈ పక్షికి బూడిద రంగు రెక్కలు, రెక్కల కింద తెలుపు, లేత ఆకుపచ్చ, ఎరుపు ఉంటుంది. బాగా గమనిస్తే వీటి రెక్కల కాంబినేషన్‌లో పన్నెండు రంగులు కనిపిస్తాయి.
- ఆడపక్షులు డల్‌బ్రౌన్ రంగులో ఉంటాయి. వీటికంటే మగపక్షులు కాస్త పెద్దవి.
- పురుగులు, నత్తలు, సీతాకోకచిలుకలను తింటాయివి.
- వెదురుచెట్లు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో .. దీంతో పాటు నీటి కుంటలకు అతి దగ్గరలో జీవించటానికి ఇష్టపడతాయి.



- బరువు కేజీలోపు మాత్రమే ఉంటాయి.
- కోళ్లమాదిరే ఇవి రెండు లేదా అంత కంటే ఎక్కువ పక్షులు సంచరిస్తుంటాయి.
- నాలుగు నుంచి పద్నాలుగు గుడ్లు పెడతాయి. వీటి పొదిగే కాలం ఇరవై ఏడు రోజుల నుంచి 31 రోజుల వరకూ.
- ఎండ పెరిగితే మంచు ప్రాంతాలకు, చలి ఎక్కువైతే మంచులేని ప్రాంతాలకు వెళ్లిపోతాయి.
- ఇవి హంటర్స్. ముఖ్యంగా వాటి గుంపులోని వాటితో కాకుండా మిగతా గుంపులో ఉండేవాటితో పోట్లాడతాయి.


### 5 తేడాలను గుర్తించండి



### దారి కనుక్కోండి




### సరైన నీడ ఏది?




### పదాలను పూరించండి

AP _ _ E
C _ RR _ T
B _ NA _ A
BRO _ CO _ I
LE _ _ N
AVO _ _ DO

### డైలీ సుడోకు - 229

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 8 | | | | | | | | |
| | | | 7 | | 5 | | 9 | 8 |
| 9 | | | | | 8 | 5 | | |
| 4 | 8 | 6 | | | 1 | | | |
| 1 | | 9 | | | | 4 | | 5 |
| | | | 9 | | | 3 | 8 | 1 |
| | | 2 | 1 | | | | | 9 |
| 6 | 4 | | 2 | | 9 | | | |
| | | | | | | | | 4 |

**సుడోకు - 228 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 3 | 4 | 7 | 5 | 2 | 6 | 1 | 9 | 8 |
| 8 | 9 | 2 | 7 | 1 | 3 | 4 | 5 | 6 |
| 6 | 5 | 1 | 9 | 4 | 8 | 2 | 7 | 3 |
| 7 | 3 | 9 | 1 | 6 | 5 | 8 | 2 | 4 |
| 2 | 8 | 6 | 4 | 3 | 9 | 5 | 1 | 7 |
| 4 | 1 | 5 | 2 | 8 | 7 | 6 | 3 | 9 |
| 9 | 7 | 4 | 6 | 5 | 2 | 3 | 8 | 1 |
| 5 | 6 | 3 | 8 | 7 | 1 | 9 | 4 | 2 |
| 1 | 2 | 8 | 3 | 9 | 4 | 7 | 6 | 5 |

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

## SCHOLARSHIP ALERT

### Bhalodia-Khetan Summer Research Excellence Award

***Description:*** Bhalodia-Khetan Summer Research Excellence Award 2024 is an opportunity offered by the Indian Institute of Technology, Gandhinagar to honor and recognise outstanding research conducted by students participating in the Summer Research Internship Program (SRIP) at IIT Gandhinagar.

***Eligibility:*** Open for students who have completed the Summer Research Internship Programme (SRIP) under the faculty guides' evaluation at the Indian Institute of Technology (IIT), Gandhinagar.

***Prizes & Rewards:*** An award of 50,000 (one-time)

***Last Date to Apply:*** 05-03-2024

***Application mode:*** Online Applications Only

***Short Url:*** www.b4s.in/aj/BKSA1

### National AIDS Control Organisation Internship Programme

***Description:*** National AIDS Control Organisation (NACO) Internship Programme 2024 is an opportunity offered by the Ministry of Health & Family Welfare, Government of India for students pursuing undergraduate, postgraduate, M.Phil and Ph.D. degree courses in various disciplines.

***Eligibility:*** Open for Indian nationals pursuing undergraduate, postgraduate, M.Phil, and Ph.D. degree courses in specified disciplines.

***Prizes & Rewards:*** A monthly stipend of 8,000 and a completion certificate

***Last Date to Apply:*** Round The Year

***Application mode:*** via post or email at: Deputy Secretary National AIDS Control Organisation (NACO) 9th Floor, Chandralok Building, 36, Janpath, New Delhi – 110001 Email ID: naco.internship@gmail.com ***Short Url:*** www.b4s.in/aj/NACO1

### Summer Research Internship Program (SRIP)

***Description:*** Summer Research Internship Program (SRIP) 2024 is a research opportunity offered by the Indian Institute of Technology, Gandhinagar, to students pursuing bachelor's or master's degrees at institutions in India.

***Eligibility:*** Open for Indian nationals pursuing a bachelor's or master's degree at an Indian institution.

***Prizes & Rewards:*** A weekly stipend of 2,000 and other benefits. ***Last Date to Apply:*** 05-03-2024

***Application mode:*** Online Only

***Short Url:*** www.b4s.in/aj/SRIP2

buddy4study.com

## పోటీ పరీక్షల ప్రత్యేకం

# రీజనింగ్

# లెటర్ సిరీస్

**పార్ట్-3**

1. L - NMMN - NNL - L - MN -
(ఎ) MLLMM (బి) MLMLM
(సి) LLMMM (డి) ఏదీకాదు

**సమాధానం:** (బి)

**వివరణ:** ఆప్షన్ (బి)లోని అక్షరాలను ఇచ్చిన ప్రశ్నలోని ఖాళీలలో పూరించిన సిరీస్ కింది విధంగా ఉంటుంది.

LMNM / MNLN / NLML / LMNM

ప్రతి సమూహంలోను మొదటి మూడు అక్షరాలు LMN / MNL /NLM / LMN కింది పద్ధతిని అనుసరించాయి. మొదటి సమూహంలో చివరి రెండు అక్షరాలు రెండో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, మొదటి సమూహంలో మొదటి అక్షరం రెండో సమూహంలో చివరి అక్షరంగా ఏర్పడింది. అదే విధంగా రెండో సమూహంలోని చివరి రెండు అక్షరాలు మూడో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, రెండో సమూహంలోని మొదటి అక్షరం మూడో సమూహంలో చివరి అక్షరంగా ఏర్పడింది. ఈ విధంగా ఒక కచ్చితమైన చైన్ పద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది. అంతేకాక ప్రతి సమూహంలో రెండో అక్షరమే తిరిగి నాలుగో అక్షరంగా రిపీట్ అయింది.

∴ సిరీస్‌లో వదిలేసిన అక్షరాలు MLMLM



2. a - bcb - cac - a - aa - c
(ఎ) abcbb (బి) abbcb (సి) abbbc (డి) ఏదీకాదు

**సమాధానం:** (ఎ)

**వివరణ :** ఆప్షన్ (ఎ)లోని అక్షరాలను ఇచ్చిన ప్రశ్నలోని ఖాళీలలో పూరించిన సిరీస్ కింది విధంగా ఉంటుంది.

aabc / bbca / ccab /aabc

ప్రతి సమూహంలోను చివరి మూడు అక్షరాలు అయిన abc / bca / cab / abc కింది పద్ధతిని అనుసరించాయి. మొదటి సమూహంలో చివరి రెండు అక్షరాలు రెండో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, మొదటి సమూహంలో మొదటి అక్షరం రెండో సమూహంలో చివరి అక్షరంగా ఏర్పడింది. అదేవిధంగా రెండో సమూహంలో చివరి రెండు అక్షరాలు మూడో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, రెండో సమూహంలోని మొదటి అక్షరం మూడో సమూహంలో చివరి అక్షరంగా ఏర్పడింది. ఈవిధంగా ఒక కచ్చితమైన పద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది. అంతేకాక మొదటి సమూహంలో మొదటి అక్షరంగా a, రెండో సమూహంలో మొదటి అక్షరంగా b, మూడో సమూహంలో మొదటి అక్షరంగా 'c' ఉంది.

∴ సిరీస్‌లో వదిలేసిన అక్షరాలు abcbb

3. a - ab - ab - b - b - b -
(ఎ) bbabbb (బి) bbbbba (సి) bbbabb (డి) ఏదీకాదు

**సమాధానం:** (సి)

**వివరణ:** ఆప్షన్ (సి)లోని అక్షరాలను ఇచ్చిన ప్రశ్నలోని ఖాళీలలో పూరించిన సిరీస్ కింది విధంగా ఉంటుంది.

ab / abb / abbb / abbbb

రెండో సమూహం నుంచి ప్రతి సమూహంలోను దానిముందు సమూహంలోని అక్షరాలే ఉంటూ ఒక 'b' అదనంగా చేరింది.

∴ సిరీస్‌లో వదిలేసిన అక్షరాలు bbbabb

4. L - N - LM - ML - N - LM - L
(ఎ) MMNNNN (బి) MLNMNN
(సి) MNMNMN (డి) ఏదీకాదు

**సమాధానం:** (బి)

**వివరణ:** ఆప్షన్ (బి)లోని అక్షరాలను ఇచ్చిన ప్రశ్నలోని ఖాళీలలో పూరించిన సిరీస్ కింది విధంగా ఉంటుంది.

LMNL / LMNM / LMNN / LMNL

ప్రతి సమూహంలోను మొదటి మూడు అక్షరాలుగా LMN ఉంటూ, నాలుగో అక్షరంగా మొదటి సమూహంలో L, రెండో సమూహంలో M, మూడో సమూహంలో N ఉన్నాయి. ఈ విధంగా ఒక కచ్చితమైన పద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది.

∴ సిరీస్‌లో వదిలేసిన అక్షరాలు MLNMNN

5. P - QQ - RRR - P - Q
(ఎ) PPPQ (బి) PQPP (సి) PPQP (డి) ఏదీకాదు

**సమాధానం:** (బి)

**వివరణ:** ఆప్షన్ (బి)లోని అక్షరాలను ఇచ్చిన ప్రశ్నలోని ఖాళీలలో పూరించిన సిరీస్ కింది విధంగా ఉంటుంది.

PPQ / QQR/ RRP / PPQ

ప్రతి సమూహంలోను మొదటి రెండు అక్షరాలు సేమ్.

∴ సిరీస్‌లో వదిలేసిన అక్షరాలు PQPP

6. P - P - PP - PP - P - P - PP
(ఎ) QPQPQP (బి) PQPQPQ
(సి) PPPQQQ (డి) ఏదీకాదు

**సమాధానం:** (ఎ)

**వివరణ:** ఆప్షన్ (ఎ)లోని అక్షరాలను ఇచ్చిన ప్రశ్నలోని ఖాళీలలో పూరించిన సిరీస్ కింది విధంగా ఉంటుంది.

PQPP / PPQP/ PPPQ / PPPP

మొదటి సమూహంలో ఒక P తరవాత Q, రెండో సమూహంలో రెండు Pలు తదుపరి Q, మూడో సమూహంలో మూడు Pలు తదుపరి Q ఉంటూ నాలుగో సమూహంలో నాలుగు Pలతో ఈ సిరీస్ పూర్తి అయింది.

∴ సిరీస్‌లో వదిలేసిన అక్షరాలు QPQPQP

7. a - cca - b - aab -
(ఎ) bcbc (బి) bbcc (సి) cbcb (డి) ఏదీకాదు

**సమాధానం:** (బి)

**వివరణ:** ఆప్షన్ (బి)లోని అక్షరాలను ఇచ్చిన ప్రశ్నలోని ఖాళీలలో పూరించిన సిరీస్ కింది విధంగా ఉంటుంది.

abc / cab / bca / abc

మొదటి సమూహంలో చివరి అక్షరం రెండో సమూహంలో మొదటి అక్షరంగా మొదటి సమూహంలో మొదటి రెండు అక్షరాలు రెండో సమూహంలో చివరి రెండు అక్షరాలుగా ఏర్పడ్డాయి. అదే విధంగా రెండో సమూహంలోని చివరి అక్షరం మూడో సమూహంలో మొదటి అక్షరంగా, రెండో సమూహంలో మొదటి రెండు అక్షరాలు మూడో సమూహంలో చివరి రెండు అక్షరాలుగా ఏర్పడ్డాయి. ఈవిధంగా ఒక కచ్చితమైన చైన్ పద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది.

∴ సిరీస్‌లో వదిలేసిన అక్షరాలు bbcc

8. a - bc - ab - cdabc - dab - d -
(ఎ) adbccd (బి) abcddc (సి) abcdcd (డి) ఏదీకాదు

**సమాధానం:** (ఎ)

**వివరణ:** ఆప్షన్ (ఎ)లోని అక్షరాలను ఇచ్చిన ప్రశ్నలోని ఖాళీలలో పూరించిన సిరీస్ కింది విధంగా ఉంటుంది.

aabcd / abbcd abccd /abcdd

ప్రతి సమూహంలోను abcd అనే నాలుగు అక్షరాలు ఉంటూ మొదటి సమూహంలో a స్థానంలో రెండు aలు రెండో సమూహంలో b స్థానంలో రెండు bలు మూడో సమూహంలో c స్థానంలో మూడు cలు, నాలుగో సమూహంలో d స్థానంలో రెండు dలు ఉన్నాయి. ఈవిధంగా ఒక కచ్చితమైన పద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది.

∴ సిరీస్‌లో వదిలేసిన అక్షరాలు adbccd



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ